SVKA101B·127

మనుచరిత్రము

అంకముఁజేరి శైలతనయాస్తన దుగ్ధములాను వేళ బా
ల్యాంక విచేష్ట తొండమున నవ్వలిచన్గబళింపఁబోయి యా
వంక కుచంబుఁగాన కహివల్లభహారముగాంచి వే మృణా
ళాంకుర శంకనంటెడి గజాస్యునిఁగొల్తు నభీష్టసిద్ధికై.

ఇది విఘ్నేశ్వర ప్రార్థన. ఇది మను చరిత్రములోనిది. మను చరిత్రము వ్రాసినది అల్లసాని పెద్దన. ఈ గ్రంథము శ్రీ కృష్ణదేవరాయల వారికి నంకిత మీయబడినది.

పెద్దన్నగారికి ఆంధ్ర కవితాపితామహుడని బిరుదు. పెద్దన్నకంటె పూర్వులు తెలుగులో చాలామంది కలరు. కవిత్రయము, నాచన సోమన్న, శ్రీనాధుడు, పోతన్న మొదలైన మహానుభావులు చాలా మంది కలరు. కవిత్రయములో నొకడైన ఎఱ్ఱాప్రగ్గడకు ప్రబంధ పరమేశ్వరుఁడన్న బిరుదు కలదు. ఇట్టి విషయములో పెద్దన్న గారికి ఆంధ్ర కవితా పితామహుడన్న బిరుద మెట్లు వచ్చినదో, ఎట్లు చెల్లుఁబడీయైనదో, విచారించ వలసిన విషయము.

శ్రీకృష్ణదేవరాయలు చక్రవర్తి గనుక తన కభిమానుడైన కవికి ఈ బిరుదమునిచ్చెనా?

లౌకికములైన కారణములు పొసగవు. విప్రతిపత్తు లెన్నియైన చెప్ప వచ్చును.

ఒక భాషయున్నచో నా భాష గొప్పసారస్వతము కలదియైనచో నా సారస్వతము వృద్ధిపొందెడి లక్షణములలో కొన్ని దశలుండును. ప్రథమ దశ పురాణదశ. ద్వితీయదశ కావ్యదశ. కవిత్రయము, నాచనసోమన్న, మాదన్న, పోతన్న మొదలైన వారిది పురాణదశ. శ్రీనాధుడు పురాణ దశకు - చివరి వాడు.

కాని, యాయన వ్రాసిన శృంగార నైషధము దాని యంతటనది కావ్యము. అది యనువాదము కాని స్వతంత్ర గ్రంథము కాదు

ఇట్లుండగా అల్లసాని పెద్దన్న ఆంధ్రభాషలో తొట్టతొలుత స్వతంత్ర కావ్యమును వ్రాసినవాడుగా కనిపించును.

మనుచరిత్ర మనువాదము కాదు. ఆంధ్రీకరణముకాదు. మార్కండేయ పురాణములోని యొక కథ తీసికొని దానిని స్వతంత్ర కావ్యముగా నిర్మించినాడు.

ఈ గ్రంథము పేరు "స్వారోచిష మనుసంభవము"; కాని "మనుచరిత్రము''ని యలవాటైనది. ఆ పేరే చెల్లుబడి యగుచున్నది. నిజానికి గ్రంథము పేరు స్వారోచిష మనుసంభవము. నేను రచించిన 'అల్లసాని వాని యల్లిక జిగి బిగి" యన్న విమర్శ గ్రంథము చదివినచో స్వారోచిష మను సంభవమన్న పేరీగ్రంథమున కెట్లి సార్థమో తెలియగలదు.

ఒక మహా విషయమును స్థాపించుట కొరకు తొట్టతొలుత వ్రాయ బడిన కావ్యమిదియే యని చెప్పవచ్చును. అందులో స్వతంత్రముగా కథా నిర్మాణము చేసి కథాంశమును తానే కల్పించుకొని చేయబడిన మొదటి గ్రంథ మాంధ్రసారస్వతములో నిదియే।

మరియు ప్రధానమైనది ఇంకొక విషయము కలదు కవులందఱకు తలాయొక శైలియు నుండును. పురాణ కవుల శైలులు పురాణ కవులవి. కావ్యకవుల శైలులు కావ్యకవులవి. ఆ రెండు శైలులకు పెద్ద భేదముండును.

పురాణ కవులు ప్రధానముగా కథను చెప్పికొని పోవుట మీద దృష్టి నిలుపుదురు. కావ్యకవులు వర్ణన మీద దృష్టిని నిలుపుదురు. పురాణ కవులు పద్యరచన చక్కగా చేయవలయునన్న ప్రయత్నము నెక్కువ చేయరు. కావ్యకవు లా ప్రయత్నమును మిక్కిలిగా జేయుదురు. పురాణ కవులు వ్రాయుచుండగా దాని సందర్భమునుబట్టి యొక మంచి రచన గల పద్యము రావచ్చును. కావ్యకవులలో నట్టి ప్రయత్న మధికము, నట్టి పద్యముల సంఖ్య యెక్కువ.

పురాణములు చదువునప్పుడు పాఠకుని బుద్ధి కథా గమనము భిన్నాంశములు మొదలైనవానిమీద నుండును. కావ్యములు చదువునప్పటి పాఠకునిబుద్ధి ప్రతి పద్యగత చమత్కారము ప్రతి పద్యమునందు చేయబడిన సూక్ష్మకల్పన, పద్యరచనా సౌందర్యము—వీని మీదనుండును.

వారిని వీరిని పోల్చిచూడకూడదు. సామాన్య సంసారములున్నవి. సంపన్నమైన సంసారములు కలవు. రెండు సంసారములకు ప్రాధాన్యము బ్రతుకుటయే సామాన్య సంసారములో నతిథులు వచ్చినచో చాపవేసి కూర్చుండబెట్టుదురు. మర్యాదచేసి మాటాడి పంపింతురు. గొప్ప సంపత్తుగల సంసారములో నతిథులు రాగా పరుపులు, తివాసీలు, పట్టు దుప్పటులతో కుట్టబడిన యాసనములు, వీవనలు, అగరువత్తులు—ఈ మొదలయిన భోగము లుండును. పురాణ కవులకు కావ్యకవులకు భేదమిది.

మరియు తొలుతటి రాజులువేఱు. తరువాత వచ్చిన రాజులు వేఱు. శ్రీకృష్ణరాయల నాటికి నాంధ్రసామ్రాజ్యమేర్పడినది. విజయనగర సామ్రాజ్యము స్థిరపడినది. విజయనగరము నాటి ప్రపంచకములలో నొక మహానగరము. అనంతమైన యొకభోగభూమి, భోగములలో సూక్ష్మ విషయముల ననుభవించుటకు వలసిన సంపత్తికలదు. పాలు త్రావినచో వట్టి వెండిగిన్నెలో త్రాగరు. పైడిగిన్నెగాని, వజ్రపు గిన్నెగాని కావలెను. ఆ గిన్నెచుట్టు నది పట్టుకొను పిడి శిల్పములచేత నిండియుండును. ఇదియొక భోగలక్షణము. ఈ భోగలక్షణము ఆనాటి సర్వశిల్ప విద్యలయందును భాసించెను. అదియే కవిత్వములోనికిని వచ్చెను.

అందుచేత పెద్దన్నగారి పద్యరచన మాధుర్య గుణములకు నిధానమయ్యెను. క్రొత్త క్రొత్త పలుకుబళ్ళకు, రమ్యమైన సమాస గ్రథనమునకు కాణయాచి యయ్యెను.

పరమేశ్వరుడు పరమ మధుర సరస్వతీ రూపముగా చిక్కని శారదా రూపముగా పెద్దన్నగారి వాక్కునందు వచ్చికూర్చుండెను.

పెద్దన్నవలె చిక్కని మధురమైన పద్యరచన చేయగల కవి యాంధ్ర సారస్వతమున మఱియొకడుండడు.

మన సారస్వతములోనున్న మంచి కవులందఱి విషయములో వారి వారి శైలి వారి వారి ప్రత్యేకత అని చెప్పవచ్చును, కాని పెద్దన్నగారి విషయములో నీ ప్రత్యేకత యందొక వైలక్షణ్యమున్నది. ఆ విజయనగర సామ్రాజ్య సూక్ష్మభోగ పరమ మాధుర్యలక్షణ మా శైలి యందున్నది. ఇది యనుభవైక వేద్యము.

శ్రీనాథుడు దీనికి మార్గదర్శిగా కనుపించును. కాని యీ లక్షణము శ్రీనాథునియందు పరాకాష్ఠ పొందలేదు. పెద్దన్నగారియందు పొందినది. అందుచేత నతడాంధ్ర కవితాపితామహుడు. పితామహుడనగా తాతకాదు బ్రహ్మ.

బ్రహ్మకు పూర్వము సృష్టిలేదా? బ్రహ్మనెవరు సృష్టించినారు? ఈ దృశ్యమానమగుచున్న సృష్టిని బ్రహ్మ చేసినాడు. ఆ రీతిగా నాంధ్ర భాషయందు ప్రథమ ప్రబంధ నిర్మాత, ప్రబంధ సర్వలక్షణములు కలిగిన గ్రంథ నిర్మాత యాయనయని యర్థము.

ఆంధ్ర సారస్వతమున కిదియొక క్రొత్తభోగము. ఆ భోగము నారంభించినది యాయన.

అంకము, జేరి—తొడనెక్కి, అల్లితీసి తొడమీద నెక్కించుకొనలేదు. ఇతడే యెక్కినాడు.

శైల తనయా స్తన దుగ్ధములు—తల్లియైన పార్వతి యొక్క చను బాలు. ఆమె కొండకూతురు. ఆమెయందు స్తన్యసమృద్ధి యెంతయుండునో తెలియదు.

బాల్యాంక విచేష్టన్ — బాల్యమునకు చిహ్నమైన విశేషమైన చేష్టతో; శైశవముకాదు బాల్యము. అనగా మకురుపాలు తాగుచున్నాడు కాబోలు !

తొండమున సవ్వలిచన్గబళింప బోయి — పిల్లలు పాలుత్రావుచు ఏడిగానున్న చేతితో తల్లియొక్క రెండవ బొమ్మను స్పృశించుదురు. పుణుకుదురు. ఈ చేష్ట సరియే ! ఈ విఘ్నేశ్వరుడు తల్లియొక్క అవ్వలి చన్ను - తొండముతో గ్రహింపబోవుచున్నాడు. తనకు చేయి - యున్నది

కదా! ఇది బాల్యాంక విచేష్ట కాదు. ఏనుగు మొగము కలిగి వున్నవాని లక్షణము.

అవ్వాలిచన్గబళింపంబోయి — కబళించుట యనగా తినుట. కబళము — ముద్ద; మాధవ కబళము— చన్నును కబళింపబోవుటయేమి—సరే!

ఆవంక కుచంబుగాన కహివల్లభ హారము గాంచి— వెదకినాడు కుచము కనిపించలేదు. హారముగానున్న పాము కనిపించెను. అహివల్లభుడే హారము. దానిని చూచినాడు. చూచినాడనగా తెలిసికొన్నాడని యర్థము. కాంచి యన గూడదు. అతడది యహివల్లభ హారముగా తెలిసికొన లేదు, అచట నహివల్లభ హారముండుటచేత నది మృణాళాంకుర మనుకొన్నాడు. మృణాళాంకురము-తామర తూటి మొక్క.

అహివల్ల భుడనగా వాసుకి, వాసుకి సర్పములకు రాజు. అతడు శివునికి భూషణము. అతనిని మృణాళాంకురమని యనుకొనుట యెట్లు? ఆ వాసుకి శరీరము మహాదీర్ఘము మహాస్థూలమై యుండవలయును.

ఇది అర్ధ నారీశ్వర మూర్తి యొక్క వర్ణన. ఇతడు గజాస్యుడు ఏనుగు మొగము గలవాడు.

అభీష్ట సిద్ధికై ఇతనిని కొలుచుటలో నతని యందభీష్టములు సమకూర్చు లక్షణములు లేవు. అట్టి లక్షణములు వర్ణితములు కాలేదు.

వుత్పత్తిచేత గజశబ్దమున కర్థము మదముకలదియని. అనగా యథార్థ పరిశీలన చేయనిది. ఇది లోకము యొక్క స్వభావము. ఈ లోకమే ఆ విఘ్నేశ్వరుని ముఖము. ఈ లోకము వట్టి భ్రాంతిమయము తెలిసికూడ పట్టిభ్రాంతి.

చనిపోవుదుమని యెవరికి తెలియదు? లోకము యొక్క ప్రవర్తనకు ఈ తెలియుటకు నేమి సంబంధము. ఇది భ్రాంతి అర్ధనారీశ్వరుడనగా లోకముయొక్క మహాతత్వము పుంజీభూతమై దేవతారూపము కట్టినవాడు.

పార్వతి, దుర్గ, ప్రకృతి, పంచభూతముల సమాహారము. పరమేశ్వరుడు ఈ పంచభూతముల యందభివ్యాప్తమైయున్న చైతన్యము. సూక్ష్మ ప్రాణము. విజ్ఞానమయ బ్రహ్మ మొదలైనవి కావచ్చును.

వారికి ముఖము మదముతో నిండిన కొడుకు పుట్టి నాడు. మదమును మినహాయించినచో వీడు పరమ చైతన్యస్వరూపము, అతనిని గూడ మనము దేవతగా కన్పించి — మన మదము మనకు తగ్గరాదు, మన పనులు మనకు కావలయును—అట్టి విఘ్నేశ్వరుని స్తోత్రము చేయుచున్నాము.

కావ్యకవులు సామాన్యముగా వేదాంతార్థముల నుద్దేశించి వ్రాయరు. వారికి కావలసినది వాక్చమత్కృతి. పారకుని మనస్సునకు చక్కిలిగింత పెట్టుట, లోకములోనున్న లీలలు చిత్రించుట, మరియు లోనికి పోయి చూడరాదు.

ఈ కావ్యకవుల యూహలో కవితయనగా చల్లని గాలి తగిలినట్లు, వెన్నెలలో విహరించినట్లు, పచ్చ కర్పూరపుపొడి చల్లుకున్నట్లు—అంతే.

మను చరిత్రము

వరణానదియని యొక నదియున్నది, కాశీకి వారణాసి యని పేరు. వరణానది - అసీనది అన్న రెండు నదులకు మధ్య నుండుట వలన వారణాసి యన్న పేరు వచ్చినదందురు. ఈ వరణానది యొడ్డున యరుణాస్పదమన్న పురమున్నది.

అచటి విప్రులు మెచ్చ రఖిలవిద్యాప్రౌఢి
ముదిమదితప్పిన మొదటివేల్పు
అచటి రాజులు బంటునంపి భార్గవునైన
బింకాన పిలిపింతు రంకమునకు
అచటిమేటి కిరాటు లలకాధిపతినైన
మును సంచిమొదలిచ్చి మనుప దక్షు
లచటి నాలవజాతి హలముఖాత్త విభూతి
నాదిభిక్షువు భైక్ష్యమైనమాన్చు

అచటి వెలయాండ్రు రంభాదులైన నౌరయ
కాసె కొంగుసవారించి కడపగలరు
నాట్యరేఖా కళాధురంధర నిరూఢి
నచటపుట్టిన చిగురుకొమ్మైన చేవ.

[మొదటివేల్పు - బ్రహ్మ; బింకాననన్ - పట్టుదలతో, అంకమునకు - సమీపమునకు, మేటికిరాటులు - గొప్ప వైశ్యులు, వర్తకులు. అలకాధిపతి - కుబేరుడు (ఆయనవద్ద నవనిధులున్నవట) నాలవజాతి - శూద్రులు, కృషికులు, హలముఖాత్తవిభూతి - నాగటి కొఱ్ఱునుండి వచ్చిన సంపదతో, ఆదిభిక్షువు - శివుడు, భైక్ష్యము - బిచ్చపుదనము. వెలయాండ్రు - వారకాంతలు, ఒరయన్ - స్పర్ధవహించినచో, కాసెకొంగు - వెనుకకుదోపికొను చీరచివర, నాట్యరేఖ అను కళావిద్యయందుకల ధురంధర - అధికమైన, నిరూఢిన్ - సామర్థ్యముతో.]

చిగురుకొమ్మ - శ్రీకృష్ణదేవరాయల వారు విజయనగరము నుండి పాలించుచు ప్రధానముగా పెనుగొండ యందుండెడి వారు. పెనుగొండలో కోటయున్నది. ఈ కొండమీద చిగురుచెట్లని కొన్ని కలవు. ఆ చెట్టు పేరు చిగురుచెట్టు, ఆ చెట్టు చాలా పెళుసు. ములగ చెట్టువంటిది. చిగురుకొమ్మ యనగా లేత కొమ్మయని యర్థంకాదు. అచటి చిగురు చెట్టయినను మంచిచేవ గలది. విఱిచినచో విఱుగదని యర్థము. పెద్దన్నగారు పెనుగొండలోని తానెఱిగిన యీచెట్టును అరుణాస్పదములో నున్నట్లు వర్ణించెను.

మన పూర్వ ప్రబంధములలో నేకావ్యము చూచినను ఈ రీతిగా వర్ణనములు వర్ణింప బడును. వారకాంతలు వర్ణింప బడుదురు. ఆనాటి నాగరికతయు సంపత్స్యవస్థయు నాలుగు వర్గముల మీదను నాధార పడి యుండెడిది. రాజ్యముల యొక్క రక్షణ దుర్గముల మీద నాధార పడి యుండెడిది. అందుచేత నగడ్తలు ప్రాకారములు కూడ వర్ణింప బడును. మరియ నానాటి శిల్పములలో భరతనాట్యము ప్రధానమైనది. దేవాలయములలో వార కాంతలు నాట్యము చేసెడు వారు. దేవాలయములలో నన్ని స్వాములకు ననేక భోగములు జరిగెడివి. నేడు తిరుపతి మొదలైన క్షేత్రములలో జరుగుట లేదా? ఆ భోగములలో ప్రధానమైనది వార కాంతలు చేయు నాట్యము. అందుచేతనే వారికి భోగమువారని పేరు వచ్చినది వారు భరత శాస్త్రములో చాల సమర్థులు.

ఆనాడు పూవులమ్ముట కూడ నొక గొప్పవృత్తి. పురుషులు కూడ సాయంకాలము అందు పుష్పములు ధరించెడి వారు. పురుషులకుంగూడ జుట్టు

ముళ్లు, గిరజాలు - వానికి పూవులు పెట్టుకొనుట యిదియొక భోగము. కనుక మన పూర్వ కావ్యములలో నీ వర్ణనలు చేయ బడినవనగా - కావ్యము జీవితమునకు ప్రతిబింబమని యాధునికు లనుచున్నారుకదా-ఆనాటి సంప్రదాయమున కీకావ్యములు ప్రతిబింబములు.

ఇది యిట్లుండగా నీ కథలో ప్రారంభించుచు పెద్దన వెలయాండ్రను వర్ణించెను. ఆయూరి వెలయాండ్రు, మహా భరతశాస్త్ర కళానిష్ణాతలు. ఎందుకు చేసెననగా నొకటి జీవిత ప్రతిబింబము. రెండవది యీ కావ్యములో కథానాయకుడు ప్రవరాఖ్యుడు.అతనికి హిమాలయ పర్వతము మీద వరూథినియన్న యప్సరస కన్పించును. ఆమె దేవతా వార కాంత. వార కాంతలు, వారి హేలలు, వారి యొయ్యారములు, వారి సౌందర్యములు ప్రవరాఖ్యునకు క్రొత్తలు కావు. ఈ సంగతిని సూచించుటకు గూడ వ్రాసెను.

ఆ వూరిలో ప్రవరాఖ్యుడన్న బ్రాహ్మణ యువకుడు కలడు. అతడు పండితుడు. యజ్ఞములు చేసిన వాడు. చాలా యందగాడు. పలుమందికి వేదమును నేర్పెడి వాడు. మరియు వైరాగ్యవంతుడు. అందుచేత వానిని పర స్త్రీలు కోరినచో లాభము లేదు. ఈ మాట కూడ భవిష్యత్కథకు సూచనగానే చెప్పఁబడెను.

అతనికి తల్లి దండ్రులుఁ గలరు. అతడు ప్రొద్దుననే లేచి వరణానదిలో స్నానముచేసి వచ్చి తన నిత్యకర్మానుష్ఠానము చేసికొనును. ఎవరు దానముచేయ వచ్చినను స్వీకరింపడు. అతడు అప్రతి గ్రహీత. ఎవరైన దానము చేసినచో దానము చేసిన వాని పాపము కొంత ప్రతిగ్రహీతకు వచ్చును. దానము పుచ్చుకొన్న బ్రాహ్మణుడు తత్ప్రాయశ్చిత్తము కొఱకు తగినంత గాయత్రీ మంత్రమును జపించ వలెను. రాజు లతనికి సాల గ్రామము నిత్తురందురు. సాల గ్రామము, బాణము, నివి రెండు రాళ్ళు. సాల గ్రామము నందు విష్ణుమూర్తి యుండును. బాణములు, శివ లింగములు, ఏది బాణమో' ఏది సాల గ్రామమో! తెలిసికొనుట ఆ విద్యయందు పండితులైన వారికే సాధ్యము. అతడు సాల గ్రామమును గూడ దానము పుచ్చుకొనడు.

అతనికి భార్య కలదు. ఆమె అన్నపూర్ణ వంటిది. అతిథులు నడికి రేయి వచ్చినను భోజనము పెట్టును. (నడికి రేయి యనగా నర్థ రాత్రమని యర్థము) నడిరేయి నడురేయి సామాన్య రూపములు, నడికి రేయి విశేష రూపము.)

ఇతనికి తీర్థయాత్రలు చేయవలెనన్నచో మిక్కిలి యిష్టము. తీర్థ సంవాసు లేతెంచినచో నాదరించి భోజనము పెట్టి దూరములడుగును. ఎంతో యాదరించును.

ఇట్లుండగా నొకనాడు కుతప కాలము (కుతప కాలమనగా మధ్యాహ్నము దాటిన కాలము) నందు ఒక ఔషధ సిద్ధుడు వచ్చెను. ప్రవరు డతనికి మర్యాద చేసెను. అతని నెంతయూ గౌరవించెను.

మీ మాటలు మంత్రమ్ములు
మీ మెట్టినయెడ ప్రయాగ, మీ పాదపవి
త్రామలతోయము లలఘు
ద్యోమార్గ ధునీరాంబు పౌనరుక్త్యము లుర్విన్.

మన దేశములో నతిథులను గౌరవించుట అతిథుల కన్నము పెట్టుట మన మతములో ప్రధానమైన భాగము. దానము చేయుట మిక్కిలి గొప్ప విషయము. శ్రీ శంకరాచార్యులవారు భాష్యములో నొక చోట దానేన ఉపనమంతే యని వ్రాసినారు. దానము చేత ప్రాణులు ఉప– సమీపము నందు, ఎవరి సమీప మందు? పరమేశ్వరుని సమీపము నందు, నమంతే-వంగుచున్నారు. సదా నమస్కరించు చున్నారు. అనగా దానముచేత జీవులు పరమేశ్వర సన్నిధానము నందు వర్తిల్లుదురని యర్థము. అతిథి పూజ కూడ ఇట్టిది. 'అభ్యాగతస్స్వయం విష్ణుః' అభ్యాగతుడనగా అతిథి. అతడు స్వయముగా విష్ణువు. అందు చేతనే మీ పాద పవిత్రామల తోయములు– మీ పాదములు కడుగగా వచ్చిన స్వచ్ఛమైన నీరు; అలఘు– తక్కువ కాని, ద్యోమార్గజలము – ఆకాశ గంగ మందాకిని లేదా భాగీరధి; (ఆకాశము నందలి గంగ మందాకిని. భూలోకము నందలిది భాగీరథి. పాతాళ లోకము నందలిది భోగవతి) ఆ గంగ యొక్క అంబు— నీళ్ళకు, (ఆయన పాదములు కడిగిన నీరు) పౌనరుక్త్యములు – పునరుక్తి యనగా చెప్పినమాట చెప్పుట, దాని మీద తద్ధిత రూపము

పౌనరుక్త్యము-అర్థ మొకటియే. గంగ విష్ణుపాదోద్భవి గనుక అభ్యాగతుడు స్వయంవిష్ణువు కనుక నిట్లనుట.

ప్రవరాఖ్యు డిట్లేఁగయో పొగడగా ఆ యౌషధ సిద్ధుడు గృహస్థ ధర్మమును పొగడెను.

కెలకులనున్న తంగేటి జున్ను గృహమేధి
యజమానుఁ డంకస్థితార్థ పేటి
పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు
దొడ్డిఁబెట్టిన వేల్పు గిడ్డి కాపు
కడలేని యమృతంపు నడబావి సంసారి
సవిధ మేరు నగంబు భవన భర్త
మరు దేశ పథ మధ్యమ ప్రప కులపతి
యాఁకటి కొదవు సస్యము కుటుంబి
బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి
జటిపరివ్రాజ కాతిథి క్షపణ కావ
ధూత కాపాలికా ద్యనాథులకుఁ గాన
భూసురోత్తమ గార్హస్థ్యమునకు సరియె.

గృహస్థుడనగా ఇట్టి వాడు; గృహమేధి, యజమానుడు, వాస్తవ్యుడు, కాపు, సంసారి; భవనభర్త, కులపతి, కుటుంబి, యివి యన్నియు గృహస్థునకు పేర్లు.

కెలకు— ప్రక్క; (కెలను — కెలకు ఈ రెండు రూపములు కలవు. కొలను — కొలకు చెఱువని యర్థము) —తంగేటి జున్ను - తంగేటి చెట్టునకు పట్టిన తేనెపట్టు వంటిది. తంగేటిచెట్టు పరమౌషధము. తంగేటిచెట్టు సమూలముగా పెఱికి తెచ్చి యెండ పెట్టి పొడిచేసి దానిని పంచదారతోనో తేనెతోనో నలుబది రోజులు సేవించినచో సర్వవ్యాధులు శమించును. అందుచేత తంగేటి జున్ను అనుట — అంకస్థితార్థపేటి — అంక — ఒడియందు; స్థిత — ఉన్న; అర్థపేటి — డబ్బుగల పెట్టె; (హస్తామలకము లందురు. చేతిలో నున్న యుసిరికాయ యని యర్థము) అట్టిది. వేల్పుగిడ్డి — కామధేనువు; నడబావి- దిగుడు బావి (నడచి వెళ్ళుటకు వీలైన బావియని యర్థము. కాని నడపీనుగు

నడచుచున్న పీనుగని యర్థము. నడదివ్వియ—నడచుచున్న దివిటీ. (నడదివ్వియలు చేసె నగరికి మాణిక్యమకుటముల్. గలిగిన మనుజపతుల—అని తిక్కన గారు విరాటరాజుతో తాము పాండవులమని చెప్పికొన్నప్పుడు ధర్మరాజును గూర్చి చెప్పిన పద్యములోనిది.)

సవిధ మేరునగంబు - సమీపమునందున్న మేరు పర్వతము.

మరుదేశ పథమధ్యను ప్రప - మరుదేశమనగా ఎడారి. చవిటి పఱ్ఱ దేశము. పథము - మార్గము, ప్రప - చలివేంద్ర (త్రప - సిగ్గు, కృప - దయ) బధిరులు - చెవిటివారు; పంగులు - కుంటివారు; అంధులు - గ్రుడ్డి వాండ్రు: జటి - జడలు కలవారు, పరివ్రాజకులు - సన్యాసులు; క్షపణకులు - బౌద్ధభిక్షులు; అవధూతలు - సన్యాసము పుచ్చుకోని పరమ విరాగులు; కాపాలికులు - ఇది యొక మతము. వారు నిత్యము కపాలములను చేబూని తిరుగుచుందురు.

ఈ పద్యము మిక్కిలి ముఖ్యమైనది—

అప్పుడు ప్రవరుడు

ఏ యే దేశములన్ జరించితిరి మీరే యే గిరుల్ చూచినా
రే యే తీర్థములందు గ్రుంకిడితి రేయే ద్వీపముల్ మెట్టి నా
రేయే పుణ్యవనాళిఁ ద్రిమ్మరితి రేయే తోయధుల్ డాసినా
రా యా చోటులఁగల్గు వింతలు మహాత్మా నా కెఱింగింపవే !

అని యడిగినాడు. గిరులు - కొండలు, తీర్థములు - పుణ్యనదులు; గ్రుంకిడుట - స్నానముచేయుట; త్రిమ్మరుట - తిరుగుట; తోయధి - సముద్రము (తోయమనగా నీరు. సంస్కృతములో నీరు అన్న యర్థముగల శబ్దములకు 'ధి' 'నిధి' రెండును కలిపినచో సముద్రమన్న యర్థము వచ్చును. తోయధి, తోయనిధి; జలధి, జలనిధి; వారిధి; వారినిధి; పయోధి, - పయోనిధి; పాథోధి, పాథోనిధి; నీరధి, నీరనిధి; వార్థి వారినిధి; - మరియును ఈ నీటి యర్థమిచ్చు శబ్దములకు. జ, జాత, రుహ యివి కల్పినచో తామరపువ్వన్న యర్థము వచ్చును. జలజము, జలజాతము, జలరుహము. ఇట్లే — మరియు ద, వాహ యన్న యక్షరములు కలిపినచో మేఘమగును; వారిద; వారి వాహము, జలదము, జలవాహము - ఇట్లు)

ఈ పద్యములో నెక్కువ యేమియును లేదు. కాని పద్యరచన పరమ సుఖముగా నున్నది, అడుగుటలో నున్న సౌఖ్యమంతయు కనిపించు చున్నది. నోటికి వచ్చుటకు పరమ సుఖముగా నున్నది.

అప్పు డౌ షధసిద్ధు డిట్లన్నాడు.

ఓ చతురాస్య వంశకలశోదధి పూర్ణశశాంక తీర్థయా
త్రాచణ శీలినై జనపదమ్ములు పుణ్యనదీనదమ్ములున్
జూచితినందు నందుగల చోద్యములన్ గనుగొంటి నా పటీ
రాచల పశ్చిమాచల హిమాచల పూర్వదిశాచలమ్ములన్.

చతురాస్యుడు - నాలుగు మొగములు కలవాడు బ్రహ్మ; చతురాస్య వంశము - బ్రాహ్మణవంశము; అదియే, కలశోదధి - పాల సముద్రము; దాని యందు పుట్టిన పూర్ణశశాంకుడు-నిండు చందురుడు, అని సంబోధన.

ఓ మిహిరాంశు వంశకల శోదధి పూర్ణ శ శాం క అని పూర్వము శ్రీనాథుడు వ్రాసినాడు. మిహిరాంశుడనగా చల్లని కిరణములు కలవాడు చంద్రుడు. శృంగార నైషధములో నల మహారాజు నొకాయన యిట్లు పిలిచినాడు.

శ్రీకృష్ణరాయల యాస్థానములో నున్న కవులు శ్రీకృష్ణ రాయలతో సహా శ్రీనాథుని శబ్దములు శ్రీనాథుని పోకడలు వందల కొలది గ్రహించి నారు. పెద్దన్న గారు తక్కువ వాడు కాదు. కాని ఆ పిలుపుకన్న నీ పిలుపు విశేషార్థము కలది. ఇచట నౌషధసిద్ధుడు బిచ్చగానివంటి వాడు. వాని బ్రతుకు గృహస్థుల మీద నాధారపడి యున్నది. అందుచేత నతడు గృహస్థులను పొగ డును. మరియు నతడు తన గొప్ప దనము తాను చెప్పికొనుచుండును. చివరి చరణములో అచలమన్న శబ్దము నాల్గుసార్లు వాడి చరణము పరుగెత్తునట్లు చేసినాడు. ఈ రచనయంతయు తన యొక్క బహుదేశ పర్యటనము యొక్క గొప్పదనము వ్యంగ్యమగుటకే. ఇది యెంత యందమైన పద్యము! మనము సంగీతము పాడుకొనుచున్నట్లే యుండును. అని ఔషధసిద్ధుడు పెద్ద వచన మును చెప్పెను. ఆ వచనములో తాను చూచిన ప్రదేశముల నన్నింటిని పెద్ద పెద్ద సమాసములతో చెప్పెను, ఆ సమాసము లన్నిటి యందు అతని గొప్ప దనము వ్యంగ్యమగుటకే.

కాని ప్రవరుడు యాజ్ఞికుడు, కర్మశీలి, పరమసాధువు. కాని చాలా గడుసువాడు. అతిథిని ఆగౌరపంచడు. కాని యతని మాటల నితడు నమ్మ లేదు. అందుచేత నిట్లన్నాడు :

వెఱవక మీ కొనర్తు నొక విన్నప మిట్టివి యెల్లఁజూచిరా
నెఱకలుఁ గట్టుకొన్న మఱి యేండ్లును బూఁడ్లునుఁబట్టుఁ బ్రాయపుం
జిఱుత తనంబు మీ మొగము సెప్పక చెప్పెడు నద్దిరయ్య మా
కెఱుఁగఁ దరంబె మీ మహిమ లీర యెఱుంగుదు రేమి చెప్పుమన్.

వెఱువక—వెనుకకు దీయక; ఒక విన్నపము చేయుదును; ఎఱకలు-ఱెక్కలు,

ఈ పద్యమున ఏండ్లును పూండ్లును పట్టు; మీ మొగము చెప్పక చెప్పెడు, ఈలోకోక్తులు వాడబడినవి. గౌరవము సడలినదని యర్థము. అతనిని తన తోటివాడుగా చూచుచున్నాడని యర్థము. మీ మహిమలు మీకే తెలియును - మే మెఱుగుట సాధ్యమా? మరి యేమి చెప్పుమందురు ?

ఈ మాటలలో నొక సన్నని యాక్షేపణ, ఒక దాగియున్న లెక్క లేని తనము నున్నది.

ఆ ఔషధ సిద్ధుడు పదియాండ్లు పాపరాజు. దేశదేశములు తిరిగి గడుసు తేలిన వాడు. వాడు గ్రహించినాడు. వానికి ప్రవరాఖ్యు నేడిపించవలెనని పుట్టినది.

అందులకాత దేమిచేసెననగా-ఇట్లన్నాడు. 'అది కాదయ్యా! మా వద్ద నొక దివ్యౌషధ మున్నది. తదూరి ప్రభావమ్మునన్ - దాని యధికమైన ప్రభావముచేత; పవమాన మానస తిరస్కారిత్వరాహంకృతిన్ — వాయువును మనస్సును తిరస్కరించునటువంటి గొప్ప వేగముతో; నేనెప్పుడు తిరుగుచుందును. ఇది చాలా రహస్యము. ఆకాశమున సూర్యుని గుఱ్ఱము లెంత త్వరగా పోవునో భూమి యందు నే నంత త్వరగా పోవుదును.' అన్నాడు. ఈ ప్రవరాఖ్యుఁడు తీర్థ యాత్రలు చేయుట యందు మిక్కిలి మక్కువ క... వాడు గావునను ఎంత తెలివిగల వాడైనను తరుణాగ్నిహోత్రి గనుక... అనగా కుఱ్ఱతన మగుటచేతను, చప్పున లోఁబడి "స్వామీ! నేనేదో పొరపా... మాటాడినాను. నేను మీ శిష్యుడను నాచేత తీర్థ యాత్రలు చేయింపు...

యడిగెను. ఆ సిద్ధుడు వెంటనే యితని పాదముల కొకపసరు పూసెను. పూయుట యేమి! వెళ్లుట యేమి! ఒక్కసారియే చేసెను. ఈ ప్రవరాఖ్యు డెగురుట మొదలు పెట్టెను. ఆకాశములోనికి పోయెను. ఇదివఱకే యితడు పోయి హిమాలయ పర్వతములు, బదరీ నారాయణము మొదలైన విషయము లన్నియు వినియున్నాడు. ఇతని కాళ్ళక్కడికి దారి తీసినవి.

"అట జని కాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ నిస్వన
స్ఫుట నటనానురూప పరిపుల్ల కలాప కలాపి జాలమున్
కటక చరత్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్."

అవి యన్నియు దేవతాభూములు. ఇతడు భూదేవత. అందుచేత నితడు భూమి సురుడని చెప్పుట. కొంత దప్పు దిగెను. అచ్చటి నుండి చూడగా ఆకాశమును ముద్దుపెట్టుకొనుచున్న శిఖస్సులు కలిగిన చెఱువులు, సెల యేళ్ళు వీని యొక్క సమూహము యొక్క మాటిమాటికి లేచుచున్న తరంగములను మద్దెళ్ళ యొక్క ధ్వనులకు స్ఫుటముగా నాట్యమున కనుకూలముగా వికసించిన పింఛములు కలిగిన నెమళ్ళ సమూహమును చూచెను.

మరి నేలమీదికి దిగెను. ఆసానువుల (కొండ ప్రక్కల) యందు ఆడ యేనుగులు చెట్లను కదిలించు చున్నవి. అట్టి హిమవత్పర్వతమును చూచెను.

ఈ ప్రదేశములను గూర్చి యతడు విన్నదే. ఇట్లిట్లుండునని విన్నదే! అందుచేత అతని కన్నియు పరిచితములుగా కనిపించు చుండెను.

అక్కడ రేగుచెట్ల వరుస యున్నది. దానినడుమ ఒక త్రోవ యున్నది. ఆ త్రోవ వెంట పూర్వము నరనారాయణులు నడచిరి. (కృష్ణుడు అర్జునుడున్నూ). అత డిదియంతయు చూచెను. అక్కడ అలకానది కలదు. దాని గాలులు వీచుచుండెను. అతడు చూచిన ప్రదేశములను మనము చదివి తీరవలెను.

అతడెన్నో యందములు చూచెను. ఇత డెన్నియో చూడవలె నను కొనెను. అన్నిటిని చూచెను. అతడు చూచిన వేవనగా :

"నిడుద పెన్నెఱిగుంపు జడఁగట్టి సగరు ము
మ్మనుమండు తపము గైకొనినచోటు
జరఠ కచ్ఛపకులేశ్వరు వెన్నుగానరా
జగతికి మిన్నేఱు దిగినచోటు
పుచ్చడీకతనంబు పోఁబెట్టి గిరికన్య
పతిఁగొల్వ నాయాసపడిన చోటు
వలరాచ రాచవా రలికాక్షు కనువెచ్చఁ
గరఁగిన యల కనికరపుఁజోటు

తపసి యిల్లాండ్ర చెలువంబుఁ దలఁచి తలచి
మున్ను ముచ్చిచ్చును విరాళిఁ గొన్నచోటు
కనుపపులు వేల్పుఁబడవాలుఁ గన్నచోటు
హర్షమునఁ జూచి ప్రపరాఖ్యుఁ డాత్మలోన.

ఇవి యేమి స్థలములు! భగీరథుడు తపము చేసినచోటు, ఆకాశగంగ భూమికి దిగినచోటు, పార్వతీదేవి శివునికోసము తపముచేసినచోటు, శివుడు మన్మథుని దహించినచోటు, కుమారస్వామి జన్మించిన చోటు. ఆశ్చర్యముకదా! ఈ పద్యములోని మాటలెటువంటివి!

భగీరథునకు సగరుముమ్మనుమడు – భగీరథుడు సగరచక్రవర్తికి మనుమని కొడుకు. పెన్నెఱిగుంపు – పెద్దవెంట్రుకల గుంపు. అది జడ కట్టినదట!

మిన్నేఱు – ఆకాశగంగ; పైనుండి గంగానది గభేలున దూకఁగా భూమియంతయు బొత్తపడి పాతాళముదాక చొచ్చుకొనిపోయి భూమిని మోయుచున్న ఆదికూర్మముయొక్క వీపుడిప్ప కన్పించినదట: ఆ పతనమెంత వేగము కలదో చెప్పుటకు జరఠకచ్ఛపకులేశ్వరు వెన్నుకానరాన్ అని వాడినాడు. కచ్ఛపము – తాబేలు; జరఠము – ముసలిది; బాగుగా బలిసినది, యుగాలుగా కూర్చున్నది యని యర్థము. గిరికన్య – పార్వతీదేవి; ఆమె భర్తకొఱకు తపస్సుచేసినది. సేవచేసినది. ఎవరైనను మగవాండ్రు స్త్రీకోస మారాటపడుదురు. ఈమె మగనికోస మారాటపడెను. తపస్సుచేసెను. దీనినే కాళిదాసు కుమారసంభవములో "నరత్న మన్విష్యతి మృగ్యతేహితత్" అన్నాడు.

రత్నముపోయి యెవ్వరిని వెదుకదు. దానినేపోయి యందఱును వెదకుదురు. అట్టి పార్వతి శివుని భర్తగా సంపాదించుటకు చాల యిక్కట్టులు పడినది. స్త్రీ యట్లుచేయుటకు సిగ్గును వదలిపెట్టవలెను. పుచ్చడీకతనమనగా సిగ్గు; సిగ్గు అనుటలో గొప్ప యేమున్నది. ఆమె పరమేశ్వరి. చక్రవర్తి కూతురు. అందు కోసము వట్టి సిగ్గు అన్నమాట చాలదని పుచ్చడీకతన మన్న మాట తెచ్చినాడు. దానిని పోఁబెట్టి-వదలిపెట్టి - ఓరి, మీ నాయనిగా రింట్లో నున్నారా? మీయయ్య యింట్లోనున్నాడా? మీ బాబున్నాడా? మీయమ్మ మొగుడున్నాడా? మీ నాయనమ్మ కొడుకింట్లో నున్నాడా ?— అన్నియు నొకటియూ! కవులు వాడెడి శబ్దములలో నొకమర్యాద యొక యొడుపు నొక యొయ్యారము నుండును. పుచ్చడీకతన మట్టిమాట.

వలరాచ రాచవాఁడు — మన్మథుడు, అలి కాక్షుడు - శివుఁడు; కను వెచ్చన్ - కంటి వెచ్చఁదనముచేత. అగ్నికాదు వట్టి సెగ. అబ్బో! అసలు అగ్ని తగిలినచో లోకములే మండిపోవును —. ఆ వెచ్చదనముచేత వాడు కఱగిపోయినాడట; కాళిదాసు బూడిద యైనాడని చెప్పినాడు. పెద్దన్న గారి మన్మథుడు కడు మెత్తనివాడు. వెన్నపూస వంటివాడు. వీడు కరిగి పోయినాడు. కాళిదాసు యొక్క మన్మథుడు కఠినుడు, వాడు ఱాయి అందుచేత బూడిదయై నాడు. ఆ స్థలమట కనికరపు స్థలమట! అయ్యో పాపమని మన మనుకొన వలయును. కావ్య కవులలోనుండెడి మార్దవ మిటువంటిది.

పూర్వ మగ్నిహోత్రుఁడు తపస్వుల భార్యలనుజూచి మోహము గొన్నాడు. అదియు నచ్చటనే చిట్టచివరకు కుమారస్వామి జన్మము చెప్పుచున్నాడు. కుమార స్వామి యెక్కడ పుట్టినాడు? తెల్లుగడ్డిలో పుట్టి నాడు. వేల్పు పడవాలు - వేల్పులనగా దేవతలు. పడవాలనగా సేనాపతి. కనుపపులు — తెల్లుగడ్డి, పులు - గడ్డి. (పులుమేసి - గడ్డితిని) తెల్లు కనుపులుగా నుండును. చెఱకు గడకున్న కనుపులవంటివి గావు. గణుకు గణుకుగా నుండును. అందుచేత కనుపపులు అన్నారు.

చూడవలసిన వన్నియు చూచినాడు. చూచినవాని నన్నింటినిజూచి యాశ్చర్యపోయినాడు. ఏమి హిమవత్పర్వతము అనుకొన్నాడు. ఒక్క సారి హిమవత్పర్వతమును గుఱించి యూహించినాడు.

పసుపునిగ్గులు దేఱు పాఁపజన్నిద మొప్పఁ
ప్రమథాధిపతి యింటిపట్టెఱింగె
శచి కేఁత గఱపుచుఁజదలేట సురరాజు
జలకేళి సవరించు చెలువెఱింగె
సదనుతోఁజేఁపి చన్నవిసి యోషధుల మ
న్నాదవు కొండలకెల్లఁ బిదుక నెఱిఁగె
వేల్పుటింతులలోన విఱ్ఱవీఁగుచు మేన
నవరత్న రచనల రవణమెఱిఁగెఁ

బరిపరి విధంపుఁ జన్నంపు బరికరంపు
సొంపుసంపద నిఖిలనిలింపసభయు
నప్పటప్పటికిని జిహ్వతుప్పుడుల్ల
నామెత లెఱింగె నీతుషారాద్రికతన.

ఈ మంచుకొండమీద నెన్ని యెన్ని చమత్కారములు జరిగినవి. శివుడిచ్చట పెండ్లియాడెను. ఇంద్రుడిచ్చట విహరించెను. ఇచ్చటనే భూదేవి పర్వతములకెల్ల నోషధులనుఁ బిదికెను. ఇచ్చటనే హిమపర్వత రాజు భార్యయైన 'మేన' దేవతా స్త్రీలందరికంటె నెక్కువ నగలు, రత్నములు ధరించి టెక్కుపోయెను.

శివుఁడిచ్చట పెండ్లియాడెననుటకు ఇంటిపట్టెఱింగెనని వ్రాసినాడు. ఇప్పటికిఁగూడ లోకములో వాడొక యింటివాడై నాడందురు. పాఁప జన్నిదము- పాము + జన్నిదము, (ముకారాంతములైన యిట్టి శబ్దముల చివరనున్న 'ము' సమాసములో 'పాఁప' యగును. రెండవ, ప కారము వెనుక నరసున్నవచ్చును. పాఁప జన్నిదము - పాము జందెము; వేముచెట్టు - వేఁపచెట్టు; నాము + చేను - నాఁపచేను.) ప్రమథాధిపతి - శివుడు.

తన భార్యయైన శచదేవికి నింద్రుడు ఈత నేర్పినాడట!

ఇట్లు చూచిచూచి విసిగి మధ్యాహ్నము కాగా ఇవ్వాళటికి ఇంటికి పోదము, మరల రేపువచ్చి చూతములే అనుకొన్నాడు.

అతని యమాయికత్వ మిక్కుడనున్నది. తీర్థయాత్రలుపోయి సేవింప వలయునన్న యాదుర్దాలో తక్కిన విషయములు మఱచిపోయినాడు. లోకములో చాలమంది యింతె. అన్ని విషయములందు చాల గడుసువారుగా నుందురు. ఏదో యొకానొకయాశ యుండును. దానియందు వారిని సులభముగా మోసముచేయవచ్చును. ఔషధసిద్ధుడు దీనిని గ్రహించినాడు, తన కోపమిచ్చట తీర్చుకున్నాడు. తీరా చూచునప్పటికి కాలికి పసరుకట్టిగి పోయినది. దుఃఖపడినాడు. కొంత యేడ్చినాడని చెప్పవచ్చును. చివరకిట్లను కున్నాడు :

"అకలం కౌషధ సత్త్వమున్ దెలియ మాయాద్వారకావంతి కా
శికురుక్షేత్ర గయాప్రయాగములు నే సేవింప కుద్దండ గం
డక వేదండ వరాహవాహరిపు ఖడ్గవ్యాఘ్ర మిమ్మంచుకొం
డకు రాఁజెల్లునె, బుద్ధిజాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్"

తానట! ఈ అకళంకమైన ఔషధముయొక్క సత్త్వమును తెలిసికొనుటకు వచ్చినాడట! ఇది యబద్ధము. లేదా దాని సత్త్వము తెలియగా వచ్చినాడనవచ్చు. ఇట్లు రాఁగా దాని సత్త్వము తెలిసినదన్న మాట తెలియన్ - తెలియగా, తెలియుటకు: రెండర్థములు చెప్పవచ్చును కాని యితడు దాని సత్త్వము తెలియుటకురాలేదు. అందుకును వచ్చియుండవచ్చును. మాయ, ద్వారక, అవంతి, కాశి,కురుక్షేత్రము, గయ, ప్రయాగము, ఇవి యన్నియు నుత్తరహిందూస్థానమునందున్న మన పుణ్యక్షేత్రములు. ఆ ప్రదేశములకు బోయి, పితరులకు పిండములు వేసినచో వారుత్తమ లోకములకు పోవుదురు.

నే నచ్చటికిపోఁక యీ మంచుకొండకు వచ్చితినేమో! ఈ మంచు కొండ యెట్టిది? ఉద్దండమైన గండమృగములు, వేదండములు - ఏనుగులు; వరాహములు - అడవిపందులు, వాహరిపులు - అడవిదున్నలు; ఖడ్గమృగములు వ్యాఘ్రములు - ఇవియన్నియు కలది. ఉద్దండ...వ్యాఘ్రము - ఇదియొక సమాసము, ఇందు మృగముల పేర్లు చెప్పబడినవి. మనమేమని యర్థము చెప్పికొనవలయును. ఈ సమాసమంతయు మంచుకొండకు విశేషణ మని చెప్పకొనవలయును. ఇవియన్నియు కలదియని చెప్పికొనరాదు. వీనిచేత నివసింపబడుచున్నట్టిదని చెప్పికొనవలయును.

చూచితిరా! ఇంతకు ముందు హిమవత్పర్వతము నేమి పొగిడినాడు. ఇప్పుడు మంచుకొండ పట్టిదౌర్భాగ్యపు కొండయని చెప్పుచున్నాడు. ఇంతకు ముందు ఏమి సీసపద్యములు, ఏమి చమత్కారము! ఇప్పుడట, వట్టి పులులు, పందులు నుండెడి స్థలమట! ఇది మానవ స్వభావము. సుఖము లనుభవించు నపుడు భోగ వస్తువులను తత్ హేతువు లయిన మనుష్యులను పొగడుదురు. దుఃఖములు ప్రాప్తించి నప్పుడు వానిని తెగడుదురు. మానవులు జీవితము ననుభవించుచు సుఖదుఃఖము లనుభవించు భిన్న వేళలందు వారు పలికెడి భిన్నమైన పలుకులు వారి సుఖ దుఃఖములకు వ్యంజకములే గాని యదార్థములుగావు. ఎందుకనగా వెంటనే ప్రవరాఖ్యు డిట్లను చున్నాడు. బుద్ధి జాడ్యజనితోన్మాదుల్ కదా! శ్రోత్రియుల్. కర్మానుష్ఠాన పరులు, బుద్ధి యొక్క జాడ్యము - మాంద్యముచేత, జనిత - పుట్టిన, ఉన్మాదము కలవారు అని. ఇంతకు ముందు మంచు కొండను తిట్టి నట్లే తన్ను తాను తిట్టుకొను చున్నాడు. లోకములో జనులే మందురు ? నాకు బుద్ధిలేదు కనుక నీకు సాహాయ్యము చేసి తినిరా యనును. తనకు బుద్ధి లేదని యర్థము! వాడు సాహాయ్యము పొందుట కనర్హుడని యర్థము. అట్లే యిచ్చట ప్రవరాఖ్యుడు తన్ను నిందించుకొను చున్నాడు. ఇంత కంటె నిక్కడ నెక్కువ యర్థము కాదు.

ఇట్లు తాను దుఃఖపడుచు, తన సంసారమును తలచుకొనుచు, తప్పని సరిగా నడచుచు ఒక కోనను చూచెను.

ఆ కోన యొక్క వర్ణన సరిగా పెనుగొండ కొండ మీద నొక చోట నున్నదట! పెద్దన్న దానినే వర్ణించినాడు. వెనుకటి చిగురు కొమ్మవలె. దానికి త్రోవయున్నది. ఏమి యందమైన దారి. అచ్చట నొక మేడ యున్నది. అది యెంత యందమైన మేడ.

ఈ దారి గాని, ఈ మేడ గాని వర్ణించుట-సొగసు సొగసుగా వర్ణించుట- కావ్యకవుల లక్షణము.

అప్పుడతనికొక సన్నని సువాసన, గాలితో వచ్చినది తగిలెను.

మృగమద సౌరభ విభవ
ద్విగుణిత ఘనసారసాంద్ర వీటీగంధ

స్ఫురితేతర పరిమళము
మగువ పొలుపుఁ దెలుపు నొక్క మారుత మొలసెన్.

మృగమదము - కస్తూరి, ఘనసారము - పచ్చకర్పూరము; కస్తూరిచేత గుమ్మమను వాసనచేత రెట్టింపైన పచ్చకర్పూరము కలిసిన తాంబూలపు గంధముతో కూడిన గాలి వచ్చినది. ఆ గాలిలో ఆ తాంబూలము కంటె నితరమైన వాసన కూడ వచ్చుచున్నది. ఆ యితరమైన వాసన యేమి? అత్తరులు, పునుగులు, జవ్వాదులు కూడ నున్నట్లున్నది. ఇట్టి వాసన యెచటి నుండి వచ్చును? మహాభోగవతియైన యొక స్త్రీ యున్నచో వచ్చును. ఆ మారుతము మగువ పొలుపుఁ దెలుపు మారుతము.

అతడు వట్టి శ్రోత్రియుడు కాడు, భోగి. స్త్రీల యొయ్యారములు, భోగములు తెలిసినవాడు. ఈ పద్యములోని రహస్యమిది.

మరియైనచో తానాచోటును పరిహరింప వలయును. రెండు కారణముల చేత నతడు పరిహరించ లేదు. ఒకటి-తనకు దారిచెప్పెడి దిక్కు మరియొకటి లేదు. రెండు-అతడిట్టి సౌందర్యములు, భోగములు, సంగీతములు నన్నియు నెఱిగిన వాఁడు. అతనికి వ్యామోహము లేదు. అందుచేత వెళ్లినాడు. వెళ్లి యామెను చూచినాడు. ఆమె మెఱుపుతీగవలె నున్నది. పెద్ద కన్నులు కలది, నల్లని ముంగురులు కలది. చంద్రునివంటి మొగము కలది. మంచి యౌవనములో నున్నది. చాల భాగ్య శాలిని. చూచిన వెంటనే యామె దేవతా స్త్రీయని యితడు గ్రహించెను. అచ్చట మానవస్త్రీ లెవరుందురు ?

ఆమె తనయింటి ముందఱనున్న యొక మామిడి చెట్టు మొదట వేయించుకొన్న యరుగు మీద కూర్చుండి వీణ వాయించు చున్నది. ఆమె యొక రతిపారవశ్య విభ్రమములో నున్నది. వీణ వాయించు చున్నది. అప్పుడామెను యితడు పలుకరించు స్థితిలో లేడు. కాని యామెయే యితనిని చూచినది. ఇతడు నలకూబర సన్నిభుడు.

నలకూబరు డనగా కుబేరుని కుమారుడు. జయంతుడు, మన్మథుడు, నలమహారాజు, నకుల, సహదేవులు, వీరందరు మన పురాణములలో గొప్ప సౌందర్యవంతులైన పురుషులు.

ఇచ్చట అబ్బుర పాటుతోడ చూచి ఝుళంఝుళత్కటక - మునుమున్ బుట్టెడు కొంకు - పంకజముఖి కప్పుడు తొంగిలి రెప్పలన్ దొలగ - ఈ పద్యము లన్నియు చదివి తీరవలెను. అప్పుడు

"అనిమేషస్థితిమాన్పె చిత్తరవుంజూ పస్వేద తావృత్తి మా
న్పె నవస్వేద సమృద్ధి బోధకళ మాన్పెన్ మోహవిభ్రాంతి తో
డనె గీర్వాణ వధూటికిన్ భ్రమరకీట న్యాయమొప్పన్ మను
ష్యని భావించుట మానవత్వము మెయిన్ జూపెట్టెనా నత్తఱిన్."

ఆమె దేవతాస్త్రీ. దేవతలు రెప్పవాల్చరు. అందుకే వారిని అనిమేషులని; అనిమిషులని యందురు. నిమేషము- నిమిషము- రెప్పపాటు: వారికి స్వేదము- చెమట, యుండదు. వారికి మోహముండదు. ఆమె ప్రవరుని చూచుచు కను రెప్పలు వాల్చినది- (ఇది శృంగార భావలక్షణము) ఆమెకు చెమట పోసినది. (దీనిని సాత్త్విక స్వేదమందురు) మోహముసరే. ఆమె గీర్వాణవధూటి-దేవతా స్త్రీ; గీర్వాణులు - దేవతలు. వధూటి - ఒకటి స్త్రీ; (సామాన్యముగా వాడుదురు) రెండు పెండ్లాడిన స్త్రీ; మూడుకోడలు; ఇచ్చట నే యర్థము చెప్పవలెనని ప్రశ్న. కవి యొక కావ్యమును వ్రాయునప్పుడు వర్ణనలు చేయును. కొన్ని వర్ణనలు కవి స్వంతముగా చేయును. కొన్నింటిని కథాను బంధిగా చేయును. కథాను బంధిగా చేసిన వర్ణనలు తత్తత్పాత్రల మనో లక్షణములను చెప్పుచుండును. స్వంతముగా చేసినవి వాని సొంతమే. అయినను వానిలో నొక్కొక్క-చోట కవి యభిప్రాయ ముండవచ్చును. పాత్ర యభిప్రాయ ముండవచ్చును. వధూటికిన్ అనుటచేత సామాన్యస్త్రీ వాచకముగా పెద్దన్న వాడియుండ వచ్చును. కాని ప్రవరాఖ్యుని మనస్సులో నామె యెవ్వనికో పెండ్లమన్న యూహ కూడ నుండ వచ్చును. ఇది వధూటి శబ్దములో నున్న స్వారస్యము.

అమరములో వధూః అన్న శబ్దము మాత్రమే యున్నది. వధూటి శబ్దము చాలా చోట్ల వాడబడినది. గోపవధూటి మొదలైనవి

లేదా యిచ్చట ప్రవరుని చూచి వలచిన వరూథిని, తానతని స్త్రీగా భావించి నది. ఆమెను పూర్వమొక గంధర్వుడు ప్రార్థించెను. ఆమె తిరస్కరించెను. అట్టి యింత వఱకు కన్యయైన దేవతావార కాంత యగుటకు నామె సపలు సందితోడ

39949

సంపర్కము కలదనుకొనుట కథాగత లక్షణములకు వ్యతిరేకము. అది న్యాయము గాదు. ఆమె తన్ను దాను ప్రవరునకు సమర్పించు కొన్నది. వెంటనే వధూటియైనది. పెద్దన్నగారి యర్థమిదియై యుండవలయును.

పెద్దన్న గారు జాగ్రత్తగా నాలోచించి శబ్దమును వేసెడి వారు.

ఇప్పుడు ఆమె దేవతాస్త్రీ. ఇతడు మనుష్యుడు. ఆమె యందు దేవతా లక్షణములు పోయి మనుష్య లక్షణములు వచ్చినవి. కనుఱెప్ప వేయుట, చెమట పోయుట, మోహము కలుగుట,—

కవి యిచ్చట నాప వలయును. ఇది ధ్వని యగును. తరువాత చెప్పినది వాచ్యమగు చున్నది. ఒక న్యాయమును కుదిర్చినాడు. ఆ న్యాయము భ్రమర కీట న్యాయము. భ్రమరము - తుమ్మెద యొక పురుగును పట్టుకొని ఝుంఝుమ్మని తిరిగి దానిని తుమ్మెదను జేయునని లోకములో వాడుక. ఇది భ్రమరకీట న్యాయము. దాని ప్రకారము వరూధిని ప్రవరాఖ్యుని భావించుట చేత తానుకూడ మనుష్యస్త్రీయైనది అన్నట్లుగా నున్నది.

ఇప్పుడేమైనది. వ్యంగ్యముపోయి వాచ్యమైనది. వ్యంగ్య మధిక రమణీయమైనది. మరి యెందుకు చేసినాడని ప్రశ్న. పెద్దన్న తక్కువ కవి కాడే! దీనికి రెండు మూడు కారణములు కలవు. 1. కావ్యకవులకు పద్యము సుఖముగా పూర్తి చేయుట అధిక వాంఛనీయము. 2. ఇచ్చట నిది వాచ్యము చేయకుండ వదలి పెట్టినచో వ్యంగ్యమును గ్రహించుట చాల కష్టము. ఈ వ్యంగ్య మొక న్యాయము మీద నాధారపడి యున్నది. ఆ న్యాయమును వదలి పెట్టినను వ్యంగ్యము వ్యంగ్యముగానే యుండును. కాని న్యాయమును సమ కూర్చుట చేత నొక చిన్న చమత్కారము కలుగు చున్నది 3. పెద్దన్న యిచ్చట వ్యంగ్యముకన్న వాచ్యమే అధిక సుందరముగా భావించు చునట్లు న్నది. ఆ మాట నచ్చముగా కాదనుటకును వీలులేదు.

అని అతని సౌందర్యమును చాల మెచ్చుకొని హఠాత్తుగా వచ్చి కాలి గజ్జెలు మ్రోయునట్లుగా వచ్చి యతని దారి కడ్డముగా నిలచెను. అతడు నివ్వెఱ పోయెను. కాని యతడట్టి లక్షణములు మున్నె యిగును. అత డన్నాడు కదా!

"ఎవ్వతవీవు భీతహరిణేక్షణ ! యొంటి జరించె దోట లే
కివ్వనభూమి భూసురుడ నేఁ బ్రవరాఖ్యుడ ద్రోవ తప్పితిన్
క్రొవ్వున సిన్నగాగ్రమునకుం జనుదెంచితి నిల్లుసేర నిం
కెవ్విధిగాంతు తెల్పగదవే తెరువెద్ది శుభంబునీకగున్"

ఈ మాటలామెకు నొకవిధముగా నర్థమైనవి. ఏమియులేదు. 'భీతహరిణేక్షణ' - భయపడిన లేడికన్నులవంటి కన్నులుకలదానా ! (లేడికన్నుల వంటి కన్నులుకలదానా యని బహువ్రీహి సమాసము చెప్పవలెను. లేడివంటి కన్నులు కలదానా యనకూడదు. ఆమె కన్నులు లేడి కన్నులవలె నున్నవి గాని లేడివలె లేవు)

ఒంటిచరించె దోటలేక-భయములేక యొక్కతెవు తిరుగుచున్నావు.

ఈ మాటలామె కాళగొలిపినవి. తనకన్ను లెట్టివైనచో నతని కేమి? తనకన్నులు మెచ్చుకొను చున్నాడు గనుకనే యట్లు పిలిచినాడు అని యామె యుద్దేశ్యము.

కాని యతడు సౌందర్యము నెఱిగినవాడు. దానిని నోటితో ననెడు వాడు. భయములేకుండ నిచ్చట తిరుగుచుంటివనగా నతడిచ్చట దారితెన్ను లేక భయపడుచున్నాడు. అది యడవి యనుకొనుచున్నాడు. అట్టి స్థలములో నామెను చూచుటచేత నిట్లన్నాడు. మరియు 'శుభంబు నీకగున్' అని బ్రాహ్మణాశీర్వాద మిచ్చినాడు. ఈ యాశీర్వాదములో శృంగార రసము యొక్క ఛాయకూడ లేదు.

తరువాత పద్యపు మొదట 'అని తనకథ నెఱిగించిన' యని యున్నది. అనగా తన కథయంతయు చెప్పెనని యర్థము-సిద్ధుడువచ్చుట, కాళ్ళకు పసరు రాచుట మొదలైనదంతయు.

అప్పటికి వరూధినికి అతడు తన చేతిలో చిక్కిన పిట్టయని తెలిసినది. ఈమాట యనుటచేత నామె యతనిని వల వేసి పట్టుకొనవలెననిగాని మరి యే మరూహలుగాని లేవు. అతడిప్పుడు నిస్సహాయుడు. అట్టి స్థితిలో తా నతనిని వలచినదిగనుక తనవలపు చెప్పినచో నచటనుండి పోవుటకత డంగీకరింప వచ్చును. నిజాని కామెకుమాత్రము దారి యేమితెలియును? ఆ పర్వతములు ఆ

మార్గములు నామె యెఱుగునా? ఒక ఆటవికుడో యొక ఆటవికురాలో యైనచో దారి చెప్పగలుగుదురేమో !

ఇంకనామె తన ప్రేమను బయటపెట్టుట మొదలు పెట్టినది.

"ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర! యే
కాంతమునందునున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించులా
గింతియకాక నీ వెఱుఁగవే మునువచ్చిన త్రోవచొప్పు నీ
కింతభయమ్ములే కడుగనెల్లిదమైతిమి మాట లేటికిన్"

ప్రసిద్ధమైన పద్యము. అతనికన్నులు విశాలమైనవని. అతడు తెలిసియే మిషపెట్టి పలుకరించుచున్నాడని తాను వానికి లోకువైనదని-యట్టి మాటల చేత నామె తన ప్రేమ వెల్లడించినది.

ఎఱుఁగవే మునువచ్చినత్రోవచొప్పు. అనగా 'అని తనకథనెఱింగించిన' యన్న మాటకు వ్యాఖ్యానము వేశే యేమియులేదు. 'ఎవ్వతె వీవు' అన్న పద్యములో నెంత యర్థమున్నదో యంతియే యర్థమని సామాన్యముగా నందఱు ననుకొందురు. అందుకనియే 'యెఱుగవే మునువచ్చినత్రోవచొప్పు' అని యీమె యనుట తటస్థించినదనికూడ చెప్పవచ్చును.

కాని యిందులో విశేషార్థ ముత్పన్నమగును 'నీవు వెళ్లుట యసంభవ' మని. ఇచ్చటనుండి యెవ్వరువెళ్ళరు. నీ విచ్చటనుండి పోవలసిందే! యని కూడ నర్థముచెప్పవచ్చును.

ఈ మాటలు ప్రవరున కర్థముకాలేదు, అర్థమైకూడ అతడు పట్టించుకోడు. తనవంశము గొప్పచెప్పినది.

చిన్ని వెన్నెల కందువెన్నుదన్ని సుధాబ్ధి
పొడమిన చెలువ తోఁబుట్టు మాకు
నహిపుట్ట జంత్రగాత్రముల రాల్గరగించు
విమల గాంధర్వమ్ము విద్య మాకు
ననవిల్తు శాస్త్రంపు మినుకు లావర్తించు
పని వెన్నతోఁ బెట్టినది మాకు
హయ మేధ రాజసూయములనఁ బేర్వడ్డ
సవన తంత్రంబు లుంకువలు మాకుఁ

గనకనగసీమఁ గల్పవృక్షముల నీడఁ
బచ్చరాచట్టు గవి రచ్చపట్టు మాకుఁ
బద్మసంభవ వైకుంఠ భర్గసభలు
సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర.''

ఇది చాల మంచి పద్యము.

చిన్ని వెన్నెలకందు-అందమైన వెన్నెల పసివాడు, అనగా చందమామ; అతని వెన్నుఁదన్ని - అతని వెంటనే; సుధాబ్ధిన్ - అమృతసముద్రములో, పొడమిన చెలువ - లక్ష్మీదేవి; మాకు తోబుట్టువు. లక్ష్మీదేవి పేరు చెప్పలేదు కదా! అందుచేత నామె తమకు పరుసకప్పగారుకాదు. నిజముగా నప్పగారు. అనగా తమరుగూడ పాలసముద్రములో పుట్టిరని యర్థము. పచ్చరాచట్టుగమి' పచ్చని మణివేదికలు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల సభలు వారికి సాముగరిడీలు. సాముగరిడీలు పురుషులు చేయుదురు. కాని భరతశాస్త్రము నేర్చికొను స్త్రీల యొక్క విద్యకూడనట్టిదే ।

ఆమె యిట్టి మాటలనగా ప్రవరుడు ఆమె స్వరూపమును సంపూర్ణముగా తెలిసికొనెను. తాను అరుణాస్పదపురములో పలుచోట్లకుపోవుట వారితనిని గౌరవించుట యితడు సాలగ్రామము మున్నుగా గొననివాడుఁ గనుక నిర్లిప్తుడు గనుక నతడనెడిమాటలు కొన్ని గలవు వానినన్నాడు. కాని 'అండజయాన!' యని సంబోధించుట తప్పుచేసినాడు. వట్టి స్త్రీ పర్యాయపదముగా వాడినాడు. అతని హృదయములో వస్తుసౌందర్యదృష్టి నెలకొనియున్నది. ఆ దృష్టికి నతని వాంఛకు సంబంధములేదు. నీవుచేసిన మర్యాదలు మాకు వచ్చినవి. నేను మీయింటికి వచ్చినచో నొకటియు రానిచో నొకటియునా ? నేనింటికిపోయి క్రియాకలాపము చేసికొనవలెను. నన్ను దయచూచి వదలిపెట్టవలయును. నీవు దేవతాస్త్రీవి. నన్ను తేలికగా మా యింటికి పంపఁగల్గుదువు

అనగా వరూధినికి ప్రవరుడు తన్ను మించిపోలేదని తెలిసినది. ఇంక నతనికెన్ని మేనెరలుపెట్టినది, అక్కడనున్న సౌందర్యములన్నియు చెప్పినది. ఎంతో శృంగారరసమును వెదలగ్రక్కినది. తన్నుఁగూడి రమింపుమన్నది. ఆక్షేపించినది.

చివరకు నిట్లన్నది :

''ఎందేదెందము కందళించు రహిచే నేకాగ్రతన్ నిర్వృతిన్
జెందున్ గుంభగత ప్రదీపకళికాశ్రీదోఁప నెం దెందుఁ బో
కెందే నింద్రియముల్ సుఖంబుఁగను నా యింపే పరబ్రహ్మమా
నందో బ్రహ్మ యటన్న ప్రాఁజదువు నంతర్బుద్ధి నూహింపుమా !''

అమె ఆనందో బ్రహ్మ యన్న వాక్యమునకి దుర్వ్యాఖ్యానము చేసినది.

ఇతడు సర్వశాస్త్రవేత్త. అధ్యయనపరుడు. అట్టివారు మరి దేనినైన నోర్తురుగాని వేదోపనిషచ్ఛాస్త్రగత పంక్తులకు దుర్వ్యాఖ్యాన మోర్వరు ఇంత వఱ కామెయందు జాలికలదు. జీవులయొక్క కామ ప్రవృత్తి యిట్లుండు నన్న యొకయూహ కలదు. ఇప్పుడదియు పోయినది. ఆనందో బ్రహ్మ యటన్నది మహావిషయము. స్త్రీ పురుష రతిసంబంధమైనదిగా వ్యాఖ్యానము చేయుట పాపముకూడ.

దానికిత డిట్లనెను;

''ఈ పాండిత్యము నీకు, దక్క మరియెందేగంటిమే కామశా
స్త్రోపాధ్యాయినినా వచించెదవు మే లోహో త్రయీ ధర్మముల్
పాపంబుల్ రతిపుణ్యమంచు నికనేలాతర్కముల్ మోక్షల
క్ష్మీ పథ్యాగమసూత్రపంక్తి కివె పో మీ సంప్రదాయార్థముల్''

ఇది మీ వాఖ్యానము. ఇక్కడ తర్కము కూడనా! ఆనందో బ్రహ్మ మొదలయినవి మోక్షలక్ష్మీ పథ్యాగమసూత్ర పంక్తిలోనిది.

మోక్షలక్ష్మీ - మోక్షేందిరయొక్క; పథి - మార్గమునందున; అగమ - శాస్త్రములయొక్క; సూత్రపంక్తి - సూత్రముల వరుస.

సంస్కృతములో కొన్ని శబ్దములు సమాసాంతము లైనచో అకారాంతము లగును. అందుచేత లక్ష్మీపథాగమములు కావలయును. కాని ఆ సూత్రము వికల్పము. వచ్చినచో వచ్చును రానిచోరాదు. అందుచేత పథ్యాగమ అని యణాదేశ సంధియేయైనది.

సంప్రదాయము - దీనిని లోకములో సాంప్రదాయమని వాడుదురు. అది తప్పు. సమర్థించవచ్చును.

అతడిట్టి వానిని తుచ్ఛసుఖము లనెను.

ఆమె కాళ్ళ తునిగిపోయెను

ఆమె యతనిమీదపడి కౌగలించుకొనెను.

"ప్రాంచద్భూషణ బాహుమూలరుచితో పాలిండ్లుపొంగార పై
యంచుల్ మోవగ కౌగలించి యధరం బాసింప హా శ్రీహరీ!
యంచున్ బ్రాహ్మణు డోరమోమిడి తదీయాంస ద్వయంబంటి పో
మ్మంచుం ద్రోచె కలంచునే సతులమాయల్ ధీరచిత్తమ్ములన్."

ఇందులో పక్కా రసాభాసమున్నది. ఈ పద్యము జనమందరికి వచ్చును.

అప్పుడామె యేమి చేయును? ఒక హేలను చూపించెను.

"పాటునకింతులోర్తురె కృపారహితాత్మక నీవు త్రోవ ని
చ్చోట భవన్నఖాంకురము సోకె కనుంగొనుమంచు జూపి య
ప్పాటల గంధివేదననెపంబిడి యేడ్చె కలస్వనమ్ము తో
మీటినవిచ్చుగుబ్బ చనుమిట్టల నశ్రులు చిందువందగన్."

నీ గోటికొన చివర యిచ్చట గుచ్చికొనెనని చూపినది. ఎచ్చటనో మనకు తెలియదు. పాపమామె యంత లజ్జ విడిచినది. ఆ గిచ్చువలన బాధకలిగి నట్లు మొదలు పెట్టినది.

ఈ పద్యమొక అందమైన పద్యము. దీనినిబట్టి ముక్కుతిమ్మన్న తన పారిజాతాపహరణములో నొక పద్యము, భట్టుమూర్తి తన వసుచరిత్రములో నొక పద్యమును వ్రాసికొనిరి.

చివరకామె నీవు నన్ను పొందుటచేత నీ గొప్పదన మేమియుపోదు. పూర్వము నీకంటె గొప్ప మహర్షులే యప్సర స్త్రీలను పొందినారు అని వారి కథలు తడవమొదలు పెట్టెను.

"వెలిపెట్టిరే బాడబులు పరాశరుబట్టి
దాశకన్యాకేళి దప్పుజేసి
కులములో వన్నెతక్కువ యయ్యెనే గాధి
పట్టికి మేనక చుట్టరికము

నను పుకాడై వేల్పు నాగవాసముఁగూడి
మహిమఁగోల్పడియెనే మాందకర్ణి
స్వారాజ్యమేలంగ నీరై రె సుర లహ
ల్యాజారుఁడైన జంభాసురారి
వారికంటెను నీ మహత్త్వంబు ఘనమె
పవన పర్ణాంబు భక్షులై నవసి యినుప
కచ్చడాల్ గట్టుకొను మునిముచ్చులెల్లఁ
దామరస నేత్రలిండ్ల బందాలుగారె."

బాడబులు - బ్రాహ్మణుల; గాధిపట్టి - విశ్వామిత్రుడు; నను పుకాడు - మిండకాడు; వేల్పు నాగవాసము - అప్సరస్త్రీలు. స్వారాజ్యము - స్వర్గము; (స్వః + రాజ్యము —స్వారాజ్యము) శబ్దము స్వః - సకారాంతము "స్వస్" అన్న మాట. ఈ విసర్గపైన 'ర' అన్న అక్షరము రాగా 'స్వ'కు దీర్ఘమువచ్చును. అందుచేత స్వరాజ్యము వేఱు. స్వారాజ్యము వేరు. మన దేశములో చాలామంది పలుశబ్దములను తప్పుగా వాడుదురు. అందులోనిది యొకటి. ఇరువది యేండ్ల క్రింద అహింసావాదులు చాలమంది స్వరాజ్యము బదులు స్వారాజ్య శబ్దమునువాడి బ్రిటిషువారి పోలీసుల చేతిలో స్వారాజ్యమును పొందిరి. కచ్చడాలు - గోచులు.

కచ్చడాలన్న శబ్దమిచ్చట వాడుట వరూధినిచేసిన యాక్షేపణకు లక్షణము.

చివరికా ప్రవరుడు తాను నిత్యము వేల్చుచున్న మహాగ్నిహోత్రుని ప్రార్థించి మింటికెగిరి తనయూరు తాను బోయెను.

మనము పూర్వము వరూధిని నెరుగము. ఆమె సంగతి మనకు తెలియదు. అయినను అతడు వెడలిపోయిన తరువాత మన మనస్సు వానిమీద కంటె నీమె మీద నెక్కువ నిలచును. ఆమె యెవ్వరు? అన్న ప్రశ్నకంటె ఆమె యేమైపోయి నది? ఏమి చేసినది? ఇట్టి ప్రశ్నలు మనలను బాధించును. అతడు వెళ్ళిపోయిన తర్వాత నామె యతనిని గురించి చాల దుఃఖించినది, ఆమె దేవతా స్త్రీ. వానికి చావులేదు. ఆమె యనుకొన్నది కదా! నాకంటె మనుష్య స్త్రీలే యెక్కువ

యదృష్టవతులు. వారు తాము ప్రేమించిన పురుషుడు నిరాకరించినచో చనిపో గలుగుదురు. నేను చావలేనని దుఃఖించినది. ఇంతలో ప్రొద్దు క్రుంకినది. సంధ్యా కాంతులు క్రమ్మినవి. ప్రపంచమంతయు నెఱ్ఱగానైనది.

ఉరుదరీ కుహరసుప్తోత్థ శార్దూలముల్
ఝరవారి శోణిత శంకఁద్రావ
వనకుంజ మధ్యశాద్వల చరన్మృగపంక్తి
దావపావకభీతిఁ దల్లడిల్ల

నాశ్రమాంతర భూరుహాగ్రముల్ మునికోటి
బద్ధ కాషాయ విభ్రాంతిఁజూడ
ఘనసాను శృంగ శృంగాటకంబులఁగాంచి
యమరులు హేమాద్రియనుచు ప్రాఁ

గా సెంబేశలరుచిఁ గింశుక ప్రవాళ
ఘుసృణకిసలయ కంకేళి కుసుమగుచ్ఛ
బంధుజీవ జపారాగ బాంధవంబు
లన్నగంబున జరఠారుణాతపములు.

పెద్ద గుహాగర్భములయందు సుప్త - నిద్దురపోయి; ఉత్థ – లేచిన; శార్దూలముల్ - పెద్దపులులు; ఝరవారిన్ - సెలయేళ్ళలోని నీటిని శోణితశంకన్ - నెత్తురన్న యూహతో : ద్రావన్ - త్రాగగా; పెద్దపులులు పవలెల్ల నిద్రపోయి ఆ మగత సరిగా తీరకముందు సంధ్యాకాలపు టెఱ్ఱదనముచేత నెఱ్ఱవడిన సెల యేటి నీళ్ళను నెత్తురనుకొని త్రావినవట ! అడవిలో అగ్ని బయలుదేరినదని లేళ్లగుంపు భయపడినది. మునులు చెట్లకొమ్మల మీదనున్న యెఱ్ఱదనమునుజూచి ప్రొద్దుట నెండవేసిన తమ కావి బట్టలు శిష్యులు విప్పలేదని చూచిరి. వట్టికొండల చరియలుచూచి దేవతలు వారి నివాసభూమియైన బంగారు పర్వతమనుకొని ప్రతి కొండమీద ప్రాలిరి.

ఇది సంధ్యాకాంతుల వర్ణన. మన కవులయొక్క వర్ణనలిట్లుండును. ఇంత రమ్యముగా నుండును. మరియు నీపద్యముయొక్క మొదటి చరణము దాని

కదియేసాటి. ఆ యక్షరములకూర్పు పరమ రమణీయము. అవి జరఠారుణాతప ములు, ముదిరిన యెఱ్ఱని యెండలు. ఆ సమాస మందమైనది.

చీకటిపడ్డది. తెల్లవార్లు గడచినది. మరల తెల్లవాఱినది. ఇచ్చట నెన్నియో పద్యము లందమైనవి కలవు.

అంతట వరూధిని దుఃఖపడుచున్నది. ఇంటిలో తోచక యుద్యానవనము లోనికి పోయినది.

ఇట్లుండగా మన కావ్యములలో నొక యంగమున్నది. తొమ్మిది రసములు కలవు. వానిలో శృంగారరసము ప్రధానమైనది. రస ముదయించుటకు విభావము లుండవలయును. విభావములు రెండు విధములు. ఆలంబన విభావము, ఉద్దీపన విభావము. శృంగార రసమునకు నాయికా నాయకులుందురు కదా ; వారాలంబన విభావములు. వారు లేనిచో రసమేలేదు. రెండవది ఉద్దీపన విభావము. ఆ భర్త దగ్గర లేనప్పుడు ఆ నాయిక చాల బాధపడుట సహజమేకదా! చల్లనిగాలి, వెన్నెల, చందమామ, మన్మథుడు మొదలైనవి ఉద్దీపన విభావములు.

ఆ నాయిక యీ యుద్దీపన విభావములను తిట్టుట మన కావ్యములలో నొక సొగసు. కవులు చమత్కారముగా తిట్టింతురు;

వరూధిని చంద్రుని తిట్టుచున్నది :

త్రిపుర సంహార మొనరించునపుడు హరుడు
బండికల్లుగ నీమేను గండిచేసె
నదియు సెలవాఱి తెగటారవైతి చంద్ర
అకట రోహిణియెడ నపథ్యమునఁజేసి.

శివుడు త్రిపుర సహారము చేసినపుడు ఆయనకు భూమి రథము, సూర్య చంద్రులు రథ చక్రములు. చక్రమైన చంద్రునిలో నిరుసు పెట్టుటకు చంద్రునిలో గండిచేసెనట. అది పెద్దగాయము. మందుఱువేసి మాన్పించుకొన్నను ప్రాత పుండు సెలవేయుట యున్నదికదా! నీవట్టైన చచ్చితివికాదు. దానికన్న నంద మైన మాటయిది. ''రోహిణియెడ నపథ్యమునఁజేసి'' యన్నది. చంద్రునకు రోహిణి పెద్దభార్య. ఆమె యన్నచో న తని కె క్కు వ ప్రేమ. అతని

కిరువది యేడు మంది భార్యలు; గురు భార్యయైన తారతో నతడు చేసిన జారత్వము ప్రసిద్ధము. అతడు గొప్ప కాముకుడు. స్త్రీ లోలుఁడు. పుండు సెలవారినపుడు జ్వరము వచ్చును. ఆ జ్వరములో స్త్రీ సంయోగము చేసినచో దోష గుణము కలుగును. దోషగుణము చాలా చెడ్డది. చాలా మంది చత్తురు.

ఇది చిన్న పద్యమైనను మిక్కిలి భావము కలిగిన పద్యము. చక్కని యూహకలిగిన పద్యము. వరూధిని చంద్రుని కాముకత్వమును నిందించు చున్నది. వరూధిని శీలవతి యని తెలియుచున్నది.

మన కావ్యములలో నిట్లు ప్రబంధము లన్నింటిలో మన్మథ చంద్ర మలయా నిలాదుల దూషణలు శృంగారరస కావ్యములలో పతి విరహావస్థ యందు కవులు నాయికల చేత చేయింతురు. జనము బంధు వియోగము జరిగి నప్పుడు భోగము లనుభవించుట కిష్టపడరు కదా! ఇష్ట పడక పోవుటయే కాదు, తిరస్కరింతురు. వానిని దూషింతురు. ఇది మానవ స్వభావము. దీని నాధారముగా చేసికొని మన కవులీ కల్పనలు చేసినారు.

ఒక స్త్రీ ఒక పురుషుని ప్రేమించుటయు ఆ ప్రేమ కొనసాగక పోయి నచో ప్రాణములు కూడ పరిత్యజించుటయు లోకములో నున్నది. అదియే నిజమైన ప్రేమయని యాధునికులు మిక్కిలి ప్రశంసించుట కలదు. ఆ స్త్రీ ఎందుకు చనిపోవును? తాను ప్రేమించిన వానిని వదలి బ్రతుక లేదు. ఈ శృంగార నాయికల లక్షణము కూడ నించుమించుగా నట్టిదే! అందు చేత కవులు తమ కావ్యముల యందిట్లు వ్రాసిరి. దీని వెనుక నీ పరమగాఢాను రాగమున్నది.

ఇవి ప్రతి కవియు చేసినాడని యాధునికు లాక్షేపించుట యారంభించిరి. తిరస్కరించుట యారంభించిరి. చిలవలు పలవలు మొలిపించిరి. వారిది సరియైన యూహ కాదు, మరియు కావ్యములు కల్పనల కోసము వ్రాయ బడుచున్నవని తొలుత చెప్పబడినది. ఆ వెనుకనున్న గాఢానురాగమును పాఠకుడు వదలి పెట్టకుండ కవి చేసిన కల్పనలలోని చమత్కారము చూడ వలయును. మన పాశ్చాత్య విద్యా ప్రభావము వలన తదనుయాయులైన కొందఱు విద్యాధికుల వలన మన కావ్యమును మనమెట్లు చదువు కొన వలయునో మరచిపోయినాము.

ఈ కల్పనలు చదివినచో నేటి పాఠకులకు మన సంప్రదాయములు మన పురాణ కథలు వానిలోని చమత్కారములు మొదలైనవి చక్కగా తెలిసి అందఱును పండితులు కావచ్చును.

ప్రొద్దు క్రుంకినది. చీకటి పడినది. వరూధిని తన యుత్సాహమే పోగొట్టు కొన్నది. ఆమె చెలికత్తె యామెను మందిలించు చున్నది.

వాలారుం గొనగోళ్లనీ వలసతన్ వాయించుచో నాటకున్
మేళంబైన విపంచి నిన్న మొదలున్ నీవంటమింజేసి యా
యాలాపంబె యవేళఁ బల్కెడు ప్రభాతాయాత వాతాహతా
లోలత్తంత్రులు మేళవింప గదవే లోలాక్షి దేశాక్షికిన్.

వరూధిని వెనుకటి దినమున వీణ వాయించి తీగలను నాటరాగమునకు శ్రుతిచేసినది. ఈ ప్రవరుడు వెళ్లి పోయినాడన్న దుఃఖముతో మరల వీణవంకనే చూడలేదు. రాత్రి గడిచినది. తెల్లవాఱినది. గాలిచేత కొట్టబడి యా తంత్రులు వేళ కాని వేళ నటరాగ సంబంధి స్వరములు వెలువరుచు చున్నవి. ప్రాతఃకాలము నందు దేశాక్షిరాగము పాడవలయును. దానికి తంత్రులను మేళవించు మని చెప్పుచున్నది. ఆమె మేళవించినచో కొంత దుఃఖము మరచి పోయి నట్లగును కదా, అందుకని.

ఇచ్చట మన కవులు, వారి పాండిత్యము; వారి నాగరికత, వారి బహుశాస్త్ర జ్ఞానము, ఆనాటి నాగరికత — ఎన్ని తెలియు చున్నవి. ఈ పద్యము చదివి తెలిసికొన్నచో సంగీత శాస్త్రములోని యొక మహా పరమ రహస్యము తెలియును గదా ! అన్ని రాగములు నన్ని సమయములందు పాడరాదు. కొన్ని ఋతువుల యందు కొన్ని రాగములు పాడరాదు. అది సంపూర్ణముగా తెలిసి సంగీతము నానందించెడి నాగరికత మన దేశములో నేనాడో పోయినది. అన్ని విద్యల యందలి యన్ని సూక్ష్మములు నశించి పోయినవి.

ఇది తృతీయాశ్వాసము. ఆమె వియోగ దుఃఖమంతయు నరువది ఏడు పద్యములలో వర్ణితమైనది.

ఇప్పుడీమె యెవ్వరన్న ప్రశ్న పుట్టక తప్పదు కదా !

పూర్వ మొక గంధర్వు డీమెను ప్రేమించెను. ఈమె యంగీకరించలేదు. అతని కీకథ తెలిసెను. వారు దేవతలు, కామరూపులు. అనగా నిష్టము వచ్చిన రూపమును ధరింప గలరు ఆతడు ప్రవరాఖ్యుడుగా మారి ఈమెను పొంద వలయునని తలచెను. అన్నియు వర్ణనలే! మలయపవను గురించి యొక చరణ మున్నది. ఆ గాలిలో నుండి సువాసన వచ్చు చున్నది.

> "ఉరగపూత్కార ధూమోగ్ర గంధము బాసి
> పొలయుఁబో యీ తావి మలయ పవనుడు."

ఈ చరణములోని మొదటి సగము తెనాలి రామకృష్ణునిది వలె నున్నది. సంస్కృతము నసహ్యించు కొనువాడు తాసీ యనుభ వానందమునకు చెడును. ఎవరికి నష్టము ?

ఇట్లెన్నియో వర్ణనలు గలవు.

ఈనాటి పాఠకులు రసవేత్తలు కారు. వారికి తెలిసినది సుంత భావము. ఆ భావము కూడ సాంఘిక వ్యవస్థ రాజకీయములు, సామ్యవాదము మొదలైన వానికి సంబంధించినదివలె నున్నది.

ఊహ యొక్క, భావన యొక్క రామణీయకము తెలిసినచో నీ కావ్యము లర్థమగును.

మొదట బుద్ధిని దానికి ననువుగా చేసికొని కావ్య పాఠము కడకు పోవలయును.

కొంత సేపటికి ఆ గంధర్వుడు—ప్రవరునివలె వేషము వేసికొనిన వాడు—ఆమెకు గనిపించెను. వరూథిని యితడే యతడను కొనెను. వరూధిని వచ్చి మరల పలుకరించెను. ఈ గంధర్వుడు నటించ వలయును. అప్పు డక్కుహనా భూసురుడు (కపట బ్రాహ్మణుడు) ఎట్లు ప్రవర్తించ వలయును ? ఇట్టి ఘట్టములలో కవి యొక్క శక్తి తెలియును. ఏవియో కొన్ని లక్షణములు ప్రతి కవియు చెప్పును. సామాన్య కవులు చెప్ప లేనివి మహాకవులు చెప్పుదురు. ఇక్కడ పెద్దన్నగా రొక సీస పద్యమును వ్రాసిరి. అందులోని మొదటి చరణమును చూడవలయును.

కొనసాగి కామినీ గోష్ఠి ప్రౌఢములైన
ఉదుటు చూపులు ఱెప్పతుదల వాపి

పద్య మంతయు పాఠకుడు చదువుకొన వలయును. ఈ చరణములోని యందము చూపింతును. కొనసాగి-రాటు తేలి; కామినీ గోష్ఠిన్-నిత్య స్త్రీ సంపర్కముచేత; ప్రౌఢములైన-బిగిసిన; తద్విషయికమైన సామర్థ్యము నందు పరాకాష్ఠ పొందిన; ఉదుటు చూపులు-ఉదుటు అన్న మాటకు నిఘంటువులలో నర్థముండును. ఉదుటు చూపులన్న మాట దాని యంతట నదియే. దానియర్థము దానిదే. స్త్రీ సంపర్క ప్రౌఢుడైన వాడు తన వాంఛ యెదురుగా నున్న స్త్రీలకు తెలియునట్లు కొన్ని చూపులు చూచును. ఉదుటు చూపులనగా నవియే. దాని కదియే యర్థము. అట్టి చూపులను ఱెప్పల యొక్క తుదల యందు ఆచి పట్టుకొనెనట.

ఇట్లు వ్రాయుట కాని ఉదుటు చూపులన్న శబ్దమును తెచ్చుట గాని చాల గడుసరియైన కవి చేయ గలడు అల్పులు చేయలేరు. మరియు నీ సీస పద్యపు చరణము యొక్క నడక ఒక గొప్ప లయమీద నున్నది. అది ప్రతి వాడును తనకుదాను చదువుకొని తెలిసికొన వలసినదే

నే నీ వ్యాఖ్యానములు వ్రాయుటలో పాఠకుల యొక్క మనస్సులు మన సాహిత్యములోని రామణీయకము తెలిసికొనుటకు ప్రయత్నము చేయుచున్నాను.

చివరకు నామె యితడు ప్రవరుడే యనుకొనినది. అతడు దొంగ కదా ; ఒక నియమము పెట్టెను. రతిసమయము నందామె కన్నులు మూసికొన వలయునట ; ఇంత కంటె రతిసమయ గత పరమ దుష్టమైన నియమముండదు. నిజమునకు రతి లేక పోయినను సరే ; ఈ నియమమున కంగీకరించు స్త్రీయందు స్త్రీత్వము కంటె నెదో మహా గుణమున్నది. ఆమె స్త్రీ కాదు. ఒక కారణ జన్మురాలు. ఆ రహస్య మీ నియమములో నిమిడి యున్నది. ఆమె గర్భమున నొక మహానుభావుడు పుట్టవలెను. వాని గర్భమున స్వారోచిషమనువు జనింప వలెను. అందుకొఱకామె జన్మించినది. అందుచేత నామె యంగీక రించినది. ఒక దానివంక నొకటి చూచుకొనుట లేకున్నను పశువులు కూడ రతి సమయమునందు కన్నులు మూసికొనవు.

భారతము నందు వ్యాసదేవరన్యాయ కాలమున అంబాలిక కనులు మూసికొన్నది గ్రుడ్డి వాడైన ధృతరాష్ట్రుడు పుట్టినాడు. వరూథినికి సంతతి కలిగినచో గ్రుడ్డి వాడు కలుగ వలెను. కలుగలేదే! ఇది యాశ్చర్యము.

దేవతలు రాక్షసులు తాము కామ రూపములు ధరించినచో రతి వేళ మృతి వేళ వారి సహజ రూపములు పొందుదురు. అందుచేత నా గంధర్వుడీ నియమమును బెట్టెను.

ఇచ్చట కొన్ని యందములైన పద్యము లున్నవి. అతడన్నాడు కదా !

నీ చనుదోయి సంకుమద నిర్భర వాసన మేననూన న
య్యో చిర సౌఖ్యముల్ కనుట యొండె తపంబొనరించి పాపముల్
రాచుట యొండె గా కిహపరమ్ములకూ ఱక దూరమై వయ
శ్శ్రీచన రెంటికిన్ జెడిన రేవడ నౌదునె నీర జేక్షణా !

° ° °

అకట నిర్దయ బుద్ధివని దూఱెఁగడు రంభ
యాహా వివేకి వౌదనియె హరిణి
చేఁదు ద్రింగెద వంచుఁ జిలికె నవ్వె ఘృతాచి
మాయలాఁడని తిట్టె మంజుఘోష
న్యాయనిష్ఠురములఁ బ్రార్థించె నూర్వశి
జంకించె రమ్మంచుఁ జంద్రరేఖ
చెలినేచితని ఁసంతులు గొట్టె మేనక
విడువు మాయలటంచు నొడివె హేమ
గొంటవనియెఁ దిలోత్తమ గూర్మిఁ గొసరె
ధాన్యమాలిని పుంజిక స్థల యదల్చె
దివిజ కామినులీరీతిఁ దిరుగువాఱి
గువ్వకోల్గొంచుఁ దమలోన నవ్వుకొంచు.

వీరు పదకొండుగురు వరూథిని చెలికత్తెలు. ఒక్కొక్కతె యొక్కొక్క మాట యన్నది. ఈ పద్యము నున్న చమత్కార మేమనగా వారొక్కొక్క రన్నది యొక్కొక్క మాటయైనను ఆ మాటలలోని వైలక్షణ్యముచేత

ఆ మాటలను చున్నప్పుడు వారు నిలుచున్న భంగిమలు వారి యాకార విశేషములు వారి స్వభావములు భిన్న భిన్నములుగా గడుసుగా శాంతముగా సాక్షేపముగా మృదు తిరస్కారముగా పదునొకండు విధములుగా కనిపించు చున్నవి. లోకజ్ఞుడు భావజ్ఞుడు రసజ్ఞుడునైన మహాశిల్పి వ్రాయదగిన బొమ్మలు.

ఈ పద్యము చివర గుంపు కూడుచు నన్న యర్థము కల శబ్దము "గువ్వ కోల్గొంచు" వాడబడినది. పెద్దన్న గారి శబ్ద జాలములో కొన్ని మాటలు కలవు పుచ్చడీకతనము, కచ్చడాలు, గువ్వకోల్కొంచు-ఇంకను కలవు. ఆయన కవిత్వము నందు భావుకులకు గల యాకర్షణలో వీని పాలు కూడ కొంత యెక్కువ యున్నది.

o o o

వారిద్దరు పలుచోట్ల విహరించిరి. ఒక సీస పద్యమున్నది. ఆ పద్య మాచోట ఆచోటనని చెప్పును. ఆ పద్యపు మొదట "మృగనాభి నికకంపు బుగబుగల్ కలచోట" అని యున్నది. ఆయన సహస్రగంథనమట్టిది.

పెద్దన్న గారి పద్యములకు చాల మంది కవులు ఏకప్పుడు-వీరి ఆయన యొక్క ఆంధ్ర కవిత యందలి యుపజ్ఞ యట్టిది. ఆయన మాటలే వేఱని వ్రాసితిని గదా!" పావురము లారజమ్ములు పలుకు చోట" (ఆరజము అనగా నవ్యక్త మధురమైన స్వరములు.) అర్థములోనే మున్నది? ఆరజమ్ములు. పలుకుచోట యన్న కూర్పులో నున్నదిగాని

వారిద్దఱకు నొక కుమారుడు కలిగెను. ఆ గంధర్వుడు వరూధినిని వదలి వెళ్ళిపోయెను.

ఆ బిడ్డ పేరు స్వరోచి. (ఇది సకారాంత శబ్దము) 'స్వరోచిస్ అని పేరు. తెలుగులో స్వరోచి యగును. రోచిస్ అన్న శబ్దము తెలుగులో రోచి' యగను తేజస్ - తేజము; యశస్ - యశము; అర్చిస్ - అర్చి; ఇట్లు. అతడు పెద్దవాడై గొప్ప రాజయ్యెను. అతడొకప్పుడు వేటకు వెళ్ళెను. ఈ వేటను చదివి తీరవలయును. ఎన్నో వేట కుక్కలు, వానికి పేర్లు; ఆ యడవిలో నున్న యేకలములు (అడివి పందులు)

కండూతికై రాయు కర్కశంబగుతుంటి
పీటపెట్టిన ప్రాను పెల్లగిలంగ

వాని వెనుక భాగములయొక్క కండూతికి (దురదకు) పీటపెట్టిన ప్రానులకు వేసికొనిరాయగా ఆ ప్రానులు పెల్లగిల్లునట !

'చప్పరించు వెదుళ్లు సటలుబ్బ దంష్ట్రాగ్ని
చొంగపైబడి చుంయిచుంయి మనగ'

ఆ పందులు వెదుళ్ళను నమలుచుండును నమలుచుండగా నిప్పుపుట్టును. ఆ నిప్పు వాటి నోటిచొంగపైబడి చుంయిచుంయి మనుచుండును.

ఆయన వర్ణన లిట్లుండును, వేట చాలవరకు వర్ణితమయ్యెను.

అడవిలో దావాగ్ని పుట్టినది. అది యెట్లున్నది?

"చకితైణాహతి దావమావలిత పుచ్ఛస్వల్ప గచ్ఛత్తర
క్షుక మద్రిగ్రహయాళు భల్లుకము వక్షోభాగనిక్షిప్త డిం
భక వల్గత్ప్లవగీ కదంబము ప్రహదాంభః ప్రోద్ధితక్రోడ నా
యక మాభీలముఖ ద్వీపిస్థపుటితంబయ్యెన్ వనంబత్తరిన్ !

భయపడి లేళ్లు పారిపోవుచున్నవి. తోకముడుచుకొని సివంగులు వెళ్లుచున్నవి ఎలుగుగొడ్లు కొండలకెగ ప్రాకినవి. పిల్లలను రొమ్ముల నెత్తుకొని అడకోతులు దూకుచున్నవి. చెఱువులలోనుండి అడవిపందులు లేచి పోవుచున్నవి. పెద్దపులులు మహాభయంకరమైన మొగములతో నున్నవి అడవి యట్లున్నది.

ఈ పద్యముయొక్క రచన సమాసభూయిష్ఠము. కాని చిక్కనిరచన. పద్యము నోటికి రావలయును.

అతడు చాలా సేపు వేటాడెను. అతనికప్పుడు ఒక శకునము తోచెను. ఆ శకునమువలన నతని కొకలాభము కలుగవలయును. అప్పుడాయడవిలో నొక మొఱ్ఱ వినిపించెను. అప్పుడొక స్త్రీ ఆర్తురాలై దుఃఖించుచు రాజుదగ్గఱకు వచ్చి యిట్లనెను.

"ఓరాజన్యమహేంద యోగిగణ పోతాసివాతాశన
ప్రారబ్ధోత్కటచక్ర యోమ ఖరశార్ద్రక్రూర బాహార్గళా

యో దుక్మాచలకల్ప యో కవచితప్ర్యాథాంగ కావంగదే
యో రామాత్త శిరోమణీ నిరవధిప్రోద్యత్ప్రతాపారణీ !"

ఇది మిక్కిలి యందమైన పద్యము. ఆ సంబోధనలు మిక్కిలి రమణీయముగానున్నవి. మొదటి చరణము మరియు నందమైనది.

ఓ మహారాజా ! మణిగణములచేత చెక్కఁబడిన పామువంటి ఖడ్గముచేత ప్రకాశించుచున్న మొలకలవాడా ! ముఖర-మ్రోగుచున్న; ధనుస్సుచేత భయంకరమైన బాహువులు కలవాడా! ఓ మేరుపర్వతము వంటివాడా ! ఓ కవచము ధరించినవాడా ! గుఱ్ఱపుస్వారి చేయువారిలో నుత్తముడా ! ఓ దివిటీవంటి ప్రతాపము కలవాడా !

ఇంతలో నామె తనకథ నిట్లుచెప్పెను.

"విసుమాసములుగాగ వసతోడ పెనబెట్టి
నెట్టెమ్ముగా ప్రేగు జుట్టినాడు"

విసుమాసములనగా అడ్డదిడ్డముగా; ప్రేవులతో తలపాగ చుట్టినాడు. ఎన్నో లక్షణములున్నవి.

ఇట్టి రాక్షసుడు తన్ను తఱుముకొని వచ్చుచుండెను. ఆమెపేరు మనోరమ. ఆమెతండ్రి పేరు ఇందీవరాక్షుడు. చిన్నప్పుడు చాల గారాబముగా పెరిగినది. ఆమె యొకప్పుడు చెలికత్తెలతో విహారముపోగా ఒక ముసలి మునిని చూచినది. అతనిచుట్టు పుట్టవలె లేచినది. అతని ముక్కుమొగము తెలియక యీమె యతనిముక్కును మొగమును తడిమినది. అతనికి మెలకువవచ్చి అతని చేతిలోనున్న నాగబెత్తముతో చచ్చునట్లు బాదెను. బాది నిన్నొక రక్షసుడు వెంటబడి తఱుమును. నీవు వానికి పట్టుబడుదువని శపించెను. ఆమె చెలికత్తెలు ఋషిని తిట్టిరి, బెదరించిరి.

"ఓయి దయావిహీనమతి యూరక యీపసిబిడ్డ గొట్టగా
చేయెటులాడె నీకు నిది చేసినదేమి? వృథా శపింతురే
బోయవె అడుతోడునను బుట్టవె శాపనిమిత్తమే తపం
బీయెడనున్న శాంతిపను లేమను వారిక నీ చరిత్రకున్."

వారా ముసలిమునిని మిక్కిలి నిందించిరి. అతడు వారినిగూడ శపించెను. వారందఱకు క్షయవ్యాధి వచ్చునట్లు శపించెను.

ఆ మనోరమ యిట్లుచెప్పి రాజుతో నిట్లనెను. నా దగ్గఱ నక్షహృదయ మను విద్య కలదు. ఆ విద్యను మున్నుశివుడు స్వాయంభువ మనువు కిచ్చెను. ఆ మనువు వశిష్ఠున కిచ్చెను. ఆ వశిష్ఠుడు చిత్రాయుధు డన్నవానికిచ్చెను. ఆ చిత్రాయుధుడు మామాతామహుడు. ఆయన మా తండ్రి కిచ్చెను. నా తండ్రి నాకిచ్చెను. నేను నీకిత్తును. దానిని నీవు గ్రహించి యీ రాక్షసుని సంహరింపు మనెను. అంతలో రాక్షసుడు వచ్చెను. కిరాతు లందఱు పారిపోయిరి. రాజు ధైర్యముతో నిలచెను. ఇద్దరకును యుద్ధము జరిగెను. రాజు ఆ రాక్షసుని సంహరించెను. అంతనారాక్షసుడు తానొక దేవతా రూపమును తాల్చెను. పూవుల వాన కురిసెను.

తరువాత నాదేవతామూర్తిగానైన రాక్షసుడు – అనఁడొక గంధర్వుఁడు– భూమికి దిగివచ్చి తన కథ నిట్లు చెప్పెను : "నేను నలనాభుడన్న యొక గంధర్వుని కొడుకును. బ్రహ్మమిత్రుడనువాడు శిష్యుల కాయుర్వేదము పాఠము చెప్పుచుండగా నేను పోయి నాకు గూడ చెప్పుమని యడిగితిని. ఆయన చెప్పను పొమ్మనెను. అని నేను దానికనర్హుడననెను. నేనును అతనినెదిరించి మాటాడితిని. కానికృత్రిమముగా నతని శిష్యులలో కలిసి యీ విద్య నంతయు నేర్చితిని. నేర్చిన వాడను తిరిగి రావచ్చును గదా! చివఱకతనిని నీవు చెప్పకున్న నేమి ? నేన దొంగగా నీ దగ్గఱనే చదివితినని వెక్కిరించితిని.

"తండ్రీ! నాకు నను గ్రహింపఁగదె వైద్యంబంచు బ్రార్థించినన్
గండ్రల్గా నటులాడి ధిక్కృతులఁ బోకాల్మంటి వోహో మదిన్
దీండ్రల్ గల్గినవారి కే కరణినేనిన్ విద్యరాకుండునే
గుండ్రాడాఁచినఁ బెండ్లి యేమిటికిఁ జిక్కంగష్టముష్టింపచా"

ఇట్లు తిట్టితిని–ఈ పద్యము ప్రసిద్ధమైనది. చివర చరణమును సామాన్యముగా లోకమునందు వాడుకొందురు. అది లోకోక్తి–ముష్టింపచుడనగా బిచ్చగాడు. పష్టియెత్తిన బియ్యమును వండుకొనువాడు–

అంతట నా బ్రహ్మమిత్రుఁడు కోపించి నన్ను రాక్షసుఁడవుకమ్మని శపించెను. నేనాయన కాళ్ళ వేళ్ళపడితిని. పిదప కతడు నన్ను కరుణించి చివరకొక మహానుభావునిచేత చంపఁబడి భద్రము పొందుదువనెను. అంత నేను రాక్షసుఁడనైతిని.

అభ్రమండలి మోచునందాక నూరక
పెరిఁగినట్లొ మేను నరవరేణ్య
యవధిభూధర సానువందాఁక నూరక
పఱచినట్లొ మేను పార్థివేంద్ర
యబ్జభూభువనంబు నందాఁక నూరక
యెగసినట్లొ మేను జగదధీశ
యహిలోక తలమటునందాక నూరక
పడినయట్లొ మేను ప్రభువతంస
యఖిలజగములు మ్రింగునఁ తాఁకలియును
నబ్ధులేడును జెడఁగ్రోలునంత తృషయు
నచలచాలనచణమైన యదటుఁగలిగె
నసురభావంబు ననుఁజెందు నవసరమున;

రాక్షసుడై నప్పుడిట్లైనాడట! ఇదియొక యాశ్చర్యమైన పద్యము. రాక్షసుడగుట యేమిటో యెట్టిదో? వాని యనుభూతి యెట్లుండునో వాని లక్షణమేమో దీనిని విచిత్రముగా నూహించి పెద్దన్నగారీ పద్యము వ్రాసిరి. ఇట్టి సమయములలో చేసిన యఖండమైనయూహ యొక మహాకవిని చేయును. ఏయూహయు లేక ఏ యున్నతమైన కల్పనయు లేక, ఊరక కవులగుచుండి, మహాకవుల యొక్క కల్పనలు చదువుటయందు కూడ నశ్రద్ధ వహించి వారిని తిట్టెడివారికి నివి తెలియవు.

అతడూళ్ళమీద పడి తిన నారంభించెను. తన యీ కథ యంతయు రాజుతో చెప్పెను. ఈ మనోరమ నా కన్నకూతురు, దానిని తినుటకే నేను ఇట్లు వెడలితిని. అని యాంగధర్వుడు మనోరమను స్వరోచి కిచ్చి పెండ్లి చేసెను వారికి పెండ్లి యైనది.

వారిద్దఱికి స్వారోచిషు డన్న మనువు పుట్టెను. అతడు పెద్ద తపస్సు చేసెను. చివరి కతడు మనువయ్యెను.

ఈ మనుచరిత్రలో చివర దశావతారస్తోత్ర ముండెను. ఆ పద్యము లన్నియు జాగ్రత్తగా చదువవలయును,

అందులోని యొకపద్య మిది :

> "కొలుతుఁ దాదృగ్భుపద్మాహుకు కులిశయష్టి
> నెద్ది గిరివోలెఁ గడుపులో వృద్ధిఁబొందఁ
> బగిలి రాకాసిదేహంబు మొగపు ముత్య
> మయ్యెఁ ముంగామురారి రంగై మురారి."

శ్రీకృష్ణుడు కేశియను రాక్షసునిచంపెను. వానినోటిలో తన చేయి దూర్చి కడుపులోనికి పోనిచ్చి యాచేతిని తెగయుబ్బించెను. వాని పొట్ట పగిలెను. వాడు చచ్చిపోయెను. అట్టి నీ చేతిని సేవింతును మురారీ! ఓ కృష్ణమూర్తి! అటువంటి నీ చేయియను వజ్రాయుధమును కొలుతును. ఏచేయి వాని కడుపులో వృద్ధి పొందగా ఆరాకాసి దేహముపగిలి నీ ముంజేతికా శరీరము కంకణమై మొగపు— రత్నము మొదలైనవాని ముందటి భాగము – 'మొగపూస' అన్నశబ్దములో మిగిలినది. మొగపుముత్యము – రత్నము ముందున్న ముత్యము. రాకాసిదేహ మిట్లైనది. ఈయన చేయి వజ్రాయుధమువలె నున్నది వజ్రాయుధము రత్నము' దాని ముందున్న ముత్యముగా రాకాసిదేహమైనది.

ముంగామురారి — ముంజేతి కంకణము – అనగా స్వామియొక్క చేయి బ్రహ్మాండముగా పెరిగి ఆ కేశియన్న రాక్షసుని శరీరము మిక్కిలి స్వల్పమై యాచేయి వజ్రాయుధమువలె నుండి వాని శరీరము ముత్యమై యొప్పెనని యర్థము. 'ముంగామురారి' యనగా ముంజేతికంకణముకదా! ఆ శబ్దమునకు 'రంగై' 'మురారి' – ఈ రెండుశబ్దములను కలిపి మురారిని సంబోధనచేసెను.

పాండురంగ మాహాత్మ్యము

కళింగదేశాభరణమైన పీఠికాపురమను పట్టణమునందు సభాపతియన్న యొక యగ్నిహోత్రి యుండెను. అతడు గొప్ప పండితుడు. అతనికొక కుమారుడు కలిగెను. ఆ కుమారుని పేరు నిగమశర్మ. అతడు గొప్ప యందగాడు.

అతనికి నూనూగు మీసాల వయసువచ్చినది. అతడు మిక్కిలి చదువుకొన్నవాడు. అతడు స్త్రీలోలుడయ్యెను. జందెమును లెక్కచేయడు. తెల్ల బట్ట సరిగా కట్టుకొనును. ఎప్పుడును తాంబూలము నములుచుండును. వారు ధనవంతులు. ఈ నిగమశర్మ సఖులును, పరిహాసకులును వెంటరా నూరి వెంట విహారము చేయును. అతనికి పెండ్లియైనది.

ఉష్ణాని హోమాగ్ని నూఁదనొల్లఁడుగాని
    విరహజ్వరార్తుఁడై వెచ్చనూర్చు
సంధ్యకుఁ బ్రార్థనాంజలి ఘటింపఁడుగాని
    యెరఁగు నీర్ష్యాకషాయితల కర్థి
నాగమవాదంబుకాఁగా దనఁడుగాని
    విటవాదములుతీర్పు వేగిలేచి
కంబుభృత్పాదోదకంబు గ్రోలఁడుఁగాని
    యౌవతాధరసీధు వానిచొక్కుఁ
బుణ్యచిహ్నంబు లపఘనంబున ఘటింప
సిగ్గుపడుఁగాని కరనఖ శిఖరలిఖిత
జాతనూత్న క్షతాంకముల్ సమ్మతించు
నారజమున మీరి యాదుర్విహారహారి.

హోమాగ్ని - హోమముచేసెడు వహ్ని; విరహజ్వరము - ప్రేమించిన స్త్రీని యెడబాసి యుండలేక పడెడుబాధ; సంధ్యకు ప్రార్థనాంజలి - సంధ్యావందనము; ఈర్ష్యాకషాయిత - కోపమువచ్చిన భార్య; ఆగమ వాదములు -

వేద వాదములు; కంబుభృత్ పాదోదకములు - పూజచేసిన తరువాత శంఖము లోని తీర్థము; యౌవతాధర సీధువు - యౌవతము - యువతుల సమూహము; సీధువు - కల్లు; అపఘనము - శరీరము; కర...క్షతాంకముల్ - వేతి గోళ్ళ యొక్క కొనలచేత వ్రాయబడిన నొక్కుల యొక్క గుర్తులు. అరజము - ఇష్టము.

నిగమములనగా వేదములు వానిపేరు నిగమశర్మ. వాని పేరు నేతిబీర కాయవలె నయ్యెను

తాత తండ్రు లార్జించిన యాస్తియంతయు భోగము పేటలో వ్యయ పెట్టుచుండెను. తన మేని సొమ్ములు తాకట్టుపెట్టును. తల్లి నేడ్పించి యామె నగలు తీసికొనును. తండ్రియొక్క పత్రములు దొంగిలించును, దుష్టపు వడ్డీలకు పత్రములు వ్రాయును. చివరకు ఋణదాతలు బాధపెట్టజొచ్చిరి. అతనికి గ్రామములో మర్యాదపోయెను.

ఇతనివార్త యతని యక్కగారికి తెలిసి తమ్ముని దిద్దుకొందమని యచ్చటికి వచ్చెను. ఆమె హఠాత్తుగా వచ్చిన తమ్ముని కతని భార్యచేత సేవచేయించి తలంటిపోయించి మంచిబట్టలు కట్టించి, తమ్ముని కూర్చుండబెట్టి యిట్లుచెప్పెను :

ప్రారంభించిన వేదపాఠములకున్ ప్రత్యూహమౌనంచునో
యేరా తమ్ముడ! నన్నుఁజూడచనుదే వెన్నాళ్ళనోయుండి చ
క్షూరాజీవయుగమ్ము వాచినది నిన్గన్గొనున్కి మీబావయున్
నీరాకల్ మదిగోరు చంద్రుపొడుపున్ నీరాకరంబుంబలెన్.

ఇది ప్రసిద్ధమైన పద్యము. ప్రత్యూహము — విఘ్నము; చక్షుః-రాజీవ యుగము: - చక్షూ రాజీవయుగము; (ఇది సంస్కృత విసర్గ సంధి. ప్రాస నిట్లదుకుట పద్యమున కొక యందము.) చక్షూరాజీవయుగము — తామర పూవులవంటి రెండుకనులు; నిన్ను చూచుటకు నా కనులు వాచిపోయినవని యర్థము. చంద్రుపొడుపు - చంద్రోదయము; నీరాకరము - సముద్రము; చంద్రోదయముకు సముద్రమువలె మీబావ నీరాకను గోరును. "రాక"కు రెండర్థములు - ఒకటి వచ్చుట; రెండు పున్నమి; ఈ శ్లేషచేత ఉపమానోప మేయములు రెంటికిని సరిపోవుచున్నది.

పరమేష్ఠినుండి సీతరముదాఁక విశుద్ధ
 తరమైన వంశంబుఁ దలఁచవైతి
దఱిఁద్రొక్కియున్న యీతల్లి తండ్రులఁ జాల
 పఱచవై సంతోషపరచవైతి
నగ్నిసాక్షిగఁ బెండ్లియాడిన యిల్లాలి
 నిల్లాలితాకార నొల్లవైతి
ధర్మశాస్త్రార్థ విత్తముల విత్తములచే
 నలరించి విఖ్యాతినందవైతి
శీల మఖిలంబు నిదిపిల్లి శీలమనుచుఁ
జదువులివియెల్లఁ జిల్కల చదువులనుచుఁ
దోడివారలు నవ్వ నాతోడ! యేల
బేలవైతివి యీ గుణంబేల నీకు.

పరమేష్ఠి - బ్రహ్మ; పఱచ - ఎందుకు పనికిరానివాడు; ఇల్లాలితాకార - ఈ అందమైన ఆకారము కలది; పిల్లిశీలము - దొంగతనముగా నదియు నిదియు నెత్తికొనిపోవుట; నాతోడ! - నా తమ్ముడ.

ఈ పద్యములో తరముదాఁక విశుద్ధతరమైన; పఱచవై సంతోష పఱచవు; ఇల్లాలి ఇల్లాలితాకార; విత్తముల విత్తములచే; మొదలయిన యమకము చేత పద్యమునకెంతో యందము వచ్చినది. ఆ యమకము భిన్న చరణములలో భిన్న స్థలముల యందుంచుటచేత యమకమువలె కాకుండ పద్యముయొక్క చమత్కారమువలె నున్నది.

"నాదు సహోదరుండు సుజన స్తవనీయ నయప్రసక్తిఁ బ్ర
హ్మాదుల మెచ్చఁదే నతనియజ్ఞమునం గడుఁ బూజ్యురాలనై
వేది యలంకరింతునని వేవురిలోపల నాడుకొందు నీ
వేదియులేక సర్వగుణహీనుఁడవౌట యెఱుంగఁ దమ్ముడా!

ఒకడు యజ్ఞము చేసినచో నతని యప్పగారిని ఒక పెద్ద పీటమీద కూర్చుండఁబెట్టి పూజ చేయుదురన్న యొక వైదికాచారము దీనివలన తెలియుచున్నది. అది యీ పద్యములోని సొగసు.

ఈ రీతిగా నక్కగారు చేసిన హితమును వాడు మన్నించినట్లుగా మన్నించెను.

ఈ గ్రంథములో ప్రసిద్ధములైన రెండు మూడు కథలలో నిగమ శర్మోపాఖ్యానమొకటి. అక్కగారు వచ్చి తమ్మునికి హితోపదేశము చేయుట సామాన్య సంసారములలోనే యొక యాచారము. సామాన్య జీవితములోని యొక ఘట్టమునకు ప్రాధాన్య మిచ్చినట్లు మన్నింతురు. తమ్ముని కామె హితోప దేశము చేయకముందు నామె కూర్చున్న పద్ధతి నితడు వ్రాసెను.

> "కుడివలన నింతయోరగా కొమరుమెఱసి
> బిడ్డ చన్నుదావ నిట్లను బిసరుహాక్షి"

ఆమె తమ్మునికి తల దువ్వుచు తలలోని యీరు ఈరుపెనతో లాగి చిట్లించుచు తన మరదలు తనకు తమలపాకు లందించుచుండగా ప్రక్కన బిడ్డ పాలు త్రాగుచుండగా తమ్ముని కీమాటలు చెప్పెనని యున్నది. ఇది సామాన్య సంసారములలోని శోభ. దీనికొఱకు నీ ఘట్టమును పాఠకులు మెచ్చుకొనుట కలదు.

అతడు కొన్నాళ్ళు సరిగానే యుండెను. తరువాత నొకనాటి రాత్రి యింటిలో నున్న సంపదనంతయు దొంగిలించి తల్లి నగలు భార్య నగలు మూట గట్టి అర్ధరాత్రమున నడవినపడి పారిపోయెను. ఇంటిలో నందఱు మరునాటి ప్రొద్దున లబాయిలు దిబాయిలు.

కాని యా రాత్రిపూట దొంగలు వానిని బాణములతో కొట్టిరి. వాని యొడ లంతయు పెద్ద పెద్ద గాయములయ్యెను. వాని ప్రాణములు మాత్రము మిగిలెను. దొంగలు వానిని దోచికొని పారిపోయిరి.

మరునాడు వానినొక కాపుకొడుకు చూచెను. వాని నింటికి తీసికొనిపోయి రక్షించెను. వానికి వైద్యము చేయించెను. ఈ నిగమశర్మ తన దుష్ట చరిత్ర మును దాచి తానొక సత్పురుషునివలె తాను దొంగల పాలబడ్డట్లు ఆ కాపు కొడుకుతో చెప్పెను. ఆకాపు కొడుకు నమ్మెను.

వారిద్దరికి స్నేహమయ్యెను. ఇతనికి నెమ్మదించెను. వారి యింటిలో నొక కోడలున్నది. ఆమె కొన్ని వికారచేష్టలు కలది. వీరిద్దఱికి సంబంధము కుదిరెను.

తలపుండ్లు గడిగించి తను బ్రతికించెగా
నడవి చోరాహతుండై నఁదెచ్చి;

మొదలైన భావములు లేక నామె నంట్రాగెను. ఆమె మగని పజ్జ పండుకొని యుండి యితనిని గూర్చియే యాలోచించును.

పొన్నాకుపై తేనె సన్న చంద్రికమోవి
మాధుర్యమనక వేమాఱుఁబొగడి
యామని బుగబుగలంగ చంపక దామ
గంధంబనక పెక్కుగతులనెన్ని

యిది యింకొక పద్యము. అతడామెను గూర్చి చేసిన పలపోత, మొదటి చరణములోని పలుకుబడి గొప్పది.

మోవి మాధుర్యము, పొన్నాకుపై తేనెవంటిదట. నిలువదు.

సామాన్యముగా నాంధ్ర సారస్వతమున ప్రసిద్ధములైన పద్యముల ప్రసిద్ధియంతయు నొక పలుకుబడిమీద, ఒకమాట మెలపుమీద, ఏదోయొక విలక్షణమైన సాహిత్య ప్రక్రియ మీద నాధారపడి యుండును. ఈ పద్యము యొక్క ప్రసిద్ధి చరణము మీద నాధారపడి యున్నది.

నిగమశర్మ యాకాపు పడుచును లేవదీసికొని పోవలయునని యెదరు. వేచియుండెను. ఆ యూరిలో నొక జాతర చేసిరి. చీకటి పడినది. వాడామెను లేవదీసికొనిపోయెను. ఆ కాపు కోడలు కంచెయంత కాపురమును పాలవంటి కులమును పాడుచేసికొని లేచిపోయెను.

వారిద్దఱును నొక పల్లె చేరి బోయవారిలో కలిసిపోయిరి. వారు కల్లు త్రావుట, వేటాడుట, అడవులలో తిరుగుట.

వారది యొక మోస్తరయిన కాపురమును సాగింపజొచ్చిరి

కొన్నాళ్లకీ కాపు కోపలు చనిపోయెను. అంత నిగమశర్మ యొక మాల స్త్రీని పెండ్లాడెను. ఆమె యందు వారి కొక కూమారుడు కూడ పుట్టెను. ఈ సంసారము కొన్నాళ్లు సాగెను.

ఒకనా డతడు కుక్కలు వెంటరా నడవి లోనికి వేటకు వెళ్లెను. పవ లెల్ల వేటాడి రాతిరికి తిరిగి వచ్చు వేళకు వాని యిల్లు దగ్ధమై యుండెను. పెండ్లాము, కొడుకు పరిజనము నందఱు నింటిలో తగులబడి పోయిరి. వాడు మూర్ఛపోయి మరల మేల్కాంచి యిట్లు దుఃఖించెను.

"ఎల్లరు నెల్లచో ధనములిచ్చి మృగాక్షులఁ గొంౘుగాని యా
పల్లవపాణి! యేఁబరమ పావన వంశమునిచ్చి కొంటి నీ
నల్లని రూపు నిక్కమనినమ్మి ధ్రువంబదిగాక నేఁడు వి
ద్యుల్లతి కాధి కాభిన యథార్థ్వహమౌట యెఱుంగ నింతయున్."

ఇతఁడు తన బ్రాహ్మణ్యమును కామమునకు వెలకట్టెను. తన వంశము నిచ్చి దాని సౌందర్యమును కొన్నాడట! నిక్కమని నమ్మినాడట! ఈ మాటలో నెంతయో యర్థమున్నది. ఏది నిక్కమని నమ్మినాడు? ఆమె సౌందర్యము నిక్కమని నమ్మినాడ? కులము కంటె యౌవనము కామ భోగము నిక్కమని నమ్మినాడ? కామ ప్రవృత్తియే ప్రధానము గాని తక్కిన వానికి ప్రాధాన్యము లేదని నమ్మినాడు కాబోలు! ఈ యొక్క మాటయు పలు మంది జీవుల పెడతల యూహలను వ్యాఖ్యానము చేయుచున్నది. దీనిని సరిగా గ్రహించినచో పలుమంది యాధునికులు బాగుపడ వచ్చును. ఆమె నల్లని రూపు చివరకు విద్యుల్లతి కాధి కాభిన యథార్థ్వహ మైనదట మెఱుపు తీగ కంటె నెక్కువైన యభినయ భారమును వహించిన దని యర్థము. ఒకటి: నిమిషములో నంతరించి పోయినదని; రెండవది; మెఱుపు తీగ వచ్చి నంతనే కనులు మిఱు మిట్లుగొని వెంటనే చీకట్లు గొనును. దాని శరీరము యొక్క నల్లదన మట్లున్నదని—

"ఈ కడజాతినాతికిహిహీ! మహీ దేవుడు చిక్కెనంచు నన్
రాకకుఁబోకకున్ జనపరంపర కెంపగుచూడ్కి జూచి యం
బూకృత మాచరించుటకు బుద్ధిఁదలంకకలంకముక్త చం
ద్రాకృతిఁబొల్చు నీముఖమునం దమృతస్థితిఁగాంచి మించుటన్."

ఈ పద్యముగూడ చాల ప్రసిద్ధమైనది. ఈ పద్యముయొక్క సౌందర్యము కూడ విలక్షణమైన యమకము మీదనే యాధారపడి యున్నది. ఇహిహీ-మహిదేవుడు. రాకకు-పోకకు, పరంపర-కెంపగు; తలంక - కలక;

అంబూకృత మాచరించుట - ఉమ్మి వేయుట; తలంకన్ - భయపడును; కలంకముక్త చంద్రాకృతి - మచ్చచేత వదలి పెట్టబడిన చంద్రుని యాకారము.

ఇతడిట్లేడ్చి యా పెండ్లము బిడ్డలను చూడకుండ తినలేను త్రావలేనని యడవిలో బడిపోవును. నడువలేక క్రిందపడి పోవుచు మరల లేచుచు, అట్లే పెక్కు దినమ్ము లనేక యోజనమ్ములు పోయి చిట్ట చివరకు పుండరీక క్షేత్రమును చేరెను. అక్కడ క్షేత్రముతో తీర్థములో స్నానమాడెను. స్వామిని చూచు చుండెను. వానికి రెప్ప మూతపడుట లేదు.

ఒక యింత ఱెప్ప వేయక చూచు బెఱవారి
దలగొట్టుకొని దుఃఖ జలధిమునుగు
బిలము తెఱవు మంచుఁ బృథివిలోఁ జొరబాఱు
సమధిక స్తంభోద్భవము గమించు
తిరియువాఁడునుఁబోలె దెసలకుఁ జెయిచాచు
దొరఁగు నస్రాంబుధిఁ దొప్పఁదోగు
హా! పోయితే; యనియఱచు భార్యగుఱించి,
బహువిధాసక్తి విభ్రాంతిఁబొందుఁ
జేరగారాని దర్శనస్థితి వహించు;
బాడబస్ఫూర్తి లోఁ గొన్న పగిదినుండు
దానివారాతి కాఁబూని తదవతార
దశకమును మున్నెతాల్చె నా ధరణిసురుడు.

ఇతడు పూర్వపుణ్య వశముచేత నెన్ని పాపములు చేసినను వైకుంఠ పురమునకు పోబోవు చున్నాడు.

భక్తులు సారూప్యమును పొందుదురు. భగవంతుని కేరూప మున్నదో ఆ రూపమును పొందుట సారూప్యమని పేరు. ఈ పద్యములో విష్ణుమూర్తి యొక్క దశావతారములు వాని దుఃఖము యొక్క స్థితిలో శ్లేషగా చెప్పఁ

బడినవి. మొదటిది మత్స్యావతారము. పెలుచారిన్ తెప్పవేయక చూ
పెడలు పెలుగాంచు సీటియందు దేపతెప్పవేయక చూచును. ఇతడు ఇతరు
లను తెప్పవేయక చూచును. ఇది మత్స్యావతారము.

తలకొట్టుకొని దుఃఖజలధి మునుగును. కూర్మావతారము. తాబేలు తలను
లోపలకు లాగుకొని కఠినమైన సముద్రములో మునుగును. ఇట్లే తక్కిన
యవతారములుగూడ. తిరియువాడు-బిచ్చగాడు; అస్రాంబుధి– 1. సముద్రము
వంటి కన్నీళ్ళు, 2. పరశురామావతారము.

'చేరగారాని దర్శనస్థితి వహించు.'

వానియూహ యెవడును పొందలేడన్నట్లున్నాడు.

దర్శనములారు. షడ్దర్శనములు. అందులో బౌద్ధదర్శనమొకటి. అది
చేరగారానిది. అనగా శూన్యమనియర్థము.

దానవారాతి – విష్ణువు :

ఇట్లు వాడు చనిపోయెను. వానిని తీసికొనిపోవుటకు యమభటులు
వచ్చిరి. వాడు పెద్ద మొఱ్ఱవెట్టెను. అదివఱకే యమభటులు వానిని పాశము
లతో బంధించిరి. ఆ మహాపవిత్రక్షేత్రమున పూర్వము భగవంతుడు తన
చక్రాయుధమును రక్షగానుంచెను. ఆ చక్రాయుధమువాని మొఱ్ఱవిని వాని బంధ
ములను త్రెంచెను. యమభటులు పారిపోయిరి.

అప్పుడు విష్ణుభక్తులువచ్చిరి. వారు వీనిని గరుత్మంతునిమీద నెక్కించి
తెల్లదీవికి తీసికొనిపోనారంభించిరి. అప్పుడు :

ఉత్తాలఫణి భుగ్గరుత్తాల వృంతాని
లా శాంత ఘర్మాంబువయ్యె మేను
ప్రత్యగ్రముక్తా తపత్త్రీభవ చ్ఛేష
వారితా తపమయ్యె బారుమౌళి
సూత్రవతీసదోర్వేత్ర దత్తావ కా
శామరంబయ్యె గటాక్షవిహృతి
భృగుభరద్వాజ ప్రభృతికృత స్వస్తి వా
గ్భరముఖరములయ్యెఁ బార్శ్వతలము

లరుణకిరణ సహస్రాభ మత్రగంబు
నగు విమానంబుపై నెక్కి నిగమశర్మ
తీంద్రఁబుద్ధిఁజ్ఞు కోదండు తంత్రిఁబోలి
పరమధామంబునకుఁ బోవుపథమునందు.

ఆజానుదీర్ఘంబులై హరిన్మణిమయ
స్తంభంబులకు కులస్వాములగుచు
దివ్యగంధముల నుద్రేకించి విద్యుదం
కురరేఖలకు జోడు కోడెలగుచుఁ
దలచుట్టుఁదిరిగి రాఁగలిగి పాండుర పద్మ
పత్రంబులకుఁ బ్రాణబంధులగుచు
సకలంబు వెలిగింపఁజాలి బాలార్క బిం
బములకు ననుబింబపంక్తులగుచు
నాల్గుచేతులు గాంచన నలిన మాలి
కలు పెడఁద కన్నులాస్య ప్రభలుచెలంగఁ
గుముదుఁ డను పేరఁ బరమేశుఁగొలిచి నిలిచి
యున్నవాఁ డాతఁడిప్పుడు నో మునీంద !

ఆంధ్ర సారస్వతములో ని పద్యముం కివియే సాటి. ఇట్లే యితర మహాకవులలో కూడ కొన్ని పద్యములుండును వానికవియే సాటియని చెప్ప దగిన పద్యములు. అనగా నా సందర్భములో నట్లు మరియొకడు వ్రాయలేదని యర్థము. మరల ఆ కవియే అట్టిదింకొకచోట వ్రాయలేదని చెప్పవచ్చును.

నిగమశర్మ సారూప్యమును పొందెను. శ్రీమన్నారాయణునితో సమానమైన రూపమును పొందెను. - అతని మేను (శరీరము) -

ఉత్తాల-ఉన్నతమైన, ఫణిభుక్ - గరుత్మంతునియొక్క, గరుత్ - రెక్కలనెడి. తాలవృంత - విసనకఱ్ఱలవలని; అనిల-గాలిచేత, ఆశాంత - చక్కగా చల్లబడిన; ఘర్మాంబువు - చెమటనీరుకిలది అయ్యెను.

ప్రత్యగ్ర-క్రొత్తదైన; ముక్తాతపత్రీభవత్ - ముత్యాల గొడుగువలె చేయఁబడిన; శేష - ఆదిశేషునిచేత; వారిత - అడ్డగింపబడిన; ఆతపము -ఎండ కలది; చారుమౌళి - అతని అందమైన శిరస్సు; అయ్యెన్ - ఆయెను.

సూత్రవతీశుఁడు - విష్వక్సేనుడు; దోః - చేయి; కటాక్షవిహృతి - కడగంటిచూపుయొక్క విహారము.

ఈ పద్యములో మొదటి చరణమున ఉత్తాలగరుత్తాల-అన్న శబ్దములచేత చేయబడిన యమకము లోకోత్తరముగనున్నది. సమాసముల కూర్పును ఇతరులు చేయలేనిది.

ఇతఁడు పరమేశ్వరునివద్ద కుముదుడను పేరుతో పార్శ్వచరుఁడుగా నుండెను. అతనికి నాల్గుచేతులు. అవి ఆజానుదీర్ఘమ్ములై హరిన్మణిమయ స్తంభమ్ములకు కులస్వాములుగా నున్నవట ! నాలుగుచేతులు బంగారు తామర పూమాలలు, వెడదకన్నులు. మొగమునందలి కాంతులు - ఇందు క్రమాలంకారము.

ఇతడు భగవంతునివద్దనున్న పార్శ్వచరులలో శ్రీమన్నారాణునకు మిక్కిలి ప్రియుడయ్యెను.

ఇది యొకకథ. ఈకథ యింత యందముగా వ్రాయబడినది.

ఒకకథ అందముగా వ్రాయబడుట వేఱు. ఆ కథయొక్క యౌచిత్యము యొక్క స్వరూపమువేఱు మన పురాణములయందు నిట్టికథలు చాలగలవు. ఒకడనేక పాపములుచేయును. చివరికాలములో భక్తుడగును. వాడు మోక్షమునకు పోవును. ఈకథ అంతకంటెచెడ్డది. వీడు భక్తుఁడుకూడ కాలేదు. ఆ క్షేత్రమునందు చనిపోవుటవలన వీడు వైకుంఠమునకు పోయెను.

మతమిట్లయినచో సృష్టికి చాలనష్టము ఎవడును మంచి ప్రవర్తనతో నుండవలసిన యవసరములేదు. ఇట్టి సిద్ధాంతములు సంఘములోని శాంతికి చాల యపాయమును గలిగించును. వాడు చేసినన్ని పాపములు చేయును. చివరకు భగవంతుఁడా ! నన్ను రక్షించుమనును. ఆ భగవంతుడు రక్షించునా ? బ్రతికి

39949

నన్నాళ్లు సాధువుగా బ్రతికి సత్కారములుచేసి బ్రతికినవాడు మోక్షగామికాడు. వీడగును. ఇది న్యాయముగాలేదు అందుచేత నిచ్చట నొక పద్యమున్నది.

చేరువచేరువై కడుఁబచేళిమమై తనుడాయుపూర్వ సం
స్కారతపః ఫలంబున భజద్వృజినావళి నాళకృన్నృ కం
కీరవ దేవనిత్య సదనీకృత సంగమ తీర్థరాజ వా
ర్ధారలనాడి తత్పరమధామపతిన్ బలుమోఱుఁ జూచుచున్.

ఈ నిగమశర్మ పూర్వజన్మలయందు బహు తపస్సు చేసినవాడు. ఆ తపస్సు పచేళిమమై - పక్వమై; వానికి మిక్కిలి దగ్గరగా వచ్చినది. ఎట్లు పరి పక్వమైనది ? ఈ జన్మలో కాలేదు. అనగా వాడుచేసిన తపస్సు ఫలానా అప్ప టికి ఫలించునని వ్రాయబడి యున్నది కాటోలు ; ఇది యొక లాటరీ వంటిదో ! ఆనాటివరకు బిచ్చగాడు. ఆనాడు వానికి రెండు లక్షలువచ్చెను.

భగవంతుని లక్షణమె యిట్లుండగా ర్యాజములు లాటరీమీద నాధారపడు టలో తప్పేమి యనిపించును.

ఇంతకుమించి యొకయూహ చేయవచ్చును. ఈ నిగమశర్మ యేమాలె తను పెండ్లియాడు వరకు దుష్టుడే ! ఏకాగ్రత లేనివాడు. మాలెతను పెండ్లి యాడిన తరువాత వానికే కాగ్రత వచ్చినట్లున్నది. ఏకాగ్రత యనగా మానవజన్మ యెత్తిన తరువాత పరమార్థ భూతమైన లక్షణము. వాడు ఆ పెండ్లకు బిడ్డలు కనిపించకుండ నేను త్రావను తిననని కూర్చుండెను. అట్టిస్థితి పరమయోగి లక్ష ణము. వానికదియే కావలయును. ఇంకొకటి యక్కరలేదు. దీనినే భాగవతమున "కామోత్కంఠరత గోపికల్" మొదలైన పద్యములలో చెప్పిరి.

ఇందులో నింకొక విషయమున్నది. ఈ నిగమశర్మకు ఏకాగ్రత కుదిరి నది కాని, ఆ యేకాగ్రత భగవంతునిమీద కుదరలేదు. ఆ యేకాగ్రత విషయము వాని భార్యయు, పిల్లలును. వారిని తీసివేసి భగవంతు నచ్చట నిల్పినచో వాడు ముక్తుడగును. మన పురాణముల యందలి పలుకథలిట్టివి.

ఇట్లుండగా మరి వీనికి వైకుంఠమున చేరుట ఎట్లు సంభవించెను?

ఇది పాండురంగ మాహాత్మ్యము. పుండరీక క్షేత్రము యొక్క మహాత్మ్యము.

ఒక కాలము ఒక దేశము పవిత్రములై యున్నవి. ఏకాదశి, శివరాత్రి, మొదలయిన దినములు పవిత్రములు కదా! ఆ దినములలో చనిపోయిన వాడు ఉత్తమగతులకు పోవునని మన వారు చెప్పుదురు. అది కాలము.

రెండవది దేశము ఆ దేశము నందే క్షేత్రములని నిరూపింప బడినవి. తిరుపతి మహా క్షేత్రమున్నది. అక్కడ నున్నది నారాయణుని యొక్క యవతారము. ఎన్ని చోట్ల విష్ణ్వాలయములు లేవు! ఆ దేవతలు పేద వారేమి? ఈ వెంకటేశ్వర స్వామి ఇంత ధనవంతుడేమి? ఇది దేశమహిమ యనగా క్షేత్ర మహిమ. అనగా, ఆ క్షేత్రము యొక్క మహాత్మ్య మటువంటిది ఇది ప్రత్యక్షముగా కనిపించు చున్నది. మోక్షము వచ్చుట అప్రత్యక్షమైన విషయము. కొందరీ ప్రత్యక్షమును చూచి అప్రత్యక్షము నంగీకరింతురు. కొందరు ప్రత్యక్షము నంగీకరింతురు. అప్రత్యక్షము నంగీకరింపరు. ఎవరి కర్మ వారిది. నిగమశర్మ కర్మ నిగమ శర్మది. అతడు పూర్వ సంస్కార తపఃఫలంబున కుముదుడయ్యెను.

అయుత నియుతోపాఖ్యానము

పూర్వము వింధ్య పర్వతము మేరు పర్వతముతో స్పర్థవహించి పెరుగ మొదలు పెట్టెను. నక్షత్రములు మొలపూసలుగ పెరిగెను. అంతకు పూర్వమే కాశీ మహా నగరము నందు అగస్త్య మహర్షి వేయి మంది శిష్యులతో కాపుర ముండెను. ఆయన వద్ద ఆ వేయి మందిలో సిద్ధులు శిష్యులు కలరు. ఒకని పేరయుతుడు, రెండవ వాని పేరు నియుతుడు. ఆ శిష్యులన్నచో నగస్త్య మహర్షికి చాల ప్రేమ వారిని గూర్చి యగస్త్య మహర్షి యిట్లనుకొనెను.

వాసోనిగ్రహ మెన్న రా కలియు నిర్వట్టుంగణింపర్ తలల్
మా సెంగాయన రంగముల్ బడలినన్ బాటింప రట్లుండ నీ
యాసాయమ్ముగ నానిశాత్యయముగా నామ్నాయముల్ గ్రోల్చుచో
నాసీన ప్రవలాయితంబయిన లేదాహా ! వితర్కింపగన్—

వాసోనిగ్రహము – వాసస్సు – వస్త్రము. నిగ్రహము – అడ్డగించుట; అనగా కట్టిన గడ్డను గూర్చి విచారించరు; నిర్వట్టు – దప్పిక; ఆసాయ

మ్మగ - సాయంకాలము పర్యంతము; ఆనిశాత్యయముగా - తెల్లవాఱు వరకు నిశయొక్క అత్యయము - నిశయొక్క నాశనము అనగా తెల్లవాఱుట; ఆమ్నాయములు — వేదములు; క్రోల్చుచోన్ - వర్ణించుచో;

ఆసీన ప్రచలాయితము - కూర్చున్న చోటినుండి కదలుట.

ఇదియొక గొప్ప పద్యము. శబ్దముల కూర్పు చేత రామకృష్ణుని రీవిని వెలార్చు చుండును.

అగస్త్యుడు వాఱిద్దరకు పెండ్లి చేయవలెనని నిశ్చయించి బ్రహ్మ దేవుని కడ నిద్దరు కూతుండ్రు గలరని విని యాయన దగ్గరకు పోయెను. ఆ బ్రహ్మ దేవుడు అగస్త్యుడిట్లు వచ్చుటకు సంతసించి అగస్త్యుని స్తోత్రము చేసెను.

"హుంకారములులేవె యుపపురందర హఠో
త్పాటనంబునకుఁ బాల్పడవు గాక ;
భ్రూభంగములులేవె యాభీల వింధ్యగ
ర్వ స్తంభనమునకు రావుగాక ;
చులుకాకృతులులేవె జలరాశి నిశ్శేష
శోషణక్రీడకుఁ జొరవు గాక !
జాఠరాగ్నులులేవె జటతాపి వాతాపి
తనుదాహమున నెదుర్కొనవుగాక :
నిష్ఠ నీమాడ్కి లోక ప్రతిష్ఠ గుఱిచి
దుష్టనిగ్రహ శిష్టసంతుష్టి హేతు
రోషభీషణ రేఖానిరూఢ గాఢ
లీలఁగ్రీడించు ప్రోడలు లేరుగాక.

ఇదియు నొక యాశ్చర్య కరమైన పద్యము. అందఱును హుంఅందురు. ఏమి లాభము? అగస్త్యుడు హుం అనగా ఉపపురందరుడు నహుషుడు పెల్లగింపబడెను.

భ్రూభంగములు — కంటిబొమ ముడులు; అనగా కోపచిహ్నములు చులుకము - పుడిసిలి; జఠరము - పొట్ట; జాఠరాగ్ని - క్షుధాగ్ని

ఆ యిద్దఱు కూతుండ్రపేర్లు - ఒకమె పేరు గాయత్రి, రెండవయామె పేరు సావిత్రి. అగస్త్యుడు వారిద్దఱిని తనవెంట తెచ్చెను. తన శిష్యుల కిద్దరకును చూపించెను.

అయుతుడు పెండ్లి కొప్పుకొనలేదు. నియుతు డొప్పుకొనెను. అగస్త్యు డాయిద్దఱు బాలికలను నియుతునకేయిచ్చి పెండ్లిచేసెను.

అగస్త్యున కయుతునిమీద కోపము వచ్చెను. వానిని వెడలనడచెను.

అయుతుడు గురు గృహమునుండి వెడలిపోయి తాను దుఃఖింప నారంభించెను.

ఉర్వీధరము లెక్కియుఱుకనే ! కుచకుంభ
　　యుగమొల్లఁగాక తానుఱుకుమనిన
వాఁడికైదువులపై వ్రాలనే ! నిడుచూపు
　　వాలొల్లఁగాక తా వ్రాలుమనిన
మున్నీట సుడివడి మునుఁగనే నతనాభిఁ
　　గననొల్లగాక తా మునుగుమనిన
బెడఁగారు కాలాహిఁదొడుకనే ! నూగారు
　　తొడుసొల్లఁగాక తాఁదొడుకుమనినఁ,
జెప్పిగురుఁడేమి పనిచినఁ జేయలేనె
కావె తనసొమ్ము మామక కాయకర్మ
గదిసి మొత్తోయనంగ లింగంబుగట్టు
జంగమన నంగనలఁగూర్చ జనదుగాక.

వాఁడికైదువులు-పదునుగల కత్తులు. ఈ పద్యములో ఉక్తివైచిత్ర్యము కలదు. స్త్రీయొక్క కుచములు కొండలతో, చూపులు కత్తులతో, బొడ్డు సుడి గుండముతో, నూగారు పాముతో కవులు పోల్తురు. దాని నీ పద్యములో చమత్కారముగా తిప్పిచెప్పినాడు. లేదా ఉపమాలంకారము దీనియందు ధ్వనితమగుచున్నదని చెప్పినను చెప్పవచ్చును.

ఈరీతిగా నయుతుడు మిక్కిలి విరక్తుడై తపస్సుచేయ నారంభించెను. మహోగ్రతపము చేసెను. అతని తపస్సునకు మిన్నునుండి నిప్పులుకురిసెను. అట్టి తపస్సు చూచినచో నింద్రుడు నిలువలేడు. అతనికి నిప్పుతొక్కినట్ల

గును. మూడు పట్టున తేలుకుట్టినట్లగును. అవ త్రాగినట్లగును. ఆ యింద్రుడు వృద్ధ బ్రాహ్మణవేషము వేసికొని నలుగురు శిష్యులను వెంటబెట్టుకొని దూడ తోడి యొక యావును నడిపించుకొనుచు నయుతునివద్దకు వచ్చెను. వచ్చి యతని యాశ్రమములో కూర్చుండి విశ్రమించి యచ్చట స్నానాదులు చేసి యయుతునివద్దకు వెళ్ళెను. అయుతుడు అతిథిపూజచేసి "స్వామీ! మీరెచ్చటి వార"ని యడుగగా ఆ దొంగయింద్రు డిట్లనెను. "నా యాశ్రమము హిమవత్ప ర్వతము మీదనున్నది. అన్ని యాశ్రమములలో గార్హస్థ్య ముత్తమమైనది. నేను దాని నాదరించుచు ననేక తీర్థములు సేవించితిని. కంచి, శేషాద్రి, శ్రీరంగము, ప్రయాగ, గయ, జగన్నాథము, పుండరీకమునన్నియు సేవించితిని." నీ వెవరని యడుగగా నయుతుడు కథ యంతయు జెప్పెను. దానికి వృద్ధబ్రాహ్మ ణుడు కోపించి "ఓయీ! జ్ఞానమను అమృతపుజల్లును మన్మథాగ్ని సోకకుండ చేయుట కష్టము. గృహస్థధర్మము మిక్కిలిమంచిది —

"కీలారముననుండి పాలింటికే తేర బహుధాన్యముల చేలబండి యొరుగ" - కీలారము- ఆవులమంద; మొదలుగా గృహస్థధర్మముల నెంతో పొగడెను.

అప్పుడయుతుడు స్త్రీ సంగమమ్మును చాల దూషించెను. వృద్ధబ్రాహ్మ ణునకు కోపమువచ్చెను. లాభము లేకపోయెను. ఇంద్రుడు ఇంక తన పని సాగదని వెంటదెచ్చిన కామధేనువు నచ్చట వదలిపెట్టి తనదారిన తానుపోయెను. ఆ కామధేనువు పుండ్లుపడి యెత్తుపడినదానివలె నుండెను. అయుతునకు దానిని చూడగా జాలివచ్చి దానిని పోషింపనారంభించెను. ఆ ధేనుపరిచర్యలో ధ్యానము, పూజాద్రవ్యముల తెచ్చుట, రుద్రాక్షలు త్రిప్పుట మంత్రమునన్నియు మూల పడెను. క్రమముగా నాయావు బలిసెను. గుండువలె బలిసెను. బలిసి యేడాది కేడాది కీనుచుండెను. ఆ యడవిలో నామె యథేష్టముగా ద్రిమ్మరు చుండెను. ఆ యావుచేతలు దుర్భరములయ్యెను. దానిని చూచి అయుతు డిట్లనుకొనెను.

"వత్సనాభీ గంధవహమయ్యె నీయావు
పైగాలి నీవార పాకములకు,
గతినకుద్దాల వక్త్రములయ్యె నీ జన్నె
మునుదెక్క లక్కందమూలములకు,

జటుల దవాన లచ్ఛటయయ్యె నీ గిడ్డి
 కటు జిహ్వా బర్హిర్హి కాయములకు,
నారణోచ్చారణోద్భృతులయ్యె నీ తొఱ్ఱు
 కంఠహ్రుంకృతు లేణ గర్భిణులకు
నాకు మొగమోడియొ గాదనరు తపస్వు
లేల ? యీ మైలపూయక దూల దీని
వత్సయుతముగ నీవనీ వాటమునకు
లాడి గావింతునంతఁ దొలంగు దూఱు.

ఈ యావుపై నుండి వచ్చెడిగాలి నివ్వరిపంటలకు వసనాభి గాలివంటి దైనది. దీనిడెక్కలు కందమూలములకు త్రవ్వుగోలలైనవి. దర్భలకు దీని నాలుక దావాగ్నియైనది. ఇదిబలిసి సర్వమును నాశనము చేయుచున్నది. నా మొగమోటమిచేత ఋషులేమియు ననుటలేదు. దీనికి లాడివేయుదునని దానిమెడలో నొకకఱ్ఱకట్టి లంకెవేసి వదలి పెట్టినాడు. దానిని చాలా బాధ పెట్టినాడు. ఆ కామధేనువునకు కోపమువచ్చినది. ఆమె వీనిని శిక్షించవలయు ననుకొనెను. అక్కడికి కొంతదవ్వున వాధూలుడను ముని తపస్సుచేసుకొను చుండెను. అతడు మహాజ్ఞాని. అతనిచుట్టును పుట్టలేచెను. ఈ కామధేనువు పోయి యా పుట్టను మట్టించెను.

"మట్టినబిట్టు మండిపడి మౌనిసముద్ధతుడయ్యె మేనిపై
పెట్టిన పుట్ట నెట్టసిసిబీటలువాఱ శ్రవశ్శకుంతముల్
చట్టుపలెత్తి ముందఱికి సాఁగఁదలంప జటాచ్ఛటాచ్ఛవిన్
ద్రుట్టెలు గట్టినిద్రిలు మరుద్భుగధీశకులమ్ము మేల్కొనన్."

ఈ పద్యము ఆ మౌనియొక్క తపస్సునంతయు చెటిదినట్లుండెను. ఆవు కాళ్ళ మట్టగింపు ఘోరముగానపించును.

ద్విరుక్తటకారము, శ్రవశ్శకుంతములు, జటాచ్ఛటాచ్ఛవి, మరు ద్భుగధీశ కులము, పద్యమునంతయు కుక్కినట్లు చేసినవి.

చట్టుపలు-డెక్కలు: ఘరుద్భుక్-పాము: ఆ ఋషి లేచి ప్రక్కనున్న యచ్యుతునిచూచి వానిని నీవొక కప్పవుకమ్మని శపించెను.

అయుతుడు కాళ్ళు వ్రేళ్ళుపడెను. తనకథ చెప్పికొనెను. వాధూలముని జాలివహించెను. గృహస్థధర్మ మేమకు వదలిపెట్టితివిరా పిచ్చివాడా? నేనింతవాడనన్న గర్వ మెప్పుడికిని వనికిరాదు. నీవు కప్పవై నరసింహదేవుని సేవించుము నీ కొక పెండ్లము దొరకును. ఆమెయందు సంతానమును కనుము. అప్పుడు నీకు భగవత్కరుణ కలుగును. అని చెప్పి యాముని తన దారిని తాను వెళ్ళిపోయెను. అయుతుడు అనేక తీర్థయాత్రలుచేసి పుండరీక క్షేత్రము నందు నృసింహస్వామినిచేరి యక్కడ కప్పయయ్యెను. ఒకనా డచ్చటికి కాన్య కుబ్జనగరపు రాజుకూతురు తన చెలులతో వచ్చి స్వామిని సేవించి యీ రత్నాలు బంగారము మూటగట్టినట్లున్న కప్పన జూచి దానిని బట్టుకొని దానితో నాడుచు ఆటకొలకు నచ్చటనున్న యొకమునిపైన నీ కప్పనువిసర, ఆ ఋషి కోపించి వీరునందఱను కప్పలుగాఁ శపించెను. వీరందరు కప్పలైరి. వానికి భార్యలైరి. కప్పగానున్న అయుతునకు వారియందు సంతానము కలిగెను.

ఈ చరిత్రము అద్భుతము. అద్భుతరసైకపాత్రము.

తెనాలి రామకృష్ణయ్య వ్రాసిన ప్రతిపద్యము గడుసుదనమునకు నిలుకడగా నుండును. పలుకుబడి క్రొత్త, కల్పన క్రొత్త, అంతయు నొక యద్భుతరసము. తన కవితయంతయు నద్భుతమని చెప్పుటకేమో చివరి కథ యిది వ్రాసి ఆ అయుతుని కథ అద్భుతరసైక పాత్రమని కావ్యము నించు మించుగా ముగించెను.

నిగమశర్మకథలో కొంతయుండెను. ఈ కథలో నదికూడ లేదు, అతని రచనయా! సర్వత అద్భుతముగా నుండును. ఈ కథ యెందుకువ్రాసెనో తెలియదు. గృహస్థధర్మము గొప్పదియని చెప్పుటకు వ్రాసెనా?

పాండురంగక్షేత్ర మాహాత్మ్య మిదియా?
కవిత్వమనేక దశలలో నుండును.

మొదటిది కవియైనవానికి సొంతమైనయొ కశైలి యుండవలయును.

రెండవది వాని పలుకుబడియందు ప్రత్యేకమైన వైలక్షణ్య ముండ వలయును.

ఇవి రెండును తెనాలి రామకృష్ణయ్యకు సమృద్ధిగా కలవు.

మూడవది కథ నడుపుచున్నప్పుడు భిన్నభిన్నాంశములను స్వకల్పనతో నింపించగలిగి యుండవలయును. అలంకారములు, లోకోక్తులు, ప్రౌఢమైన భాషాప్రయోగములు మొదలైనవానితో రచన యాశ్చర్యముగా నుండునట్లు చేయవలెను. ఇదియు తెనాలి రామకృష్ణయ్యకు సమృద్ధిగా కలదు.

నాల్గు - కవి తాను తీసికొన్నకథలో తగినంత పుష్టిలేనిచో కథాంశములు కల్పించుటయందు, రసమును మలచుటయందు, దానికి పుష్టిని సమకూర్చవలయును. పాఠకుని హృదయమును నిత్యవ్యగ్రముగా చేయవలయును.

అయిదు - కథ నెన్నుకొనుటలో నిజముగానున్నది మహాకవియొక్క యదార్థమైన శక్తి.

కథలనేక విధములు. కొన్నింటియందు రసము ప్రధానము. రసములు తొమ్మిది. కొన్నింటియందు భగవద్భక్తి ప్రధానము. కొన్నింటియందొక మహాపురుషుని చరిత్ర ప్రధానము. కొన్నింటియందు సృష్టిలోని కొన్ని మహారహస్యములు ప్రధానము. ఇంకననేక విధములుగా కథలుండును.

ఇన్ని విధములైన కథలను తీర్చవలయును కదా ! కవులలో రెండు రకములున్నారు ఒకడు వట్టికవి. వాడు కథను చెప్పికొనిపోవును. రెండవవాడు శిల్పియైనకవి. వాడు కథను చెప్పటలో చిత్రవిచిత్రములైన శిల్పములు చూపించును.

ఇట్లు పోనుపోను మహాకవులలోకూడ తారతమ్యములుండును.
ఇదియొక యగాధమైన విషయము.
కాని మొదటి రెండు గుణములుకలవారే చాలమంది కవులు.
తెనాలి రామకృష్ణయ్య అక్కడ మేటి.

పారిజాతాపహరణము

ఈ గ్రంథము వ్రాసినాయన నంది తిమ్మన్న. ఈయనకు ముక్కు తిమ్మన్న యనికూడ పేరు.

"ముక్కు తిమ్మనార్యు ముద్దుపలుకు" అని ప్రశస్తి. ఈయన పలుకు ముద్దుగానుండునని యర్థము.

శ్రీకృష్ణుడు స్వర్గమునకు బోయి పారిజాత వృక్షమును పెకలించికొని తెచ్చిన కథ యిందలి యితివృత్తము.

శ్రీకృష్ణున కనేకులు భార్యలు. వానిలో, రుక్మిణీ, సత్యభామయు; నెక్కువ ప్రేమాస్పదలు. ఇద్దఱును కులమును రూపమున్ మగని కూరిమియున్ గలవారే ఇద్దరు నా గర్వము కలవారే. అందుచేత వారిలో రవరవలు పుట్టెను.

ఒకనాడు శ్రీకృష్ణుడు రుక్మిణి యింటనుండి రుక్మిణితో జూదమాడు చుండెను. అప్పుడాకాశమునుండి నారదుడు వచ్చెను. అరివేరము - కయ్యము ఆయన అరివేరంపు తపసి. వచ్చిన నారదునివారు పూజచేసిరి. ఆ నారదుడు శ్రీకృష్ణుని పొగడెను. ఆ నారదుడు వచ్చునప్పుడు పారిజాతపువ్వులను తెచ్చెను. దానిని స్వర్గమునుండి తెచ్చెను. శ్రీకృష్ణుడా పుష్పమును రుక్మిణిదేవి కిచ్చెను. కాని యిచ్చుటకు మున్ను మనసులో దీనివలన సత్యభామకు కోపమువచ్చునేమో యనుకొనెను. కాని యచ్చటనున్న రుక్మిణికీయనిచో నామెను పరిహాసము చేసినట్లగును, ఆమెయు సంశయపడెను. కాని నారదుడు తీసికొమ్మని కనుసన్న చేసెను. ఆమె తీసికొన్నది. ఆమె ఆ పువ్వును తలలో పెట్టుకొనునప్పటికి.

''వలిగుబ్బలి ముద్దుపట్టి లేతనెల ధరించినట్లమరెను. వలిగుబ్బలి - హిమవత్పర్వతము - ఆయన ముద్దుపట్టి పార్వతీదేవి.

అంత నారదు డిట్లనెను.

"పరిమళము సెడదు వాడదు
పరువము తప్పదు పరాగభర భరితంబై
నిరతము జగదేకమనో
హరమగు నీ కుసుమరాజ మంబుజ వదనా."

"అలి నీలాలక నీవు నీపతి రహస్యక్రీడ వర్తించువే
ళ లతాంతాయుధు సంగరంబునకు నుల్లాసమ్ముఁ గల్పించు ను
జ్జ్వల దీపాంకురమై రతిశ్రమతనూ సంజాత ధారాళ ఘ
ర్మలవంబుల్ తొలగింపగా సురటియై రంజిల్లు నిచ్చాగతిన్."

లతాంతాయుధు సంగరంబునకు – మన్మథయుద్ధమునకు – సంగమమున కుత్సాహము కల్పించునని యర్థము. సురటి – విసనకఱ్ఱ.

ఆయన భగవంతుడు. ఆమె భగవతి. నారదు డిట్లనవచ్చునా ? యని కొందఱి సందేహము. నారదుడు తాతగారి వంటివాడు. వీరు పసి పిల్లలు. కొందఱు వృద్ధులు యౌవనములోనున్న పడుచువాండ్రతో దగ్గిర బంధుత్వము నున్నచో ముఖ్యముగా ప్రేమయు చనవు నధికముగా నున్నచో నింత స్వాతంత్ర్య మును తీసికొందురు. ఇది లోకసహజము. నిజమునకు స్త్రీ పురుష సంగమము సృష్టిహేతువు. అది ధర్మబద్ధ మైనప్పుడు దోషములేదు. అది సృష్టి హేతువని ధర్మబద్ధమై యుండవలయునని లోకము తుచ్ఛ కామ ప్రవృద్ధబుద్ధియై దాని యందసభ్యబుద్ధి కల్పించుకొనెను. తల్లి తండ్రుల సంగమములేక పుత్రోత్పత్తి లేదు. చెల్లెలి నెవరికోయిచ్చి పెళ్ళిచేయుట సంతానము కొఱకే.

నారదు డింతటితో నూరకుండక "ఓయమ్మ రుక్మిణీ ! నీవీ పుష్పమును తలలో దాల్చుటవలన సవతులందరువచ్చి నీ పాదములమీద వ్రాలుదురు. ఇన్నా ళ్లను కృష్ణుడు సత్యాభామకు వశంవదుడని విందును. ఇప్పుడు తెలిసినది. ఆ సత్యభామ

చక్కని దాననంచు నెలజవ్వనినంచు జగంబులోన పే
రెక్కిన దాననంచు పతియెంతయు నా కనురక్తుడంచు దా

నిక్కుచు విఱ్ఱవీగుచు గణింపదు కాంతలసత్యే యింతకున్
బ్రుక్కక యున్నె నీ మహిమసూచిన బోటులువిన్నవించినన్."

అనికూడ అనెను. అతడు సత్యభామ పేరెత్తి యిట్లనుట న్యాయముగా లేదు. కాని యాయనకు భయము. తాను పెట్టదలచుకొన్న పోట్లాట యూరకే పూవిచ్చి వెళ్ళినచో సరిగా కలుగదేమో ! యని.

ఒక రాజాంతఃపురములోఁగూడ రాజకీయము లుండును. ఒక రాజునకు పదిమంది భార్యలున్నచో వారి వారి ప్రతినిధులు పదిచోట్ల రహస్యముగా నుందురు. ఆ భార్యవద్ద నేమి జరిగినది? యీ భార్యవద్ద నేమి జరిగినది? అన్న వార్తలు ప్రతి భార్యయు తెలిసికొనుచుండును.

ఈ రుక్మిణి యొక్క యంతఃపురములో నట్లే తక్కినఏడుగురు భార్యల ప్రతినిధులును కలరు. వారు వారు తమ తమ రాణులవద్దకు పోయి ఈ కథ యంతయు చెప్పిరి.

తక్కిన యందరును సర్దుకొని యూరకుండిరి. మరియు నచ్చట నారదుడు ప్రధానముగా సత్యభామ పేరెత్తినాడు గాని తమ పేరు లెత్తలేదు కదా!

సత్యభామ తన చెలికత్తె రుక్మిణి యంతఃపురమునకుపోయి రాలేదని ప్రొద్దుబోయెనని యెదురు చూచుచుండెను. అప్పటికే ప్రొద్దుపోయెను. అప్పుడు సత్యభామ యెచ్చట నున్నది?

"తన శృంగార వనంబులోన గిరిపొంతం, జక్కఁగాదిద్ది తీ
ర్చిన పూదేనియ యేటికాలువదరిం, జెంగల్వపుప్పొళ్ల నిం
చిన చంద్రోపలవేదిపై సరసగోష్ఠిన్ బోటియుందాను న
వ్వనజాతాయతనేత్ర శౌరిగుణముల్ వాక్రుచ్చి వర్ణించుచున్."

ఇది యాయన ముద్దుపలుకు.

చంద్రోపలవేది — చంద్రకాంతపు రాతితోవేసిన యరుగు; ఆ సమయములో నామె శ్రీకృష్ణ దేవుని గుణములు పొగడుచున్నది. ఈ మాటలో నందమున్నది. తానాస్వామి గుణములనిచ్చట పొగడుచుండును. ఆ సమ

యములో కూడ పొగచు చుండెను. సరిగా నప్పుడే యీ వార్త వచ్చును. ఆమె కెక్కువ కోపము వచ్చుటకు వీలైన సమయమని సూచించు చున్నది. అప్పు డామె కుడిబుజము, చూచుకము, కన్ను కంపించినవి. స్త్రీలకు కుడివైపు నందలి యవయవము లదరినచో శుభము కాదు. అంతటి స్త్రీలకు వచ్చెడి యాపద ఏమి? తమ భర్త మరియొక స్త్రీయందనురక్తుడగుట. అప్పుడే రుక్మిణి వద్ద నుండి రావలసిన చెలివచ్చినది.

ఆమె మంచి కోపముతో వచ్చినది. ఆమె యిట్లన్నది - అనుచుండగా 'కనుగవ నెఱసంజ నొదవగా' - ఆమె కన్నుల యందెఱ్ఱని సంధ్యాకాల ముద యించగా - ఎఱ్ఱదనము కోపమునకు లక్షణము. ఎఱ్ఱసంజ - ఎఱసంజ; తెలుఁ గులో సామాన్యముగా ద్విత్వాక్షరములు ద్విత్వములేకుండగూడ వాడబడును. సన్నమాట - సనమాట.

లోకములో ఆశ్రితులు తమ కాశ్రయమిచ్చిన వారితో నభేద ప్రతిపత్తిగా నుందురు. వారి దుఃఖములు తమవి. వారి సుఖములు తమవి. వారి కోప ములు తమవిగా నుందురు.

''అమ్మా ఏమని చెప్పుదును' అచ్చటికి నారదుడు వచ్చెను. ఆ మురా రికి పారిజాత పుష్పమునిచ్చెను. ఆయన

''మిన్నంది వేగ కయికొని
కన్నుల నొత్తికొని మ్రొక్కి గారవమొసగన్
వెన్నుఁడు రుక్మిణి కొసఁగెను;
అన్నెలఁతయుఁ గొప్పులోన నవ్విరిదాల్చెన్."

ఆ కృష్ణుఁడు మిన్నంది (ఎక్కువ సంతోషించియని తాత్పర్యము) ఆకాశ మంటినాడు. అన్నట్లు — కాని యీ మిన్నందియన్న మాటలో కృష్ణుఁడు తరువాత స్వర్గమునకు వెళ్ళి పారిజాతమును తెచ్చునన్న యర్థము దూరముగా నున్నది.

అక్కడ జరిగినది వేఱు. ఇది చెప్పినది వేఱు. కృష్ణుఁడు సంశ యించుటకుగాని రుక్మిణి సంశయించుటకుగాని యిది చెప్పలేదు. ఆ పుష్పమామె ధరించినంతనే రాజబింబాస్య రుక్మిణి తేజరిల్లె, సానబట్టిన మకరాంకు శస్త్ర మనగ.

మకరాంకు శస్త్రమనగా మన్మథ బాణము; ఈ మాటనిది కల్పించి చెప్పినది. ఈ చెలికత్తె మనస్సులో సత్యభామ యొక్క రుక్తయే కృష్ణునకు తగినది, రుక్మిణి తగనిది, యని యభిప్రాయము.

అంతియేకాదు. ఆ రుక్మిణియట తలలో నా పువ్వుఁదాల్చి మూడు లోకములు తానే యేలుచున్నట్లు—

ఆ కుసుమమ్ము, దాల్చిన మహా మహిమమ్మునఁ దోడఁ కామినీ
లోకము మచ్చరంబు మదిలోనఁ దొలంగి భజించుచుండ, న
స్తోక నిజప్రభావములు సూపెడు గద్దియమీద నెక్కిము
ల్లోకముదాన యేలుగతి లోలవిలోచన యేమిసెప్పుదున్.

ఈ పద్యములో క్రియలేదు. ఏలుగతి - అని యాపినది. ఉన్నదియని గర్వపడుచున్నది యేమి యా మొదలైన విషయములేదు. అక్కడికి ఆపివేసినది. ఇది లోకసహజము. ఒక కోపముతో నున్నవారు వాక్యమును పూర్తి చేయరు. అది యవతలివారికి కోపమెక్కించుటలో నొకమార్గము.

"ఎంతకులేఁడు నారదమునీంద్రుఁడు శౌరివినంగ రుక్మిణీ
కాంతవినంగ, నేను వినఁగా బలికెం; బతిఁగూర్చుదాన నా
యంతటి వారులేరని యహంకృతి నెప్పుడు విఱ్ఱవీగుచున్
వంతునవచ్చు సత్యగరువంబిఁ కఁజెల్లదటంచు, మానినీ!"

ఈ పద్యములోనున్న విశేషమేమనగా "నేను వినగా" ననుట-తానెవ్వతె? తానొక చెలికత్తె. ఒక పరిచారకురాలు. తనకేమంత ప్రాధాన్యము? తన ప్రాధాన్యము తనకు ఉన్నచో సత్యభామకుకూడ నుండవచ్చు. పరిచారకుల యొక్క యహంకారము విచిత్రముగా నుండును.

ఈ మాటలన్నది యెవరు? నారదుడు. అతనికేమి లెక్క? కాని యిది యంతయుపోయి కృష్ణునిమీద పడవలయును. ఇంత గొప్పచెలికత్తె యచ్చట నున్నదని నారదున కేమితెలియును? ఎంతదో యంతది యొక చెలికత్తె యున్నదని తెలియవచ్చును.

అని చెలికత్తె చెప్పఁగా దెబ్బతిన్న త్రాచుపామువలె సత్యభామ మండి పడెను. సత్యభామ తన కోపమును వెల్లడించెను. పుష్పమును రుక్మిణి కిచ్చినచో నిచ్చుకోనిమ్ము. ఆ నారదుడు మా పేరెందుకెత్తుకోవలయును? సరే! ఆ నారదునకు పోట్లాటలు పెట్టుటయేపని. నా భర్త ఆ నారదుని వారింపవలదా? కృష్ణుడిచ్చినచో నిచ్చుఁగాక, రుక్మిణియే మొగముపెట్టి తీసికొన్నది. ఇన్నాళ్ళు నేనే సవతులందఱిలో గొప్పదానివలె నుంటి. నేడేమొగము పెట్టుకొని తిరుగుదును? నేనెట్లు వారితో మాటాడెదను. ఓసీ! ప్రాణములెంతతీపి. అనగా నామె తన ప్రాణములు వెంటనే పోవలెనని వాంఛించినదన్నమాట. ఓసి. ఇట్టిమాటలు వినికూడ నేను బ్రతికియున్నాను. ఇంకనెట్టివి చూతునో! ఆ కృష్ణుఁడు రుక్మిణిమీద తనకున్న ప్రేమ యెంతయెంత దాచి నాదగ్గఱ ప్రేమ చూపుచున్నాఁడు. సరే! కృష్ణుఁడచ్చట నున్నాఁడు. భర్త అచ్చట నున్నాడుగనుక నామెకిచ్చినాడు. ఈ సపత్నులందఱు ఆమెను సేవించుటకు పోదురా?

కొందఱు లోకములో మేలువచ్చినను కీడువచ్చినను తలయొగ్గుదురు. అది నాచేతకాదు. ఓసీ! అతని ప్రేమకేమిచెప్పుదును? నామాట జవదాటడే! నా చెలులకు లంచములిచ్చును.

కృతకాద్రి కందరా కేళీనిగూహన
వేళా పరస్పరాన్వేషణములు
పోషిత మాధవీ పున్నాగపరిణయో
త్సవ కల్పితానేక సంభ్రమములు
చాతురీసర్జిత ద్యూతపణాదాన
కలితచేలాంచ లాకర్షణములు
సాయం సమారంభ చక్రవాక ద్వంద్వ
విరహ ప్రలోకన విభ్రమములు
సాంద్రతర చంద్రికాకేళి చంక్రమములు
విధుశిలామయ వేదికా విశ్రమములు
ఫలకచిత్రిత నిజరూప భావనములు
మఱచెనో కాక, రుక్మిణి మాయఁదగిలి.

కృతకాద్రి - కల్పించిన కొండ. ద్వారకాపురం సముద్రపుటొడ్డున నున్నది. అచ్చట కొండలుండవు కొండలలో విహరించవలయుననగానెట్లు ? వారు మహా ధనవంతులు గనుక అవీయివీ పేర్చి కొండవలె చేయుదురు. అందులో గుహలు మొక్కలు మొదలైనవి పెంచి చేయుదురు.

కందరా - గుహ; కేళి-ఆట; నిగూహనము - దాగికొనుట; దాగుడు మూతలాడుదురన్న ఆమాట. ఆ సమయములో ఒకరినొకరు అన్వేషణము లు - వెదుకుటలు.

పరస్పరావేల్లనములని మరియొక పాఠము. అది అన్వేషణములకంటె మంచిపాఠము. ఎందుకనగా వారొకరినొకరు వెదకికొని యొకరినొకరు చూచి నంతనే కౌగలించుకొని చుట్ట వేసికొందురని యర్థము.

మాధవీ - బండిగురివెంద; పున్నాగము - వానిరెంటికి పెండ్లిచేయు నప్పటి తొందరపాట్లు.

చాతుర్యముచేత గెలిచిన జూదపుపందెము నిమ్మని చేలాంచలాకర్షణములు చీరలుపట్టికొని లాగికొనుటలు.

సాయంకాలములయందు చక్రవాక దంపతులు విరహమనుభవించు చుండగా వీరుచూచి విభ్రాంతిపొందుటలు. అయ్యో, మనకు వియోగము వచ్చి నచో నిట్లుండును కదాయని;

ధనమిచ్చి పుచ్చుకొన్నను
మనమున నోర్వంగవచ్చు; మగఁడింతులకున్
జన విచ్చిపుచ్చుకొన్నను
మనవచ్చునె ? యింక నేటిమాటలు చెలియా ?

అని యామె కోపగృహమునకుఁ బోయెను అచటనెంతయో బాధపడు చుండెను. చీకటింటికడ మంచముమీద మబ్బుచివరనున్న చంద్రరేఖవలె నుండెను. మాసినచీర, నగలు లేకపోవుట, వాసెనకట్టు;

మాత్సర్యమను విషమామెకెక్కెను. మనకపు పాము కాటువేసినట్లు. ఆ లక్షణములన్నియు కనిపింప నారంభించెను.

మదించిన యేనుగు యొక్క తొండమునందలి తామరపువ్వువలె నామె తిరుగుచుండెను.

ఈమె యిచ్చటనిట్లుండగా కృష్ణునకు లోపలహడలు. ఆ చెలికత్తె వెళ్ళి చెప్పియుండును. అది దుర్మార్గురాలు. ఏవోయేవోకల్పించి చెప్పును. అని శ్రీకృష్ణుడు తనకొడుకైన ప్రద్యుమ్నుని మౌసికప్పగించి తాను సత్యభామ యొక్క యంతఃపురమునకు బయలుదేరెను. తన కొడుకైన ప్రద్యుమ్నుని మౌసి కప్పజెప్పి యనగా ప్రద్యుమ్నుడప్పటికి పెద్దవాడై నాడని యర్థము. ఇతఁడాలి చెప్పు అతని కాలికి సరిపోవుచున్నదన్న మాట. శ్రీకృష్ణుఁడు తన యీ శృంగార రసములో ప్రద్యుమ్నునికి పనిచెప్పుట ఆ కొడుకున కెంత తెలియక పోయినను న్యాయముగాలేదు. కాని దీనివెనుక నొకరహస్య మున్నది. ప్రద్యుమ్నుఁడు మన్మథుఁడు సర్వజగత్ స్త్రీ పురుష సంగమ వ్యవహారనిర్ణేత. వారు వారిద్దరు జగన్నాథులు. ఇద్దరికిని లోకము లోకమే, తాము తామె. ఇదియొక లీల.

> "అరదమునెక్కి కేతన పటాంచలచంచలమైన తాల్మితోఁ
> దురగజవంబు మున్గడవఁ బోచి కడింగెడు తత్తరమ్ముతోఁ
> దిరిగెడుబండి కండ్లపగిదిన్ భ్రమియించు మనంబుతోడ శ్రీ
> హరి చనుదెంచె సత్యసముదంచిత కాంచనసౌధ పీఠికిన్."

ఇదియొక యాశ్చర్యమైన పద్యము. ఆయన రథము నెక్కినాడు. ఆయన తాల్మి - ఓర్పు - జెండాకుకట్టిన గుడ్డ చివరివలె చంచలముగా నున్నది. ఆయన తత్తరము - తొందరపాటు రథమునకుకట్టిన గుఱ్ఱములకంటె ముందు పోవలె ననిపించుచున్నది. అతనిమనస్సు బండి యాకులవలె తిరుగుచున్నది. ఆయన సత్యభామ యొక్క ప్రకాశించుచున్న బంగారపు మేడదగ్గఱికి చనుదెంచెను.

చనుదెంచెననగా వచ్చెను. చనెన్ అనగా వెళ్ళెను. చను + తెంచు — ఇవి రెండు ధాతువులు అట్టివానిని శబ్ద పల్లవములందురు. ఈ చనుదెంచు అను ధాతువువాడుట మూలముగా శ్రీకృష్ణున కచ్చటకు చేరిన తృప్తి వ్యజ్యమానమగు చున్నది అమ్మయ్య, వచ్చినాము - అన్నట్లు. పద్యములో నున్న తొందర యంతయు చరితార్థమైనట్లు.

ఇచ్చటనొక కొంచెము భేదమున్నది. సత్యభామది కాంచనసౌధము రుక్మిణిది మణిసౌధము. చెలికత్తె చెప్పినది కదా రుక్మిణీసతి మణిసౌధమున నుండగానని. ఆమె పట్టమహిషి. ఆమెది మణిసౌధము. ఈమె తక్కినయేడుగురు భార్యలలో నొకతే. తక్కినభార్యలవి కాంచనసౌధములు. లేదా తక్కిన యారు వురవి కాంచనసౌధములుకూడ కావేమో !

ఇక్కడ సత్యసముదంచిత కాంచనసౌధ వీథి. సత్యాసముదంచిత కాదు. సత్యభామా సముదంచితకాదు, సత్యసముదంచిత. శ్రీకృష్ణుడామెను 'సత్య' అనును. అది ప్రియమైనపేరు. సత్య ఇంటికివచ్చితిని. సత్య నాకొఱకెదురుచూచు చుండును. సత్య ఏమనునో ! సత్య ఎట్లున్నదో ! ఈ ప్రేమలో నున్న సత్య అన్న శబ్దమునే వాడినాడు. అచ్చటి కూర్పులో సూక్ష్మముగా ధార కొంచెము విరిగిన లక్షణమున్నది దానిచేత నీప్రేమ వ్యంజితమగు చున్నది.

శ్రీకృష్ణుడు సత్యభామ సౌధములోనికివెళ్ళెను. సౌధమంతయు చిన్న బోయియున్నది. అచ్చట నెప్పటివలె చిలుకలకు మాటలు నేర్పుటలేదు. నెమళ్ళ నాడించుటలేదు. వీణలు వాయించుటలేదు హంసలను నడిపించుటలేదు పారిజాత పుష్పవృత్తాంత మెవ్వరో చెప్పియుందురని శ్రీకృష్ణుడనుమాన పడినాడు. కోప గృహమును చేరినాడు. తానువచ్చిన సంగతి యామెకు తెలియకుండ చెలికత్తెలకు సైగలుచేసి ముసుగుపెట్టుకొని యున్న యామెపజ్జచేరి తానొక విసనకఱ్ఱగొని యామెకు విసరుచుండెను ఆ విసరుట యెట్లున్నదనగా "తద్వపుః కీలిత పంచసాయకశిఖిన్ దరికొల్పుచు నున్నకైవడిన." ఆమె శరీరమునందు తగుల్కొనిన మన్మథాగ్నిని మంటలుగా రేపుచున్నట్లున్నది.

ఆ ముసుగులోనున్న సత్యభామకు పారిజాతపు క్రొత్త వాసనలు వచ్చినవి, ఆమె ముసుగుతీసి చూచెను. పతి విసనకఱ్ఱపుచ్చుకొని విసరుచుండెను. ఆయనను చూచినంతనే యామె కన్నులయందు నీళ్ళు గిర్రునతిరిగెను. ఆమె మరల ముసుగిడుకొనెను. ఆ ముసుగులో కూడ ఆమె కన్నీళ్ళు జార్చుచుండెను. ఆముసుగులో జార్చుచున్న కన్నీళ్ళుకూడ వర్ణింపబడెను. అది చాల యనవసరము. ఆమె మనస్సునందున్న యగ్నిని చల్లార్పుటకు మేఘమువంటి

యీయన వచ్చెనని, యోయీ! యగ్నీ, నీవింక వెళ్లుమని యగ్నిని బయటికి పంపించు వాని మిత్రుడైన వాయువువలె నామె నిట్టూర్పు విడిచెను. ఎంత పెద్దనిట్టూర్పు విడిచెనో గానామె కప్పుకొనిన దుప్పటియొక్క చివళ్లు లేచెను

"వనిత కుచద్వయమ్ముపయి వ్రాసిన కుంకుమపత్రభంగము
ల్ఘనిత నితాంతఘర్మకణజాలముచేత గరంగి మెల్ల మె
ల్లన వెలిపట్టుపయ్యెద కెలంకులజాఱుట యొప్పె మానసం
బున నెలకొన్న క్రోధరసమున్వెడ బెట్టుచునున్న కైవడిన్."

ఆమె స్తనములమీద వ్రాసిన కుంకుమముతోడి యలంకారములు, ఆమె చెమటచేత కరిగి తెల్లనిపట్టుపయ్యెద చివళ్లయందు జారెను. అది యామెలో నున్న క్రోధరసము బయటికి వచ్చినట్లుండెను.

అప్పుడు శ్రీకృష్ణుడామెను చాలబతిమాలెను. బతిమాలి ముసుగును లాగెను. చేతిలోనున్న తామరపువ్వుతో నామె కొట్టబోయెను.

చివరకు కృష్ణుడు దిక్కులేక యామె పాదములపై వ్రాలెను.

"జలజాతాసన వాసవాది సురపూజాభాజనంబై తన
ర్చు లతాంతాయుధు కన్నతండ్రి శిరమచ్చో వామపాదమ్మునం
దొలగం ద్రోచె లతాంగి యట్టియెడ నాథున్ నేరముల్ సేయ పే
రలుకం జెందినయట్టి కాంత లుచిత వ్యాపారముల్ నేర్తురే"

జలజాతాసనుడు - బ్రహ్మ, అతడు లతాంతాయుధుని కన్నతండ్రి. మన్మథుడు శ్రీకృష్ణుని కుమారుడుకదా! లోకమునందలి సర్వస్త్రీల ప్రేమలను పాలించువాడు మన్మథుడు ఇతడు వానితండ్రి. అతనితలను కాలితో త్రోసెను.

అతడు మిక్కిలి కోపము పొందవలయును. కాని యామెకాలిస్పర్శచేత తాను పులకరించిన శరీరముకలవాడై తనకు మన్మథ సామ్రాజ్యపట్టాభిషేకము జరిగినట్లు ఇష్టపడ్డాడు.

"ననుభవదీయ దాసుని మనంబున నెయ్యపుఁగినుకంబూని తాఁ
చినయది నాకు మన్ననయ; చెల్వగు నీపద పల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానముఁ దాఁకిన నొచ్చునంచు నే
ననియెద; నల్కమానవుగదా యిఁకనైన నరాళకుంతలా !"

నేను నీ దాసుడను. నన్నుతన్నుటలో తప్పులేదు పైగా నిది నన్ను గౌరవించుట. నా యొడలు పులకరించి ముళ్ళముళ్ళపలెనున్నది. నీ కాలికి గ్రుచ్చుకొని నొప్పి పెట్టలేదుగదా ! ఇంకనైన కోపము మానుము. ఓసీ అరాళకుంతలా ! అన్నాడు. అనగా వంకరలైన ముంగురులుకలదానా ! తల ద్రువ్వుకొనలేదు కనుక ముంగురులు రేగియున్నవి అందుచేత నరాళ కుంతలా యన్నాడే ! అసలామె కుంతలము లరాళయలో ! నిజముగా శృంగారసములోనిది యొక క్లిష్ట ఘట్టము. కోపముతో భార్య తన్నినచో లోకములో నిద్దరుభర్తలే యూరకుందురు. ఒకఁడు కృష్ణునివంటి మహారసికుడు. రెండవవాడు వట్టి అసమర్థుఁడు.

సత్యభామ నిజముగా చాల తప్పుచేసినది. కృష్ణుఁడుకోపించి వెడలిపోయినచో కథయేలేదు. ఆమె జీవితాంతము ధృతినితినుచు బ్రతుకవలసినదే. అట్టిస్థితి నామె కల్పించికొన్నది. కాని శ్రీకృష్ణుఁడు పరమరసికుడు. ఆయన మానవస్వభావము తెలిసినవాడు. పరమేశ్వరుఁడు. ఆయన చిత్స్వరూపుఁడు. అన్నియుతెలిసి ప్రవర్తించువాడు. ఆయన యీ కథను సాగించినాడు. ఇది లోకమునందు శృంగారరసమునకు లక్ష్యభూతమైనది.

ఈ తన్నుట రతివేళకాదు. అప్పటిస్థితి వేరు. ఇది వట్టికోపము నభినయించుసమయమునందు. ఆమెయు ప్రేమచేతనే యిట్లుచేసినది. ఎంతప్రేమ యున్నను ప్రవర్తనలో నొక హద్దుండవలయును.

ఆమె చాల విచిత్రమైన ప్రకృతికలది ఇట్టి స్త్రీలుందరు. ఆమె యట్లుచేయగా నతడట్లనగా స్త్రీయైనది వెంటనే మెత్తపడి భర్తమొక్క కవుగింటికిదూకును, అప్పుడతడామెను లాలించును. నిజముగా నట్లు జరుగవలయును.

ఇక్కడ నింకొకరీతిగా జరిగినది. ఆమె లేచికూర్చుండి మరల శృంగార రసమే యారంభించినది ఓయి పశుపులకాపరి ! నీకు భావజ మర్మ కర్మ

ములు తెలియునా? నీకు మాయందు ప్రేమ లేదు. ఈ దొంగ వేషములు నీతో పుట్టినవి ఈ మాయలు నీకు వెన్నతో పెట్టినవి. నేను నిన్ను నమ్మి మోసపోయితిని నీవిచ్చటి కెందుకు వచ్చితివి? పారిజాత వాసనలు మాకు చూపించి మమ్మెకసక్కెము చేయుటకు వచ్చితివి.

మానంబె తొడవు సతులకు
మానమె ప్రాణాధికంబు; మాన మఖిల స
మ్మానములకు మూలంబగు,
మానరహితమయిన బతుకు మానినికేలా !

ఇది వరకు చూపించఁబడిన యనౌచిత్య మంతయు నీ పద్యములో స్త్రీ భావము చేత పరిహరింపబడినది. ఈ భావమే ముందు కూడ విస్తరించఁబడును. సత్యభామ ప్రధానముగా నభిమానవతి. ఆమె కాలితో తన్నినప్పుడు కోపము వచ్చి కృష్ణుఁడు వెడలి పోయినచో నామె భరణము మీద బ్రతికెడి స్త్రీ కాదు. ఆమె విషము త్రావియో, యురి పోసికొనియో తప్పకుండ మరణించెడు స్త్రీ. ఈ రహస్యము శ్రీకృష్ణునకు తెలియును. అందుచేత నాయన యట్లు ప్రవర్తించెను.

ఉవిదయెవ్వతె నోచియున్నదో యీశ్రీం
తకరత్న మింక నొవల ధరింప!
నీరైవతకశైల చారుకూట విటంక
కేళి కింకెవ్వతె పాల్పడునో,
యెవ్వతె కబ్బునో యీ వసంతారామ
కర్పూర కదళికాగారవసతి
లీల నీ మణిసౌధ జాలకంబుల నిన్ను
గూడి యెవ్వతె వార్ధిఁ జూడఁగలదొ

యకట! నేఁ బెంపఁ బెరిఁగిన శుకపికాళి
శారికా బృంద మెవ్వతెఁ జేరునొక్కొ
నన్ను నాతోడి సవతులు నగక యున్న
పంత మలరఁ గనన్ను మెప్పింతుఁగాన.

ఆమె చనిపోవుటకు సిద్ధముగా నున్నది. ఆమె భగవంతునితో కడపిన ప్రతి నిమిషము జీవితముతో కడపినది. ఆమె బంగరు మేడ యొక్క గవాక్షములు మణులతో చేయబడినవి. అందుండి తాను స్వామితో కలసి సముద్రము చూచుచుండునట !

నను నెవ్వతెఁగాఁ జూచితివి ? యని మాట్లాడ లేక పోయినది. తన్ను సవతులు నవ్వక ముందు అతనిని మెప్పింతునన్నది. అనగా మరణింతునని యర్థము.

ఇది యొక స్త్రీ సృష్టి. పరమ సుకుమారముగా చేయఁబడిన సృష్టి. ముక్కుతిమ్మన్న యొక్క ప్రతిభ యంతయు నిందున్నది. అప్పుడామె ఏడ్చినది.

"ఈసుఁబుట్టి డెందమున హెచ్చిన కోపదవానలమ్ముచే
గాసిలియేడ్చెఁ బ్రాణవిభుకట్టెదురన్లలితాంగి పంకజ
శ్రీ సఖమైనమోము పయి చేల చెఱంగిడి బాలపల్లవ
గ్రాసకషాయ కంఠ కలకంఠ వధూకల కాకలీధ్వనిన్."
ఈ పద్యము చాల ప్రసిద్ధమైనది.

అప్పుడు శ్రీకృష్ణుఁడామెను కౌగలించుకొని కన్నీరు తుడిచి యిట్లన్నాడు
ఓ లలితేంద్రనీలశకలోపమకైశిక ! యింతవంత నీ
కేల ? లతాంతమాత్రమునకే గలుగ ? న్విను నీకు దేవతా
కేలివనంబునొచ్చి, యనికిన్బలసూదనుఁడెత్తి వచ్చినన్
దీలుపడంగఁదోలి యిటఁదెచ్చెద నిచ్చెద పారిజాతమున్.

ఈ పద్యములోని మొదటి సంబోధనము పరమ రమ్యమైన సమాసము.

ఒక్క పువ్వుకోస మింత యేందులకు ? నేను స్వర్గలోకమునకుఁబోయి యింద్రుని తోటలోని పారిజాతము మొక్క పెల్లగించి నీ తోటలో నాటుమను,

అప్పుడైనను సత్యభామ స్వామిని తిరిగి కౌగలించలేదు. అనునయ మాడలేదు. క్షమాపణ యడుగలేదు.

> ఆని పలుకు నంబుదశ్యా
> ముని గర్జితమధురవాక్యముల సత్యామా
> నిని నీపలతిక వోలెం
> గనుపట్టె సఖీమయూరికలు సెలరేఁగన్.

ఆయన మేఘములవలె నల్లనివాడు. ఆ మేఘముయొక్క గర్జితమే యీ తియ్యని మాటలు. నీపలతిక కడిమితీగ. ఆమె యట్లున్నది. అనగా చివురించి నట్లున్నది చెలికత్తెలన్న నెమళ్లు చెలఁరేగినారు. చెలఁరేగినది చెలికత్తెలు ఆమె ప్రసన్నురాలైనది.

ఆమె భావములో కృష్ణునకు తానొక్కతెయే భార్య. ఇంతకు ముందటి సీసపద్యములో ఈ శమంతకరత్న మెవ్వతె ధరించును ? మొదలైనమాటలలో తాను చనిపోగా కృష్ణుడు మరి యొకర్తును పెండ్లియాడు నన్నట్లున్నది. ఆయన కింక నేడుగురు భార్యలు కలరు మరియేమి? సంఖ్యాపూరణము చేయవలయునా? ఆ సత్యభామయొక్క రీవి, యభిమానము, ఆమె గర్వము విలక్షణమైనవి. ఎంత సుకుమారమైన సృష్టిచేసినాడు ముక్కుతిమ్మన్న ! ఎంత విలక్షణమైన సృష్టిచేసినాడు ముక్కుతిమ్మన్న !! ఎంత రహస్యమైన సృష్టి చేసినాడు ముక్కుతిమ్మన్న !!!

ఆముక్తమాల్యద

ఈ గ్రంథ మాంధ్రభాషలో మహా ప్రౌఢమైన ప్రబంధము కర్త శ్రీ కృష్ణ దేవ రాయలవారు. ఆయన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి కవిత్వములో కూడ నంతటివాడే. ఈ గ్రంథము వైష్ణవ మతమును సమర్థించుటకు ప్రచారము చేయుటకు వ్రాయబడినది. విజయనగర చక్రవర్తులు మొదట శైవులు. లేదా స్మార్తులు ఈ గ్రంథముయొక్క అవతారికలో కృష్ణరాయల వంశం చెప్పబడి యున్నది. ఆ పద్యములన్నియు పెద్దన్న మనుచరితములో నున్నవి. మరి నాలుగై దెక్కువ కూడ నున్నవి.

ఇది ప్రౌఢ ప్రబంధము. అనగా వ్యాఖ్యానము లేకుండ నర్థముకాదు. ఇది యెన్నో కల్పనలు కలిగిన గ్రంథము వర్ణనలలో దీనినిమించిన గ్రంథముండదు. ఇట్లు కల్పించుట యెవ్వరికి సాధ్యము కాదన్నను ననవచ్చును. ఈ గ్రంథము ప్రధానముగా నవర్ణనాశక్తి చేతనే నిలచియున్నది.

కాని యిందులో కథ యున్నది. ఒకటి విష్ణుచిత్తుని కథ రెండవది కేశిధ్వజ ఖాండిక్య సంవాదము, మూడు గోదాదేవి కథ. నాల్గు మాలదాసరి కథ. ఈ మాలదాసరి కథవంటికథ అనగా నట్టిరచన సృష్టిలో నెవ్వడును చేయలేదు. ఆంధ్రభాషలో నాముక్తమాల్యదలో తప్ప మరి యేసారస్వతము నందుండదు, అట్లు వ్రాయుట యసంభవము.

విలుబుత్తూరని యొక గ్రామమున్నది. అది అరవదేశము. ఆ పట్టణమును వర్ణించినాడు శ్రీ కృష్ణ రాయలు. ప్రతి పద్యము నొక యద్భుతమైన కల్పన. అందులో నొకపద్యము మరియు ప్రసిద్ధము.

తలఁబక్షచ్ఛట గ్రుచ్చి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకులు ప్రాంతప్రయాతద్విజా
వలి పిండీకృత శాటులన్న పిదవావాసంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గన్వెసఁ బాఱువానిఁగని నవ్వ న్శాలిగోపీఘముల్.

బ్రాహ్మణులు ప్రొద్దుట స్నానముచేసి తెల్లని తడిబట్టలుపిండి యొడ్డున పెట్టుదురుకదా! బాతులు మెడ వెనుకకుత్రిప్పి రెక్కలలో గ్రుచ్చికొని చలికి పండుకొని యున్నవి. అవి బ్రాహ్మణుల బట్టలనుకొని రాజభటు తద్గృహస్థుల కప్పజెప్పుటకనిపోగా నవి యెగిరిపోయినవి.

ఆవిల్లి పుత్తూరునందు విష్ణుచిత్తుఁడను వైష్ణవ భక్తుఁడు కలడు. పండితుడు. కాని మహా తపస్వి. గొప్ప విష్ణుభక్తుఁడు గొప్ప అన్నదాత. న్యాయార్జిత విత్తముతో ఆసేతుశీతాచలము నుండి వచ్చిన వైష్ణవుల కన్నము పెట్టును.

"అనిశాంనిధి గేహసీమనడురే యాలించినన్ మ్రోయు నెం
తే నాగేంద్రశయాను పుణ్య కథలుం దివ్య ప్రబంధాను సం
ధానధ్వానము 'నాస్తి శాకబహుతా నాస్త్యుష్ణ తా నాస్త్యపూ
పోనాస్త్యోదన సౌష్టవంచ కృపయాభోక్తవ్య' మన్ బల్కులున్,"

అతని యింటిలో సర్వ రాత్రమునందుకూడ నీమాటలు వినిపించునట. ఒకటి విష్ణువుయొక్క పుణ్య కథలు; రెండు దివ్యప్రబంధముల యొక్క పఠనము దివ్య ప్రబంధములనగా తిరువాయిమొళి, మొదలయిన యాళ్వారులు వ్రాసిన ప్రసిద్ధ ద్రావిడ గ్రంథములు. మూడు అయ్యా కూర అయిపోయినది. పదార్థములు చల్లబడినవి. పప్పు అయిపోయినది. భోజన సౌష్టవములేదు దయ చేసి భోజనము చేయవలయును-అన్ని - ఈ మాటలు సంస్కృతములో నున్నవి.

అతడిక్కడ నిట్లుండగా, మధురా నగరమున్నది. ఆ నగరము యొక్క వర్ణనమున్నది. ఆ యూరునకు రాజున్నాడు ఆయన పేరు మత్స్యధ్వజుడు. అతడు రాజ్యము చేయుచుండగా నొకప్పుడు గ్రీష్మర్తువు వచ్చినది. ఇవి యన్నియు వర్ణనలే. అందులో నొక పద్యము.

"తారుణ్యాతిగచూత నూత్నఫలయు క్తైలాభిఘారస్వన
ద్ధారాధూపిత శుష్యదంబుహృత మాత్స్యచ్ఛేద పాకోద్గతో
ద్గారంపుం గనరార్చు భోగులకు సంధ్యావేళలం గేళికాం
తారాభ్యంతర వాలుకాస్థిత హిమాంబ ర్నారి కేళాంబుపూర్.

దోరమామిడి కాయలలో నూనెపోసి చేపలు వేసి వండి తిన్నారట. భోగులు తిన్నారు. ఆవేడి తట్టుకొనలేక సాయంకాలము లయందు లేత కొబ్బరి బొండముల నీరు త్రాగుచున్నారట.

ఈ గ్రంథము పెద్దన్నవారు వ్రాసి కృష్ణదేవరాయల పేరు పెట్టినాడని కొందరు చెప్పుదురు. ఇట్టి పద్యములెన్నో ఆ మాట నిజము కాదనుటకు సాక్ష్యములు. మరియు పెద్దన్నగారిశైలి వేఱు. శ్రీకృష్ణరాయలవారి శైలి వేఱు. ఇంత విస్పష్టమైన రెండు శైలులు వ్రాయగలిగిన కవి యుండడని చెప్పవచ్చును.

ఈ మధురానగరమునకు దగ్గరనే వృషపర్వతమని యున్నది. ఆ పర్వతముమీద విష్ణ్వాలయ మున్నది. ఆ స్వామికి తెప్పతిరునాళ్ళు జరుగు చున్నవి. ఆయుత్సవము చూచుటకొక పరదేశ బ్రాహ్మణుడువచ్చి ప్రక్కనున్న మధురా నగరమును దర్శించుటకు వచ్చెను. మధుర ప్రక్కనే వైఘయినది కలదు. అందులో స్నానముచేసి ఆ రాజపురోహితుని యింటిలో భోజనముచేసి తనతోడి యితర బ్రాహ్మణులుకూడ తోడుగా పండుకొని యేదో యేదో చదువుకొను చుండగా రాజుగారు తానుంచుకొన్న భోగినీకాంత యింటికి నలంకరించుకొని పోవుచుండెను. అప్పుడు ఈ పరదేశి బ్రాహ్మణుడొక సుభాషితమును చదువు చుండెను. దానిలోని తాత్పర్యమేమనగా వయస్సునందే మోక్ష ప్రయత్నము చేయవలయును. అని. ఈ మాట విన్నంతనే రాజునకు తల తిరిగెను. అతడు తిరిగి యింటికివచ్చెను. మరియు చాలవిచారించి చివరకు నిర్ణయించెను. ఏ దేవత మోక్షదాతయో వానిని సేవించుదునని నిశ్చయించికొనెను. ఆ బ్రాహ్మణునకు కొంత ముడుపు పంపెను. తనవద్దకువచ్చెడి పలుమంది పండితులను పిలిపించి మీ శాస్త్రిలలో ఏ దేవుడు మోక్షమిచ్చునో నిర్ణయింపుడనెను. ఎవడు గెలుచునో వానికి బీరపూవులవోని బంగారు నాణెములు జాలరులో గట్టి వేలాడదీసి దాని నిత్తుననెను.

సభలో పండితులు చర్చలు చేయుచుండిరి.

ఆ సమయములో విల్లి బుత్తూరుతో విష్ణుచిత్తుడు తులసిదండ కట్టి స్వామి మెడలో వేయబోవుచున్నాడు. అప్పుడు భగవంతు డిట్లనెను "ఓయీ మధురలో నిట్లు జరుగు చున్నది, నీవుపోయి నా మహిమను ప్రకటించి ఆ

బీరపూనాణెములను సంపాదింపుము. ఆ రాజు ఇహమును రోసిన వైష్ణవుని చేయుము. అనగా విష్ణుచిత్తుండు భయపడినాడు. ఇతడు ఇతనికి వాదన ఏమిటి ? పండితులితనిని చీల్చి ముక్కలు చేయుదు

స్వామీ ! నన్ను నితఃపురా పఠితశాస్త్ర గ్రంథ జాత్యంధు,
రామక్ష్మాఖనన క్రియాఖర ఖనిత్ర గ్రాహి తోద్యత్కిణ
స్తోమాస్నిగ్ధ కరున్భవద్భవనదాసు న్వాదిగాఁ బంపుచో
భూమీభృత్సభ నోటమైన నయశంబు ల్మీకుఁ గాకుండునే.

స్వామీ నేను పూర్వము శాస్త్రగ్రంథములేమి చదువలేదు. అందుచేత జాత్యంధుడను. ఎప్పుడును నీతోటలో నేల త్రవ్వుటచేత త్రవ్వుగోలవలన నా చేతులు బొప్పెలు కట్టినవి. నేను నీతోటలో పనివాడను. నన్ను పంపినచో రాజ సభలో మీకు తలవంపులు కదా ! ఇచ్చట భూమీభృత్సభయన్న శబ్దమున్నది. రాజశబ్దము తరువాత సభా శబ్దము వచ్చినచో నపుంసక లింగమగును. రాజసభ మగును. ఇచ్చట పర్యాయశబ్దమైన భూమీభృచ్ఛబ్దమును రాయలవారు వాడిరి.

"గృహసమ్మార్జనమో, జలాహరణమో, శృంగారపల్యంకికా
వహనంబో, వనమాలికాకరణమో, వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో, వ్యజనాతపత్రధృతియో, ప్రాగ్దీపికారోపమో
నృహరీవాదములేల? లరె యితరుల్మీ లీలకున్ బాత్రముల్."

స్వామీ! నీ ఇల్లు ఊడ్చుటయా? నీ పల్లకీని మోయుటయా? పువ్వులు గుచ్చుటయా? ఓ నృహరీ! నాకు వాదములెందుకు? ఇది నీ లీలయైనచో దానికి పాత్రులైనవారు ఇతరులులేరా?

అనగా విష్ణువు లక్ష్మివంకఁ జూచి నవ్వి నేను వీనిచేతనే గెలిపించెదను చూడు అన్నాడు. అని విష్ణుచిత్తునితో "ఓయీ! ఇచ్చట నీ యిష్టమా? పద నీచేత గెలిపింతును. వెనుక నేనున్నాను గదరా" అని. అంత విష్ణుచిత్తుడు మాటాడ కుండ మధురకు బయలుదేరెను.

మధురకుచేరి రాజసభకు వెళ్ళెను. లోనికి ప్రవేశించెను. రాజతని ప్రతిభ కొలదిమాటలలోననే గ్రహించి యితడు వాదించుట కనుమతి యిచ్చెను. అతడొకని తరువాత నొకనిగా వాదుల నోడించెను. అందఱి నోడించెను. ఇతడు

వాదించుచుండఁగా రాజు ప్రేలాడకట్టిన బీరపూవుల వంటి నాణెముల జాలెముతెగి క్రిందపడెను. ఆకాశమునందు దేవదుందుభులు మొఱసెను. పూలవాన కురిసెను. అప్పుడిట్లయ్యెను.

"అద్ధావాగ్విబుధం బహోవచన కవ్యాహార మాహో వచ
స్సిద్ధం, బాఃకృతతాంగతః కలిరితి శ్రీసూక్తివిద్యాధరం
బిద్ధౌద్ధత్యమగాల్లయంహి కుధియా మిత్థంవదత్కిన్నరం
బద్ధీ రాగ్రణిగెల్పుటుత్సవము నందయ్యెన్న భంబంతయున్."

అద్ధా - ప్రశంసావాక్యము. అద్ధాయన్న మాటయాడిన విబుధము - దేవతలు కలదియు; కవ్యము: - పితృదేవతలకిచ్చు నన్నము; కవ్యాహారులు - పితృదేవతలు; వారు అహో అన్నారు. ఆః - ఈయక్షరము సంస్కృతములో కోపము మొదలైన వానిని చెప్పును. కలికృతతాంగతః - కలికృతయుగ లక్షణమును పొందెను అని విద్యాధరులన్నారు. కిన్నరులు, కుధియా- దుష్టబుద్ధులయొక్క, యౌద్ధత్యం - పొగరుబోతు తనము, లయం అగాత్-లయమును పొందెను అన్నారు. ఆ ధాత్రీసురుని గెల్పుటుత్సవమునందు ఆకాశమిట్లయ్యెను తరువాత నెవరిదారిన వారుపోయిరి. రాజతని నూరేగింపించెను. ఆ సమయములో విష్ణుమూర్తి గరుత్మంతుని మూపునందుండి విష్ణుచిత్తునకు కన్పించెను.

"ఇంగిలికంబునం దడిపియెత్తుకసీసపు రెంటిమో యన
న్నింగి గరుత్పరంపరల నిగ్గునలేఁదొగరెక్కె; నంత వీ
చెం గలశాబ్ధి మీఁగడల జిడ్డెతిఁగించెడు కమ్మగాడ్పు; నిం
డెం గడుప్రోత; పెన్దిరువడింగని రాఖగరాజు మూఁపునన్,"

గరుత్మంతునియొక్క ఱెక్కల కాంతిచేత నాకాశము తొగరు వన్నె వహించెను. వచ్చినగాలి పాలసముద్రముమీది మీగడల జిడ్డువాసన వేసెను. అట్లాకాశమున తోచిన భగవంతుని విష్ణుచిత్తుఁడు స్తోత్రముచేసెను. దశావతారములను వర్ణించెను. శ్రీరామావతారము నిట్లు వర్ణించెను.

పవిధారాపతనంబుఁ గైకొనని యప్పౌలస్త్యుమై సప్తధా
తువులం దూఱ పరిశ్రమించుటకు నుద్యోగించెనా! సప్తసా
ల విభేదంబొనరించి నిల్పికసలీలన్ జన్న యుష్మన్మరు
జ్జవనాస్త్రంబొసఁగు న్సిరుల్ రఘుకులస్వామీ రమావల్లభా.

ఇంద్రుఁడు వజ్రాయుధము పెట్టికొట్టగా పౌలస్త్యుడు (అనగా రుడు) వాని కేమియు దెబ్బతగుల లేదు. అట్టి వానిని చంపుటకు వాని శరీరము లోనున్న ధాతువులను భేదించ వలెను. ఆ ధాతువుల సంఖ్య యేడు. సప్తధాతువులు. రాముఁడు సప్తసాల విభేదనము చేసెను. ఏడు తాడి చెట్లను నఱకెను. ఆ సప్తధాతు విభేదనము కొఱకు ఈ పరిశ్రమముచేసెనా! యన్నట్లున్నదట అటువంటి రాముని బాణము సిరులొసగుగాఁత!

ఈ పద్యము మనుచరిత్రములో గూడ నున్నది. అంత విష్ణుచిత్తుఁడు మరల విల్లిపుత్తూరు పోయెను. అచ్చట సుఖముఁగా నుండెను. అచట నుండు చుండగా నొకనాడు తన తోటలో తాఁవుర పూలు పూచిన దిగుడు బావి ప్రక్క నున్న తులసి తోటలో నతనికొక చిన్న పిల్ల కనిపించెను. అతనికి పిల్లలు లేరు. ఆ పిల్లను తీసికొనిపోయి భార్యకిచ్చెను. ఇద్దఱు నాపిల్లను పెంచిరి. ఆమెకు కమముగా యౌవనము వచ్చెను. ఆ యింటిలో నెప్పుడును హరికథలు విష్ణు సంగీతమును, విష్ణుగాథలు, భజనలు. ఆమెకు క్రమముగా విష్ణుభక్తి హెచ్చెను. విష్ణుభక్తియే కాదు. విష్ణువు నందు ప్రేమకలిగెను. ఆమె మనస్సులో భగవంతుని పెండ్లియాడుదమని నిశ్చయించెను.

వారు మహాధనవంతులు ఆమెకు ముగ్గురు చెలికత్తెలు కలరు. ఒకామె పేరు మరాళి. ఇంకొకామెపేరు హరిణి. మూడవయామె పేరు స్రగ్విణి. వారీమె రహస్యమును తెలిసికొనిరి. ఆమె యొకనాడు కృష్ణకథలుచ్చరించుచు :

"నాఁడు మనమున్న నెట్లొ పూఁబోఁడులార"
యనిన వారలు మగుడ నాయమకు ననిరి
"యింతి వాఁడుండ కెందుఁబోయితివి నీ" వ
టన్న నచ్చెరుపడి వారి కతప పలికె.

'సకియలార; త్రైకాలిక జ్ఞానవంతు
లైన ఋషులపట్ల పలికెద, రంతయెఱుక
యెదఁ గలిగెనేని యెఱిఁగింపుఁడేను మొదల
నెవ్వతె' నటన్న; మఱి వారలిట్టులనిరి.

''దివిజ ద్రుమప్రసవంబుఁగాంచిన సపత్నింజూచి, చూపోప కిం
తవు జిల్గుంబని యంతసేసి మది నీర్ష్యాక్రోధ ముల్పొందడిం
ప విరింబోకద్రుమంబుఁ గైకొని, పతి న్మందన్నమానెల్లఁ దే
నవధింబెట్టిన సత్యవీ వహహ, కావాభామినీ'' నావుడున్.

మన మా దినములలోనున్న నెట్లుండెడిదోయన్నది గోదాదేవి. ఆమె పేరు గోద. ఈ పేరు ప్రసిద్ధమైనదే. గోదావరీనది యున్నదికదా॥ గౌదా అన్న పేరును శబరి యన్న పేరును గలిపి గోదావరియైనదందురు.

అప్పుడు చెలికత్తెలు 'అప్పుడు నీవున్నావు॥' అన్నారు. గోద తానప్పు డెవ్వతె॥ నన్నది. వారు నీవు సత్యభామవన్నారు. ఆమెకు పూర్వజన్మజ్ఞాన మంతయు వచ్చెను.

ఆమె ఋట్లుగా నెంతయో భగవద్భక్తురాలై కృశించిపోయి చాల బాధ పడుచుండగా విష్ణుచిత్తుడుచూచి విల్లిపుత్తూరులోని స్వామితో చెప్పగా ఆయన యామెను శ్రీరంగమునకు దీసికొనిపొమ్మనెను. అతఁడు దీసికొని పోయెను. ఆమె యచ్చట రంగనాథుని సేవించుచుండెను. తాను పూలదండ కట్టి ముందాదండ తానుతాల్చి తరువాత స్వామికివేయుచుండెను. అందుచేత నామెకు 'ఆముక్త మాల్యద' యన్న పేరు వచ్చెను. చివరకు వారిద్దరకు విల్లిపుత్తూరులో వివాహము జరిగెను.

ఇది యాముక్తమాల్యద మొత్తముమీది కథ. ఈ గ్రంథ మేడాశ్వాస ములు. ఈ కథ ఈ ఏడాశ్వాసములమీద పఱచఁబడినది.

ఈ గ్రంథములో ప్రధానమైనవి ఋతువర్ణనములు. ఆ వర్ణనముల కవధి లేదు. ఆ కల్పనలకంతులేదు. రెండవ యాశ్వాసములో గ్రీష్మ ఋతు వర్ణనము. నాల్గవయాశ్వాసమున వర్షర్తు శరదృతు వర్ణనములు.

మరియు విశిష్టాద్వైతమతము బహువిధములుగా వర్ణింపఁబడినది.

మధ్య మూడవ యాశ్వాసములో ఖాండిక్య కేశిధ్వజ సంవాదము [illegible] యొక కథకలదు. నాల్గవ యాశ్వాసములో యామునాచార్య చరిత్ర కలదు. ఆరవ యాశ్వాసములో మాలదాసరి కథ కలదు. ఏడవ యాశ్వాసములో బ్రాహ్మణుఁడు బ్రహ్మరాక్షసుడెట్లయ్యెనో ఆ కథ కలదు.

కాని యామునాచార్య మాలదాసరి కథలుమాత్రమే యిందు వ్రాయఁబడును.

యామునాచార్య కథ

ఈ కథ శ్రీవిష్ణుమూర్తి తనభార్యతో చెప్పినట్లున్నది. విష్ణుచిత్తుఁడు గెలిచినప్పుడు స్వామి యిట్లన్నాడు : ''ఈ విష్ణుచిత్తుఁడును యామునాచార్యుఁడును వీరిద్దరు నా దర్శనము నుద్ధరించినవారు" అని. దర్శనమనగా షడ్దర్శనములలో నొకటి. షడ్దర్శనములని యున్నవి. ఆయా మతముల యొక్క సిద్ధాంతములను నిరూపించు గ్రంథముల పేరు దర్శనములు. బౌద్ధ దర్శనము, సాంఖ్యమత దర్శనము, ద్వైతదర్శనము, అద్వైత దర్శనము మొదలుగ. ఈ యామునాచార్యుఁడు విశిష్టాద్వైత దర్శనమును సముద్ధరించెనని యర్థము.

ఈ యామునాచార్యుఁడు చిన్నప్పుడు వేదశాస్త్రములు చదువుకొనుచుండగా నప్పుడు పాండ్యదేశము నొకరాజు పాలించుచుండెను. ఆ రాజు వెఱ్ఱి శైవమ్ము ముదిరి హరుడె పరతత్త్వమనును. అతడు జంగమార్చన చేయును. వీరభద్ర పళ్లెరములుపట్టును. శైవమఠములు కట్టించును. వీర శైవమునుబూని జందెమునుఁ ద్రెంచివేయును. లింగముఁ దాల్చినవా రేపాపముచేసినను లెక్క చేయడు. జనులు గంజాయి త్రావుదురు. కల్లు త్రావుదురు. వారు శివలింగమును ధరించినచో చాలును. కాని యతనిభార్య వైష్ణవురాలు.

''వింగడంబైనట్టి ముంగిట నెలకొన్న
బృందావనికి ముగ్గువెట్టుఁదాన;
దశమినాఁడేక భుక్తము సేసి, యవలి నాఁ
డోర్చి జాగరముతో నుండునిట్టు;

బారసిపో నీవు; పైని ద్రాబాఱుట
క్కాలుపాడు మత్పుణ్యకథలఁ ద్రోయు;
నేమంపు మూనాళ్లు కామింప దధినాథు
మఱువాఁడు కన్నును మనసుఁదనియ

నారజపువన్నెఁ బ్రియు సెజ్జకరుగుఁ గూర్మి
నరుగుచో నాభిఁదుడిచి కప్పురపు నాభిఁ
బెట్టు; నిట్టులు మద్భక్తి పుట్టియును ని
జేశునెడ భక్తిచెడదు మదిష్ట మగుట."

(వింగడము - విస్తారము; సుందరము)

అనిచెప్పి భగవంతుడిట్లనును. "బ్రహ్మయు శివుఁడును నా శరీరములే వారిపూజ నాపూజయే. అయినను తారతమ్యము కలదు.

ఆ రాజు తామసప్రవృత్తితో ప్రవర్తించుచుండెను. అందుచేత నా భక్తులను నిరాకరించుటతప్ప. ఆ రాజుభార్యే నా భక్తులకు రహస్యముగా దానములు చేయు చుండెను. విష్ణుభక్తులు రాజగృహమునకు పడమటి ద్వారమును చేరి యామె వలన దానములు మొదలైనవి గ్రహించురు. అప్పుడీ యామునాచార్యుఁడు రాణి వద్దకుపోయి యామెతో తాను వాదముచేసి శైవులను గెలిచెదననెను. ఆమె సంతోషించి యా రాత్రిపూట రాజుతో చెప్పెను.

'భూవల్లభ "దెట్టెట్టా!
తావాదముసేసి శివమతంబు జయింపం
గా వచ్చెనో? చూతముగా,
రావింపు' మటన్న నాఁటిరాత్రి చనంగన్"

మరునాడు యామునాచార్యుఁడు రాజదర్శనమునకు పోయెను. అతడు వాకిటనున్న రావిచెట్టును సాక్షిగాచేసి లోనికిపోయెను. అతనిని చూచి రాజిట్ల నియెను.

'సంగతియె యోఱు యిసుమంత తింగణావు
తత్త్వనిర్ణయవాదంబు దరమె నీకు!

వోడితేనియుఁబట్టి మొఱ్ఱోయనంగ
లింగమును గట్టకుడుగ, మెఱింగినోడుపు.''

సంగతియనగా నొక ప్రయోజనముండి రాజదర్శనమును వా। లింగణా - అనగా పొట్టిగుట్టము. ఆ వాదములకు నియమములు యామునా చార్యుఁడోడినచో రాణియు నతఁడును లింగములు ధరించవలయును. అతఁడు గెలిచినచో తాను చక్రాంకితములు వేసికొనును. వైష్ణవులు చక్రాంకితములు వేసికొందురు. అనగా సన్నని లోహచక్రమును కాల్చి భుజములమీద నంకితము వేసికొందురు.

అంత యామునాచార్యుఁడు శైవునందఱను గెలిచెను.

''నీ వేమంటివి రమ్మం
చావలివానికిని మగిడి యట్లనె వానిం
గావించి, యొకఁడొకఁడు రా
నా విప్రుఁడు వాదసరణి నందఱఁగెలిచెన్."

విష్ణుచిత్తుఁడు వాదించునప్పుడు కూడ నీ పద్యమునే రాయలవారు వ్రాసితి "నీ వేమన్నావు? రా'' అని వాదములో నామట గమనదనమని రాయలవారి యుద్దేశ్యము కావలయును.

అప్పుడు యామునాచార్యుఁడు విష్ణుదేవుండె పరతత్త్వమనియు, విశిష్టా ద్వైతంబ మతంబగుటయున్ బ్రతిష్ఠించినన్ :

ఆ యెడను కొక్కెపలు కెదు
రై యుండెడు పిప్పలమున నాయెను విన'' నో
హో ! యిది నిక్కము నృప ! నా
రాయణుఁడె పరంబు, కొల్వుమతని" నటంచున్.

ఆ రావిచెట్టుమీద నిట్లు వినిపించెను శైవు లోడిపోయిరి. రాజు వైష్ణవుఁ డయ్యెను.

పాండ్యదేశమునకు నెప్పుడును మేనల్లుడు రాజ్యాధికారియగును. అందు చేత రాజు తన చెల్లెలిని యామునాచార్యునకిచ్చి పెండ్లిచేసెను. అరణముగ నతని

కర్ధరాజ్యమిచ్చెను యామునాచార్యుఁడు రాజై దిగ్విజయము చేయుటకు బయలు దేఱఁగా వర్షాకాలము వచ్చినది. ఆగి శరత్కాలమున బయలుదేఱుమని మంత్రులు చెప్పగా రాజాగెను. ఇచటనొక పెద్ద వర్షాకాల వర్ణమున్నది.

ఇల్లిల్లుదిరుగ నొక్కింతబ్బు శిఖి; యబ్బె
నే నింటిలోఁ బూరియుడి విసరక
రాఁజదు; రాఁజిన రవులు కోల్వాసాలఁ
గాని కల్గదు; గూడు దానఁగలిగె
నేనికూరగుట మందైనఁ బెన్పొగ, సుఖ
భుక్తి సేకూర; దాభుక్తికిడినఁ
బ్రాగ్భోక్తలకె తీఱు బహుజనాన్నము; దీఱ
నారుల కొదవుఁ బునః ప్రయత్న

మాజ్యపట ముఖ్యలయమెన్న; రాలయాంగ
దారులయమెన్న రంతిక కారజనిక,
పచన నాంధోగృహిణి రామిఁబడకమరుఁడు
పెడవెడనె యార్చు నౌగిలి రజ్జడిచి గృహులు.''

(శిఖి – నిప్పు)

శ్రీకృష్ణరాయలవారి వర్ణనలు పరమసహజములుగానుండును. కాని కొన్ని కొన్ని మాటలు జాగ్రత్తగా చదివి తెలిసికొనవలయును. తెలిసికొన్నచో నెంతయైన యానందము కలుగును.

తఱువాత మరలనంతటి శరదృతు వర్ణనమున్నది. అప్పుడా యమునా చార్యుఁడు దండయాత్ర బయలుదేఱి సర్వరాజులను గెలిచి యింటికి వచ్చి యజ్ఞములుచేసి భోగము ననుభవించుచు కూర్చుండెను.

ఇతఁడు జన్మచే రాజుగాడు. నిజముగా నతఁడుపొందవలసినది యోగ సామ్రాజ్యము. ఇది వ్యతిక్రమము. ఇతనితాత ఎంతో నైష్ఠికుఁడు. ఇతని రాజ్య వ్యసనము నెవరు మన్నింతురు ? అని శ్రీరామమిశుడన్న పండితుఁడు భావించెను. అతడు యామునాచార్యుని పితామహుడైన నాథమునికి

శిష్యుఁడైన పుండరీకాక్షునకు శిష్యుఁడు. ఆయన యీ యామునాచార్యుని లాలసను గురించి భయపడి యామునాచార్యునకు అలర్క శాకః చేయించెను. అలర్కమనఁగా ముళ్ళయుచ్చింత కూర. అది యొక నుండును. దానిని తిన్నచో విజ్ఞాననాశంబగును.

ముల్లు దలకొనని నవకపుఁ
బల్లవములతోడ ముక్తిభామ చెవులకుం
బల్లేరుఁ బువ్వులగు పువు
లుల్లసిలు నలర్కశాక మొసగుగ గొనుచున్.

మోక్షలక్ష్మి చెవులకు ఈ ముళ్ళయుచ్చింత పువ్వులు పల్లేరుపువ్వులవలె నుండుట.

ఈ రామమిశ్రుఁడు ప్రతిదిన మాకూర తెచ్చియిచ్చును. రాజైన యామునాచార్యునకది చాల రుచిగానుండెను. రాజునకు ప్రతిదినము నొక బ్రాహ్మణుఁడు తెచ్చియిచ్చుచుండెనని తెలిసెను. యామునాచార్యుఁ డతని పిలిపించి నీకేమి కావలయును? అని అడిగెను. అతఁడు "మీ పెద్దలుకూర్చిన నిక్షేప మొకటి కావేరీనదియొక్క లంకలోనున్నది. దానిని నీకు చూపవచ్చితి" నని చెప్పి రాజునప్పటికి దీసికొనిపోయి శ్రీరంగపతిని చూపించెను.

అంతట యామునాచార్యునకు వైరాగ్యము కలిగెను. అతడు తన కొడుకునకు రాజ్యమిచ్చి తాను సన్యసించి వెడలిపోయెను.

మాలదాసరి కథ

ఈ కథ యొక యాశ్చర్యమైన కథ శ్రీ రాయలవారి యనేక పద్యములు ఇతర కవుల పద్యములవలె నోటికి వచ్చునట్లుండవు. అర్థగాంభీర్యము కొఱకు నెమ్మదిగా చదువుకొనవలయును. మాటలకూర్పులో గడుసుదన ముండును. పలుకుబడిలో కుదింపు ఉండును. నడుమనడుమ నిఘంటువులలోని మాటలుండును. పాఠకుఁడీ శ్రమకోర్చినచో బ్రహ్మానందము నందును.

ఒక పేర్గొనరాని కులమునందు విష్ణుభక్తుడొకఁడు కలఁడు. శ్రీ మహావిష్ణువు వామనావతారము వహించిన పుణ్యభూమికి మూడామడ దూరమున

నొక పల్లెటూర నతడు నివసించును. అతఁడు బ్రాహ్మవేళ చనుదెంచి యా స్వామిని మంగళకైశికిరాగముతో పాడి సేవించును. ఇచ్చట నితని యాకారము వర్ణింపబడినది. అతఁడు తన చెక్కిళ్ళయం దానందాశ్రువులుబుకగా పాడి తన బరువులను దించికొని తాండవమాడును. అతని చేతిలో వీణయుండును. అది కిన్నరవీణ. దానిపేరు చాండాలిక. అది చిన్నది. దాని కొక్కటియే తంతి యుండును. అతఁడు ప్రొద్దెక్కుదనుక పాడును.

> "అట్లు దడవుగఁగొల్చి సాష్టాంగ మెఱఁగి
> గర్భమంటపిఁ గడిగిన కలఁక జలము
> లోని రా తొట్టినిండి కాలువగఁ జాఁగి
> గుడి వెడలివచ్చునది శూద్రుఁడిదఁగ గ్రోలి."

ఇట్లు దినములు గడుచుచుండగా నొకనాటి యర్ధరాత్రమున కోళ్ళగుడిసెలో నొక పిల్లి దూరగా కోళ్ళఱచెను. అతఁడు వేళయైనదని బయలుదేరెను. దారిలో మరులతీగె త్రొక్కెను. మరులతీగె త్రొక్కినచో మనుష్యులకు దారి తెలియదు. అడవిలో నూరక తిరుగుచుందురు అతఁడిట్లు తిరిగి తిరిగి చివరకు తెల్లవారునప్పటికి నిర్జనమైన యొక యడవిలోనికి చొచ్చి వెళ్ళుచుండెను. ఆ సీమ నానా ఘోరముగఁనుండెను. పెద్దపేరు ఉత్తరేణు, కసింద కోరంతపొదలు పూర్వమెప్పటివో వర్లగరిసెల్క్రింద లాగలు త్రవ్విన యెలుకలు. చీమలు బియ్యమునులాగగా అవియెండి యేవో లేచిన మొక్కలు. తిండిలేక మీసాలాడించు టక్కపిల్లులు. పూర్వమది యూరుకావలయును. పాడైపోయిన యేతాలు. అతఁడు కాళ్ళలో గ్రుచ్చుకొనిన ముళ్ళను, పల్లేరుకాయలను జాగ్రత్తగా తీసికొనుచు పోవుచుండెను. పోయిపోయి యితఁడొక పెద్ద మఱ్ఱిచెట్టును చూచెను. అచ్చట నొక సన్నని కాలిత్రోవ చూచి దానివెంట పోయెను. ఆ త్రోవ మరియు కశ్మలముగానుండెను. ఆ దారిలో మెదడుజుఱ్ఱివైచిన మనుజుల పుఱ్ఱెలు, దంతములతో మాంసమును గీరిన బొమికెలు. మానవశరీరములలోని బొమికెల కోసము పోరాడుచున్న కుక్కలు-ఇట్లు కనిపించెను. మరియు నాదకుక్కలు ముంగాళ్ళమీద సాగి పైకి దొంగచూపులు చూచుచూ బొమికెలెత్తుకొని పారిపోవుచుండెను. అనగా చెట్టుమీదనెవరోయున్నారు. వారుచంపుదురనిభయము. మాంసపు

ముక్కలు తోరణముగా నెండకట్టఁబడినవి. వానినితన్ని రాపులుగులెత్త...
పోవుచుండెను. ఎవరోకొట్టఁగా దెబ్బతిని రెండిన చేతులు పెట్టుకొని కోతులు
పారిపోవుచుండెను. దానిని చూచి మాలదాసరి పైన నెవఁడోయున్నాడు, వాడు
మనుష్యుఁడు కాడని నిర్ణయించుకొనెను. అప్పుడు వానికి వాఁడు కనిపించెను.
వాఁడు చచ్చినమనుష్యుని శవమును గోచిగా పెట్టుకొనెను. తల్లక్రిందులు...
ఏన్గుతలకాయలవలెనున్నది వానిమొగము. పాయగా తీసిన పెద్ద ...
కోరలతో వానిమొగమెట్లు కన్పించుచుండెను వాఁడు ప్రేవులను జ...
వేసికొనెను. ఆ జడ దెయు జారుచుండగా దానిని కసరి సర్దుకొను
వానికింత పెద్దపొట్ట. భేతాళికలను ఒండతిట్లు తిట్టుచుండెను.
కుంభజానువు. వాఁడొక బ్రహ్మరాక్షసుఁడు

మాల దాసరివానిని చూచి తప్పుకొందమనుకొనెను.

"వాఁడునుఁ గంటిఁబోకుమని ప్రాలె మహీ న్వింటపాళి నుగ్గుగా
వీఁడును మున్ను రేవగటివేళకు మానిసియౌటఁ బోరిలో
వాఁడిమిఁ గొంతకాలమిల ప్రాలుట, లావరియౌట, నిల్చియా
వాఁడిశరంబుచే నడువ, వాఁడది ద్రుంపుడువీఁడు నుద్ధతిన్."

కనపడినావులే పారిపోకుము, అని వాడు చెట్టు దూకివచ్చెను. మాల
దాసరి పూర్వము యుద్ధభటుఁడు. బలవతుఁడు. బాణముతో కొట్టెను.
వాఁడా బాణమును త్రుంచెను. వాఁడుచొచ్చినప్పుడితఁడు దూకెను. వాఁడు
కొట్టినచో తప్పుకొనెను. వాఁడు పైనఁబడఁగా పిడికిళ్ళ బలిమిలోఁ బడక
నిలిచెను వాఁడు చంపుటకురాఁగా వీఁడు గుద్దెను. చివరకు మాలదాసరి
తప్పించుకొని పారిపోవ యత్నింపగా వాఁడు తన రాక్షసీచయమును పిలిచెను.
ఆడరాక్షసులు వచ్చిరి. వారును వచ్చిరి. అందరు పట్టుకొనిరి. మాలదాసరి
పెనగుచునేయుండెను చివరకు దాసరిని మఱ్ఱిచెట్టు వద్దకు లాగిరి. వానిని కట్టి
వేసిరి. ఆ రాక్షసుడిట్లనెను. "నన్నింత బాధపెట్టిన నిన్ను న్యాయముగా
చంపవలెరా" అని దాసరిని కోలుకొక్కెలగా వడఁద్రోసెను. కోలుకొక్కెల
యనఁగా నెత్తకు లాఘములు వేయుటకు పగ్గములు వేసి వడఁద్రోయుపద్ధతి
(ఈమాట బహుగ్రంథములయందు బహువిధములుగా నున్నది. ఒక గ్రంథ

ములో 'గోలగర్గెర' యనియున్నది.) వానినిఁజంపుటకు వానినెత్తుకోద్చుటకు కత్తిని, పాత్రను తేఁబంచెను. అపుడు దాసరి దైన్యము లేకుండ ధర్మమును చెప్పెడువానివలె నిట్లుచెప్పెను :

వినుమొకమాట రాత్రిచర వేగిర మేటికి ? నిన్ జయింతు రే
యనిమిషులైన ? భాజనగతాన్నమ నే నీఁక నెందుఁబోయెదన్ ?
బెనఁగక ప్రాణరక్షణ ముపేక్షయొనర్చుట పాప మిందుకై
కనలకు, నాకు మేనియెడఁ గాంక్షయులే దిఁకపోవుదేయరున్.

ఓయి రాత్రిచరా! రాక్షసుఁడా! అనిమిషులైనఁ దేవతలైన, నిన్ను జయింతురా ? నేను భాజనగతాన్నమను. అనగా కంచములో వడ్డించుకొన్న అన్నమువంటి వాడను. నేను నీతో పెనగితిని. ప్రాణరక్షణ చేసికొనకపోవుట పాపము. అది ఆత్మహత్య క్రిందికివచ్చును. కోపపడకు నాకీ శరీరము మీద పెద్దకాంక్ష లేదు.

హీనజన్మ మఱుట ఎవ్వడే నొక ప్రాణి
సంతసిలుట ముక్తి పొంత గనుట
మేలెకాదె; శిబియ మేల్పొంతిగాఁడె న
శ్వరపు దేహమమ్మి పరము గొనుట,

నాది హీనజన్మము. చండాలజన్మము. అది పోవుచున్నది. ఎవరో ఒక ప్రాణి ! నీవు సంతోషించుచున్నావు. నేను మోక్షముపొంతకుఁ బోవుదును. శిబిచక్రవర్తి నశించిపోవు శరీరమునమ్మి మోక్షము పొందినాడు అది మేలు కదా !

మనుజునకు మృత్యువనేక విధములుగా వచ్చును. ఈ శరీరమూరకే పోకుండ ఆకలిచే బాధపడువాని నొక్కని రక్షించుట న్యాయముకదా ! నీవు దేవయోనివి. జంతువులలో మానవులకంటె మీకు శక్తి ఎక్కువ. మీకు జ్ఞానముకూడ నెక్కువ. మనుష్యమాంసము తినుట దురాహారము. చని పోయిన తరువాత నుత్తమలోకములు చెడునుఁగదా! నేడుగాకున్న రేపైనను మీరైనను చచ్చెదరుదే ! మీరును దేవత లన్నదమ్ములు. వారు సాధువులై యుండగా మీరసాధువులై యుండుటచేతనేకదా, వారికి పరము కలుగుట. మీకు పరముచెడుట జరుగుచున్నది అనగా బ్రహ్మరాక్షసుడిట్లనెను :

"చంపకు చదువుల, మేము ప
ఠింపని శాస్త్రములె ? మా పఠింపని శ్రుతులే ?
యింపవవి నమ్మవే(" బ్రథమాం
పిబతేవహ్ని' యనెడు మాటవుగాదే!

ఓయి! అగ్నిహోత్రుఁడు సర్వాశికదా! ఆయన దేవతయే కదా! దే:
పడిన దానిని తినునుగదా! గరుత్మంతుడు హరికి శ్రీ విష్ణుమూర్తికి హిత
కదా! అతఁడు పాములను చంపి తినుచుండునుగదా! మాకు మీరు జాత్యన్నము.

నిదురయుఁ గూడుఁబోఁ జదివి, నేనిటఁ గన్నదియేమి ? యెన్నఁడీ
చదువుల యర్థవాదపు మృషల్వినిబేఁటడు, నీవు మాయెడం
జదువుల మాటలాడి కనఁజాల వొకానొక మెప్పు. నొక్కఁ డీ
చదివిన కూరవింతచవి చాలఁగఁదె' మ్మను మెచ్చుతక్కఁగన్.

ఓయి! నేను బ్రహ్మరాక్షసుఁడను. అనగా పూర్వము బ్రాహ్మణుఁడను.
నేను నిద్రాహారములు లేక చదివి యేమి బాగుపడ్డాను? మా దగ్గఱ చదువుల
మాట చెప్పి నీవు ప్రశంస పొందలేవు. ఇంతకును నీవు చదివినకూరవు అది
యెక్కువ రుచి.

అనగా దాసరి నీవు సర్వజ్ఞుఁడవు. శాస్త్రములు చదివిన వాఁడవు. నీతో
నేను వాదించఁగలనా? నాదొక ప్రార్థన యున్నది వినుము. ఈ సమీపమున
కురుగుడిలో వైకుంఠుఁడున్నాడు. నేను ప్రతి దినము నతనిని పాడి వత్తును. అది
నాకు వ్రతము, నేఁడు చివరిరోజు. నన్ను వదలుమనెను.

అంచునతండు వల్కఁ దరహాసతఁ జెక్కిలిఁగొట్టి లెస్స పం
డించితివోయి దాసరి! వనిందెరవాటులు గొట్టి కొట్టి మే
న్పెంచి విరక్తి దాసరివి నిన్నఁగదా యయినాఁడ వీమమున్
గొంచెముఁజేసి తాద్గొటికి కోఁవలపోసెదు మెప్పితిన్నిమున్.

ఏ రాజ్యంబు నయందునోరె కడివో నీబోధ మాలించు ? నిం
కేరాజ్యంబు నరుఁడు బాసకయిమే నీఁధార యేతెఁచు ?ఁదీ

పారన్నేఁజననీమియున్మగిడి నీవారామియుఁదెల్ల ; మే
లారంతు ల్పలు పల్కు లంత్యకుల! యేలాచింత లేలావగల్.
తెరవాటులు - దారిదోపిళ్లు ;

తాడ్గొఱికికోఁదలపోసెదు - ఏ రాజ్యపు మానిసిరా నీ మాటలు నమ్మను ? ఏ రాజ్యపు మానిసిరా మాట నిలబెట్టుకొనుటకు మేఁయగా తానే వచ్చును? నేను నిన్ను వదలను. నీవు మరలరావు

ఇందులో ఏ రాజ్యపు మానిసివనుట క్రొత్త పలుకుఁబడి. అనాఁడు కొంతమేఱ విజయనగర రాజ్యము, కొంతమేఱ గజపతుల రాజ్యము-ఇంట్లుండెడిది ఇది యానాటి మాట

అనగా మాలదాసరి చెవులు మూసికొని హరిహరీ, యని నేను రాఁక పోయినచో విష్ణువుతో నింకొక వేల్పును సరిగా లెక్కించిన పాతకినౌదును! అని ఒట్టు వేసికొనెను.

బ్రహ్మరాక్షసుఁడు వానినినమ్మి వదలెను. వాఁడుపోయి చాండాలిక మీద స్వామిని గూర్చి పాడి తిరిగివచ్చి రాక్షసునితో నిట్లనెను.

నీ చెఱఁబాసి పోయి రజనీచర చక్రిభజింప ముక్తి పొం
దే చెర, యే చెఱందవులనే, నిఁక నుండగఁజూడు; పంచచో
నేచరణంబు లేయుదర మేయు ర మేశిర మేకరంబు లీ
వాచరణంబు లాయుదర మాయు ర మాశిర మా కరంబులున్.

చెఱ - చెరసాల; రజనీచర - రాక్షసుఁడా ;; ముక్తిపొందు - మోక్షము యొక్క కూడిక; ఏచెర - వృద్ధిపొందినదయ్యా !, నేను వెళ్ళునప్పుడు నా యవయవము లెట్లున్నవో మరలనట్లున్నవో లేవో చూచికో అనగా రాక్షసుఁడు వాని నిజానికి నబ్బురపడి యొడలుపులకరించగా మధ్యాహ్నపు టెండకు వాని బట్టతల మాడుచుండగా పిచ్చి యెక్కిన యేనుగువలె వాని చుట్టు ప్రదక్షిణించి వాని పాదముల మీద పడి దాసరి యొక్క యొక్కొక్క పాదము తన దంతముల మీద నెత్తిపట్టుకొని "ఓయీ! నీకు సాటియెవ్వరు? నీ ధైర్యమును నీ నిజమును చెప్పరానివి వీనియందు కురుంగుడినంబి కృపావలంబివైన నీకు నెవ్వరును సరిపోలరు.

అనఁగా - దాసరి రాక్షసుని కౌగలించుకొని :

"ఓయీ ! నీ దయవలన నీ నాఁడు నావ్రతము చెల్లినది."

"బాసలు బందికండ్లు మఱి ప్రాణభయంబున లక్షసేసి నం
గ్రాసము కృచ్ఛ్రలబ్ధముడు గన్వసమే ? యిది నీకచెల్లెనో !
భూసురవంశపుణ్యజన పుణ్యజనాంకము దావకీనమే
పో, సమకూరెడిం గులముపొత్తున దైత్యులకెల్ల నం కతన్.

బాసలు - వాగ్దానములు; బంది కండ్లు-బంది చక్రపుటాకులు; గ్రాసము - తిండి; కృచ్ఛ్రలబ్ధము - కష్టముమీదగాని దొరకదు. ఉడుగన్ వసమే - భోజనము మానివేయుట సాధ్యమా ? పుణ్యజనా ! - ఓ రాక్షసుడా !; రాక్షసులకు పుణ్యజనులని పేరు. రాక్షసు లందఱు నీ మూలముగా పుణ్యజనులైనారు.

[శబ్దమునకు రెండర్థములుండును. ఒకటి యౌగికార్థము. రెండు రూఢ్యర్థము యౌగికార్థమనగా వ్యుత్పత్త్యర్థము. రూఢ్యర్థమనగా వాడుకలోనున్న యర్థము. పంకజము-రూఢ్యర్థము తామరపువ్వు. యోగార్థము - బురదయందు పుట్టినదియని స భావన - యోగార్థము, గౌరవము. (ర్యూఢర్థము) యాచన; ఆట్లే పుణ్యజనుఁడు. రూఢ్యర్థము రాక్షసుఁడు. యోగార్థము పుణ్యము కల మనుష్యుడని.]

అని మరల దాసరి యిట్లనెను. "కడుపాకలితో నకనకలాడఁగా నన్ను వదలిపెట్టితివి. మేము మీజాతికి అన్నము. నామీదనొట్టు. నన్ను భక్షింపుము." అనగా రాక్షసుఁడు "ఏమయ్యా ! ఇట్లనుట న్యాయమా ? ఈ మనుష్యమాంసముతో నీ శరీరము నెన్నాళ్ళు పోషించితివి ? ఎవడో మహానుభావుఁడు రాడా నన్ను రక్షించఁడా ? అని యెదురు చూచుచుండగా మహానుభావుఁడవగు నీవు వచ్చి యిట్లనుట న్యాయమటయ్యా ! నా శరీరము తినుమనుట దయయా నన్ను రక్షించుమనుట దయగాని. నీవు దయతో నీ వీనాడు స్వామినిగూర్చి పాడినపాట

యొక్క ఫలితమిమ్ము. నే నీ దుష్ట జన్మఁబాసెదననెను. అంత దాసరి యిట్లనెను : "ఓయీ ! ఒకనాటి సంగీతఫలమే ! ఒక్క నిముసము పాడినఫలము గూడ నీయను, దేనికీయవలయును ? ఈ శరీరముకోసమా ?

దిక్పాల తనువెత్తి తిరిపంపుదనుదోన
యెన్నిమార్లెత్త మీయేను నీవుఁ ?
గేసరి తనువెత్తి కీటంపుఁ దనుఁదోన
యెన్నిమార్లెత్త మీయేను నీవుఁ?
మాతంగ తనువెత్తి మశకంపుదనుఁదోన
యెన్ని మార్లెత్త మీయేను నీవు ?
ధరణీశ తనువెత్తి దాస్యంపుదనుఁ దోన
యెన్నిమార్లెత్త మీయేను నీవు ?
సోమయాజుల యెన్నిమార్లామ్ము, శ్వపచ
ఖగకులుల మెన్నిమాఱులు గాము; పాము
గాములమ యెన్నిమాఱులు గాము వెంది
కంసరిపు భక్తుల మొకండె కాముగాని

ఎన్ని జన్మలెత్తితిమి కాము ? విష్ణుభక్తులము కాముగాని ఈశరీరము కోసము పుణ్యమమ్ముట పచ్చకర్పూరమిచ్చి యుప్పు తీసికొన్నట్లు" అనగా రాక్షసుఁడు.

సంగీత ఫలంబునఁ గో
సంగీ సగమైనఁ దయపొసఁగ నీవే; మీన్
మ్రింగిన గ్రుక్క న్వారిధి
కిం గొఱఁతయె ? కొదయె విష్ణకీర్తన కసనన్."

గోసంగి – మాలవాడు; దేవ సముద్రములో నొక గ్రుక్కెడు నీళ్ళు త్రాగినచో సముద్రమునకు లోటా ? నాకుఁ గొంత యిచ్చినచో నీ విష్ణు కీర్తనకు కొదువయగునా ?

అనగా దాసరి యిట్లనె :

"ఏలా నొంచెద దేహమిట్లడిగి యెంతే బాసమేనం బలం
బో, లీలావటు గీత కీర్తన ఫలంబో, నీయెడ న్మన్నపా (బే)
తాళ ప్రశ్నలు మాని మేన్గొనుము; బేతాళచ్ఛలోక్తిన్ రుషం
దూలింపం దలఁ తేని; పుట్టుమటి నూతుల్దివ్వ బేతాళముల్.

ఓయీ! అదేహము – దేహముకాని దానిని; అడిగి ఎందుకు బాధించెదవు? మన యిద్దఱినడిమి యొప్పందమేమిటి? నా శరీరములోని మాంసమా ? కీర్తన ఫలమా ? పాతాళ ప్రశ్నలు మానుము. చిక్కు ప్రశ్నలని యర్థము. రాక్షసులు పెట్టెడు మిషమాటలు పెట్టి నన్ను ఢింకాకొట్టింపఁ దలంతేని నూతులు త్రవ్వగా బేతాళములు పుట్టును. (ఈ మాట లోకములోని సామెత.)

అనగా సాలకటంకదేయుఁడు అనగా రాక్షసుఁడు. సాలకటంకట – అన్నది ప్రజాపతి సృష్టిలో నొకానొక రాక్షసస్త్రీ పేరు. దాని సంతానము సాలకటంకదేయుఁడు. వాడు సాలకటకటంబడి యిట్లన్నాఁడు "అయ్యా ! విష్ణు భక్తులకు దయవలదా ? పూర్వము రామానుజాచార్యుఁడు గురువు చెప్పిన మంత్ర మును శ్రీరంగమునందలి గోపురమెక్కి యందరకు చెప్పఁగా గురువు కోపించగా నేమనెను. ''స్వామీ! నే నొక్కఁడను రౌరవనరకమునఁ బడుదును. విన్న ప్రజ లందఱు మోక్షములకు పోదురుకదా'' అనగా గురువు సంతోషించెను. ఇట్లు రాక్షసుఁడెన్నోచెప్పి దాసరి పాదమ్ములమీద పడి ఆపాట ఫలములో సగమువద్దు పాతిక యిమ్మనెను.

దాసరి యీాయననెను, అప్పుడు రాక్షసుడు "కానిమ్ము నీవు నేడు స్వామినిఁగూర్చి యనేక కీర్తనలు పాడియుందువు. చివరికీర్తన ఫలమైన నిమ్ము

ఈయనిచో నేను నీకాళ్ళు వదలను." అని మొండిపట్టు పట్టఁగా చివరకు దాసరి గుండెలో జాలి యుదయించెను. జాలికలిగి యిట్లనెను: ఓయీ ! స్వామియొక్క కైంకర్యమునకు ఫలితమింతయని నేనెట్లు చెప్పఁగలను ? కొంత తీసికొమ్మనుటకు నేనెవ్వఁడను. నిన్ను భగవంతుఁడే రక్షించును. ఊఁ అడిల్లు మనగా మాల దాసరి నోటిమాట వానినోటనేయుండెను. బ్రహ్మరాక్షసుఁడు వాని రాక్షసత్వము పోయి - పూర్వమతఁడు సోమశర్మయన్న బ్రాహ్మణుఁడు - ఆ సోమశర్మయై నిలచెను. అతడు మహాభాగవతశ్రీ పొందెను. మాలదాసరికి ప్రదక్షిణము చేసెను. వానిని స్తోత్రము చేసెను. అతఁడు మరల పెండ్లాడలేదు. తీర్థయాత్రలు సేవించెను.

కనుక విష్ణుకీర్తనవంటిది మరియొకటి లేదు.

వసుచరిత్ర

ఈ గ్రంథము తెలుఁగు భాషలో నున్నదని చెప్పఁబడు పంచ కావ్యములలో నొకటి. ఈ గ్రంథమును వ్రాసిన యాయన పేరు రామరాజ భూషణుఁడు. భట్టుమూర్తి యని యాయన కింకొక పేరు. ఇది మహాశ్లేషకావ్యమని చెప్పుదురు. రెండర్థములు గల కావ్యములు వేఱే యున్నవి. రాఘవపాండవీయము, నల హరిశ్చంద్రోపాఖ్యానము, రావణ దమ్మీయము మొదలైన గ్రంథము లున్నవి. అవి రెండు కథల జోడింపులు. ఇందున్నది ఒక్కటియే కథ. కాని యిందనేకములైన శ్లేషలున్నవి. ఇంచుమించుగా ప్రతి పద్యము నందు శ్లేషలు కొల్లలు కొల్లలుగా నుండును ఈయన పెద్ద పండితుఁడు. ఈ కథ చమత్కారమైనది.

చేది దేశము కలదు వింధ్యకు దక్షిణమున చేది, చేర, పాండ్యాది దేశములు పూర్వముండెడివి. అందులోనిది యీ చేదిదేశము. ఆ దేశమునకు రాజధాని అధిష్ఠానపురము. సామాన్యముగా మన పూర్వకావ్యము లందొక పట్టణమును జెప్పెదరు. ఆ పట్టణము నందలి నాల్గు వర్ణములవారిని, కోటను, అగడితను, పూవులమ్మెడు వారిని మిక్కిలి వర్ణింతురు. ఇందు నద్దే కలదు. ఆ యూరి ప్రక్క శుక్తిమతి యన్న నది ప్రవహించుచున్నది.

చెన్నగు నన్నదీ పులినసీమల దాఁగిలిమూఁత లాడుచున్
వెన్నెల రేలు కప్పురపు విప్పుటనంటుల నీడ నీఁగు రా
కన్నెల తోయునన్నులకుఁ గన్నులు మూయు దదీయ వాసనల్
మన్ననఁ గాంచి కప్రపు దుమారము రేఁచు సమీర డింభముల్.

ఆ నదియొక్క యిసుకలయందు రాచకూతుండ్రు వెన్నెల తేలయందు దాఁగుడుమూఁత లాడుదురు. అచటనున్న గాలి కుఱ్ఱవాండ్రు కప్పురంపు పొడి వారి కన్నులలో చల్లి వారికి సహాయపడుదురు.

ఆ రాజధానికి రాజు వసు నృపాలుఁడు. ఆయన పేరు వసువు. పెద్దన్న గారు మను చరిత్రమును వ్రాసిరి. ఈయన వసుచరిత్రమును వ్రాసెను.

సామ్యము వట్టి పేరుగందే ; మనుచరిత్రలో నున్నది మనువుయొక్క కథ కాదు. మనువుయొక్క పుట్టుక కథ. ఈ పుస్తకము మాత్రము నిజముగా వసువన్నరాజు కథ.

దేవతలలో వసువులని కొందఱున్నారు. వారెనిమిదిమంది. వారిలో నొక్కఁడే భారతమునందు భీష్ముఁడై పుట్టినాఁడందురు. ఈయన కూడ వారిలో నొక్కఁడే—యిచ్చట రాజై పుట్టినాఁడు.

హిమవత్పర్వతము కుమారుఁడైన కోలాహలమన్న పర్వతము శుక్తిమతీనది కడ్డముగా వచ్చి నిలువఁగా నీ వసురాజు తన కాలిబొటనవ్రేలితో వానిని గవ్వను మీటినట్లు మీటెను. అప్పుడు దేవేంద్రుఁడితనితో స్నేహము చేసెను.

ఆ కోలాహల పర్వతము పాపము ! ఆ రాజుయొక్క కాలిదగ్గఱ ప్రాణాధారము పడియుండఁగా రాజు దానిమీద దయపూని దానిని కేళీశైలముగా మన్నించెను.

అతఁ డీరీతిగా మహా శౌర్యవంతుఁడై యుండఁగా వసంత ఋతువు వచ్చెను.

లలనాజనాపాంగ వలనావసదనంగ
తుల నాభికాభంగ దోఃప్రసంగ
మలసానిలవిలోల దళ సాసవ రసాల
ఫలసాదర శుకాలపన విశాల
మలి నీ గరుదనీక మలినీకృతధునీ క
మలినీ సుఖితకోక కులవధూక
మతికాంత సలతాంత లతికాంతర నితాంత
రతికాంతరణతాంత సుతనుకాంత

మకృత కామోదకురవ కావికలవకుల
ముకుల సకల వనాంత ప్రమోదచలిత
కలిత కలకంఠ కులకంఠకాకలీ వి
భాసురము వొల్చు మధుమాస వాసరంబు.

పద్యము యొక్క యర్థమట్లుంచి తాత్పర్యమేమనగా వసంత కాలపు దివసము వచ్చెను అని.

ఈ భట్టుమూర్తి గొప్ప సంగీత విద్వాంసుఁడు ఇట్లు పద్యము వ్రాయుట మరియొక్కనికి సాధ్యము కాదు.

అట్లుండ నుద్యానపాలురు వచ్చి రాజుతో పూఁదోటలలోని సౌందర్యమును గూర్చి చెప్పుచుండిరి. ఈ మీ పూఁదోటతో చైత్ర రథమును సాటి చెప్పుటకు వీలులేదు. కుబేరుని పూఁదోటకు చైత్రరథమని పేరు. ఇక్కడ నున్న యొక్కొక్కచెట్టే చైత్రరథము. తమరు వచ్చి పూఁదోటనుఁ జూడ వలయునని ప్రార్థించిరి. అంత రాజునకు పూఁదోటను జూడవలయుననిపించెను. దాని కోసము రథమును దెప్పించెను. దాని మీద నెక్కి పుష్పోద్యానమునకు వెళ్లెను. వెండి బెత్తాలవారు 'సాంగు భళా, యసఁగా తేరుఁ దిగి తోటలోనికి పోయి తోటలోని సౌందర్యమంతయుఁ జూచుచుండెను.

ఆ పూఁదోటలో ననేక దోహదక్రియలు జరుగుచుండెను. దోహదము లనఁగా వేళకానివేళ వృక్షములను పూయించుటకు, ఫలింపజేయుటకు జేయు ప్రయత్నములు.

అప్పుడా కొండమీద నున్న ఒక కిన్నరదంపతులు ''ఓ రాజా! నీకు కొద్దిలో అన్యదురాసదమైన యొక శుభము కలుగబోవుచున్నది" అని చెప్పి వెళ్ళిరి.

అంతట నా రాజు తనకు కలుగఁబోవు శుభము కొఱకెదురుచూచుచుండెను.

రాజులకు నర్మసచివు లుందురు. అనఁగా వారు రాజున కెప్పుడును సంతోషము కలిగించుచుందురు.

అప్పుడొక నర్మసచివుఁడు రాజుతో నిట్లనెను : ''రాజా! నాచే చాయన చూడుము. ఆ యాకాశములో నల్లని మబ్బులో కొన్ని చెట్లు గలవు. అవి నందన వనములోని వృక్షములు'' అని అనఁగా రాజు నవ్వి "ఓయీ! అది

మన క్రీడాపర్వతము. అది యింద్రనీలమణులతోఁ గట్టిన ప్రదేశము. అవి నందనవనములోని చెట్లుకావు."

ఆ నర్మసచివుఁడు చాల సేపా కొండను పొగిడెను. వారిద్దఱును నా కొండ నెక్కి విశ్రమించుచుండగా వారి కొక్క కలస్వనము విన వచ్చెను.

"వీనులవిందై, యమృతపు
సోనల పొందై, యమంద సుమచలదళిసీ
గానము క్రందై, యాస్వన
మానందబ్రహ్మమైన నధిపతి వల్కెన్."

అప్పుడు రాజు

"నానాగాయన గాయనీమణుల గానం బుర్వి నాలింపమో
నానాఁటన్ నగభేది వీటఁగల గన్ధర్వాప్సరోగీత వి
ద్యానైపుణ్యము లెన్నియేని వినమో! యందైన నిందైన నెం
దైన నాదం బొనగూర్చునే మదికి నిట్లానంద సందోహమున్."

అనఁగా నర్మసచివుఁ డిట్లనెను: "ఓ రాజా! ఎవరో వీణతో కలిపి పాడుచున్నారు. ఆ సంగీతమునకు కోకిలకుల సమూహము ప్రతిధ్వనులిచ్చు చున్నవి." అనఁగా రాజునకు నందు నొక యనురాగము గలిగెను, కలిగి నర్మసఖునితో "ఆ పాడెడివారెవ్వరో చూచి రమ్ము. మనముఁ గూడ నచ్చటికి పోదము" అని వానిని పంపెను. ఆ నర్మసఖుఁడు వెళ్లి శుకశారికల ఘోష ఘుమఘుమిత మైన [illegible] దానిని గనెను. అచ్చట నొక దివ్యమందిరమును జూచెను. అందులో స్త్రీలుండిరి. ఇతఁడు చెట్లచాటున నుండి చూడఁగా

అరుదుపాటంత పొంది వసుధావరమిత్రుఁడు గాంచె నచ్చటం
దరుణిఁ బయోధినీలకచఁ దామరసోదరసోదరప్రభం
దరళవిలోచనం దతనితంబఁ దటిన్నిభగాత్రవల్లరిం
దరుణశశాంకఫాల నొక తన్విఁ దరంగవళిం దలోదరిన్.

ఆమె వీణావాదనము చేయుచున్నది. అంతట నర్మసఖుఁ డామెను జూచి యామె సౌందర్యమున కాశ్చర్యపడి రాజును దీసికొనివత్తునని వెళ్ళెను. వెళ్ళి రాజుతో చెప్పెను. "అయ్యా! అక్కడ వీణ వాయించు నొక్క యలివేణినిఁ గంటిని."

అని యామెను చాల పద్యములమీద వర్ణించెను. అందులో నిది యొక పద్యము.

నానా సూనవితాన వాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్లదటంచు గంధఫలి బల్కాకన్ దపంబంది యో
షా నాసాకృతిఁ బూని సర్వసుమనస్సౌరభ్య సంవాసి యై
పూనెన్ ప్రేక్షణమాలికా మధుకరీ పుంజంబు నిర్వంకలన్.

ఇది ప్రసిద్ధమైన పద్యము. స్త్రీయొక్క అనేకావయవములు వర్ణించుటలో నామె ముక్కునుఁ గూడ వర్ణించెను. దీని కొక కథ యున్నది. ఈ పద్యమును పారిజాతాపహరణ గ్రంథకర్తయైన నంది తిమ్మన్న వ్రాసెననియు, అందుచేతనే యాయనకు ముక్కు తిమ్మన్న యని పేరు వచ్చినదనియు, ఆయనవద్ద నీ భట్టుమూర్తి యీ పద్యమును డబ్బిచ్చి కొన్నాడనియు, కొని యీ పద్యమును తన గ్రంథములో పెట్టుకొన్నాడు. ఇది కథ

కథ నిజమో కాదో పద్యముయొక్క గొప్పదనమును మాత్రము చెప్పుచున్నది. సారంగము-తుమ్మెద; గంధఫలి-సంపెంగపువ్వు. ముక్కును సంపెంగ పువ్వుతో పోల్తురు. స్త్రీలయొక్క కంటి కాంతులను తుమ్మెదల వరుసగా చెప్పుదురు. తుమ్మెద యనఁగా, తేటి, యనఁగా తేనెటీగ. అన్ని పువ్వులమీద వ్రాలును గాని సంపెంగపువ్వుమీద వ్రాలదు. పువ్వులు స్త్రీలు, తుమ్మెద పురుషుఁడు.

ఇట్టివానిని కవి సమయము లందురు. మన కావ్యములలో చాల భాగము కలిగెడి శోభ యిట్టి కవి సమయముల నవలంబించియే పుట్టుచున్నది. అన్ని పువ్వులమీద వ్రాలెడి తుమ్మెద నామీద నేల వ్రాలదని సంపెంగపువ్వు తపస్సు

చేసి ఆ స్త్రీయొక్క ముక్కుగా జన్మించినది ఈ సంపెంగయైన ముక్కునకు రెండు వైపులను చూపులను తుమ్మెదల బారులు వెలసెను.

"ఓయి రాజా! నేను వారి యెదుటికి పోలేదని వారినిఁ జూచి నీకు చెప్పుటకు వచ్చితిని."

అనఁగా రాజున కతని మాటలు తాను విన్న సంగీతము కంటె మధురముగా నున్నవి. ఆ రాజునకు వెంటనే యామెమీద ప్రేమకలిగెను. విరహబాధ యుదయించెను. ఇంతకు ముందేకదా కిన్నర దంపతులు నీకు శుభమగు నని చెప్పిరి. రాజునకు తొందర యెక్కువయ్యెను. ఇద్దఱును కలసి పోయిరి. రాజు వెళ్ళి అచట బంగారపు మేడఁ జూచి తీఁగల చాటుననుండి చివురుటాకుల సందుగా నామెను చూచెను.

కనుఁగవ పూర్ణకామమగుఁ గన్గవకన్నను బూర్ణకామమై
మనమతి చిత్రవృత్తి యగు మానసవృత్తికి మున్న చిత్రమై
తనువు రసోత్తరంగమగుఁ దత్తనువైఖరికిన్న సంభ్రమం
బెనసి రసోత్తరంగము నిప్పిడిమానఁగ మానభేదికిన్

కన్నులు పరితృప్తిపొందెనవి సంపూర్ణమైన తృప్తిపొందినవి. అంత కంటె కూడ మనస్సు తృప్తమైనది. ఆయి చిత్రమైన వృత్తి కలిగియుండెను. మనస్సుకంటె కూడ అతని శరీరము రసోత్తరంగమయ్యెను. ఆ రాజు యొక్క కోరిక ఆ శరీరము కంటె రసోత్తరంగమయ్యెను. ఇది యాశ్చర్యకరమైన పద్యము :

అనిమేషోత్తము చేత నాడ ననిమేషత్వంబుఁ గాంచె మ; న
న్ననిమేషత్వము నంత కాంతముఖ చంద్రాసేవ నానందవా
సనఁ బ్రాపించనఁ గోరునప్పు డనిమేష స్వామిభావంబుఁ గ
న్గొన నెందున్ నృపు లుత్తరోత్తర పదానూనస్పృహా చంచలుల్.

అనిమేషులు - దేవతలు; నిమేషము - ఱెప్పపాటు: దేవతలు కనుఱెప్పలు మూయరట; అందుచేత ననిమేషు లనగా దేవతలు. అనిమేష స్వామి-ఇంద్రుడు; నృపులు - రాజులు; ఉత్తరోత్తర పదానూన స్పృహా చంచలుల్ - ఎప్పటి కప్పుడు పైపైకి పోవుచున్న కోరికచేత స్థిరత్వములేని వారు ఈ లక్షణము రాజు

నకు ఆమె పాదములనుండి మొగములకు వ్యాపించిన దృష్టిలో కూడ నున్నట్లు తరువాత చెప్పఁబడినది. చివరకు రాజు ఇంకొక యూహయే లేనివాఁడయ్యెను అప్పుడు నర్మసఖుఁడు దగ్గరకువెళ్ళి అతఁడు రాజుతో మాటాడువరకు రాజునకు స్మృతి లేదు. నర్మసఖుఁ డిట్లనెను: ''నేనొక సన్యాసివేషము వేసికొని, మహారాజా! ఆమెవద్దకు పోయి ఆమె పుట్టుపూర్వోత్తరములు తెలిసికొని వచ్చెదను. నన్ను పంపుము'' అనెను. రాజనెను గదా! "చాల జాగ్రత్తగా వెళ్ళి రావలయును. నీ తెలివి చూతును గదా, వెళ్ళు'' మనెను.

ఇతఁడు యతి వేషమును బూని వెళ్ళెను. అప్పు డామె చెలికత్తెలలో నొకతె.

''గంధగజయానగీతి ప్రబంధకలన
నలరి యతి వియ్యమై వచ్చు నరిది మగువ
లార! కనుఁగొంటిరే యను నాళి వాక్య
మొకటి విననైన నిదె వేళ యొదవె ననుచు"

అతివియ్యము - ఈ అతిలోనున్న 'అ' కారము తెలుఁగులో సంధివలన 'య' అగును. అప్పుడు యతి వియ్యమగును అందుచేత యతి వచ్చుచున్నాడని నీకెట్లు దెలియును? అని శ్లేషమీద చమత్కారము చేసెను.

తరువాత యతి వెళ్ళగా నా స్త్రీలందఱు లేచి గౌరవించిరి. మీరెవ్వరని యడిగిరి. ఈ దొంగయతి తన పేరు గౌతముఁడని చెప్పెను అని ''ఓ వలమాన మీన మిథునోపమ లోలవిలోచనాంత కాంతా!'' అని పిలిచెను. రెండు చేపలతో సమానమైన కన్నులుగల యాఁడదానా! యని యర్థము. కాని కూర్పు బాగుగా నున్నది కదా!

తెలుఁగులో చాలమంది కవులు పద్యములయందు ఒక్కొక్క చరణము రమణీయముగా చేయుదురు తక్కిన పదములు దానికి లోనిపోవును దానికోసము పద్యమంతయు నేర్చుకొనవలయును.

39449

అంతట నా యోగి తాను వసురాజు నాశ్రితుండనని చెప్పెను. నా రాజును ఉద్యానవనమునందు నామెకు వచ్చితి నని, శిష్యుండే యీ పిల్లను చూపితిని

యామెను చూడఁగా తనకును రాజునకును వాత్సల్యమును, జాలియు, నాశ్చర్యమును గలిగినవనిచెప్పి "యీమెను జూడఁగా లక్ష్మియో, పార్వతియో యన్నట్లున్నది. ఈ యమ్మాయి యెవ్వరో చెప్పుడు."

అట్లనటలో లక్ష్మి యనుటకు సింధునందన యని, పార్వతి యనుటకు అచలేంద్రనందన యని వాడెను. సింధువనగా సముద్రము. అచలేంద్రమనగా కొండ. అప్పుడా చెలికత్తెలు ఈమె సింధు నందన, అచలేంద్ర నందన ఇద్దయును. అనగా నీమె సింధువనగా నది - నదికి పుట్టినది. కొండకును పుట్టినది యని యర్థము.

అసలు విషయమేమనగా శుక్తిమతి నదిని మొట్టమొదట కోలాహల పర్వతము అడ్డగించగా నీ పిల్ల పుట్టినది. ఇక్కడి చమత్కారమో యేమో యేమనగా నది స్త్రీ పర్వతము పురుషుఁడు. వాఁ డామెను బలాత్కారముగాఁ బొందెను. అప్పుడు పుట్టిన బిడ్డ యీమె. ఈమె బలాత్కార సంయోగ సంతానము. అప్పుడుకూడ మంచి పిల్లలే పుట్టుదురు కాబోలు! ఆ చెలికత్తెలు ఆమె యీ జన్మ వృత్తాంతమును చెప్పిరి. కాని వర్ణించవలయునుఁ గదా! ఈ శుక్తి మతి నర్మదా బహుదా వేత్రవతీ సరస్వతీ ముఖ్య నదులు చెలికత్తెలుగా ప్రతిదినము బ్రహ్మను సేవించి వచ్చుచుండును. ఒక నాడు తిరిగి వచ్చుచుండఁగా కోలాహలుఁడను పర్వతుఁడు శుక్తిమతి కెదురయ్యెను. వాఁడు చాల అందగాఁడు. ఇచట నొక సీస పద్యము కలదు. అతఁడు తక్కువవాఁడు కాడు. అతఁడు

అనుపమ భాగ్యశాలి కచలాధిపమౌళికిఁ బుత్త్రుఁడై జగ
జ్జనని కనుంగు దమ్ముఁడయి, శంకరు ముద్దుమఱంది కుఱ్ఱయై
మనుతన భాగధేయ మహిమంబున మిన్నులు ముట్టివచ్చు ధ
న్యుని నతనిన్ భజించి నదియున్ వినయంబున నోరయైనవన్

అతఁడు హిమవంతుని కుమారుఁడు. పార్వతీదేవికి తమ్ముఁడు. పరమేశ్వరుఁడైన శివునకు మఱఁది. ఆతని చూచి శుక్తిమతి తప్పికొనబోయినది. ఆమెను జూచి యా కోలాహలుఁడు కామపరవశుఁడయ్యెను, అతఁడు తన ధైర్యమును గోల్పోయెను. ఆ నాఁటినుండి కోలాహలుఁడు శుక్తిమతి మీఁద మన

న్నుంచి బాధపడుచుండెను. అప్పటినుండి శుక్తిమతికూడ నతనియందనురాగవతి యయ్యెను.

ఆ కోలాహలుఁడు తన కోరికను పట్టుకొనలేక ఒకనాడు శుక్తిమతి దగ్గరకు వచ్చెను. శుక్తిమతి యతనిని బూజించెను. మిక్కిలి గౌరవముగా మాట్లాడెను. 'తమ రిచ్చటికి వచ్చుట నాయందు ప్రేమచేత కదా !' యనెను. అతఁడు నవ్వి 'నీవు మంచి తెలివి కలదానవు నా రహస్యము వెంటనే కనిపెట్టితివి. నేను నిన్నెప్పుడును మనస్సులో భావింతును.

''ఆ పద్మోద్భవు నోలగంబునకు దివ్యద్వీపిను ల్విచ్చురా
రో, పోరో, మఱియెందఱేనియును వారున్ మేము సంధింపమో
యే పద్మాననఁజూచినం జెలియ ! నిన్వీక్షించినట్లుండదే
లా పల్మాటలు పూర్వజన్మ కృతముల్గాఁబోలు నీ నెయ్యముల్.
ఓలగము - సభ; ద్వీపినులు - నదులు;

ఈ పద్యము చాల సుకుమారమైన పద్యము నీవు నాకెప్పుడెదురు పడి నను తొలఁగి పోయెదవు గాని నిన్నెట్లు పొందుదునని నేనెప్పుడును దుఃఖపడు చునే యుందును. నీ దయకోసము వచ్చితి ననెను. నన్ను రక్షించుమనెను.

అప్పుడు శుక్తిమతి భయపడి వినయముతో తన తక్కువఁదనమును చెప్పుకొనెను.

ఈ పద్యము లన్నియు శ్లేషము. సామాన్యముఁగా చదివినచో తెలియును. చదువవలయును.

అప్పుడు కోలాహలుఁడు చిన్నబోయి మరియు దీనముగా మాటాడెను శుక్తిమతి యిట్లనెను : ''అయ్యో ! నన్ను పొందినచో నీవు తేలికవాడగుదువు. పోయి తీర్థయాత్రలు చేయుము. నీవు కోరినచో గంధర్వాప్సర స్త్రీలు వత్తురు,'' అనగా కోలాహలుడు మిక్కిలి దీనుఁడై కామాంధుడై యామెను పట్టుకొనెను.

వేణి చలింపఁ గంపితనవీన మృణాళ భుజాగ్ర కంకణ
శ్రేణి నటింప, లోల శఫరీనిబిరీస కటాక్షకాంతి వి
న్నాణము చూప, హంసక గణక్వణనంబులు మీఱ; సైకత
శ్రోణి వివర్తి తాబ్జ ముఖశోభితయై కడు సంభ్రమించినన్.

వేణి - 1. జడ. 2. నీటిపాయ; మృణాళము - తామరకాడ; కంక ణము - 1. గాజు 2. నీటిబొట్టు; శఫరీనిబిరీస కటాక్షకాంతి - శఫరీ - ఆడు చేప.

సైకత శ్రోణి; వివర్తి తాబ్జముఖ శోభిత వీనియందు విగ్రహ వాక్య ములు చెప్పుటచేత శ్లేషలు సిద్ధించును. చేపలే కన్నులు - లేదా చేపలవంటి కన్నులు, సైకతమే శ్రోణి భాగము లేదా సైకతముపంటి శ్రోణి భాగము కలది. అబ్జమే ముఖము లేదా అబ్జము వంటి ముఖము.

"ఈ రీతిగా నాగద్దటి యమ్ముద్దరాలి బెద్దయుం బ్రొద్దు నిరోధించు సమ యంబున."

అప్పుడు శుక్తిమతి వసురాజును రక్షింపుమని యఱచెను. ఆమె యొక్క శోకార్త నినాదములు వీరును వారును పోయి వసురాజుతో చెప్పిరి. "అయ్యా! మహారాజా! ఎవడో యొక పర్వతుఁడు శుక్తిమతి నడ్డగించెను. గ్రామములు చెడిపోయెను. ఇండ్లు పడిపోయెను. జంతువులు తిరుగుటకు వీలులేకుండెను."

ఈ రీతిగా చెప్పిరి. ఇందులో నున్న చమత్కారమేమనఁగా - ఒక నదికి కొండ యడ్డముఁగా వచ్చినచో నేమగును? నది పొంగిపోయి యూళ్ల మీద పడును. దీనిని కవి యొకానొక పురుషుడొక స్త్రీని మానభంగము చేసినచో కలి గెడి ధర్మము యొక్క యుపద్రవముగా జెప్పెను.

అంత రాజు అభయమిచ్చెను. ఆయన పెద్ద సైన్యముతో బయలు దేరెను.

ఆ రాజు వచ్చుచున్నాడని యా పర్వతము కూడ భయపడ సాగెను. ఆ రాజు వచ్చి యా పర్వతమును తన కాలి గోటితో మీటెను. ఆ పర్వత మెగిరి దూరాన పడెను.

ఈ దొంగ యతి ఆ రాజు చెలికాడు. వానికి కథ యంతయు దెలియును. వీఁడు మొదటనే తాను వసురాజు కృపచేత బ్రతుకుచుంటినని చెప్పెను. ఆ పిల్ల ఈ సందర్భములో పుట్టినదని వారు చెప్పఁబోవుచున్నారు. ఒక్కని కద యొక్కరికి పూర్వమే తెలిసినట్లున్నది. మరి యెందుకయ్యా యింత రగడ పెంచుట యనగా –

పర్వతము. నది. దీని కది యడ్డము వచ్చుట. ఇద్దఱి యందు స్త్రీ పురుష లక్షణము. లోకములో నదికడ్డమైనచో జరిగెడి భూతముల వికారము. ఈ రెంట నడుమ నభేద ప్రతిపత్తిగా శ్లేష సాహాయ్యముతో విలక్షణమైన యొక కవితా పద్ధతిని వెలయించుటకు.

ఒక కొండ యడ్డము వచ్చుట – నది పొంగుట పాయలు వాఱుట తరంగములు లేచుట – గట్లెగపాఱుట. పశులు లేచిపోవుట – జనమిబ్బంది పడుట–ఇట్టి పరిస్థితులలో నదులు వరదలమీద నున్నప్పుడు చూచుటొక సరదా. మనమందులో కొట్టుకొని పోకపోయినచో దూరమునుండి చూచుట యొక యాశ్చర్యము. ఒక యానందము.

ఒక చమత్కారపు మాట యున్నది, స్వామీ! నక్క కుడివైపునుండి యెడమవైపునను తిర్చుట మంచిదా యెడమవైపు నుండి కుడివైపునకు తిర్చునా యని యడిగెనట.

ఒక చమత్కారియైన శాస్త్రిగారు చెప్పిన సమాధానమేమనగా 'నెట్లు పోయిననేమి మనలను కఱవకుండ పోయినచో చాల మంచిది.' అది ఆ రీతిగా పాంచభౌతికములైన విప్లవములు ద్రష్టల కాశ్చర్యజనకములు. సంతోష దాయకములు. చనిపోయిన వారికి కాదు. బ్రతికియున్నవారికి. ఈ కథలోని రమ్యత నగమచ్చుట నున్నది.

అప్పుడు పుష్పవర్షము కురిసెను. ఇంద్రుఁడు తదితర దేవనాథులతో రాజును చూచుటకు వచ్చెను. రాజేంద్రునకు నమస్కారము చేసెను. ఇంద్రుఁడు రాజును మిక్కిలి మెచ్చుకొనెను. ఇంద్రుఁడు వసురాజున కొక విమానమును బహుమానము చేసెను. ఆ విమానము ప్రతి దినమును బోలె

బంగారు నాణెములను కురియును. ఈ విమానము ముందు పుష్పక విమానము కూడ సరికాదట. అంత నింద్రుఁడు వెడలిపోయెను.

అంతట నా రాజునకు శుక్తిమతి తాను విహరించు దిగుడుబావి, కోలాహలము క్రీడా పర్వతముగా నుండెను.

అప్పుడు శుక్తిమతి గర్భవతి యయ్యెను ఆమె యొక కుమార్తెను నొక కుమారుని గనెను. కోలాహలుఁడు తన కామెయందు బిడ్డలు కలిగినందుకు చాల సంతోషించెను.

అచటి మౌను లాపిల్లపేరు 'గిరిక' యని పెట్టిరి. ఆమెను కాంతార దేవతలు ప్రోచుచుండిరి.

ఆ కోలాహలుఁడు తన కూఁతునకు సంగీతము నేర్పెను. ఈ రీతిగా నా చెలికత్తె దొంగ యోగికి ఆ పిల్లయొక్క పేరును దాని పుట్టుకయును చెప్పగా చాల సంతోషించెను.

ఈ కథయంతయు రాజు చాటునుండి వినుచుండెను కదా! ఆ రాజీకథ యంతయు విని యీ పిల్ల తన సొమ్మనుకొనెను.

దొంగమౌని యిట్లనెను. "మేము దివ్యదృష్టితో చూచితిమి. ఈ పిల్లను వసురాజేంద్రుఁడు పెండ్లియాడును." అని జోస్యము చెప్పెను. అప్పుడా చెలికత్తె "అయ్యా! ఆ రాజెప్పుడు వచ్చును, ఎట్లు వచ్చును. ఈమె నెన్నడు పెండ్లియాడును." అని యాదుర్దా పడగా నా యోగి యిట్లనెను. 'నీకంత భయముగా నున్నచో మా మంత్రశక్తిచే నా రాజు నిప్పుడే రప్పింతు'నని 'మజ్జు' యని యఱచెను. రాజు "ఇదేవేళ" యని యెదుటికి వచ్చెను. ఆ రాజును చూచి చెలికత్తెలందరు చకితలై లేచి నిల్చుండిరి. రాజు వారి దగ్గరకురాగా దొంగమౌని యాశీర్వదించెను. అచట నొక బంగారు పీటమీద కూర్చుండెను. ఆయనను జూచి గిరిక తానెంతయో కుతుక మూని యిద్దఱు నొకరినొకరు చూచుకొనుచుండిరి. వారిలో నొక చెలికత్తె పేరు మంజువాణి. ఆమె రాజును పొగడెను. గిరికను పొగడెను. మీ యిద్దరి సమాగమము చాల గొప్పగా నుండునవెను. రాజు తన నర్మసఖుడైన యా దొంగమౌనిని పొగడెను. ఆ దొంగమౌని చాటునకు వెళ్ళి తన వేషమును

మార్చి మరల నచటికి వచ్చెను. ఆ చెలికత్తెలు ఈ రాజు యొక్క స్నేహితుని జూచి వాడే వీడనుకొనిరి అంత గిరిక సిగ్గుపడి చాటునకు బోయెను. రాజామె చాటునకు పోవుటకు సంతోషపడలేదు. ఆ చెలికత్తెలు వెళ్ళి యామెను దీసుకొని వచ్చిరి. బలవంతముగా తీసికొని వచ్చిరి. అయిన నామె మరల వెడలి పోయెను. రాజామెయొక్క వెడలి పోవుట కోర్వలేక యామె పోయిన జాడనే పోయెను.

అంతట రాజు తన నర్మసఖునితో తన కామె మీదగల ప్రేమయంతయు దాని మీద దీని మీద పెట్టి యొలుకబోసికొను చుండెను. చివరికి రాజు తన యూరునకు వెళ్లెను. రాజామెను గూర్చి మిక్కిలి దుఃఖపడు చుండెను.

ఈత డిట్లుండెను. ఎందుచేత? మన్మథుడట్లు చేసెను. ఆ మన్మథుడూర కుండెనా? ఆమె గూడ నట్లేచేసెను. అక్కడ నామె యిబ్బంది పడుచుండెను.. ఆమె చెలికత్తెలు ఆమెకు కొంత యోర్పు తెప్పుటకు వనవిహారము జలవిహారము చేయించిరి.

ఈ లక్షణములో విరహ వర్ణనలలో మన్మథుని, వాయువును, చంద్రుని, తిట్టుట కావ్యములయందొక లక్షణము.

కొండటవిల్లు వేదలల కుండలి రాజట నారి యమ్ము సం
తుండట బైటిపల్లియలు దున్మినవాడట యొందు రెందు భ
గ్గుండిది నిండు పౌరుషమొకో యని గెల్చావె ముజ్జగంబు లు
ద్దండత నొక్కతుంట విలుఁదాలిచి యంటిన కందుతూపులన్."

ఇది మన్మథుని పొగడిన పద్యము. శివుని త్రిపురాసుర సంహారము వర్ణింపబడ్డది. విల్లుకొండయట! నారి ఆదిశేషువట, బాణము అనంతుడు విష్ణు మూర్తియట. మూడుపల్లియలు త్రుంచినాడట ఇది గొప్పయాయని యోయి! మన్మథుడా నీవు తుంటవిలు గైకొని మూడు లోకములు గెలువవా?

లోకత్రయీ జయోత్సేకమ్ముఁ దెలుపు నీ
ఫడగ నారాయణ ప్రథమ మూర్తి'

మన్మథుని బావుటా మీద చేపయుండును. అతడు మత్స్యకేతనుఁడు. దశావతారములలో మొదటిది మత్స్యావతారము. అందుచేత నిట్లు వ్రాయుట వాగ్గతమైన గొప్ప చమత్కారము. ఇట్లు వసుచరిత్ర కవిత్వములో వంద లుండును.

ఆ గిరిక చివరకు మూర్ఛపోయెను. ఇచ్చట నొక పద్యమున్నది. ఇది మహాప్రసిద్ధమైన పద్యము.

మోహాపదేశతమోముద్రితములైన
　　కనుదమ్ముల హిమాంబు లునుపరాదు
శ్రమబిందు తారకాగమఖిన్న కుచకోక
　　ములఁ జంద్రనామంబుఁ దలఁపరాదు
శీర్యదాశావృంత శిథిలితాసుల తాంత
　　మసియాడ పీవన న్విసరరాదు
పటుతాప పుటపాక పరిహీనతను హేమ
　　మింకఁ బల్లవపు టార్చిడఁగరాదు
లలన కానంగ కీలికీలా కలాప
సంతతాలీఢ హృదయ పాత్రాంతరాళ
పూరిత స్నేహపూరంబు పొంగి పొరలఁ
జల్లని పటీరసలిలంబుఁ జల్లరాదు.

మోహమను చీకటిచేత ముద్రితములైన కన్నులను తామరపూవులందు మంచునీరు చల్లరాదు. తామరపూవులు రాత్రిపూట ముకుళించును. వానిమీద మంచు కురిసినచో నింకను ముడుచుకొని పోవును. ఇచ్చట నామె విరహిణిగనుక విరహబాధ తగ్గుటకు విరహజ్వరము తగ్గుటకు మంచు నీళ్లుపయోగింపరాదని యర్థము.

ఇద్దే పద్య మంతయు. ఈ పద్యము యొక్క గొప్పదనము ఈ శ్లేషలలో లేదు. ఒక లోకోత్తరమైన శబ్ద చారుత్వములో నున్నది. ఈ పద్యములో భట్టుమూర్తి యొక్క శైలి పొందిన యొక యనిర్వచనీయమైన మాధుర్య సౌకుమార్యములు శబ్దశ్లిష్టత కలసిన యొక గుణము మరి యొక చోట లేదని చెప్ప వచ్చు. మరియు నీ మొదటి రెండు చరణములలోని సౌందర్యము దాని కదేసాటి

ఏ మంద మేమి సేయుద
మే మందని మందలింత మే మందము యిం
దే మందయాన నడుగుద
మేమందఅ మనుచుఁ దరళ హృదయాంబుజలై.

ఇదియొక రచన.

అంత నా చెలికత్తెలామెను విహార భవనమునకుఁ దీసికొని వెళ్ళిరి. అంత సూర్యోదయమయ్యెను. దాని వర్ణనయుండెను. మరల ప్రొద్దుక్రుంకెను. చంద్రుఁడు వచ్చెను. అంతలో నామె చెలికత్తె - దానిపేరు మంజువాణి. ఆమె వసురాజును పిలిచికొనివత్తునని వెళ్ళెను. ఇచ్చట చంద్రదూషణము కలదు.

''రా జీవాక్షులనేచు పాతకివి చంద్రా ! రాజవానీవు నీ
రాజత్వంబునఁ జక్రముల్మనియెనో, రంజిల్లి సత్సంతతుల్
తేజంబందెనొ, డిందెనో యహిభయోద్రేకంబు, తాఁజెల్ల రే
రాజై పుట్టుట రశ్మిమాత్రఫలమే, రాజౌట దోషార్థమే."

ఓయి ! చంద్రుడా ! నీవు రాజీవాక్షులను బాధించెడి పాతకివి. రాజీవము - తామరపువ్వు. చంద్రుఁడు రాజీవములకు విరోధి - ఆ విరోధము వానికెంతదూరము పోయినది ? ఆ రాజీవములవంటి కన్నులుగల స్త్రీలను గూడ బాధించుచున్నాడు చక్రము - 1. భూమి. 2. చక్రవాకపక్షి; సత్సంతతులు - 1. సత్పురుషులు, 2. నక్షత్రముల సమూహములు. అహిభయము - 1. శత్రు భయము; 2. రాహుభయము, రశ్మి - 1. కిరణము. 2. ధనము. దోషార్థమే. 1. దోషములకొఱకా ? 2. దోషమనగా రాత్రికూడ.

ఇంతులనేచు పాతకమదింతట నంతటబోదు పాంథలో
కాంతక ! నిన్ను ఘోరతమమై, ఘనమై యజహత్కళంకమై
పంతలఁబెట్టి యాఱుపది వక్కలుసేయక పూర్వపక్షపుం
గంతులకేమి చూచెదవుగా తుది నీ బహుళార్తి ఖేదముల్.

పాంథ లోకాంతక ! పాంథులనఁగా బాటసారులు. వారు భార్యలను వదలి పెట్టి యుందురు కనుక విరహులని చెప్పబడుదురు. వారికి యముని వంటివాడా! అజహత్ కళంకమై-జహత్ వదలుచున్న, అజహత్ - వదలని, వదలని కళంకమై అనగా నిత్యము మచ్చకలవాడవై యని యర్థము.

అరుపది వక్కలు - పదునాఱు కళలు; పూర్వపక్ష పుంగంతులకేమి - శుక్లపక్షమునాటి దర్శాలకేమి ! బహుళా రాత్రి భేదముల్ - బహుళ - అనేకములైన; లేదా బహుళ పక్షమునాటి ఆ రాత్రిభేదములు.

పండితులు వాదన చేయునప్పుడు పూర్వపక్షము సిద్ధాంతము నని రెండుండును. చెప్పినది సరిగా లేదని దోషములు చూపించుట పూర్వపక్షము. దోషములు నిరాకరించి విషయమును స్థాపించుట సిద్ధాంతము. ఈ శ్లేషలో ఆ చర్చాలక్షణము స్ఫురించు చున్నది.

కమలించెగాక యంగజవిరోధి శిరోధిఁ
దలకెక్కఁజాలెనే హాలహాలంబు ?
క్రాచెఁగాక పయోధికాండ ప్రకాండంబుఁ
బైకిఁ బొంగించెనే బాడబంబు
తూరెఁగాక ముకుందతుంద ప్రఘాణంబు
వెడలెనే యెదఁ గాలి విపిన కీలి ?
యడఁచెఁగాక శిలోచ్చయచ్ఛదా హంకృతు
ల్గరఁచెనే నీరుగా సురపహేతి
నీ కరణి నట్లు దయలేక లోకమేర్చు
నీ కరుణియైన యలయత్రి నేత్రమునకు
ఖర కరాలోక గాఢ నిష్ఠురతపోగ్నిఁ
బెటిలిపడ కున్కి భరమె ? కృపీట జన్మ !

కృపీటజన్ముఁడు - నీటియందు పుట్టినవాడు. కృపీటము - జలము; చంద్రుఁడు అత్రిమహర్షికన్నునందుపుట్టినాడని యొకప్రథ. అంగజవిరోధి-శివుడు.

శిరోధి - మెడ; హాలాహలము శివునిమెడను కబళించినప్పుగాని తలమీదికెక్కినదా? బాడబము సముద్రమును పొంగించినదా? ముకుందుడు - శ్రీకృష్ణుడు; తుందము - కడుపు, ప్రఘాణము ముంగిలి;

ఇదియొక విలక్షణమైన యూహ - చాల గడుసుగా చెప్పబడినది. ఇట్లు కొంతసేపు మన్మథుని తిట్టి మరికొంతసేపు చల్లగాలిని తిట్టెను. చివరకు

"ఆ జాబిల్లి వెలుంగు వెల్లికలడాయన్‌లేక, రాకానిశా
రాజశ్రీ సఖమైనమోమునఁ బటాగ్రంబొత్తి యెల్గెత్తి యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూ రాజత్క రాంభోజ కాం
భోజీ మేళవిపంచికారవసుధాపూరంబు తోరంబుగాన్."

జాబిల్లి - చంద్రుడు; రాకానిశా రాజశ్రీ సఖము - పున్నమనాటి చంద్రలక్ష్మికి చెలియైన మొగము; పటాగ్రము - చీరయంచు; కిన్నరవధువు యొక్క ప్రకాశించుచున్న చేతియందున్న కాంభోజీరాగమునకు మేళవించిన వీణాధ్వని వంటి ధ్వనియొక్క యమృత ప్రవాహముతోరమ్ముగాన్ నిండుగా నామె యేడ్చెను.

ఈయన గొప్ప సంగీతవిద్వాంసుడు. ఏ రాగమునం దేభావముండునో యతనికి చక్కగా తెలియును. అందుచేత నీ దుఃఖము కాంభోజీరాగములో నుండునని నిరూపించినట్లున్నది.

మనుచరిత్రలో ''హాటున కింతులేర్తురే కృపారహితాత్మక'' యన్న పద్యము; పారిజాతాపహరణములో "ఈసునబట్టి డెందమున హెచ్చిన'' యన్న పద్యము,

ఇందులో నీ పద్యము:

కథానాయిక లేడ్చుచున్నట్లు చెప్పబడినవి. దీనిమీద తెనాలి రామకృష్ణయ్య చమత్కారముగా నొకమాట యన్నాడని చెప్పుకొందురు.

పెద్దన్న ప్రియముగా నేడ్చెను.
ముక్కుతిమ్మన్న ముద్దుముద్దుగా నేడ్చెను.

భట్టుమూర్తి బావురుమని యేడ్చెనన్నాడట.

ఏది ఎట్లున్నను వసుచరిత్రలోని యనేక పద్యములు పెద్దన్నగారి యనేక పద్యముల ననుసరించి వ్రాయఁబడినవి.

అట్లుండఁగా వారియెదుట యెట్టనికాంతి కనిపించెను. ఏమిటయ్యా ఆ యెట్టనికాంతియనగా మంజువాణి రాజుయొక్క యెట్టని యుంగరమును దీసికొని వచ్చెను. ఆ యుంగరమును జూపించి యా మంజువాణి యిట్లనెను. "నేను చాల తొందరఁగా పోయితిని. రాజసౌధమును చేరితిని. అ రాజసౌధమును చూచితిని. ఆచట రాజుగారి కేళిసదనమును జూచితిని. అచట నెందఱో యందగత్తెలను జూచితిని. ఆ స్త్రీలు రాజునకు నిద్రలేదని చెప్పుకొనుచున్నారు. ఆ మాటలు విని నేను సంతోషించితిని. అచట నొక గొప్ప మంచమున్నది. ఆ మంచముమీద పూవులపొడియొక్క పరుపుమీదనొత్తిగిల్లి యొక చిత్రఫలకమును వీక్షించు రాజును చూచితిని. ఆ పటములోనున్నది మన చెలికత్తెయో యింకొక స్త్రీయో యని నేనచట చాటునదాగి చూచితిని ఆ రాజు మిక్కిలి బాధపడుచున్నాడు. ఆ బొమ్మతో మాట్లాడుచున్నాడు. ఓసి! ప్రియురాలా! నీ కాఠిన్యము వదిలిపెట్టుమనుచున్నాడు. నా కాబొమ్మ మన చెలికత్తెదియేయని తెలిసెను. నేను బ్రహ్మానందమందితిని. ఆ రాజు మంచమువద్ద యంత్రపుత్రికామండలి యున్నది. అనగా యంత్రములతో చేసిన బొమ్మల సమూహము. ఆ బొమ్మలు ప్రమాణము చేత సౌందర్యముచేత స్త్రీలవలెనే యున్నవి. నేనందులో నొక్కతెగా నిలుచుండి పకపకనవ్వి యిట్లంటిని: "ఓయి! రాజా! ఆ బాలికనెందుకు తిట్టెదవు. ఇంతులు తమంతతాము వరింతురా? మగ వారిని నమ్మవచ్చునా? అందులో రాజులనా?" అన్నంతలో రాజు "ఇది యే దేవతాస్త్రీయో! ఆ శుక్తిమతి యొక్క చెలికత్తెయైన మంజువాణియో!" యని యూహించి మంచముమీద నొఱగెను. నేను మన చెలికత్తె గుర్తుగానిచ్చినది నేను తీసికొనివెళ్ళినది యైన మణిహారము నాతని కంఠమునందు వేసితిని.

ఆ రాజు హారములనుఁజూచి యీహారమును నేనెచ్చటనో చూచితిని. ఈ హారమును బొమ్మలోనున్న కన్య మెడలోని హారము నొక్కటియే" అని యా హారమును సంబోధించి యిట్లనెను :

"కమనీయ ద్యుతిభామమా ! ఏమం ముక్తాదామమా సేమమా ?"
అంచు నేదేఁయో చెప్పి నన్ను రత్నపుత్రిక యనుకొనుచున్నాఁడు గదా అందు
చేత నన్నుజూచి నీవు సేమమా ? యని నన్నడిగెను. అప్పుడు నేను రాయి
యేగ యహల్య స్త్రీ యైనట్లు నేను నేనై నీ కథయంతయు జెప్పితిని. అంత
రాజు చిన్నగా నవ్వి "ఓసీ! నీ చెలికత్తెయందు నా ప్రేమను నీవే చూచితివి
కదా ? మీ గిరిక గురుజనాధీనురాలు తండ్రి యీవలె నేను గ్రహించవలె.
ఇంద్రుఁడు నా హృదయము నెఱిగి నాబదులు తాను వెళ్ళి మీ గిరికను నాకొఱకు
కోలాహలు నడుగునట. అందుచేత నేనూరకున్నాను. ఈ సంగతి మీ చెలికత్తెతో
చెప్పుమని రాజీ యుంగరమును నాకిచ్చెను. ఆ గిరికకు ఆ యుంగరము మీద
రాజుగారి పేరు చూచుటతోడనే రాజును చూచినట్లే సిగ్గుకలిగెను. అంతట ఆ
రాత్రి వర్ణనసాగెను.

ఇది నాల్గాశ్వాసముల కథ. తక్కిన రెండాశ్వాసములలో ఆ యింద్రుఁడు
వచ్చుట సంబంధము కుదుర్చుట, చివరకు పెండ్లియగుట జరుగును.

కథ తక్కువ. వర్ణనలెక్కువ. ఈ గ్రంథముయొక్క గొప్పదన
మంతయు వర్ణనలచేత శ్లేషలచేత మరి భాషాగతమైన యితర లక్షణములచేత
కొన్ని పద్యముల గడుసు రచనచేత ప్రకాశించుచున్నది. ఆంధ్ర సాహిత్య
ములో మరియు ప్రబంధములలో పద్యరచన యొక్కటి మిక్కిలి గొప్ప విష
యము. కృష్ణరాయలనాటి కవులలో నెక్కువమంది కవుల కీర్తిప్రతిష్ఠలు వారి
పద్యరచనమీద నాధారపడియున్నవి. సీసపద్యముల మీద నాధారపడియున్నవి.
ఈ గ్రంథములోని కొన్ని సీసపద్యముల మొదళ్ళు చూడుడు.

1. ఇమ్ములై మరు హజారమ్ములై పొదలుండ
   పూజలికెలు వేతె పూనవలదు
2. ఒకచాయ నవపాయపిక గేయ సముదాయ
   మొకసీమ నానా మయూర నినదము
3. తనకొప్పు నెఱికొప్పుననె పూని గౌరీ స
   మాఖ్య మించ జనించినట్టి యార్య.

4. ఈ జాలపోరాదు హేరాళము జవాది
ఈ రాలనదు చక్కనేల వలయు
5. అతులశైవలవతీశతము లీనెడు నీకు
నా యిచ్చు విమలార్ఘ్య తోయమెంత ?
6. తలిరు బ్రాయము వాని నల రాజు వలరాజు
నలరాజు తెగడు సోయగము వాని.

ఇట్లెన్నైనను జూపించవచ్చును. మరియు తక్కువ వృత్తములలో గూడ పద్యపు టెత్తుగడలు దింపుగడలు చిత్రవిచిత్రములుగా నుండును

కావ్యము మొత్తముమీద శ్లేష లెంతయెక్కువో వృత్త్యనుప్రాసములు యమకములంత యెక్కువ. వృత్త్యనుప్రాసమనగా వచ్చిన యక్షరమే మరల మరల వచ్చుచుండును యమకమనగా రెండక్షరములు గాని రెంటికన్న నెక్కువ యక్షరములుగాని మాటిమాటికి వచ్చుచుండును.

కవి నేర్పుకొలది యిట్టిరచన సౌందర్యమును, మాధుర్యమును పండించు చుండును. కవి యప్రతిభుడైనచో విసుగు పుట్టించును. భావసమృద్ధి కలిగి చేసిన పద్యరచనలో ని శబ్దాలంకారములు కవియొక్క ప్రతిభకొలది రామణీయ కమును పండించిపోయును.

కాశీ ఖండము

ఈ గ్రంథ రచయిత శ్రీనాథుఁడు ఆంధ్రభాషలో బహుగ్రంథములు వ్రాసినవాఁడు. అందులో కొన్ని గ్రంథములు నిత్యమాంధ్రులు చదువుచుందురు. శృంగార నైషధము, హరవిలాసము, భీమఖండము, కాశీఖండము-ఈ గ్రంథములు చదువని సాహిత్యవేత్తయుండఁడు. శ్రీనాథుఁడు తెలుఁగు కవిత్వములో గొప్ప ధారాశుద్ధి యనుగుణమును పద్యమునకు ప్రధానముగా స్థాపించివెళ్ళెను. భట్టుమూర్తినరసభూపాలీయమన్న గ్రంథమును వ్రాసెను. అది తెలుఁగుభాషలో నొక యలంకార గ్రంథము. అందులో బహుకవుల రచనాగుణములను జెప్పుచు శ్రీనాథుని గుఱించి యిట్లనెను - శ్రీనాథుని పదప్రసిద్ధ ధారాశుద్ధి' యని.

శ్రీనాథుఁడనగా శ్రీనాథకవి, విష్ణుమూర్తి - రెండర్థములును. పదముల చేత ప్రసిద్ధమైన ధారాశుద్ధియని కవి పరమైన యర్థము. పాదముల యందు ప్రసిద్ధమైన ధారాశుద్ధియనగా గంగానది - అది విష్ణుపరమైన యర్థము.

శ్రీనాథుఁడు కొండవీటి రెడ్డిరాజులు పాలించిన కాలమువాఁడు. ఆయన గొప్ప పండితుఁడు. హంపీ విజయనగరము వెళ్ళి యక్కడ డిండిమభట్టు అన్న యొక పెద్ద పండితునోడించి వాని ఢక్కా పగులగొట్టించెను. సామాన్యముగా తెలుఁగు కావ్యములలో నవతారికలలో కృతిభర్త యొక్కయు కృతికర్త యొక్కయు గొప్పఁదనములు సారస్వతములో రత్నములనఁదగిన పద్యములలో చెప్పఁబడియుండును. ఈయన కావ్యములలోఁ గూడ నట్లే యున్నవి. మరియు నీయననుగురించికూడ చాల పద్యములుకలవు. దేశములు తిరిగి పలుచోట్ల శత్రువులనోడించి దిగ్విజయముచేసి కవితాజయ స్తంభమును నాటిన మొదటి తెలుఁగు కవి యీయనయే యనవలయును. ఈయన పద్యము లఖండధారా సమన్వితములై యుండును. ఆంధ్ర సారస్వతములో తరువాతి తక్కిన సర్వకవులకు సీస పద్యరచనయం దీయనపెట్టినదే భిక్ష. ప్రధానముగా సీసపద్యపు పంపిణీ యీయన తిక్కన్నగారివద్ద నేర్చెను. కొంత నాచన సోమన్నవద్ద నేర్చెనుగాని సీస పద్యము నీయన తనమార్గమునఁదాను పెంపొందించెను. ఈయన తెలుఁగు

మాటలు సంస్కృత సమాసములు విచిత్రముగాఁ గుంఫించి సీసపద్యములను వందలుగా కురిపించెను.

ఇతఃపూర్వము వ్రాయఁబడిన కవులందఱు కొందఱీతనిని కొన్ని విషయములందు మించిపోయినను నీయన శిష్యులనియే చెప్పవలయును. ఈయన పద్యముల నకళ్ళే ఈయన ప్రయోగించిన తెలుగు శబ్దములే సమాసములయందు కొన్నిభాగము లీయనవే. అటువంటివాడు శ్రీనాథుఁడు.

కాని పరమసాహిత్యరస రహస్యదృష్టితో చూచినచో చాలమంది యీయనకంటె నధికులు, అంతకవియే వారు మిగిలినారు. లేనిచో నీయన దీప్తి ముందు తెలుఁగులో మరియొకకవి నిలువలేకుండెడివాఁడు. తరువాత కవియే లేడనుటకు తగినంత భాషాశక్తియు, పద్యరచనాశక్తియు విడంబించిచూపి వెళ్ళినవాఁడు శ్రీనాథుడు.

వింధ్య గర్వాపహరణము

ఒకనాఁడు నారదుఁడు తీర్థయాత్రలు చేయుచుండెను. దక్షిణ దేశమున ననేక యాత్రలుచేసి వింధ్యపర్వతమును చూచెను. అప్పుడు వింధ్యము –

స్థావరంబైన రూపంబు జలదవీథి
నావరించుచు మొగలనున్నట్లయుండ
జంగమంబైన రూపంబు సందరించి
యెదురుగా వచ్చె వింధ్య మహాధరంబు."

ఆ కొండ నారదమహర్షికి నమస్కరించి "స్వామీ ! నా యంతటి పర్వతము సృష్టిలో మఱియొకటి యున్నదా? నాతో సమానముగా చెప్పదగినది మేరు పర్వత మొక్కటియే ! అదియు నాకు నతనికి కొంత సరిపడుటలేదు. మీరు పక్షపాతములేని మహాత్ములు మాయిద్దఱిలో నెవ్వరధికులో చెప్పవలసినది." అనఁగా నారదుఁడు "ఔనయ్యా ! మేరుపర్వతముకూడ నాతో నిట్లేయన్నది. మీ యిద్దఱు గొప్పవారలే. మీ తారతమ్య మెంతవారికిని తెలియ" దనెను వింధ్యపర్వతమునకీ మాటలు గిట్టలేదు. ఆ పర్వతమిట్లన్నది :

"కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకున్
వంటక మిందునే? యితర వైభవమేల్ పడివేలు మానసం
బంటునె? మానసంబుగల యట్టి మనుష్యున కెన్నఁడేనియున్
గంటకుఁడైన శాత్రవుఁడొకండు దనంతటివాఁడు గల్గినన్."

"అయ్యో, నాకీ యీర్ష్య యొక జ్వరముగా పట్టుకొన్నది. ఇప్పుడు పోయి మేరుపర్వతము మీద దూకి నాశనము చేయుదునుకాని ఆ యింద్రుఁడు మా ఱెక్కలను త్రుంచెను సూర్యుఁడు మేరుపర్వతము చుట్టు తిరుగునఁట. నే నా సూర్యుఁడు కదలకుండ జేసెదను" అని వింధ్య పర్వతము విజృంభించి పెరిగెను. అంతలో సూర్యోదయ మయ్యెను.

ఇచ్చట శ్రీనాథుడు కొన్ని పద్యములను వ్రాసెను. వానిని కావ్యము చదివియే గ్రహించవలయును సూర్యుని రథము మింటికి లంఘించెను. ఆ సూర్య రథము అచ్చటచ్చట తిరిగి:

"నడచు రవి తేరుమింటి నన్నడిమి చక్కిఁ
బ్రగ్గనఁగఁ దాఁకె వింధ్యపర్వతము చలుఁ
గఠిన నిర్ఘోష నిర్ఘాత ఘట్టనమునఁ
బంక జాత భవాండ కర్పరము వగుల."

ఈ గీత పద్య మొక సీస పద్యము చివరిది

ఈ రీతిఁగా ననేక సంవత్సరములు సూర్యరథము నడచుటకే వీలు లేక పోయెను.

రెండు వేలును నిన్నూట రెండు యోజ
నంబు లర్ధనిమేష మాత్రంబు నందు
నంబరంబునఁ బాఱు తీవ్రాంశు రథము
నిలిచె బహుకాల మిట్టిదే నియతి మహిమ.

సూర్యుని గమన వేగ మీ పద్యము నందు చెప్పఁబడినది సూర్యరథ వేగము — అర్ధనిమేషమునకు రెండువేల రెండువందల రెండు యోజనములు వెళ్ళునఁట. నేఁటి ఈ పాశ్చాత్య ప్రకృతి శాస్త్రజ్ఞులు కూడ నక్షత్రములు, చంద్రుఁడు,

సూర్యుఁడు మొదలైన వాని గమన వేగములనుఁ జెప్పిరి. ఈ లెక్కలన్నియు మన పూర్వ గ్రంథములందుఁ గూడఁగలవు. కాని కాలము గతించి యానాటి యోజనము మొదలైన దూరమును వారు చెప్పిన వాని పరిమాణములు తెలియక యిప్పటి తెలిసిన పరిమాణములతో వానిని పొంతన పరచక యాధునికులు అవి తప్పని సులభముగాఁ జెప్పుచున్నారు.

ఇదియంతయు ఖగోళశాస్త్రవిషయము. జ్యోతిశ్శాస్త్రములో రెండు భాగములు. 1. సిద్ధాంత భాగము అనగా మానవుల జాతకములు, దేశముల జాతకములు మొదలైనవి. రెండవది ఖగోళ సిద్ధాంతములు. ఆకాశము నక్షత్రములు, గ్రహములు. గ్రహములు వాని నడకలు-ఇవి.

ఈ విషయములో నన్నయ్యగారొకరు, తరువాత శ్రీనాథుఁ డొకడు గొప్పగా తెలిసి వ్రాసినవారు.

సంస్కృతములో కాళిదాసు గొప్ప జ్యోతిర్వేత్త. ఆ కవికులగురువు యొక్క గ్రంథములలో ఖగోళ విషయము లనంతములు కలవు. తెలుఁగులో నన్నయ్యగారిలో నొండు రెండు గలవు. శ్రీనాథునిలో చాల కలవు.

ఈ కాశీఖండములోననే యెక్కువఁగా కలవు.

ఇట్లు సూర్యగమనావరోధము జరుగగా

పూచిన కొరవి పూఁబొదరింటి చందానఁ
గత్తెర యొక్కచోఁ గదలకుండె
నొకచోఁ దగుల్పడె నుపకారి కొఱటికిఁ
దరమైన రోహిణీ తారకంబు
నొకచోఁ బునర్వసు వూఁగె వృక్షముకొమ్మ
నుడివడ్డ ముత్యాల సోఁగువోలె
శయనించె నొకచోట శ్రవణ నక్షత్రంబు
గుంటిమీదటి ప్రత్తికొండువువోలె
స్వాతిచిత్తలు తోరణస్తంభయుగము
ననుకరించుచు నొక్కచో నత్తమిల్లెఁ

జిలుతవోయిన మూకుటి చెలువుఁదాల్చి
హత్తెనాకచో విశాఖ వింధ్యాద్రియందు.

కత్తెర-కృత్తికానక్షత్రము.

ఈ గ్రహములుకాని, కొన్ని నక్షత్రములుకాని బహు నక్షత్రముల గుంపులు. కృత్తికా నక్షత్రము మహాగ్నిజ్వాలల సమూహము. ఈ నక్షత్రమే శివాకృతి యందురు.

మనదేశములో ఇప్పుడు కత్తెర, శుభ కార్యములుగాని వివాహములుగాని చేయకూడదందురు. ఈ కృత్తికానక్షత్రము పూచిన యెఱ్ఱగోరింట పొదవలె నున్నదట కొరవి యనగా ఎఱ్ఱగోరింట. కొరడు ఒక యాయుధము. లేదా మ్రోడు. ఈ పద్యమంతయు నక్షత్రముల యొక్క లక్షణములను చెప్పునదే! వాటి స్వరూపములట్టివి యని.

ఇట్టి విజ్ఞానము మన దేశములో పూర్వమునందు చాల సార్వజనీనముగా నుండెడిది నేటికిని పల్లెటూళ్ళలో వృద్ధులైన రైతులకీ విషయ పరిజ్ఞాన మెక్కువ.

అపుడు దేవతలును మునులును బ్రహ్మలోకమునకు వెళ్ళి బ్రహ్మనుస్తుతించిరి. బ్రహ్మకు వీరు వచ్చిన పని తెలియును. బ్రహ్మయిట్లనెను: 'మీరు వచ్చిన పని నాకు తెలియును. కాశీక్షేత్రమున నగస్త్యుడు తపస్సు చేయుచున్నాడు. మీరు పోయి యాయన నభ్యర్థింపుడు ఆయన పూర్వము వాతాపిల్వలులను రాక్షసులను చంపినవాఁడు. అనగా వారు వారణాసీ పట్టణమునకు పోయిరి. వారణాసి యందు సర్వక్షేత్రములను సేవించిరి. అగస్త్యుని దర్శించుటకు పోయిరి, అగస్త్యుఁడు వారికి నాతిథ్యమిచ్చి వారు వచ్చినపని యడిగెను. వారు అగస్త్యుని భార్యయైన లోపాముద్రాదేవిని గూడ స్తుతించిరి. యగస్త్యునితో తమ వచ్చినపని చెప్పిరి. బ్రహ్మ తమరిని యాయన దగ్గఱకు పంపించినాడని చెప్పిరి. అగస్త్యుడు ప్రయత్నము చేయుదుననెను.

వారు వెళ్ళిన తరువాత నగస్త్యునకు కాశీక్షేత్రమును వదలుట యిష్టము లేకపోయెను. ఆయన కాశీ పట్టణమును వదలి పోవుటకు చాల కష్టపడెను.

అచ్చటి గంగ, లోలార్కుఁడు, కేశవుఁడు, విశాలాక్షి, వటుకభైరవుడు అందఱి దగ్గఱ సెలవు దీసికొనెను.

కలహంసి! రారాదె కదలి నాతోఁగూడి
 నీవేల వత్తమ్మ నెమ్మినుండి
కదళికాకాంతార! కదలిరా ననుఁగూడి
 నీవేల వత్తమ్మ నెమ్మినుండి
శ్రీ విశాలాక్షి విచ్చేయు నాతోఁగూడి
 నీవేల వత్తమ్మ నెమ్మినుండి
నాతోడఁగూడి యంతగ్రహ! యేతెమ్ము
 నీవేల వత్తమ్మ నెమ్మినుండి

రండు నన్గూడియో పరివ్రాట్టులార!
వత్సలతగల్గి మీరేల వత్తురయ్య
పరమ నిర్భాగ్యుఁడైన నా వజ్జఁబట్టి
కటకటా! సౌఖ్యజల రాశిఁగాశిఁబాసి.

ఇది సీసపద్యములో శ్రీనాథుఁడు ప్రవేశపెట్టిన యొక లక్షణము. సీస పద్యము మొదటి నాలుగు చరణములలో మొదటి సగము క్రొత్తగా వ్రాసి కడమ సగమును మొదటిచరణము యొక్క సగముతోనే నింపుట. ఈ పద్యములో అగస్త్యుని కాశీ విరహబాధ నాల్గుచరణముల రెండవ సగములలో మాటి మాటికి చెప్పుటచేత నధికముగా భాసించుచున్నది. నీవు సుఖముగా నుండి నీవెందుకు వత్తువు. అన్నమాటలో వారి సుఖము తనకు లేదన్న దుఃఖము ప్రతిచరణమునం దధికముగా కనిపించుచున్నది.

మహాకవులు తిరిగి తిరిగి చెప్పినను దానియందు భావమును నింతురు. భావము నిండియున్నచోటే మరల వాచింతురు. ఏది హృదయమును తాకునట్టి భావమో! యేదికాదో వారికే తెలియును. ఒకానొకప్పుడొక చిన్నమాట కొద్ది భావము సందర్భమునుఁబట్టి హృదయముదాక పోవును. దానిని మహాకవులే యెరుగుదురు. దీనినిచూచి తరువాతి కవులు చాల మంది నిగూఢభావ పరిజ్ఞానము లేనివారు పద్యములు దొర్లింపనారంభించిరి,

ఆ యగస్త్యుడు వదలలేక వదలలేక కాశి వదలి పెట్టెను. కాశీ నగరమును వదలిపెట్టవలసి వచ్చెనన్న భావముచేత నాయనకు కోపమెక్కువయ్యెను.

అట్టివానిని వింధ్య పర్వతము చూచెను. చూచి నమస్కరించి "నీ యాజ్ఞ యేమియో చెప్పు" మనెను. అనగా నగస్త్యుడిట్లనెను :

"వింధ్యాచలేంద్ర ! పృథ్వీభృత్కులశ్రేష్ఠ !
దక్షిణాపథము తీర్థంబులాడఁ
బోవుచున్నార మీ పువ్వుఁబోఁడియు నేను
బెద్దకాలమునాఁటి పెరువఁగాన
లావు చాలదు జరాక్లిష్టంబు కతమునఁ
బొడవెక్కనపుడుడిగెను నపుడును
నభ్రంకషములైన యానీ శిరశ్శృంగ
శృంగాటకము లిట్లు చిఱుతపఱిచి
యనఘ ! నేఁ గ్రమ్మరగవచ్చునంతదాఁక
నుండవలయు ధరిత్రిలో నొదిగి నీవు
చేయు నా యాజ్ఞ లెస్సయోఁ జేయకున్న
నెటిఁగెదవుగాక రజ్ఞాద నేల యిపుడు ?

ఇదియు సీసపద్యమే. దీనినడక యెట్లున్నది? ఏచరణమునకాచరణము తీర్చిలేదే ! సామ్యము గలిగిన భావములను మాత్రమే చెప్పుట కాదుగదా ! ఇంక నిట్టి పద్యములు శ్రీనాథునిలో చాల గలవు.

సీసపద్య మనేక ప్రక్రియలకు కవు లుపయోగించిరి. శ్రీనాథుఁడా రహస్యము తెలియనివాఁడు కాడు. ధారాశుద్ధి కలిగి ఏపాదమున కాపాదముగా తీర్చిన శ్రీనాథుని సీసపద్యములకు మోహపడెడి పాఠకులపలె శ్రీనాథుడు సీసపద్యము యొక్క గొప్పశక్తిని తెలియని వాఁడుకాడు

అగస్త్యుడు దాటిపోవుటకు వింధ్యము తలవాల్చెను. అగస్త్యుడు "నేను తిరిగివచ్చు వఱకు నిట్లేయుండు" మని యాజ్ఞాపించెను.

ఇంకేమున్నది మేరుపర్వతములేదు. స్పర్థయు లేదు. నేటిపటుకు వింధ్య పర్వత మట్లేయున్నది.

మౌని జటాధారి శివభక్తుఁడనఘమూర్తి
యెవ్వఁ డేతెంచునప్పు డత్తెత్తి చూచుఁ
గుంభ సంభవుఁడను కోర్కి. కౌనలుసాఁగ
వసుమతీధరయతఁడేల వచ్చు మరలి ?"

ఇక్కడికి కథ యైపోయినది. కాని నడుమ రత్నాలు, వజ్రాలు వంటి పద్యములెన్ని దాట వేసికొంటిమి.

ఈ కథలో నొక యందమున్నది. వింధ్యపర్వతము పెరుగుట మూల ముగా నేమైనది ? సూర్యరథగమన మాగినది సూర్యరథగమన మాగినచో నేమగును ? పవలులేదు. పక్షములులేవు, నెలలులేవు. ఋతువులులేవు సంవత్స రములులేవు. రాజ్యములు లేవు బ్రాహ్మణుల తపస్సులులేవు యజ్ఞములులేవు. దీనియంతకు గారణమెవ్వరు ? సూర్యుఁడు ఆ సూర్యరథగమనము. అది యాయువుపట్టు. అందుచేత శ్రీనాథుఁడు వింధ్యపర్వతము పెరిగినతరువాత వింధ్యపర్వతమువద్దకు సూర్యరథము వచ్చువఱకు నాలుగైదు సీసపద్యములు వ్రాసి పర్వత మడ్డగించినప్పటి దుస్థితిని పూచిన కొరవి పూబొదరింటి చందాన యన్న పద్యములో వ్రాసెను. ఇప్పుడు సూర్యునకు తెలిపి వచ్చెనుగదా! సూర్య రథము నడచుటను మరల మూడు సీసపద్యములలో వ్రాసి కథనుపసంహరిం చెను

కథయొక్క మొదలు చివరను కలుపుట యొక శిల్పము.

స్ఫటిక భూములయందు బ్రతిబింబములు చూచి
యితరాశ్వ బుద్ధి హేషిత మొనర్చు
పద్మరాగోపల ప్రస్థ భాగములందుఁ
జరమసంధ్యా శంక జాడ్యమందు
మరకత మణి శిలామధ్యంబునందు దృ
శ్యా దృశ్యమూర్తులై యలఁచుసూతు
వైడూర్య మణిమయప్రాంతములయందు
సలిలాభిలాష నౌదలలు వాంచు

గిన్నరస్త్రీలఁ జూచి లంఘింపఁ బోవుఁ
గారవంబెత్తి యుద్దామకామ వికృతి
వాయు జవములు రవితేరి వారువములు
వేల్పుగుబ్బలి ప్రస్థాన వీథియందు

ఇదియంతయు సూర్యుని రథమునకు కట్టఁబడిన గుఱ్ఱముల వర్ణన, స్ఫటికపురాళ్లు కలిగిన దేశములయందు ఆ గుఱ్ఱములు తమ నీడలు తామె చూచుకొని వేఱుగుఱ్ఱములనుకొని సకిలించును. ఎఱ్ఱని రాళ్ళచోట సంధ్యాకాలము వచ్చినదనుకొని కొంచెము నడకను మందగించును.

ఇది మేరుపర్వతమునందు సూర్యరథము పోవుచున్నప్పటి కథ.

ఆకుపచ్చ రాళ్ళయందు అనగా మరకతములందు సూర్యునిగుఱ్ఱములాకుపచ్చనివి గనుక కనపడీ కనపడవు

దేవయోనులలో కిన్నరులొక్కరు కిన్నరులు, కింపురుషులు మొదలుగా గలవారు. కిన్నరుల మొగములు గుఱ్ఱపుమొగములు. ఆ కిన్నరస్త్రీలను జూచి వారాగుఱ్ఱములను కొని వారిమీదికి పోనెంచును ఈ గుఱ్ఱములు వేల్పుగుబ్బలి ప్రస్థానవీథియందు—వేల్పులయొక్క కొండ మేరుపర్వతము. ప్రస్థానము - బయలుదేరి వెళ్ళుట.

యా అన్నధాతువునకు ప్ర అన్న ఉపసర్గ చేర్చినచో బయలుదేఱుట ప్రయాణముచేయుట యని యర్థము. 'స్థ' యనగా నుండుట; ప్రస్థయనగా వెళ్ళుట. ప్రస్థానవీథి - సంస్కృతశబ్దము. వేల్పుగుబ్బలి - తెలుగుశబ్దము. ఈ తెలుఁగు సంస్కృతములు కలుపుటలో శ్రీనాథునకున్న నేర్పు మరియొక కవికుండదు

తమతనుచ్ఛాయ మేఘములు పచ్చని వన్నె
నుభయ పక్షములనై యూఁగియాడఁ
గళ్యాలఁదెగిన సృక్వముల క్రొన్నెత్తురు
లాననంబులకుఁ గెంపా వహింప

నుడు పథంబున యందు నుండిన గతి ధార
గమన వేగంబునఁ గానఁబడగ
శుకముఖ ద్విజకోటి సులభకౌతూహల
వ్యతిషంగమనఁ జేరి యనుచరింపఁ
జిలుకలను బోలె హేమాద్రిశిఖర శృంగ
కల్పవృక్షాటవీ వాటికలఁ జరించె
మహీధరము సేయునంకిలి మానుటయును
పవజవన బాంధవుని తేరి వారువములు.

ప్రక్క నున్న మేఘములు తమతమ శరీరములయొక్క పచ్చదనముచేత పచ్చనై యా సూర్యుని గుఱ్ఱములకు ఱెక్కలవలె నుండెను. కళ్ళాలచేత నోటి సెలవులు పగిలి నెత్తురయ్యెను చివరి గీతపద్యములో బంగారుకొండ చివర నున్న కల్పవృక్షపు టడవులలో నివిగూడ చిలుకలవలె నుండెను.

ఆకాశవాహిని సైకతంబుల ఖురాం
చల టంకములు గ్రుంగ జడనుపడిన
శాత కుంభాచల స్థపుట స్థలంబున
జక్రాభిహతి వడి చాలకున్న
బహుల దూర్వాశంకఁ బ్రణత దేవకిరీట
మరకత ద్యుతులకై మరులుగొన్న
నిందు బింబముఁజూచి చెందుప్పుగలు సావి
యఱులెత్తి నాకంగ నాసపడిన
బసిఁడి గిలుకల చెరోక్కలఁ బరిఢవించి
కఠిన హుంకార మొనరించి కనకరథము
వారువంబులఁ బఱపె దుర్వారలీల
బిరుసు తహతహ వినువీథిఁ బిచ్చుగుంటు.

పిచ్చుకుంటు-అనూరుఁడు. సూర్యుని రథసారథి - ఇది తెలుగుమాట బిరుసు తహతహ వినువీథిఁ బిచ్చుగుంటు తెలుగులు సంస్కృతములు కలపుటలోని సొగసు ఈ అనూరుఁడు సూర్యుని రథాశ్వములను హుంకా

రముచేసి చేతిలోని పసిడి గిన్నెకలు చేర్చుకొనుచుఁగా కొరడా ప్రయోగించియో తాకించియో గుఱ్ఱములను నడపిన తీరు ఈ పద్యములందు వర్ణితము. ఆకాశ గంగ యొక్క యిసుకలలో గుఱ్ఱముల కాలి గిట్టలు, క్రుంగినచో శాతకుంభా చలము (బంగారపు కొండ) స్ఫుట స్థలము (మెట్ట పల్లములుగా నున్నచోటు). అచ్చట చక్రములు చప్పున పెగిలి రాకున్నచో సూర్యరథము పోవుచుండగా దేవతలు సూర్యునకు నమస్కారము చేయుదురు. వారి కిరీటములో నాకు పచ్చ మరకతము లుండును. ఆ కాంతి దూర్వాశంకన్ - పచ్చగడ్డి యన్న బుద్ధితో గుఱ్ఱము లాగినచో దారిలో చంద్రబింబము కనబడును అందులో సైంధవ లవణము రాశ్ళవంటివి, కనిపించును. అది యుప్పనుకొని ఈ గుఱ్ఱములు మెడలెత్తి దానిని నాకపోవును. ఇట్టి సమయములందు పిచ్చుకుంటు వాని నదలించి తోలును.

ఇవియన్నియు రమణీయములైన కల్పనలు. సంస్కృతములో మయూరుడన్న కవియున్నాడు. ఆయన సూర్యశతకమని యొక గ్రంథమును వ్రాసెను అది మహాప్రసిద్ధమైన గ్రంథము. శ్రీనాథునకు సంస్కృతములోని సర్వగ్రంథములు కరతలామలకములు. మయూరుడు మురారి భట్టి బాణుడు బిల్హణుడు మొదలైన కవుల యొక్క రచనలాయనకు కంఠస్థములు. వారి సమాసములను వారి భావములను శ్రీనాథుఁడు సమృద్ధిగా వాడుకొనును. ఈ పద్యములలోని భావములన్నియు మయూర మహాకవివి. కాని తెలుఁగులో వాని నిట్లు వ్రాయుట శ్రీనాథుఁడుతప్ప వేఱొకఁడు చేయలేదు.

కుబేర వృత్తాంతము

కాంపిల్య పురమునందొక బ్రాహ్మణుఁడు కలడు. అతనిపేరు యజ్ఞదత్తుఁడు. వేదవేదార్థములు చదివినవాఁడు, యజ్ఞ విద్యయందు పండితుఁడు. అతనికి కుమారు డొకడున్నాడు. అతనిపేరు గుణనిధి. వాఁడు దర్పకునితోడి జోడు సౌందర్యరేఖ. వాని కుపనయనము చేసిరి. చదువబెట్టిరి. కొంత పెరిగినాడు. జూదమాడుట కలవాటుపడినాడు. పవలురాత్రులు వాని కదేపని.

వాఁడు సజీవ నిర్జీవద్యూతముల రెంటినాడును : సజీవద్యూపమనఁగా గొఱ్ఱెలు, మేకలు, కోళ్ళు, దున్నలు ఇట్టి ప్రాణముకల జంతువుల నొడ్డియాడుట. గుఱ్ఱపు పందెములుఁగూడ వీనిలోనివే.

నిర్జీ వద్యూతమనగా చీట్లపేక, చదరంగము. లాటరీ మొదలైనవి. తాను ధనమోడినచో తల్లిని పీడించి యామె నగల తీసికొని యా డబ్బు చెల్లించు చుండును.

తల్లి బోధించు తత్పరత్వంబుఁ గలిగి
యన్న ! మీ యన్న చెప్పిన యట్లుచేయు
ధూర్తసంగతి విడువు సాధువులతోడఁ
బరిచయము సేయుమని పుత్త్రి ననుదినంబు.

అన్న యనఁగా నాన్న. నా + అన్న—నాన్న. మనము నాన్న యందుము లోకములో తల్లిదండ్రులు బిడ్డలను నాన్న యని పిలుచుట కలదు. మొదటి యన్న తల్లిబిడ్డను పిలుచుట. రెండవయన్న తండ్రినిగూర్చి చెప్పుట.

ఎడపఁదడపఁ దనూభవుం డెచటనుండు
గానరాఁడని గృహభర్త కాంతనడుగ
నింతదడవును నాయొద్ద నిచటనుండి
యరిగెఁ జదువంగనని భర్తికతివమొఱఁగు.
స్నానమాడెనె ? వార్చెనే సంధ్య? యగ్ని
హోత్రమొనరించెనే? యింతి పుత్త్రుఁడనిన
స్నానమాడెను వార్చెను సంధ్య యగ్ని
హోత్రమొనరించె ననుచును నువిదమొఱఁగు.
గొడ్డుపీఁగి కన్నబిడ్డండు కావున
నొక్కరుండ కాన నుత్పలాక్షి
ధూర్తుఁడైన వాని దుశ్చేష్టితములెల్ల
నధిపు నెఱుఁగనీక యడఁచుచుండు.

అతనికి పదునారేండ్లు దాటిన తరువాత వివాహముకూడ చేసిరి. తల్లి ప్రతిదినమును వానిని మంచిమార్గమున నుండుమని బోధించును. అన్నా! నీ తండ్రి కోపగాడు. నీ సంగతి యాయనకుఁ దెలిసినచో మన యిద్దరి ప్రాణములు మీఁదికి వచ్చును.

సచ్ఛ్రోత్రియులు సనూచానులు సోమపీ
　　థులు నైన కులముపెద్దల దలంచి
రాజమాన్యుఁడు సత్యరతుఁడు వినిర్మలా
　　చారవంతుండైన జనకుఁ దలఁచి
భాగ్యసంపదఁ బుణ్యగతి దేవతలలోన
　　నెన్నంగఁ దగియెడు నన్నుఁ దలఁచి
వేదశాస్త్ర పురాణ విద్యానిరూఢులై
　　వాసికెక్కిన తోడివారిఁ దలఁచి

చెడ్డయింటి చెదారమై శివుని కరుణ
నివ్వటిలు సర్వదేవేంద్ల నిష్టుదలఁచి
పదియు నార్వత్సరంబుల భార్యఁదలఁచి
గోరతనములు మానరా! కొడుకుఁగుజ్జ!

శ్రోత్రియులు - వేదములు చదివి నిష్ఠగా నుండెడివారు. అనూచానులు - ఆచారవంతులు; సోమపీథి - యజ్ఞముచేసి సోమమును త్రావినవాఁడు. గోరతనములు - దుర్వ్యసనములు.

ఇతనికి ఇప్పటి కిరువదియైదేండ్లు. అతని భార్యకు - పదునారేండ్లు. ఇంత వయసు వచ్చినను వాఁడు తన లక్షణములను మానలేదు. పెండ్లికాక ముందే యీ వృత్తిలో నున్నాడు. పెండ్లియైన తరువాతకూడ నిట్లే యున్నాడు.

అఖిల కళ్యాణగుణగణా యత్ర యత్ర
మామ యౌదార్య తేజఃక్షమామహితుఁడు
మాతులుండు యశోమహిమాతులుండు
తనయ! యేలయ్యె నీకొవు వినయగరిమ.

అత్తకు గణాయత్తయని; మామకు క్షమామహితుడని, మాతులుడు మహిమ చేత అతులుఁడు - మహిమాతులుఁడు. ఈ యమకముచేత కందము వచ్చినది.

ఇట్లుండఁగా నొకనాఁడు వాని తండ్రి తన యుంగరము నొక జూదరి చేతివ్రేల జూచెను.

"దర్శనంబిచ్చె నెద్దానిఁ గోమటి క్రొత్త
    పొడచూప నేతెంచి భూభుజునకుఁ,
దనకిచ్చె నెద్దానిఁ ధారాంబు పూర్వంబు
    పుణ్యకాలమునందు భూమిభర్త
తానిచ్చె నెద్దాని ధర్మ గేహినియైన
    సోమిదమ్మకు మనః ప్రేమమలరఁ
దఱిచూచి యిచ్చె నెద్దానిఁ బట్టికిఁ దల్లి
    జూదమాడిన పైఁడి సుట్టికొనిన
నట్టి నవరత్నమయమైన యంగుళీయ
కంబు యజ్ఞావభృథ పుణ్యకర్మసాక్షి
వీటిలో నొక్క జూదరి వ్రేలనున్నఁ
జూచెఁ గనురెప్ప వేయక సోమయాజి"

వైశ్యోత్తముఁడు మొదటిసారి రాజుగారిని జూడవచ్చి యా యుంగరము రాజునకు బహుమానముచేసెను. అప్పుడు ఈ యజ్ఞదత్తుఁడు రాజువద్దనే యున్నాఁడు. ఆ యుంగరము యజ్ఞదత్తునకు మొదటిసారి దర్శన మిచ్చిన దప్పుడు. ఆ యుంగరమునుఁ జూచి యజ్ఞదత్తుఁడు ప్రశంసించెఁ గాబోలు దాని నొక పుణ్యకాలమునందు ధారాంబుపూర్వముఁగా అనగా నీళ్ళతోసహా యజ్ఞదత్తునకు దానమిచ్చెను. దానిని సోమయాజి తన భార్య కిచ్చెను. జూదమాడిన పైఁడి (బంగారము) చుట్టుకొనగా దానిని తల్లి కొడుకునకిచ్చెను. (అప్పువచ్చి చుట్టుకొన్నది) అనుట లోకములో నుడికారము. అనగా నింకొక దానిని తోచనీయ లేదని యర్థము.) యజ్ఞావభృథ పుణ్యకర్మ సాక్షి - యజ్ఞములు చేసిన తరువాత

దీక్షాంత మందు సమంత్రకముగా స్నానము చేయుదురు. దాని పేరు అవభృథ స్నానము దీక్షతో నున్నప్పుడెవ్వరును స్నానము చేయరు.

యజ్ఞదత్తుఁడు వానిని పట్టుకొని యిది నీ కెట్లు వచ్చినది. చెప్పుము. అబద్ధము చెప్పితివా ? రాజుచేత దండింపింతు ననెను. ఆ జూదరి గుణనిధి యొక్క సర్వలక్షణములను తండ్రికిఁ జెప్పెను. ఇది యేమి ? యిది యొక్కటియా ? నీ కొడుకు మీ యింటిలో నున్న పళ్ళెములు గిన్నెలు సర్వమును పెట్టి జూదమాడుచున్నాడు. మీ యిల్లంతయు నేడు నిర్వస్తువుగా నున్నది.

> "అక్షధూర్తులలోన నీ యనుఁగుఁగొడుకు
> దొరయు నంతటి యక్షధూర్తుండు లేఁడు
> క్షితితలంబున యాగదీక్షితుల యందు
> గీర్తి నీయట్టి యాగదీక్షితుఁడు లేఁడు.''

ఈ పద్యములో తండ్రికి కొడుకునకు సద్విషయమున నసద్విషయమున పోటి పెట్ట వ్రాయుటచేత పద్యమునకు మంచి శోభ వచ్చినది.

సోమయాజికి పై ప్రాణములు పైన పోయినవి. మొగము గంటు వెట్టుకొని యింటికి బోయి భార్యను బిలిచి-

> అంగోద్వర్తన వేళ నీవు దరహాసాంకూరముల్ లోచనా
> పాంగ ప్రాంతముల దిగుర్ప నొక సయ్యాటమ్ము కల్పించి నా
> యంగుళ్యాభరణమ్ముఁ బుచ్చుకొనవే యా యుంగరమ్మిప్పుడీ
> శృంగారింపని చేతఁ బావకునకుం జేయన్ హవిర్దానమున్.

అంగోద్వర్తనము - అభ్యంజన స్నానము, దరహాసాంకూరములు - పిల్ల నవ్వులు; లోచనాపాంగములు - కంటికడకంటి చూపు; అంగుళి - వేలు; ఆభరణము - నగ; పావకుఁడు - అగ్నిహోత్రుడు.

అని యతఁడడుగగా నామె మాటల మీద పెట్ట నెంచెను. ఆయన పట్టు పట్టెను. ఆమె చెప్పిన యబద్ధములన్నియు రుజువయ్యెను. ఇంటిలో నున్న వస్తువులేవియు కనిపించ లేదు

చివరకా బ్రాహ్మణుడు మిక్కిలి కోపముతో కుపుత్రత్వంబు కంటె నపుత్రత్వంబు మేలు. (అనగా కొడుకు దుర్జనుఁడగుట కంటె కొడుకు లేకపోవుటయే మంచిది.) అని వానికి నివాపాంజలు లిచ్చెను. అనఁగా వాఁడు చనిపోయి నట్లు భావించి వానికి శ్రాద్ధము చేసెను. ఆ భార్యను వదలి పెట్టి మఱియొక భార్యను చేసికొనెను.

ఇంక గుణనిధి యాటలేమి సాగును? వాఁడు పోయి దేశమంతయుఁ దిరుగుచుండెను. అన్నము పెట్టిన వాఁడు లేఁడు అప్పటికే చాల దినములైన దేమో! ఆనాడు శివరాత్రి.

ఆ రాత్రి పూట నొకశైవుఁడు ఊరి బయట నొక శివలింగమును స్థాపన చేసి తానుపవసించి రాత్రి యెల్ల జాగరము చేసి ప్రతి జామునకు స్వామికి నైవేద్యములు కల్పించువాడై యచ్చటికి చేసిన వంటకములు తెచ్చెను. ఆ వాసన యీ గుణనిధి ముక్కులకు గప్పుమని కొట్టెను

ఊరి వెలుపలి శివలింగమైనను నది దేవాలయమే అపుడు గుణనిధి-గుడ్డ బిగించి కట్టి తలుపు కిట్టు లేకుండఁ ద్రోసి మోరగాఁదీసిన వాకిలిలో నుండి దూటి లోని దీపారాధన నూనెయైపోగా పేఁడె దాచిని వత్తి ఎగసన ద్రోసి యన్నమును జక్కఁగాఁ జూచుకొని యావత్తి చాలక పోగా తన కట్టిన బట్టలో సన్న పీలిక చింపి వత్తిగావేసి యేది యెక్కడ నున్నదో చూచుకొని యన్నపాత్ర చేబూని బయటికి వచ్చుచుండగా నచ్చట నిద్రబోవుచున్న వారిలో నొకరికి వీని కాలి వ్రేలు తగిలెను. అతఁడు లేచి "మ్రుచ్చు, మ్రుచ్చు" అనెను. ఈ గుణనిధి యన్నపాత్ర వదలకుండ పారిపోవు చుండెను. ఆ బ్రాహ్మణుల కేకలకు తలారులు వచ్చిరి. పారిపోవు చున్న గుణనిధిని బాణములతోఁ గొట్టిరి. వాఁడు చనిపోయెను. అప్పుడు వాని కొఱకు యమభటులు వచ్చిరి. కాని శివకింకరులు గూడ వచ్చిరి.

శివకింకరులనుఁ జూచి యమ భటులు భయపడి "యయ్యా! వీడు దుర్జనుఁడు, మీరు రా నేమి కారణ" మని యడిగిరి. శివకింకరు లిట్లనిరి: "శివ ధర్మాచారములు సూక్ష్మములు. వీఁడు అన్నము దొరకకయైననేమి శివరాత్రి యంతయు నుపవాసము చేసెను. అన్న మెత్తుకొని పోవుదమని యైన నేమి తెల్ల వారులు జాగరము చేసెను. ఎందులో నన్నము భక్ష్యములు

సమృద్ధిగానున్నవని చూచుకొనుటకైన నేమి దీపమును బెద్దదిచేసెను. అనగా దీపారాధన చేసినవాడయ్యెను. చూడవలయునన్న యుద్దేశ్యము లేకపోయిన నేమి శివపూజ కన్నులార చూచెను. చచ్చిపోవుట యెక్కడ చచ్చిపోయెను? శివాలయ పరిసరములందు చనిపోయెను. వాఁడు పూర్వజన్మమునం దెంత పుణ్యముచేసి నాడో! అనూహితముగా నిట్టికర్మలు జరిగినవి. కనుక నితనిని మేము శివలోక ములకు దీసికొని పోవుచున్నా'' మనిరి. యమభటు లేమి చేయుదురు? వెడలి పోయిరి.

శివకింకరులు గుణనిధినిఁ దీసికొనిపోయి శివునకు జూపించిరి.

శివుఁడు వానిని కళింగదేశమునకు రాజుఁగా జనింపజేసెను. వాఁడు తన రాజ్యమంతయు శివదీపములు పెట్టించెను. ఎవఁడు తన యింట శివదీపమును బెట్టడో వాని తల తెగవేయించెను.

ఈ యజ్ఞదత్తియే యనఁగా గుణనిధియే మేఘవాహనకల్పము నందు కుబేరుఁ డయ్యెను.

కృత త్రేతా ద్వాపర కలియుగములు నాలుగు ఈ నాలుగు యుగములు కలిసినచో నొక మహా యుగము. ఇట్టి మహాయుగములు కొన్ని యైనచో నొక మన్వంతరము. ఇప్పుడు మనమున్నది కలియుగము. ఇది వైవస్వత మన్వంత రము. ఇట్టి మన్వంతరములు కొన్ని కలిసినచో నది కల్పము. ఇపుడు మన మున్నది శ్వేతవరాహ కల్పము. పూర్వమెప్పుడో కొన్ని కోట్ల సంవత్సరములకుఁ బూర్వము మేఘదాహన కల్పమని యుండెను.

కల్పమునకు కల్పమునకు దేవతలు మారుచుందురు. మన్వంతరములకు కొందలు మారుదురు. ఈ గుణనిధి మేఘవాహనకల్పముతో కుబేరుడైనాడు. అతఁడే కాశీ పట్టణమున శివలింగ స్థాపన చేసినవాఁడు. అచట నతఁడు చేసిన శివపూజ ఆశ్చర్యముగా నుండెను. అతఁడు విజ్ఞానదీపమును వెలుఁగఁజేసెను. చివరకు శివుఁడు సంతోషించి వానిని నీకేమి కావలయునని యడుగగా యాజ్ఞదత్తి ''స్వామీ! మీ శ్రీపాదపద్మములు దర్శించునట్టి సామర్థ్యమ్ము కృపచేయు'' మని ప్రార్థించెను. శివుఁడతనికి దివ్యదృష్టి నొసంగెను. వాడు అనఁగా యజ్ఞదత్తుఁడు

దివ్యదృష్టి వచ్చిన మొదటి చూపుతో పినాకపాణియొక్క యెడమవైపున నొక పదు నారేండ్ల బాలికను జూచెను. ఆమె వచ్చి తన భుజము ఫాలలోచను భుజముతో నొఱయఁగా నిలువఁగా గుణనిధి యిట్లనుకొనెను :-

ఎవ్వతెయొకొ? యీ యిందుబింబానన
జగదేక సౌభాగ్య జన్మభూమి!
కమలాయతాక్షి నాకంటె నగ్గలముగా
నెటుచేసెనొకొ యీ నీ తపంబు!
పరమేశుఁ డీ బింబఫల పాటలాధర
నను మీఱ మన్నించినాఁడు మేలె?
భాగ్యంబు గాకేమి? బాలేందు శేఖరు
కృపఁగాంచె నీ రాజ కీరవాణి
యనుచుఁ గ్రేగంట నీరసం బంకురింపఁ
గినుపు కిలికించితము నాత్మఁ గీలుకొనఁగ
సవతి వీక్షించు ప్రౌఢయోషయును బోలె
బ్రాహ్మణుఁడు చూచెఁ బర్వతరాజ తనయ.

వాఁడు పార్వతీదేవినిఁ జూచి యీర్ష్యపడెను. అతఁడెన్నో యుగములు శివునిగూర్చి తపస్సు చేసెను. ఈమె యెవరురా? నాకంటె స్వామి సన్నిధిని చనవుఁగా నున్నది యని ప్రౌఢురాలైన స్త్రీ భర్తయొక్క యింకొక భార్యను చూచి యీర్ష్యపడట్లుగా పడెను.

అప్పుడు పార్వతీదేవి శివునితో "స్వామీ! వీఁడెక్కడి దురాత్ముఁడు! నన్ను కంటిచివళ్ళయందు చూచును. వికారములు పోవును. వీనికి నీవింత చనవిచ్చితివి" అనఁగా శివుఁ డిట్లనెను :

"మనమునయందు నీ నెగులు మానుము పర్వతపుత్రి! వీఁడు నీ
తనయుఁడు, నందనుల్ బహువిధంబుల ధౌర్త్యము లాచరించినం
ఏయెడ తల్లి భావమున నాదరికించిన దేవళాదళా
జన రతి భావమై పరగు భావవిలాసము లీవికారముల్"

కీలు పరికించినచో దేవతల నవలంబించు యన్నది రతిభావముగా నుండును. అనగా స్త్రీ పురుష లొకరినొకర రెట్లాశ్రయింతురో, యొక్కరన్నచో నొక్కరు ఎట్లు పడిచత్తురో, సర్వదా యొకరి నొకరు భావించుచుందురో, ఒకరు లేకుండ నొకరు బ్రతుకలేమని యెట్లనకొనుచుందురో, యట్టి తాదాత్మ్యము నట్టి తన్మయత్వమును దేవతావిషయమున పొందినప్పుడే. భక్తి పండినట్లు. వీడు నీ బిడ్డ

ఇతనికి నేను వరమిత్తును. నీవుఁగూడ వరమిమ్మనెను. అని శివుఁడు వానికి కుబేరత్వము నిచ్చెను అనఁగా వాని యెడమ కన్ను గవ్వవోలె నూగుచుండును. కుడికన్ను పల్లమై యుండును.

అప్పుడు పార్వతి యిట్లనెను :– నా సౌందర్యమునకు నీవు చుప్పనాతి తనము పొందితివిగాన నీవు కుబేరుడవగుదువుఁగాక !

కుబేరుఁడనగా బేరము–శరీరము; కుత్సితమైన బేరము కలవాఁడు. చెడ్డ శరీరము కలవాడు. అతఁడు శివభక్తుఁడు గనుక దిక్పాలకు డయ్యెను. పార్వతినిఁజూచి యీసు పొందినాడు గనుక కుబేరుడయ్యెను.

ఈ కథకును పాండురంగ మాహాత్మ్యములోని నిగమశర్మ కథకును చాల పోలిక యున్నది. ఇది శివభక్తి కథ. అది విష్ణుభక్తికథ. తెలుఁగులో ఈ గుణనిధి కథను మొదట వ్రాసినవాడు శ్రీనాథుడు. నిగమశర్మ కథ తరువాత వ్రాయబడినది.

శ్రీనాథుని రచన మధురమైనది. రామకృష్ణుని రచన ప్రౌఢమైనది.

ఈ కథలో మొదట నైదారు గీతపద్యములు కలవు. గీతపద్యములట్లు వ్రాసి వానియందు సాహిత్యముద్ర కల్పించుట సాధ్యముకాదు.

ఇచట గుణనిధికి శివలోకములు వచ్చినవి. అచట నిగమశర్మకు విష్ణుసాయుజ్యము వచ్చినది. కాని భేదమున్నది నిగమశర్మకు విష్ణుసాయుజ్యము వచ్చుటలో పూర్వజన్మ సంస్కారము హేతువుగా చెప్పబడినది.

ఇక్కడ నట్టి ప్రసక్తిలేదు కథలో పూర్వజన్మ సంస్కారమని నేను వ్రాసితిని. గ్రంథమందు లేదు. శివధర్మములు సూక్ష్మములనుటలో నున్నది.

అనఁగానే మఱుచున్నది? ఉపవాసము, జాగరము, దీపారాధనము, శివదర్శనము. మృత్యువు సర్వమును వాని మనస్సులో లేవు. మనస్సునకు, నూహకు, బుద్ధికి, అహంకారమునకు, నంతఃకరణమునకు సంబంధములేని పనులు జరిగినవి. ఆ పనులు శివభక్తికి సంబంధించినవి. శివారాధనకు సంబంధించినవి. జరిగిన వెప్పుడో శివరాత్రినాడు. అనఁగా కాలమునకు ప్రాధాన్యమువచ్చినది. తత్కాలమునకు సంబంధించిన తత్క్రియలకు ప్రాధాన్యము వచ్చినది.

ఆ సమయము నందట్లు జరుగుట కాలస్వరూపుడైన పరమేశ్వరుని సంకల్పమన్నట్లుగానైనది. ఇదియొక మహారహస్యము. ఇచ్చట మనదేదియు లేదు. అంతయు దైవసంకల్పము. శివ ధర్మము దీని మీద నాధారపడినట్లున్నది.

హరవిలాసము

ఇదియు శ్రీనాథ మహాకవి వ్రాసినదే. ఆయన వీరశైవుఁడని చెప్ప వలయును. ఆయన వ్రాసిన కొన్ని కథలు వీరశైవాచారములను వెల్లడించును. కుబేరుని కథ వీరశైవమే కదా! ఆధునికులైన కొందఱు విమర్శకులు శ్రీనాథుఁడు వీరశైవుఁడనియే వ్రాయుచున్నారు.

ఈ హరవిలాస మేడాశ్వాసముల గ్రంథము. అందులో ద్వితీయాశ్వాస మంతయు చిఱుతొండ నంబి కథ. ఇది నిస్సంశయముగా వీరశైవ కథ.

తొలుత నొక విషయమును చెప్ప వలయును. మన దేశములో ననేక దర్శనము లున్నవి. అనేక మతము లున్నవి. కొన్ని వైదికములు. కొన్ని అవైదికములు. సాంఖ్యము, యోగము, బౌద్ధమతము. ఇవి అవైదిక మతములు, తక్కినవి వైదికములే! వీరశైవ మవైదికమని చెప్ప వచ్చును. అచ్చముగా నట్లు చెప్పుటకును వీలు లేదు.

వైదిక మతములో కూడ భేదము లున్నవి

అద్వైత మతము సంపూర్ణముగా నుపనిషన్మతము. జీవుఁడు పరమేశ్వరుఁడు అనేకములైన యుపాసనలు వీనినన్నింటిని గురించి యుపనిషత్తులు చెప్పినంత గాఢముగా మంత్రము చెప్ప లేదు. మంత్రమనఁగా నాల్గు వేదములును మంత్రము, ఉపనిషత్తు, బ్రాహ్మణము. ఈ మూఁడింటికి కలిపి వేదమని పేరు. అందుచేతనే వేదమునకు త్రయీ అని పేరు.

కాని యుపనిషత్స్పర్శ లేకుండ నేమతమునకును లోతుండదు. శ్రీనాథుని వీరశైవము కొన్ని చోట్ల యుపనిషత్తులలోతు కల మతము. మరియు నీ చిఱుతొండనంబి కథ శివభక్తి శివభక్తియే. శివాచారము శివాచారమే. వానియందలి వీరత్వము వీరమే కాని యుపనిషత్తులోని కొన్ని లోతులు కల కథ.

ఈ హరవిలాసము యొక్క ప్రథమాశ్వాసములో నొక తుంబురుఁడు శపించఁబడి చిఱుతొండనంబిగా పుట్టెనని చెప్పఁబడినది.

శివుని కైంకర్యము చేయు వారిని ప్రమధు లందురు. వారిలో నొకని పేరు తుంబురుఁడు.

భారత దేశమునందు కాంచీనగర మున్నది. అచ్చట చిఱుతొండ డన్న వైశ్యోత్తముడు కలఁడు అతఁడు నిత్యము జంగమారాధనలను చేయు చుండును.

కైలాసమునందు పార్వతీ పరమేశ్వరులు మాటాడుకొను చుండగా శివుఁడు పార్వతితో బసవేశ్వరుఁడు తన కెట్టి భక్తుడో చిఱుతొండనంబి తన కట్టి భక్తుఁ డని చెప్పెను. బసవేశ్వరుఁడు ప్రసిద్ధుడు వీరశైవ మతమును స్థాపించిన వాఁడు. కర్ణాటక భాషలో కొన్ని వేల శివకీర్తనలు వ్రాసిన వాఁడు. పశ్చిమ చాళుక్య రాజ్యమునకు కళ్యాణ నగరము నందు మంత్రి శివుఁడెక్క నంది బసవయ్యగా పుట్టెనని చెప్పుదురు. ఆయన యెంత భక్తుఁడో యీయన యంత భక్తుఁడనుట చేత పార్వతి యతనిని చూడవలయునన్నది. శివుని కతని భక్తి పారమ్యము పార్వతికి చూపించవలె ననిపించినది.

అప్పుడు శివుఁడు ఇంద్రుని పిలిపించి కంచి పట్టణమున నిరువది యొక్క దినములు ఎడతెఱిపి లేకుండ వానలు కురిపించు మని చెప్పెను. అతఁడు కురిపించెను. ఆ వానల కెవ్వరు తట్టుకొన గలరు? ఆ వానలకు నిలువ లేక కంచి పట్టణమున నున్న సర్వభిక్షుకులు లేచిపోయిరి.

వానలిట్లు కురియు చున్నను చిఱుతొండడు జంగములకు సంతర్పణములు చేయుచునే యుండెను. చిఱుతొండని కుమారుని పేరు సిరియాళుఁడు. అతని దాది పేరు చందనిక.

వంట చెఱుకులు లేకున్న వాములైన
వస్త్రములు తైలమున ముంచి వహ్ని గూర్చి
వంట కంబులు వండి యవ్వారి గాగ
పెట్టు శివభక్తతతికి నంబి ప్రభుండు.

ఇట్లుండగా నావాన వెలసెను. ఈ చిఱుతొండక ఒక్కడైనను జంగమ ప్రమథునకు భోజనము పెట్టకుండ తానుతినడు అది యతని వ్రతము. తాను ఆనాడు శివారాధనము చేసి వాకిఁటవచ్చి చూచెను. ఎప్పుడతని వాఁకిట

జంగములుందురు. అనాఁ డొక్కఁడైనను లేఁడు. లోనికిఁబోయి - ఆయన భార్య పేరు తిరువెంగ నాంచి - యా మెతో తానొక శివయోగిని వెదకి తెచ్చె దనని పోయెను. ఆ మహానగరమంతయు వెదకెను. ఒక్కఁడును. కనిపించ లేదు.

ఆ యూరిబయట నొక పాడుగుడిలో నెనుబదియేండ్ల వాఁడు మిక్కిలి ముసలి, మరి యొక యెనుబదియేండ్ల ముసలి గ్రుడ్డియవ్వ పాదము లొత్తుచుఁడగా పులిచర్మము మీద పండుకొని యున్న వానిని చూచి నమస్కరించి వారిద్దఱిని తన యింటికి నాఁడు శివార్చనకు రమ్మనెను.

అనఁగా నా ముసలి "నీ వెవరవు ? నీ వెవరవైన నేమిలే, నేను వత్తును కాని నే నొక నిరాహారదీక్షలోనున్నాను. ఏడాదినుంచి యన్నము తినుటలేదు. నే నా వ్రతమున కుద్యాపనము చేయవలెను. నాకు నరమాంసము కావలయును. వాఁడు పిన్నవయసువాఁడు కావలయును. వాని తల్లి దండ్రులు వాని మాంస మును వండి వడ్డించఁగా గృహస్థును వానికొడుకును నా పంక్తిని కూర్చుండి తినఁగా నే నా వ్రతమును పూర్తి చేయుదు"ననెను.

అనఁగా చిఱుతొండఁడు తా నట్లేచేయుదుననెను.

అప్పుడు వృద్ధుడు "అది యేమయ్యా! నీవు అంగీకరించిన కాదు. నీ భార్య అంగీకరించవలయును. ఒక వేళ నీ భార్యయు నొప్పుకొనునందము. నీ కొడు కొప్పుకొనవలదా ?"

అనఁగా చిఱుతొండఁడు తన భార్యయు తనకొడుకు తనమాట కెదురా డరని తెలిపి యతనిదగ్గఱ విభూతి తీసికొనెను. తీసికొని యింటికి వెళ్ళి భార్యతో చెప్పెను.

అప్పుడు శివుఁడు మారు వేసము వేసికొని పాఠశాలయందు చదువు చున్న సిరియాలుని దగ్గఱకుబోయి వానితో నిట్ల నెను :

"అన్నా ! యీ చిఱుతొండనంబియను పాపాత్ముండు మీ తండ్రియే !
యన్ని ర్భాగ్యుఁడు జోగికొక్కరునికిన్ హాలామదోన్మాదికిన్
నిన్నుం జంపి మహేశహారముగ వండింపంగ నున్నాఁడు సం
పన్న స్నేహముతోడ నీకు నెఱిఁగింపన్ వచ్చితిం జెచ్చెరన్."

నిన్నుచంపి యొకజోగికి విందుచేయునట 'నీ తండ్రి' రాక్షసుఁడుగాని మనుష్యుఁడుకాడు. కనుక నీ వెచ్చటికైనను పారిపోయి యీ గండము తప్పించు కొనుము.

అనవుడునుం గుమార సిరియాళుఁడు వీనులు మూసికొంచు నో
యనఘచరిత్ర ! నీకు నిటులానతి యీఁదగునయ్య నీకుఁ గా
దని పలుకంగ నాకు భయమయ్యెడుఁగాక పరార్థమై తమా
ధనము వ్యయింపఁ గల్గుటగదా జననైకఫలం బెఱింగినన్."

అని యా కుఱ్ఱవాఁడు వేదాంతముఁజెప్ప నారంభించెను. అప్పుడు శివుఁడు వీఁడు తండ్రికంటె నధికుండని వానికొక మూర్ఛ తెప్పించెను.

ఆ కుమారసిరియాళుఁడు చనిపోయెను. కాని యా గురువు వాని మొగ మునందు భస్మమునలదెను. వాఁడు బ్రతికెను.

అంత చిఱుతొండఁడు ఈ ముసలియోగిని తన యింటికి తెచ్చెను అతనిని భుజముమీద నెక్కించుకొని తెచ్చెను. అతనికి తలంటిపోసెను.

అప్పుడు శివాజ్ఞచేత :

"పల్లియచోటనుండి యెల ప్రాసఁగు టద్కులు జక్కిలంబులున్
బెల్లపుటచ్చులున్ సెనగబేడలుఁ జిమ్మిలి నవ్వులుండలున్
బెల్లుగనంబి వియ్యములు పెద్దటికంబు బ్రియంబునొప్ప మే
నల్లునకుం గుమార సిరియాలునకుం గొనితెచ్చి రర్మిలిన్"

ఈ పద్యములో నాహార పదార్థములు పేర్కొనఁబడెను. శ్రీనాథుని కవిత్వములోనున్న మరియొక విశేషమేమనగా భోజనము వంకటము తినెడి కమ్మని పదార్థముల వర్ణన. కొతిమేర పచ్చిమిరపకాయలు మొదలైన వానితోడి కమ్మని వంటకములు వాని సువాసన యిట్టివెన్నియో వర్ణింపఁబడుచుండును.

శివ పార్వతులు కొడుకును చిఱుతొండ నంబిచేత చంపించి పరీక్షింప వలయును. ఆ సమయమున పార్వతీదేవి యింకొక యెత్తెత్తెను. తాను వేఱొక తాపస స్త్రీ వేషమువేసికొని వారింటికి వచ్చెను.

ఫాల పట్టికయందు భస్మ త్రిపుండ్రంబుఁ
గర్ణంబులను రాగి కమ్మదోయి
కంఠమం దిత్తడికంబఁపుఁ గంటియఁ
ఘనకుచంబులమీదఁ గావి గంత
కటి మండలంబునఁ గరకంచుఁ బట్టంబు
కుడి సంది గిరి పెండ్లికొడుకుఁ గుబ్జ
కేలఁ దామరయందుఁ గేవార వలయంబు
జడకుచ్చుమీదఁ బచ్చడపుఁ గండ
సంతరించి పదాఱు వర్షముల వయసుఁ
పచ్చిబాలెంతరాలు తాపస పురంధ్రి
నంబిభామినిఁ దిరువెంగనాంచిఁ జేరి
పాలు వోయింపు(దమ్మ పాపనికి ననియె.

ఈ హరవిలాసము శ్రీనాథుఁడు వ్రాసిన చివరి పుస్తకమై యుండవలయును. ఆయన వ్రాసిన తక్కిన పుస్తకములు నిండుగా ప్రవహించు కాల్వలవలెనుండును. ఇందులోని శైలి చాల సుకుమారమైన సౌకుమార్యములో మాధుర్యము తొణికిసలాడుచుండును.

తిరువెంగనాంచి తాను బిడ్డను చంపఁబోవుచున్నానన్న లక్షణముకూడ లేకుండ ఏ దిగులు లేనట్లుగా నామెకు పాలుపోసెను. పార్వతీదేవి దయచేత కలఁగిపోయెను.

శ్రీనాథుఁడు పార్వతినిఁగూర్చి యిచ్చట నొకమాట వాడెను. ఆమె పేరు శూలినాంచారు శూలి - శివుఁడు. నాంచారు, నాంచారి - ఈ రెండు మాటలు తెలుఁగులో పార్వతీదేవినిగూర్చి చెప్పునవి. కొన్ని కొన్ని చోట్ల నాంచారమ్మ గుడులుకూడ గలవు. నాంచారి, నాంచారు అన్నశబ్దములలో 'ఉ'కారాంతమైన శబ్దము అనఁగా నాంచారు భక్తులకు మిక్కిలి ప్రియమైన శబ్దము. గౌరు, నాంచారు ఈ మాటలు తెలుగుదేశములో శివభక్తులకు ప్రియములైన శబ్దములు.

అట్లు పాలు పోయించుకొని పార్వతి తిరువెంగనాంచితో నిట్లనెను : "ఏవమ్మా ? యూరిలో చెప్పుకొనుచున్నారు. మీ యాయన యెవడో శివ

యోగికి కొడుకును జంపి యోగిరముగా బెట్టునని. జోగులు కపటులు వారిని నమ్ముదురా ?

ఆవగింజంత భూతి మై నలఁదికొనిన
వెలఁది గుమ్మడి కాయంత వెఱ్ఱిపుట్టు
కటకటా ! యెటుల తనబుద్ధి కాటగలియ
నిసువు చంపంగనెంచెనో నీమగండు"

అనఁగా నామె తన శివభక్తి ననుసరించి మాట్లాడెను. పార్వతి లాభము లేదని వెడలి పోయెను. పిల్లవానిని పాఠశాలనుండి తీసికొని వచ్చిరి. అతనికి తలంటిపోసిరి. అలంకరించిరి. వానితోఁ జెప్పిరి. "నాయనా ! నిన్ను చంపి యొక శివయోగికి శివార్చనము చేయబోవుచున్నాము. నీకిష్టమేనా ?'' యని యడిగిరి. అతఁడు దానికంగీకరించెను.

తల్లి చన్నిచ్చులాగున వానిని తొడలపై పండుకోబెట్టెను. చందనిక తన చేతులతని తలక్రిందఁ బెట్టెను. సిరియాళుఁడు చేతులు మొగిడ్చెను. అప్పుడు తండ్రి కొడుకుతో నిట్లనెను :

''మది శంకింపకుమన్న ! మావలని ప్రేమ స్నేహవాత్సల్య సం
పద వాటింపకుమన్న ! నాలుకతుదిన్ బంచాక్షరీ మంత్రముం
బదిలంబొప్ప బఠింపుమన్న ! పరమబ్రహ్మార్థ సంసిద్ధి యి
య్యది సుమ్మన్న ! యనుంగునందన! సిరాలా ! వీరశైవ వ్రతా !''

ఈ పద్యములో పరమ బ్రహ్మార్థ సంసిద్ధి యని యున్నది. పరమ బ్రహ్మముయొక్క అర్థముయొక్క సంసిద్ధి లేదా పరమ బ్రహ్మము అను నర్థముయొక్క సంసిద్ధి. ఆ బ్రహ్మసిద్ధి శివసాయుజ్యమో శివసారూప్యమో అయినచో బ్రహ్మ శబ్దమును వాడనక్కఱలేదు. బ్రహ్మమునకు శివునకు నభేద ప్రతిపత్తియైనచో వాడవచ్చును. కాని బ్రహ్మార్థ సంసిద్ధి బదులు శివార్థకమైన శబ్దము వాడవచ్చును. వాడలేదు.

అంత తండ్రి కొడుకుమెడ తెగవేసెను. తెగిన శిరస్సు పంచాక్షరీ మంత్రమును జపించుచుండెను. ఆ కొడుకు మొగమునం దేమియు దుఃఖము లేదు, దిగులులేదు. విచారములేదు. తలిదండ్రులు సంతోషించిరి. వారి

కెట్లున్నదనగా పందెము పెట్టి గెలిచినట్లున్నది. అప్పు చక్కగా తీర్చినట్లున్నది.

మిరియము నుల్లియున్ బసుపు మెంతియు
నింగువ జీరకంబు శ
ర్కరయును జింతపండును గరాంబువు
గమ్మనినేయి తైలమున్
బెరుగును మేళవించి కడుఁబెక్కు విధంబులఁ
బాక శుద్ధి వం
డిరి సిరియాళునిం గటికి డెందమునం
దరళాక్షులిద్దఱున్.

శ్రీనాథుఁడు వంటకములు భోజనములు మొదలైన వానిని గుఱించి యెక్కువ వర్ణించును గదా! ఇది యట్టి పద్యము తరువాతి సీసపద్యము కూడ నిట్టిదియే!

ఈ రీతిగా వంట సిద్ధముజేసి యా వృద్ధ దంపతులను దీసికొనివచ్చి వారి నర్చించి చిగురుముదురు కాని నిడుపువెడల్పుఁగల యరటియాకు నడిమియీనె తీసి పఱచి కడిగి చక్కగా వడ్డించి వారిద్దరను ఆరగించి రక్షింపుడని యడిగెను!

అంత భైరవయోగి వడ్డించిన మాంసపదార్థములన్నియుఁ జూచి యిందులో తలలోని మాంసము లేదు. మా వ్రతము భగ్నమైనదని యల్లరి చేసెను. అప్పుడు చందనిక యిట్లన్నది "ఈ యోగులు తెచ్చెదు ఖెదంద నాకు దెలి యును. అందుచేత దానిని వేఱపాకము చేసితి" నని వడ్డించెను.

అప్పుడు యోగి యిట్లనెను. "నీవు నా పంక్తిని కూర్చుండక నేను భోజనము చేయను. మగబిడ్డలేని నిర్భాగ్యుని ఇంట నేను భోజనము చేయను. నేను మొదటనే చెప్పితిని. నీవు నీకొడుకును పిలిపింపుము. ముగ్గురము కలిసి భుజించెదము."

అనఁగా చిఱుతొండఁడు "నాకింకొక కొడుకున్నాఁడు వాఁడాటలకు పోయి యుండును. వాఁడు వచ్చువఱకు కూరలు చల్లనారిపోవును" అనెను.

నిజానికి చిరుతొండనికి సిరియాలుఁడొక్కఁడే కొడుకు. ఈ సంగతి తొలుత చెప్పినచో శివయోగి భోజనమునకు రాడని చెప్పలేదు. సహపంక్తిని గూర్చుండి భోజనము చేయుటకు మరి యొక కొడుకు లేఁడు. ఇంత వ్యవహారము వ్యర్థమై పోవునట్లు తోఁచెను.

అప్పుడు శివయోగి యిట్లనెను: "నీ భార్యను నీ కొడుకును పిలువు మనుము. నాలుగు దిక్కులందు పిలువు మనుము. అతఁడు వచ్చినచో సరే లేనిచో మనమే భుజింతము. లేనిచో నా యింతటి వ్రతమును నేను పాడుచేసి కొందునా?"

అనఁగా తిరువెంగనాంచి నాలుఁగు దిక్కుల నిట్లు ఎలుగెత్తి పిలిచెను.

రారా వణిగ్వంశ వారాశిహిమధామ!
రారా వికస్వరాంభోరుహాక్ష!
రారా మహాఘోర వీరశైవాచార!
రారా ఘనౌదార్య రాజరాజ!
రారా కుమార కంఠీరవేంద్ర కిశోర!
రారా సమగ్ర ధీరౌహిణేయ!
రారా మనోభవాకార రూపవిలాస!
రారా యసార సంసార దూర!
రార నావన్నెవడుగ! రారా తనూజ!
రార సిరియాల! రార నా ప్రాణ పదమ!
రార నా కుఱ్ఱ! నాజియ్య రార యనుచుఁ
జీరుఁ గా రాపుఁ గొడుకు రాజీవనయన.

అత్తన్వంగి సమస్త దిక్కులను పర్యాయ క్రమంబొప్పగా
నొత్తెం జిన్నికుమార రారయని యత్యుచ్చైశ్రుతిం జీరినం
జిత్తంబుబ్బగ వచ్చె బాలుఁడు మహాశీఘ్ర ప్రచారంబునన్
దత్తద్వ్యంజన పాకగంధ్యవయవ స్థాన ప్రతానంబుతోన్.

ఈ కథలోనున్న పట్టంతయు నీరెండు పద్యములలో నున్నది. వచ్చిన వాఁడు కూరలుగా వండబడిన మాంసము కలవాఁడు. బ్రతికివచ్చుటయెట్లు? ఇది యసంభవముకదా!

అగస్త్య మహర్షి వాతాపియను రాక్షసిని చంపెను. ఇల్వలుఁడు వానిని గొఱ్ఱెనుచేసి యా మాంసము నగస్త్యునకు వండిపెట్టెను. అగస్త్యుడు తిన్నంత సేపు "వాతాపి జీర్ణం - వాతాపి జీర్ణం" అనుచు తినెను. తరువాత నిల్వలుఁడు వాతాపిని పిలువగా వాడు రాలేదు. జీర్ణమైపోయెను. అనఁగా జీర్ణమైనచో మరల బ్రతుకుట సంభవము కాదుగాని జీర్ణముకానిచో బ్రతుక వచ్చునన్నమాట.

బ్రతుకుట యనఁగా నేమి? ఈ శరీరావయవములు సంతన పడఁగా ప్రాణములు వచ్చి యందులో చేరుట.

సంతనపడుట యెట్లు? ఎంత ప్రకృతిశాస్త్ర మహా విజ్ఞానమైనను మనుష్యులను సృష్టించుట లేదుగదా. గుండెలు మార్తువు. రక్తమెక్కింతువు. మరియొకరి యవయవములను దీసి మరియొకరి కంటింతురు మానవుల యొక్కయు జంతువుల యొక్కయు శరీరములు నిర్మింపబడుటకు స్త్రీ గర్భమందు నిక్షిప్తమైన పురుషుని రేతస్సే కారణముగా గన్పించుచున్నది. అది వట్టి భగవదధీనము. ఈ శరీరములకు భగవంతుఁడు సృష్టించుచున్నాఁడు. పెంచుచున్నాఁడు. ఇచట ప్రకృతి శాస్త్ర దురహంకారము పనిచేయదు ఆ దురహంకారము దురహంకారముగానే మిగులును. అది యితరులమీద ప్రయోగించుటకు పనికివచ్చును గాని సృష్టి చేయుటకు పనికి రాదు ప్రకృతి శాస్త్ర పరిజ్ఞాన మతుకులమారి బొంత. సృజన శక్తికలది కాదు.

దైవము యొక్క విలాసముచేత సృష్టి కలుగు చున్నది. పెరుగు చున్నది. కొంతకాలము పట్టుచున్నది. కాలముకూడ భగవంతుఁడే. వాఁడు తలచినచో కాలముకూడ నక్కఱలేదు. దీనికెన్నో యుదాహరణములు కలవు. ఇది శాస్త్ర గ్రంథము కాదుగాన వ్రాయుటలేదు.

అసలీశరీరము నిర్మింపబడవలసిన యవసరమేమి? జీవుఁడు తన కర్మ ఫలము ననుభవించుటకు ఈ శరీరముండుటతోడనే దీనిలోనికి ప్రాణములు వచ్చిచేరుచున్నవి. అవి యెచ్చటనుంచి వచ్చుచున్నవి?

నానా దిక్కులనుండి వచ్చుచున్నవి. అనగా సర్వదిశలును ప్రాణభరితములని యర్థము. పంచభూతములయందు ప్రాణములున్నవని యర్థము. జీవుఁడుగా కావలసిన ప్రాణముల లక్షణము వేఱు. అది భగవంతునికే తెలియును.

ఇవి యతీంద్రియ విషయములు అతీంద్రియ విషయములు వేదములే చెప్పఁగలవు.

సామాన్యులు మరణింతురు యోగులు సిద్ధులు మరణింతురు. వారికి పునర్జన్మ లేదు. కర్మబద్ధులైన జీవులకు ప్రాణసంపుటి చెడదు. సిద్ధులకు యోగులకు ప్రాణసంపుటి చెడిపోవును.

ఈ మహా విషయము ఇంధ బ్రాహ్మణములో కలదు. అది బృహదారణ్యకములోని చతుర్థాధ్యాయములోని ద్వితీయ బ్రాహ్మణము. అచ్చట నిట్లున్నది:

తస్య ప్రాచీదిక్ ప్రాంచః ప్రాణాః
దక్షిణాదిక్ దక్షిణే ప్రాణాః
ప్రతీచీదిక్ ప్రత్యంచః ప్రాణాః

మొదలుఁగా ఏ దిక్కు ప్రాణములాదిక్కునకు పోవును. అప్పుడు బ్రహ్మపదార్థము మిగులును.

ఈ మహా రహస్యమును శ్రీనాథుఁడీ కథ చివర ననుసంధించెను.

ఆ సిరియాలుఁడు బ్రతికెను. బ్రతుకుట యెట్లో శ్రీనాథుఁడు వేదము యొక్క సాక్ష్యమును చూపించెను.

రెండవ పద్యములో నాల్గవ చరణములోని యర్థము. కవితాగుణముతో కూడియున్నది. అనఁగా కల్పనా చమత్కార సహితముఁగా నున్నది.

అనఁగా నాపిల్లవాని యువయవములు పెట్టిన పోవుల వాసనలు వేయుచున్నవఁట.

అప్పుడు శివుడు ప్రత్యక్షమయ్యెను. వరములిచ్చెను.

భీమేశ్వర పురాణము

ఈ గ్రంథమును గూడ శ్రీనాథుఁడే రచించెను. దీనిని భీమఖండమని కూడ నందురు.

వ్యాసుఁడు కాశిని వదలి పెట్టిన కథ

పూర్వము మహర్షులందఱు కాశీ పట్టణము నందు నివసించి యుండెడి వారు. అచ్చట నుంచి వదలి పెట్టుట కెవ్వరికిని ప్రాణములొప్పెడివి కావు. తప్పని సరికివదలి వచ్చెడి వారు.

కాశి అవిముక్త క్షేత్రము. ఆనంద కాననము. అగస్త్యుఁడు పూర్వ మెప్పుడో వింధ్యాచలమును శిక్షించుట కొఱకు దక్షిణ దేశము వచ్చెను. మరల నాయన వెళ్ళుటకు వీలులేదు. ఈయన తిరిగి వెళ్ళినచో మరల నా వింధ్య పర్వతము లేచును. అది లోకమున కుపద్రవకరము.

కొన్నాళ్ళకు వ్యాస మహర్షి కాశి నుండి వచ్చెను. మహర్షులిద్దఱు కలిసి కొనిరి. వ్యాసుని మొగము వెల వెల పోవుచుండెను. అతని కన్నుల యందు దైన్యము కనిపించు చుండెను. అగస్త్యుఁడు వ్యాసునిట్లడిగెను.

లోలార్కునకు నీకు లోలోన నేమేనిఁ
　　బోటు పుట్టదు గదా మాట మాట
వెనకయ్య ఢుంఢి విఘ్నేశ్వర స్వామి
　　ధిక్కరింపడు గదా తెగువ నిన్ను
నాఁకొన్న నిన్ను మధ్యాహ్న కాలంబున
　　నరయకుండదు గదా యన్నపూర్ణ
నెపమేమియును లేక నీ యెడాటమ్మునఁ
　　బాటి దప్పఁడు గదా భైరవుండు

ఎట్టు పాసితి మిన్నేటి యిసుకతిప్ప
లెట్టు పాసితి వాస్తలం బేను కోసు
లెట్టు పాసితి వవిముక్త హట్టభూమి
యెట్టు బాసితి విశ్వేశు నిందుధరుని.

లోలార్కుఁడు శివుడు. శివునకు నీకు లోలోన స్పర్థ కలుఁగ లేదు కదా! లేనిచో మాట మాట పట్టింపు రాలేదు కదా! అని మొదటి ప్రశ్న.

అనఁగా ఆ మహర్షులును శివుఁడును ఒక పాయ వారన్న మాట. అని మరి కొన్ని ప్రశ్నలు వేసెను.

అప్పుడు వ్యాసుఁడిట్లు సమాధానము చెప్పెను.

"మేము అనగా నేనును నా మూడు వందల మంది శిష్యులు జైమిని, పైలుఁడు, సుమంతుఁడు మొదలైన వారు - మేము - భూమి యంతయు తీర్థయాత్రలు చేయుచు కాశికి వచ్చితిమి. (కాశికి వెళ్ళితిమి కాదు. అది వారి స్వస్థలమన్న మాట) ఏ శకునమున వచ్చితిమో! ఏడునాళ్ళుపవాస మంటిమి

"గేహములకేఁగి భిక్షం
దేహి యనస్వేఁట నొక పతివ్రత యైనన్
సౌహార్దంబునఁ దెడ్డెం
డాహారము పెట్టదయ్యె నా దినములలోన్."

ఏ పతివ్రతయు ఒక తెడ్డెడన్నము పెట్ట లేదట. ఈ మాట వాడుట చాల అందము. శ్రీనాథుఁడిట్టి తెలుఁగు మాటలు వందలు వాడును.

మే మేడు దినములిట్లు గంగ యిసుక తిన్నెల మీద నుపవాసములు చేసి యుండగా నాకు కోపము వచ్చినది. నా చేతిలో నున్న భిక్షాపాత్రము రాతి మీద వేసి పగులఁ గొట్టితిని. నేను శివుని గాని గంగానదిని గాని విశ్వేశ్వరుని గాని కాలభైరవుని గాని లెక్క చేయ లేదు. కాశిని శపింపఁ బూనితిని. గంగా జలమునుఁ దీసికొంటిని. శిష్యులందఱు కోప ముపసంహ రింపుమని బతిమాలిరి. నాకు కోపమాగ లేదు. కాశి నిఖిలకైవల్య కళ్యాణ నిలయము. శివుని యిల్లు.

అచట గంగ యున్నది. ఏమని శపించ వలయును? ఏమని శపించ వలయునో యాలోచించి నిర్ణయించు కొంటిని. ఆ నిర్ణయమిది.

మాభూత్త్రైపూరుషీవిద్యా
మాభూ త్త్రైపూరుషంధనమ్
మాభూ త్త్రైపూరుషీ భక్తిః
కాశ్యాంని వసతాం సదా."

ఈ కాశిలో నివసించెడు జనులకు మూడుతరాల చదువు గాని, డబ్బు గాని, భక్తిగాని లేకపోవు గాక ! యని. ఇంక శాప జలమందు కొనుటకు నా చేయి యాడలేదు.

అప్పుడు కాశిలోని సోమపీఠ సమీపాన నొక యింటిలో నుండి యొక ముసలి యామె వచ్చెను. ఆమె కేబది యేండ్లు. తల నరసినది. ఆమె వక్షోజములు జారి యున్నవి. చేతి కంకణములు ఘలు ఘలుమన కాలి మట్టియలు మ్రోత మ్రోక
చీర, దప క ందునను కాటు పెట్టి వస్త్రమును గాఢంగా
మైన చెవుల కాంతికి ఉద్దీపిత కన్నులు మిక్కిలి విశాలములుగా నుండగా వీణా ధ్వనివలె కంఠ మెత్తి "యోయి ! బ్రాహ్మణుడా ! శపించకుము. ఇటురమ్ము" అని నన్ను పిలిచెను.

"సంతస మంది యేసపుడు శాప జలంబులు పాఱజల్లి వే
దాంత వచో మహోపనిషదర్థమయిన్ శుభరూప వృద్ధ స్త్రీ
మంతినిఁ గాశికానగర మధ్యనివాసిని విశ్వనాథు శు
ద్ధాంతముదాయఁ బోయితిఁ బ్రియంబును భక్తియునుం దలిర్పఁగన్."

ఆ పిలిచినది పరమేశ్వరి యని నాకు తెలియును. ఆమె మహోప నిషదర్థ మయి. ఆమెయే మహోపనిషత్తుల యొక్క యర్థము. ఉపనిషత్తు లున్నవి. అందులో కొన్ని మహోపనిషత్తు లున్నవి. అవి యుపాసనా భాగములు. ఈమె సాక్షాత్పరమేశ్వరి. శ్రీదేవి. అందు చేత మహోపనిదర్థమయి. ఈ "మహా" శబ్దములో నున్న రహస్యమేమనగా ఆమె విశ్వనాథు - శుద్ధాంతము అనగా - అంతః పుర స్త్రీ.

నేను పోయి యామెకు నమస్కారము చేసితిని. ఆమె నన్ను చేరఁ బిలిచి యిట్లనెను. భిక్ష లేదని కాశి మీద యింత కోపము చేయరాదు? నీమనశ్శుద్ధి తెలియుటకు నీలకంఠుడిట్లు చేసెను. అంతియే కాని కాశిలో కూడేమి బాతి! తిండికి లోపమా?

"ఏడు దినమ్ములన్నమున కెడ్డము పుట్టిన యంత మాత్రలో
నేడుచుచున్న వాఁడవు మునీశ్వర! నేడునునీదు ధీరతల్
పాడఱి పోయెనే శివుని భార్యను గాశికిఁబుణ్యరాశికిన్
గాడు నొనర్పఁ జూచెదవు కంఠపుఁ గ్రోధము పెచ్చులెచ్చగన్.
క్రొన్నెల పువ్వుఁదాల్పునకుఁ గూరిమిభోగపురంధ్రి కక్కటా
యిన్న గరీలలామమునకీ పరిపాటికి సిగ్గి కోపమే
లన్న ఘటించె దోమునికులాగ్రణి! నిక్కముమవో బుభుక్షితః
కిన్న కరోతి పాప మను కేవలనీతిఁ దలఁచి చూడఁగన్."

ఆమె పరమేశ్వరి. వ్యాసుఁడంత మహర్షి నేమను చున్నది. తిండి లేక యేడ్చుచున్నావన్నది. ఈ నగరీలలామము — అనగా ఈ మహా నగరి రాజము క్రొన్నెల పువ్వు తాల్పునకు అనగా శివునకు ఈమె కూరిమి భోగపురంధ్రి. ప్రేమ కలిగిన వలపు టిల్లాలు. "బుభుక్షితః కింన కరోతి పాపం" ఆకలియైనవాడే పాపము చేయుడు? అని అర్థము ఈ మాట యెంత విచిత్రముగా నున్నది. మానవులు రాజ్యములు సిద్ధాంతములు నేటి సర్వనాగరికతయు నొక్క మాటలో చెప్పినట్లున్నదే! నీవు బ్రాహ్మణుఁడవు కానీ లే భిక్షకు రమ్ము.

అనఁగా నేనిట్లంటని :

"తల్లీ! యిన్ని దినాల కేనియు సుధాధారా రసస్యందియై
యుల్లంబున్ సుఖియింపఁజేయు పలుకెట్లో వింటి నిప్పిటిలోఁ
బెల్లాకొన్న కతాన నేనొకఁడనే భిక్షానకున్ వత్తునో
యెల్లన్ శిష్యులఁగొంచు వత్తునొ నిజం బేర్పాటుగా జెప్పుమా.

నేనొక్కడనే భోజనమునకు రానా యెల్లన్ శిష్యులను గొంచు వత్తునా యని యడిగినాడు. ఇందులో యెల్లన్ విశేషణము. శిష్యులు విశేష్యము. విశేషణమైన యెల్ల శబ్దమునకు చివర నకారముండ రాదు. ఎల్ల

శిష్యులని యుండవలయును. ఎల్ల రాజులు, ఎల్ల స్త్రీలు, ఎల్ల కామినులు అనవలె గాని ఎల్లన్ రాజులు, ఎల్లన్ జనులు అనరాదు కాని యిచ్చట శ్రీనాథుడు ఎల్లన్ శిష్యులన్ అని వ్రాసినాడు. లేనిచో గణము పోవును. ఇది శ్రీనాథుని ప్రయోగము. అందుచేత కాదనుటకు వీలులేదు. "కాదు. నీవు నాకొక్కనికే భిక్ష పెట్టెద వేని దానినే మేమందరము పంచుకొని తిని ప్రాణములు రక్షించు కొందుము."

అనగా నామె చిరునవ్వు నవ్వి యందఱను రమ్మనెను. వారందరు గంగలో స్నానముచేసి వచ్చిరి. ఆ మేడమీద సున్నము వేసిన రెండరుగు లున్నవి. వీరు పోయి కూర్చుండిరి మేము వచ్చితిమని శంభళీ జనములు చెప్పిరి. శంభళీ జనములనగా ద్వారపాలకులు; సేవకులు. ఆమె - ఒక బంగారు గొడుగు కాళ్ళకు పావలు, గిలకలు - ఒక సౌందర్యవతి తాంబూల కరండ వాహిని - యామె చేయి పట్టుకొని వచ్చి మున్ముందు గౌరవించి మమ్ము కూర్చుండబెట్టి లేత చిగురు అరటాకులు వేయించి పంక్తిపంక్తికి వచ్చి గౌరవించుచుండెను. ఆపోశనమ్ములు పట్టించుచుండెను. మే మిట్లను కొంటిమి. అన్నము వండిన పద్ధతి లేదు, పొగపు వాసనలేదు. వంటపాత్రలు లేవు ఈమె వట్టి మాటలు చెప్పుచున్నది. ముందరమాత్ర మరటియాకు లున్నవి ఆమె గంధాక్షతాది విశేషములతో పూజించెను. శాంతి పాఠములు చదివితిమి. ఏమి చేయవలయును ? నేడు కూడ నిన్నటివలె నగునను కొంటిమి. అచ్చటి స్త్రీలు మాకాపోశనములు వడ్డించిరి ప్రొద్దుపోయినది భోజనము చేయుడనిరి. మేమేమి చేయవలయును ? ఇంతలో

"పప్పును బిండివంటలును బాయసముల్ ఘృతముల్ గుడంబులుం
గుప్పలుఁగాగ జుట్టునను గూర్పఁగఁ గూడిన యేను బ్రాల తె
ల్లప్పుర భోగి వంటకము గమ్మని కాలివు సొజ్జపిండితో
నొప్పులుగా భుజించిరి బుధోత్తములంతటి చిచ్చుపెంపునన్,"

ఈ ఘట్టపంచకము శ్రీనాథుడు గొప్ప విందులు గొప్ప సంతర్పణలు జరిగెడి యాంధ్రదేశ బ్రాహ్మణ వివాహాది శుభకార్య లక్షణములు వర్ణించెను.

అందరును భోజనములు చేసిరి. ఆ మేడ నడుమనున్న పెద్దయరుగు మీద వీరందఱును కూర్చుండిరి.

ఆ సమయమునందు గౌరియు శ్రీ విశ్వనాథుఁడును బంగారపు పాదుకలు మెట్టుకొనుచు. నొకరినొకరు బుజాలు పట్టుకొనుచు నా యున్నచోటికి వచ్చిరి. వారి వెంట పరిచారిక లెవ్వరును లేరు. ముందర నందికేశ్వరుఁడు వచ్చుటలేదు. ఆ ప్రథమ దంపతులిద్దఱు తొందఱ పాటేమియు లేకుండ వచ్చిరి గౌరి యందు కారుణ్య సంపత్తి కనిపించుచున్నది. తల్లిని చూచినప్పుడు సంతోషము కలుగు చున్నది. స్వామిని చూచినప్పుడు భయము కలుగు చున్నది.

కాశి శివునకు శుద్ధాంత కాంతగాన
దానిపై నల్గి కోపపాత్రంబనైతిఁ
గాశి గౌరికి సవతియౌఁగాన నేను
దానిపై నల్గి ప్రేమపాత్రంబనైతి

అప్పుడు మేము లేచి యెదురేగి నమస్కారములుచేసి ప్రక్కలను నిలిచి యుంటిమి. పార్వతీ పరమేశ్వరులు విజయంచేసి వేదికాస్థలమ్మున కూర్చుండిరి. అప్పుడు పరమేశ్వరుఁడు కోపముతో నా దిక్కు చూచి ''ఛీ'' యని యిట్లనెను

ఓరి దురాత్మ ! నీవారమష్టింపచా
భాస ! యోజనగంధి ప్రథమపుత్ర !
దేవరన్యాయ దుర్భావనా పరతంత్ర !
బహు సంహితా వృథా పాఠపరన !
భారతగ్రంథ గుంభన పండితంమన్య !
నీవా మదీయ పత్నికి నశేష
కైవల్య కళ్యాణ ఘంటాపథమునకుఁ
గాశికాపురికి నిష్కారణంబ
శాపమిచ్చెదనని యనాచార సరణి
నడుగువెట్టిన వాఁడ వహంకరించి
పొమ్ము నిర్భాగ్య, మాయూరి పొలము వెడలి
యెచటికేన్ శిష్యులు నీవు నీ క్షణంబ.

నీవారముష్టింపచాబాస! - నివ్వరిధాన్యమును అనగా చెఱువుల ప్రక్క నీళ్ళలో వానియంతట నవి పెరిగిన వరిమొక్కల కంకుల ధాన్యము. అవి యొక గుప్పెడు దెచ్చికొని వండి తినెడివాడా! దరిద్రుడా!

యోజనగ్రంధి ప్రథమపుత - మత్స్యగంధి మొదటి కొడుకా! మత్స్య గంధిని శంతనుమహారాజు పెండ్లి యాడకముందు ఆమెయందు ఈ వ్యాసుడు కలిగెను. పరాశరునకు గలిగెను.

దేవరన్యాయ మనఁగా - అన్నదమ్ములలో సంతానము లేకుండ సోదరులు చనిపోగా వారి భార్యలందు మిగిలిన సోదరుడు కులమును నిలుపుటకు వారిని స్వీకరించుట ఇది దేవరన్యాయము ఈ దుష్టమైన భావన యందు పరతంత్రుడా!

బహు సంహిత లనఁగా సర్వ వేదములు - వాని నన్నిటిని వృథాఁగా చదివిన వాఁడా

భారత గ్రంథమును గుంఫనము చేసితిని కూర్చితిని. అందుచేత నేను పండితుడ ననుకొనెడివాఁడా!

కాశీ పట్టణము కైవల్య కళ్యాణ ఘంటాపథమ్ము - కైవల్యము నడివీథి.

ఇది సీసపద్యము. వ్రాసినది శ్రీనాథుఁడు తక్కిన సీస పద్యములవలె లేదే! ఇందులో పరమేశ్వరుని కోపమంతయు నున్నది. రౌద్రరసమంతయు వ్యజ్యమానమగుచున్నది. ఈ పద్యమున కున్నంత ప్రశస్తి శ్రీనాథుని యితర పద్యములకున్నదో లేదో తెలియదు

తెలుగు సారస్వతములో సీసపద్యమున కున్నంత విస్తారత మరియొక దానికి లేదు. ఒకానొక పెద్ద భావము తక్కిన పద్యములలో నిముడదు. ఇముడదు. సీసపద్య మెంత భావమునైనను నిమిడించికొనును. తిక్కనగారు సీస పద్యము నెంతైన చేసెను. శ్రీనాథుడు తన పెక్కు సీసపద్యములందు తన ధారచేత తనసమాసగుంఫనచేత నొక హద్దులలో పెట్టెను. తరువాతి కవులు ఆ సీసపద్యరచనకు మోహపడి సీసపద్యము యొక్క విశ్వరూపమును మరచిపోయిరి.

39949

"పోక నడగొట్టి తేనియు
రాకింతుఁజుమీ మొగంబు రాచట్టు పయిం
శ్రీకాశిక నిందించిన
నీకింతట నేలపోవు నీచచరిత్రా!''

నీవు వెళ్ళకపోయితివి. నీ మొగమును రాచట్టుమీద రాకింతును. ఇచ్చట శ్రీనాథుడు రాకించుటన్న ధాతువును వాడెను. ఈ సందర్భమును బట్టి రాయు అన్న యర్థము చేసికొనవలయును.

శ్రీనాథుఁ డిట్టి తెలుఁగు ధాతువు లెన్నియో వాడెను. పెక్కు తెలుఁగు పలుకుబళ్ళు వాడెను. వాని నన్నింటిని కృష్ణరాయల సభలోని క వు లం ద రు చక్కగా వాడుకొనిరి.

అని శివుఁడనగా ఎట్టి మాటలనెను. చెవుల కొనరని మాటలనెను (అన్నది పరమేశ్వరుఁడు. అనిపించుకొన్నది భగవంతుడైన వ్యాసుఁడు. ఏమి చమత్కారము! తక్కినవట్లుండి భారత గ్రంథ గుపంన పండితంమన్యుడా? అనటయా' అన్నవాఁడు శివుఁడు గనుక సరిపోయినది. శివుఁడు గనుక అనగలఁడు. ఆయన కి భారతము లెక్కయేమి! వేదములే లెక్క లేదాయె! ఆయన పేరు పశుపతి పశువునకు రెండర్థములు - ఒకటి ప్రాణులు, రెండు వేదములు. 'పశవో వై ఛందాంసి' అని వేదము.

నేను కాశి వదలిపెట్టి వచ్చుచుంటిని. నేనా దుఃఖమునకు అ గుండెపిగులు నకు నేమి కావలయును? అప్పుడు పార్వతీదేవి నన్నుఁ జూచి యిట్లనెను :

వెఱవకుమో కుమార, పదివేల విధంబులనైన నిన్నుఁ నే
మఱవ మభేదకుం జనుట మాని సుఖంబున దక్షవాటికిన్
దుఱఁ గలిగొన్న సమ్మదము తో గమనింపుము భీమనాయకుం
డఱగఱ లేనివేల్పు నిఖిలాభ్యుదయంబులు నీకు నయ్యెడున్.

తుఱఁగలికొన్న - ప్రకాశమును పొందిన.

పార్వతి వ్యాసుని ద్రాక్షారామమునకు వెళ్ళుమనియెను. పార్వతి యీ మాటలు వ్యాసునితో శివునకు తెలియకుండ జెప్పెను. ఇతఁడు కాశి నుండి వెడలి పోవునప్పుడు చెప్పెను.

పూర్వము మన దేశమునందు సవతి కయ్యము లెక్కువగా నుండెడివి. వాని పద్ధతులుకూడ మన కావ్యములం దధికముగా నుండెడివి. జానపద గేయము లలో గంగాపార్వతుల, రుక్మిణీసత్యభామల కయ్యములు పెక్కుగా నుండెడివి. ఈభావమును పురస్కరించుకొని చాలమంది వ్రాసిరి. శ్రీనాథుఁ డిచ్చట ఈ భావ మునకు ప్రాధాన్యమిచ్చెను.

ఇచ్చట వ్యాసుఁడు కాశీ వెడలివచ్చి ద్రాక్షారామమునకు వచ్చి యచ్చట నున్న యగస్త్యమహామునితో నీ కథ చెప్పి యిట్లనెను :

"అనవధానత యావగింజంత సూవె
పర్వతంబంత యపరాధభరము కొలిపి
కాశి వెడలంగ మొత్తినఁ గాసిఁబొంది
తిరుగుచున్నాఁడ నిదె యేను దిక్కుమాలి.

అనవధానత - అశ్రద్ధ, మన యశ్రద్ధ ఆవగింజంత. శివుఁడు దానిని పర్వతంబంత చేసినాఁడు.

అని వ్యాసుఁడు కాశిలోనున్న దేవతలను గురించి యీ మాట చెప్పి నాఁడు.

కడు దయాళురు దేవతాగణము నెల్లఁ
గాలభైరవు చిత్తంబు కఠినపాక
మీరసము పెద్దఢుంఠి విఘ్నేశ్వరునకుఁ
గాశి మనబోంట్ల కెల్లనుఁగాని బ్రతుకు.

ఈ పద్యము చాల చిత్రమైన పద్యము. కాశిలో సర్వదేవతలు కలరు. అందఱు దయావంతులట! ఈ మాటలో పార్వతీదేవి యున్నది. కాలభైరవుని చిత్తము కఠినపాకము. ఢుంఠి విఘ్నేశ్వరునకు ఈరసము పెద్ద. ఈరసమునగా నీర్ష్య. కాలభైరవుని చెప్పెను. ఢుంఠిని చెప్పెను. ఒకటి చెప్పకుండ వదలి పెట్టెను. ఆ వదలిపెట్టినది శివునియొక్క లక్షణము. ఆయన చాల కోపి యనుట. ఆయన యావగింజంత యశ్రద్ధను పర్వత మంతజేయునని చెప్పినాఁడుకదా!

శివుని పేరెత్తకుండ వ్యాసుఁడు తన భావమును చెప్పెను. చివరికేమనె ననగా

కాశీ మనబోంట్ల కెల్లను గాని బ్రతుకు.

మన మందఱము ఋషులము. తపస్సు చేయుదుము. అప్పుడప్పుడు మనకు కోపమువచ్చును. మన మెవ్వరినైన శపింతుము. ఇవతల మన మాడినది యాట పాడినది పాట. ఆ కాశిలో మనకట్లు కుదురదు. పైన శివుఁడున్నాఁడు. మనము చేసినపని యాయన కిష్టమగునునో కాదో; కానిచో మన బ్రతుకులు బండలెక్కినట్లే. మన మొగములు రాచట్టులమీద రాపించును.

ఇట్టి వలపోతయంతయు నీ రెండు పద్యములక్రింద నున్నది. ఈ పద్యములలో నిదియంతయు ధ్వని. ఇట్లు వ్రాయుట చాల కష్టము.

తన మనోభావములన్నియు చెప్పుటకు వీలులేదు. మనసేమో బాధపడుచున్నది. ఒకటి రెండు మాటలకన్న నెక్కువచెప్పరాదు. తాను చెప్పదలచుకొన్నదా రెండుమాటల వలన వ్యక్తము కావలయును ఇంతియే.

శ్రీ కాళహస్తి మాహాత్మ్యము

తిరుపతి దగ్గఱనున్న మహాక్షేత్రము శ్రీ కాళహస్తి. ఆ యూరి పేరు పట్టి కాళహస్తి కాదు. శ్రీ కాళహస్తి. శ్రీయనఁగా సాలెపురుగు. కాళమనగా పాము. కాళాహి. హస్తియనగా ఏనుగు. ఒక సాలెపురుగు, ఒక పాము, ఒక యేఁనుగు. ఈ మూఁడును నెప్పుడో పూర్వయుగములందు నక్కడ శివ సాయుజ్యమును పొందెను. అందుచేత నా యూరునకు శ్రీకాళహస్తి యన్న పేరు వచ్చినది. ఈ మహాగ్రంథము వ్రాసిన యాయన పేరు ధూర్జటి.

ఆయన జన్మస్థలము, నివాస స్థలము శ్రీ కాళహస్తియని చెప్పుదురు. ఆయన శైవుఁడు.

ఆయన కవిత్వము మధుర సుకుమారము. ఒక చాటువున్నది. "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కులకేలఁగల్గెనో యతులిత మాధురీ గరిమ...." మొదలైన పద్యము. ఆయన మాటలందు సాటిలేని మాధుర్యమున్నదని సర్వజను లంగీకరించిరని యర్థము.

ఈ ధూర్జటి వ్రాసిన రెండు గ్రంథములు నేడు ప్రశస్తిలోనున్నవి. 1. ఈ శ్రీ కాళహస్తి మహాత్మ్యము. 2. శ్రీ కాళహస్తీశ్వర శతకము. కొన్నిచోట్ల గ్రంథమునకంటె శతకమునకే యెక్కువ గౌరవము కలదేమో; అభిమానము మాత్రము నిస్సందేహముగా పలుమందికి శతకమునందే కలదు. మన యాంధ్రభాషలో ననేక శతకములుకలవు. ఈ శతకమును వాని యన్నింటిలో తలకట్టు మానికముగా మన్నించుటకలదు. తెలుఁగులో చాల గొప్ప శతకములు అనగాఁ మహాకావ్యములతో తులతూగగలవి కలవు. వానిలో ఆంధ్ర నాయక శతకమొకటి ఈ శ్రీ కాళహస్తీశ్వర శతకము ఆంధ్ర నాయక శతకముకంటె చాల పూర్వము. చాల శతకములున్నవి. గద్య శతకములున్నవి వీరనారాయణ శతకమని యొకటికలదు దాని నెక్కు మంది యెఱుగరు. అది యాధునికమైన శతకము. అది వేఱు మాట.

చెలదిపుర్వు కథ

కృతయుగమునందు సాలెపురుగొక్కటి కలదు. అది, గొప్ప వాస్తుశిల్పి. దానికి శివపూజ చేయవలయునని యూహ కలిగెను.

నేఁడు కాళహస్తి క్షేత్రమున్నచోటు ఆ యుగములో పట్టి యడవి. శ్రీశైలము నట్టిదియే!

శివలింగములు కొన్ని సహజోద్భూతములు. తరువాత తరువాత స్థాపితములై యాలయములు నిర్మింపఁబడినవి. ఆ మొదటి పట్టి మహాసముద్రములనుండి భూమి యేర్పడినప్పుడు ఘనీభవించినప్పుడు కొన్ని కొండల మీద మరికొన్నిచోట్ల సహజముగా దేవతాకృతు లేర్పడి యుండెను. ఈ శివలింగములు భూమి పుట్టుకతోనున్నవి. అవి సహజోద్భూతములు. శ్రీ కాళహస్తీశ్వర లింగము, శ్రీశైల మల్లికార్జున లింగము, కాశీ మహానగరమునందలి శ్రీ విశ్వేశ్వర లింగము మరియు కొన్ని లింగములు భూమితో నేర్పడినవి. ఇవి యనాది శివమూర్తులు. తరువాత తరువాత జనులు వాని చుట్టు నాలయములుకట్టి పూజ లారంభించిరి.

ఇది యొకటి, రెండవది సాలెపురుగు దానికి విజ్ఞానము కలుగుట

కొన్ని మతములవారు ఆత్మయే లేదందురు. కొన్ని మతములవారు ఆత్మయనునది మానవులకే యుండునందురు. మన మతము పరమేశ్వరుడు సర్వాంతర్యామి యనును. ఎందు ప్రాణమున్నదో అందు వివేకమున్నది. వివేకమనఁగా జ్ఞానముయొక్క లక్షణము. ఆత్మలేకుండ ఈ జ్ఞానముండదు. అందుచేత చెలది పుర్వునకుగూడ జ్ఞానమున్నది. దాని కాత్మయున్నది. అది శివునకు పూజచేయవలెననుకొనెను.

అది మహాటవి, ఆ పురుగు స్వామికి
ప్రాకారములు గోపురమ్ములు కొలువు కూ
టములు, నర్తన మందిరములు. కోశ
గేహము ల్పండిళ్ళు. కేళీ నివాసంబు
లంతః ప్రదక్షిణాయతన పీథి

యుపహార భోగమంటపము, గర్భగృహంబు
పరిణయ హేమ వైభవ నిశాంత
మంతఃపురంబు, కక్ష్యాంతరంబులు జాల
కంబులు, మేడలు గరుణతోడ
నిభముఖానలజాత చండీశ పుండ
రీకలోచన మాతృకాలోక నయన
దక్షిణామూర్తి వటుకాది దైవతముల
నిలయములు గట్టి నత్యంత నిష్ఠతోడ.

ఇభముఖుడు - విఘ్నేశ్వరుఁడు, అనలజాతుఁడు - అగ్నిహోత్రుని కుమారుడు కుమారస్వామి ; వటుకుడు - కాలభైరవుఁడు. వీరందరకు ఇవి యన్నియు గట్టెను. ఇచ్చట నొక చిన్నప్రశ్న. అది కృతయుగము. అది మహాటవి. జనమేతక్కువ. దేవతల నిట్లు కొలుతురన్న జ్ఞానమేలేదు. ఈ సాలె పురుగునకు నీ జ్ఞానమెట్లు కలిగెను ? దీనికొక్కటియే సమాధానము. పూర్వ జన్మ సంస్కార విశేషము. అనంత యుగము లనంతములు. ఈ సృష్టి యట్లే జరుగుచున్నది. ముక్తిపొందని జీవులందఱు మరలమరల నుదయింతురు, వారికా పూర్వజన్మ సంస్కారములుండును. ఇది మన మహాసిద్ధాంతము.

నేనీ వ్యాఖ్యానములు వ్రాయుచు వలసినచోటనెల్ల ఇట్టివిషయములు చెప్పుచున్నాను. ఇవి చాల యవసరము. మన పూర్వకవులందఱు వీనిని విశ్వసించినవారు గాన నాయాకథల నట్లట్లు వ్రాసిరి. ఈ మహాసిద్ధాంతములు లేనిచో పరమార్థమున నివి వట్టి పిచ్చికథలగును.

ఇట్లు కట్టిన ప్రాకారాదులు
ప్రాతఃకాల తుషారశీకరచయప్రాప్తిన్ లసన్మౌక్తికో
పేతాగారములట్లు చెల్వొసఁగి, తద్బిందుచ్ఛటాజాత ఖ
ద్యోతచ్ఛాయలఁ గొంతసేపు బహు రత్నోదీర్ణ గేహంబులై
లూతాకల్పిత తంతుసద్మములు వొల్పుం జెప్పఁ జిత్రంబులై.

ఈ దారములతోడి గుళ్ళుగోపురాలు ప్రాతఃకాలమునందలి మంచు బిందువులవలన మౌక్తిక - ముత్యములతో, ఉపేత - కూడు కొన్న, ఆగారములు -

ఇళ్ళవలెనున్న వట। ఆ మంచుబిందువులలో ప్రతిఫలించిన ఖద్యోతచ్ఛాయలచేత అనఁగా సూర్యకిరణములచేత రత్న గేహములవలె నున్నవట. తంతు సద్మములు దారపు మేడలు. లూత - సాలెపురుగు. చెలదిపుర్వు మర్కటక కీటకము; ఇవి దాని పేర్లు.

కాని వట్టి యడవికదా! రాత్రులందు రివ్వుమని గాలివీచును. ఈ మేడలు పడిపోవును. దారాలు తెగిపోవును. ఆ చెలదిపుర్వునకు వేఱుపని లేదు. గాలికి తెగిపోయిన పోగులు, జారినపోగులు నెప్పుడు నదికించు చుండును.

అనగా నేమని యర్థము — ఆ పురుగునకు నిత్యము శివపూజయే. శివసేవయే!

ఇట్లుండగా శివునకు దాని నియమమును పరీక్షింపవలెనని పుట్టెను. ఆ శివస్థలమునందు నిత్యముగా దీపమొకటుండును. ఈ దీప మెచ్చటిదన్న ప్రశ్న. అడవులలో కొండలలోనున్న యిట్టి దేవతామూర్తులకు నెవడో యెంతదూరము నుండియో వచ్చి వారానికొకసారి పదునాలు కొకసారి కానిచో నెలకొకసారి దీపారాధనచేసి పోవుచుండును. ఇది యోగసిద్ధమగు వృత్తాంతము. [illegible] ఈ సహజోద్భూతమైన దేవతామూర్తుల దగ్గఱ చర్మచక్షుస్సులకు గనవడని నిత్యాగ్నిహోత్రములు, నిత్యదీపములు నుండునేమో! స్వామి యా దీపజ్వాల మండించి చెలదిపుర్వు కట్టిన సర్వసౌధములను తగులబెట్టెను. ఆ చెలదిపుర్వు తన యింతపని వృథాయగుట జూచి యిట్లనుకొనెను.

> ''ఇది పెక్కేడులు పట్టెన్
> 'సదనంబులుగట్ట నాకు శంభునికొఱకున్
> దుదిఁ గుమ్మరి కొకయేఁడును
> గుదెకొక పెట్ట' న్నమాటకున్ సరివచ్చెన్.''

పాపమది యెన్నోయేండ్లు కష్టపడి కట్టినది. ఇచ్చట కుమ్మరితాను, గుదియకాడు శివుడు. ఆ చెలదిపుర్వునకు తెలియదా? కాని స్వామియందు దోషము నిరూపించుట దానికిష్టములేదు. ఈ లోకములక్షణము ఆ దోషమును ప్రక్కవారి మీద పెట్టుదురు.

ఈ పని యంతయు దీపము చేసినది. దీనిని మ్రింగుదునని యా పురుగు నిశ్చయించెను. దీపమును మ్రింగుట యనఁగా నేమి? అది అగ్నిహోత్రము కదా! దానిని మ్రింగుట యనఁగా దానిలో పడి చచ్చుటయే!

అట్లు చేయఁబోవు చుండగా స్వామి ప్రత్యక్షమై నీ భక్తికి మెచ్చు కొంటిని. నీకేమి కావలయునని యడిగెను. ఆ పురుగు తనకు కైవల్యము నిమ్మని కోరెను.

కైవల్యమనఁగా మోక్షమని చెప్పుదురు. కాని కేవల శబ్దము మీది తద్ధిత కైవల్యము. కేవలమనగా నేమి? నురి యొక దాని యంటు సొంటు లేని లక్ష ణము; కేవల తార్కికుడు; తర్కశాస్త్రము తప్ప వానికింక నేమియు తెలియ దని యర్థము. అట్లే కైవల్యమనగా ప్రపంచకముతో సంబంధములేని పంచేంద్రి యములు, మనోబుద్ధి వాక్కులు, సత్త్వరజస్తమో గుణములు మొదలైన వేవియు లేని శుద్ధ బుద్ధాకారము సాక్షాత్మివైక్యము. ఇది కైవల్యము. శివుఁడా పురుగును తనలో చేర్చికొనెను.

ఎక్కఁజూచినన్నిటిము నిర్జర దానవ మానవాహిపుల్
మ్రొక్కుచు సన్నుతించు రవముల్ ధ్రువమండలవీథి నిండఁగా
దిక్కులు ముంచుకొన్న తన తేజము లోపల నూర్ణ నాభమున్
గ్రక్కునఁ గూర్చెఁదన్మయముగా శివలింగము భక్తలోలతన్.

దేవతలు ఋషులు మ్రొక్కు చున్నారు. అట్టి తన తేజముతో – నూర్ణ నాభమనఁగా నీ చెలదిపురుగు – స్వామి దానిని చేర్చికొన్నాడు.

కాలసర్ప హస్తుల కథ

సాలెపురుగు కథ కృతయుగము లోనిది. ఈ కథ త్రేతాయుగములోనిది. ఈ యుగములు ఇప్పుడు జరుగుచున్న మహా యుగములోనివో పూర్వ మహా యుగములోనివో చెప్పబడ లేదు.

పూర్వ కథలో సాలెపురుగు యొక్క కథ చెప్పబడినది. అది పట్టి పురుగు. దానికే జ్ఞానము భక్తియు నున్నప్పుడు ఈ కథలో నున్న సర్పమునకు

నేనుఁగునకు జ్ఞాన భక్తులెందు కుండ రాదు ? పరమేశ్వరుఁడంతర్యామి. ఆయన యొక్క స్పర్శ లేకుండ ప్రాణమే రాదు. ప్రాణమున్నప్పుడు తగిన జ్ఞానము మొదలైనవి యుండును. తత్తజ్జంతువుల శరీర ప్రమాణములు వాని యవయవములు వానికనురూపముగా నుండుము. అందుచేత నొక జంతువులో జీవుడున్నాడు. ఒక జంతువులో జీవుడు లేడను కొనుట వివేకశీలి చేయడు. మనుజులలో నెక్కువ వివేకులున్నారు గనుక మనుజునిలో మాత్రమే జీవుఁడుండును. ఇంత వివేకములేని జంతువులలో నుండడు అనుకొనుట కర్మ సిద్ధాంత మెఱుగని వారనుకొన వలయును. ఆ జంతువులా జన్మ యెత్తిన దనఁగా వాని వాని పూర్వజన్మ సంస్కారములే :

వివేక తారతమ్యమునుఁబట్టి జీవుని లేమియు నిర్ణయింతుమేని కొందఱు మనుజులలో జీవుఁడు లేఁడనవలయును. పశువులు ఆకలియు స్త్రీ పురుష సంగమము మొదలైన వానిని గుఱించి మాత్రమే యెఱుఁగును. అది జ్ఞానము కాదు. దాని పేరు పసి. ఇంగ్లీషులో నీమాటను instinct అందురు. ఈ పసి జ్ఞానము వేఱు, జ్ఞానము వేఱు, ఆలోచన వేఱు అని సిద్ధాంతములు చేసినచో కొన్ని కథలు పొసగవు. కొన్ని విషయములందవు. పాముపగ యొకటి ప్రసిద్ధము. ఏనుఁగు వివేకము కూడ చాల ప్రసిద్ధము. వీనిని గూర్చి నేటికిని కథలు జరుగుచునే యున్నవి. జీవుఁడనఁగా జ్ఞాన తారతమ్యము చేత నున్నాఁడని లేఁడని చెప్పబడెడి వాఁడు కాడు. కర్మానురూపముగా బహుజన్మలెత్తెడి వాఁడు. ఒక్కొక్కప్పుడు మూఢుడై పుట్టును. మనుజుఁడై పుట్టి పశువుకన్న కనాకష్టుడై యుండును పశువులలో కూడ మనుజులలో కంటె నధిక జ్ఞానము కలిగిన జంతువులుండును.

భక్తి కూడ నొక మనోభావ మందము. దేవుఁడు లేఁడను వారు మనుజులలో లేరా? అంటే దేవుఁడున్నాఁడన్న జంతువులుండును. ఇక్కడ 'అన్న' అను శబ్దమునకు ప్రాధాన్యము లేదు. ఈ 'అను' ధాతువు అనుకొను అర్థమిచ్చు ధాతువు. మరియు మన పూర్వ గ్రంథములు పూర్వ యుగములలో జంతువులకధిక జ్ఞానము కలిగినట్లు చెప్పును. మనుజులింత కంటె నధిక బుద్ధిమంతులుగా చెప్పును. ఆ గ్రంథముల ప్రకారము కాలము పోను పోను క్షీణించుచున్నదందురు.

రామాయణములో కోతులు రాముని పక్షమున యుద్ధమునుఁ జేసినవి. కోతులు కోతులే. కత్తులు కటారులు లేవు. వానికిని కోటలు, రాజులు

మంత్రులుపుఁగరు. భారతములో నట్టి జంతువులేవు. అదియొక యుగములోనిది. ఇదియొక యుగములోనిది. యుగ ధర్మములు మారుచుండును.

ఇవి యంతయు వ్రాయుట యెందుకనఁగా నీ కథలు నీతి చంద్రిక కథల వంటివి కావు. ఇవి నిజముగా జరిగినవి. ఇవి యర్థవాదములు కావు అర్థవాదము లనఁగా నొక విషయముయొక్క ప్రాధాన్యము చెప్పుటకు చెప్పబడెడు కథలు. అందుకోస మీపీఠిక వ్రాయఁబడుచున్నది. విశ్వసించిన వాఁడు విశ్వసించును. లేనివాఁడు లేదు. విశ్వాసమో అవిశ్వాసమో, మానవుఁడు బ్రతికి యున్నంతవఱకే ! తదనంతరమెట్టిదో యోగులకు సిద్ధులకు మహావ్రతులకు తెలిసినచో తెలియవచ్చును. తక్కిన సామాన్యజనమునకు తెలియదు. మనకు తెలిసినది యీ లోకము. దానియందు రమింతము. తెలియనిది తెలిసినట్లు ప్రవర్తించుట యెందులకు ?

అందుచేత ఈ కథకూడ చదువుదము.

త్రేతాయుగము చివర నొక్క మహాసర్పము పాతాళమునుండి దివ్య మాణిక్యములనుఁ దీసికొనివచ్చి ప్రొద్దుననే శ్రీ కాళహస్తీశ్వరస్వామికి ఆ రత్నములతో పూజచేయును. వెడలిపోవును. ఆ సర్పము పాతాళలోక నివాసి ఏదో మహాసర్పము. మరలమరునాడు ప్రొద్దుట వచ్చును. నిన్నటి మణులు తీసివేయును. క్రొత్త మణులు సమర్పించును.

ఇట్లుండగా ద్వాపరయుగము వచ్చెను అప్పుడొక యేన్గు శ్రీ కాళహస్తీశ్వర లింగమునుఁ జూచెను.

ఆ స్వామికి శ్రీ కాళహస్తులు చూచి సేవించి మోక్షము పొందిన తరువాత శ్రీ కాళహస్తీశ్వరస్వామియని పేరువచ్చినది. తత్పూర్వమాయన పేరేమి ? వట్టి యీశ్వరుఁడు. వట్టి శివలింగము. ఇది చాల చమత్కారము కదా ! ఈ మువ్వురితో నాయనపేరే మారిపోయెను. లేదా అంతకు పూర్వము పేరులేదు. వీరితో నాయనకు పేరువచ్చెను.

అదివఱకు వట్టి శివలింగము ఱాయి. వట్టి బ్రహ్మస్వరూపము. ఈ ముప్పురకు మోక్షమిచ్చునప్పటికి "కాదోయీ ! యీయన భక్తులను రక్షించు వాఁడు.

నిత్యమైన తన శివస్వరూపము మాత్రమేకాదు. భక్త రక్షణ తాత్పర్యము కలిగిన మూర్తి'' అని తెలిసినది. అప్పుడు పేరువచ్చినది.

శ్రీకృష్ణదేవరాయలవారు తాను మహాచక్రవర్తి. సహజముగా పండితుఁడు. ఆయన గ్రంథములువ్రాసి పెద్దన్న మొదలైన కవులను పోషించిన తరువాతకదా కవులాయనచుట్టు మూఁగినది. అట్లు చేయనిచో తక్కిన రాజుల వంటివాడే.

అప్పుడు శ్రీ కాళహస్తీశ్వరుఁడైనాఁడు. అప్పుడు భక్తులు మూగినారు. తత్పూర్వము వట్టి శివాకృతి లింగాకృతి.

ఈ యేనుఁగువచ్చి స్వామిని చూచినది. వచ్చిచూడలేదు. స్వామి యచ్చట నున్నాఁడని తెలిసి వచ్చినది.

శ్రీ కాళహస్తి ప్రక్కన సువర్ణముఖీ నది ప్రవహించుచున్నది. ఆ నదిలో పూర్వము మొగలిపొదలు నిండియుండెడివి. అందుచేత నానదికి కేతకీనదియని కూడ పేరు వచ్చినది. తెలుఁగులో మొగలేరు అందురు.

ఆ యేనుఁగు వచ్చి స్వామిని చూచినది. స్వామిమీఁద రత్నములు మణులు నున్నవి. అవి రత్నములని మణులని యెవరోచేసిన పూజయని యేనుఁగున కేమి తెలియును ! ఈ యేనుగు కేతకీనదికిపోయి స్నానముచేసెను. అడవులు చెఱువులు తిరిగెను. మారేడు రెమ్మలు, కలువపూలు, తామరపూలు కోసితెచ్చెను. సర్పమర్చించిన మణులను పోఁద్రోచెను. తాను తొండమునందు నించికొనివచ్చిన నీటితో స్వామి కభిషేకముఁజేసెను. తానుఁదెచ్చిన పూలతో పూజించెను. తాను వెడలిపోయెను.

మరునాటిప్రొద్దున కాలసర్పము వచ్చెను. వచ్చిచూచెను. తనపూజలేదు. ''ఎవఁడువాఁడు ? నా పూజయైన రత్నములు గగ్గులకాఁటగలిపి ముళుకంపలు శీవలువెట్టి నాకెగ్గొనరించెను ? నా భాగ్యమువిట్లు నిప్పులపాలుచేసిన యామదాంధు నేమనవలయును ?'' అని చాల దుఃఖపడి యేనుఁగు చేసిన పూజను త్రోసిపారవేసి మనసులో నీర్ష్యయు, భక్తియు పెనవేసికొని యుండఁగా తాను మరల మణులతో స్వామినిపూజించి వెళ్ళెను.

అటు తెల్లవాఱు చుండఁగా పాము వచ్చును. ప్రొద్దెక్కిన తరువాత యేనుఁగు వచ్చును ఆ యేనుఁగు వచ్చి చూచెను. తన పూజ లేదు. "ఏఁడెవఁడురా? బుద్ధి హీనుఁడు! స్వామిని పూలతోఁ బూజింతురు గాని రంగుల రాళ్ళతో పూజింతురా?" అని ఆ రాళ్ళను మరల తీసి వేసి తాను బిల్వదళములు పువ్వులతో పూజించి వెళ్లెను మరునాఁడు ప్రొద్దుననే పామువచ్చెను. మరల పూవులు నాకులు ఆ లోపల నున్నది శివలింగము. ఆ సందులో నుంచి కనిపించు చున్నది శివ లింగము. ఆ సర్పరాజు దుఃఖపడుచు నట్లే నిలిచిపోయి యా సందులో నుండి స్వామిని చూచెను. నా జన్మ యెందుకు? అనుకొనెను.

కొంత సేపటికి తెప్పరిల్లి "కానీ రేపుగూడ సిద్ధియైనచోఁ జూతము. అది సరే కాని, యీ రీతిఁగా నెవఁడో చేయఁగా స్వామి యెట్లూరకుండెను? ఈయన కూడ నా శత్రువుతో చేరెనా? ఓయి శివా: పులకరించిన యమ్మవారి చేతి గ్రుచ్చు కొనుట యందు సుముఖుఁడవే. ఈ కంటకములందెట్లు సుముఖుఁడవు? స్వామి! నీకు మూడవ కన్ను కలదు. మఱచి పోయితివి కాబోలు!" అని మనస్సు దిటము చేసుకొని యేన్గుపూజలు పోఁద్రోచి పై దుమ్మును బుస్సున పోనూది తాను మరల రత్నముల నర్పించి యింటికిఁ బోయెను. పోయెనుఁ గాని దానికి మన శ్శాంతి యెక్కడిది?

భోగవతీ ఝరంబునఁ జొచ్చి, బోటుల
తోడనాడెడు జల క్రీడ లుడిగి,
పువ్వుఁబోఁడులుఁ దానుఁ బొత్తుల భుజియించు
మధుర సుధాహారవిధిఁ దొలంగి
బహువిధతాన సంపన్న గానంబుల
నిక్కచొక్కెడు తన నేర్పు వదలి
ప్రాణ నాయికతోడఁ బర్యంక సీమల
మసకానఁ బెనఁగు సంభ్రమము విడిచి

నిద్రవోయెడు సుఖమెల్ల నేలఁగలిపి
ప్రతి దినంబును దాఁజేయు రత్న పూజ
శివుసిపై నుండ కుండినఁ జింత నొంది,
రాత్రి శివరాత్రిగా జాగరమ్ముఁ జేసె

పాతాళము నందున్న గంగా నది పేరు భోగవతి. భూలోకము నందున్న గంగా నది భాగీరథి. స్వర్గ లోకము నందున్న గంగా నది 'మందాకిని'. ఝరము-ప్రవాహము; బోటులు-స్త్రీలు. తానసంపన్న గానంబులు - సంగీతములో నుచ్చె స్వరమున పాడు సంగీతమునకు తానమని పేరు. పర్యంకము - ప్రక్క; మస కాన - ఆడపాములు. మగపాములు కలిసి కొను దానిని మసక మందురు. ఆ సర్పరాజు పవలెల్ల నిట్లు గడిపి రాత్రి శివరాత్రిగా జాగరమ్ము జేసెను.

ఆనాడు పాము రత్నములు పెట్టి వెళ్ళిన తరువాత మరల నేనుఁగు వచ్చెను; నిన్నటివలె మొన్నటివలె మరల రాళ్లుంచెను. ఏనుఁగు చిన్న బోయెను. అంత పెద్ద జంతువు చిన్న బోవుట యేమిటో! 'వీఁడెవఁడు? నాతో పట్టుదలయా? అని శివునితో నిట్లనెను:

''అచ్చపు నీలవర్ణ దృషదావళి నల్లనికల్వలే? కసుం
బచ్చనిజాలు బిల్వనవ పత్రములే? యరుణాశ్మ ఖండముల్
విచ్చిన యెఱ్ఱదామరలె? విశ్వపతీ! విరసోపలంబు లె
ట్లచ్చదలయ్యె నీకు? నవి యందునె గంధమృదుత్వ శైత్యముల్?''

నీలవర్ణ దృషదావలి - నల్లని రంగు గల రాళ్ల సమూహము. బిల్వనవ పత్రములు - క్రొత్త మారేడు దళములు, అరుణాశ్మ ఖండములు - ఎఱ్ఱ రాళ్ళ ముక్కలు; విరసోపలములు - రసవిహీనములైన రాళ్లు; అవి గంధము - సువాసన; మృదుత్వము-మెత్తదనము; శైత్యము-చల్లదనమును పొందునా?

''ఉనికి శిలోచ్చయంబు, నిజయోష శిలోచ్చయ రాజపుత్రినీ
ధనువు శిలోచ్చయంబు పురదాహ! రథీకృత రత్న గర్భ! నీ
మనమున కీ శిలాశకల మండన మెట్లు ప్రియంబు సేసె? నే
మనఁగలవాఁడ నిన్ను? వ్రతహాని యొనర్చు దురాత్ముఁడుండగన్.

ఉనికి-ఉండు స్థలము: శిలోచ్చయము-కొండ; నిజయోష-నీభార్య; కొండ కూతురు; నీవు పురదాహుఁడవు-మూఁడు పురములను దహించిన వాఁడవు ఆ సమయమున నీ ధనుస్సు-శిలోచ్చయము-మేరుపర్వతము; నీవు రథీకృత రత్న గర్భుఁడవు. (ఆ సమయము నందే) రథముగా చేయబడిన భూమి కల వాఁడవు ఇంత రాళ్ళ వ్యవహార ముండగా ఈ శిలాశకలములు ఈ రాళ్ళ ముక్కలు, మండనము-నగగా, ఎట్లు ప్రియమైనది. నా వ్రతహాని చేసిన దురాత్ముఁడుండగా నిన్ననుట యెందుకు?

''పోసీ నేఁటికి నా యెఁబోయెఁ గడు దుర్బుద్ధిన్విచారింప నే
లా? నిత్యంబును నీశ్వరుంగొలుచు వేళంగాక; తేపాడి రాఁ
గా, నర్చాక్షత హంతఁగన్న, నది భాగ్యంబే వివేకింప; వాఁ
డా నేనా, నొకఁడాడఁబో యెదము; లేదా జీవమింకేటికిన్.''

అప్పుదేశుఁగు 'వాడా నేనా' వాఁడో నేనో యని యర్థము. మరి వాడే నేనేనన్న ప్రయోగమేమి? దుఃఖము వట్టి వ్యక్తిగతమైనచో విరోధము వ్యక్తిగతమైనచో కోపము వ్యక్తిగతమైనచో వాడో నేనో, అనుట తగును. ఇక్కడ దోషము శత్రువునందుకాదు శివునియందు శివుఁడు నా పూజల నంగీకరించి యూఱకయుండుటలో నున్నది దోసము. ఆ శివునకు వాఁడగును నేనగును అయినచో వాఁడు భక్తుఁడగును లేనిచో నేను భక్తుఁడగుదును. శివుఁడు నిర్ణయించవలయునని యర్థము

రేపుకూడ నిట్లేయున్నచో నా ప్రాణము లిచ్చుటనే వదలిపెట్టెదను. విచారమెందులకు? ప్రాణములంత తీపియా?'' అని ఆ యేన్గు స్వామికి పూజచేసి వెడలిపోయి యిదిమాత్రము తక్కువదా?

పెడి యేనుఁగులవెంటఁ బడిపోక యుడుగని
వెఱపిల్లు వేఁడిమి విడుపు చూపఁ
గరమున నుదకంబు కడుఁ జల్లుకొనకున్నఁ
దెమలని మిహిరదాహము దొలంగ,
సరసునఁ జొచ్చి తామరతూండ్లు మెసఁగక
మానని యాఁకటిమంట లార,
సింహపోతములు ఘోషింపఁబుట్టిన భయా
తంకాగ్ని తహతహఁ గ్రుంకబాఱ,

కెట్టివెట్టలుఁ దనమీఁద నెక్కలేక
పంచబంగాళమై పోవఁ బ్రాణలింగ
పూజనావిఘ్నమున యందుఁ బుట్టినట్టి
చింతయున్ వేఁకి తన లోనుచేసికొనియె.

పెడియేనుఁగులు - ఆడ యేనుఁగులు. వెడవిల్తుఁడు - మన్మధుఁడు; మిహిరదాహము - సూర్యుని యొక్క వేడి ; మెసఁగుట - తినుట ; పంచబంగాళమై పోవుట - పటాపంచలగుట. అనఁగా ఆ మన్మధాగ్ని; సూర్యునియెండ; ఆకటిమంట; సింహములు ఘోషింపగా బుట్టిన భయవహ్ని - ఈ నాలుగును తన మీద నేమియు పనిచేయలేదని యర్థము. చింతయన్ వేఁకి - చింత అను జ్వరము. వేఁకి - జ్వరము.

అక్కడ సర్పమిట్లే బాధపడినది. ఇక్కడ యేనుగిట్లే బాధపడు చున్నది. ఇద్దఱి భక్తియు సమానమని యర్థము. ఆ భక్తియొక్క సమానత్వము వారికి గలిగిన దుఃఖములయొక్క సమానత్వము చూపించుటకు ధూర్జటికవి యక్కడను సీసపద్యము వ్రాసె నిక్కడను సీసపద్యము వ్రాసెను.

ఎప్పుడస్తమయమగును ? ఎప్పుడు రాత్రి గడచును ? ఎప్పుడు మరల సూర్యోదయమగును? అని యేనుఁగు తహతహ పడుచుండెను.

ఇచ్చట సూర్యాస్తమయము రాత్రి పడుట, మరల సూర్యోదయము దీనినంతయు కవి వర్ణించెను. కథను చెప్పకొని పోకుండ నీ వర్ణనలెందుకు ? అన్నప్రశ్న. కాలము గడచుచున్నది. అక్కడ పాము బాధపడుచున్నది. ఇక్కడ నేనుగు బాధపడుచున్నది. ఒకటి వారి భక్తియొక్క లోతులు చూచుటకు, చెప్పుటకు. రెండు పరమేశ్వరునకివి పట్టవనుటకు. మూఁడు ఆ మరునాడు జరుగఁబోవువారి యిద్దఱి పగసాధించుకొనుటలలోని నైశిత్యము పాఠకుని హృదయమున కధికముగా భాసింపజేయుటకు.

మరునాడు తెల్ల వాఱినది. కుంభీనస వల్లభుఁడు అనఁగా పాముల రాజు బయలుదెఱి వచ్చెను ఎట్లు వచ్చెను? పగ చంపఁగవచ్చు కటారికాని చందమున వచ్చెను. కటారికాడు - కత్తితో శత్రువులను పొడిచి చంపెడివాఁడు. వచ్చి చూచెను. తన చేసిన పూజలేదు. తానా మారేడుదళములు కలువపువ్వులు మొదలైనవి నిన్నటివలె తీసివేయలేదు. వాని వాఁడెవఁడో చూతము. వానిని చంపుదును. లేదా నా ప్రాణములు శివునికర్పింతును.

అది పాతాళ లోకములోని మహా సర్పము. పాతాళము నందలి సర్ప రాజులు కూడ కామచరులు. ఆ సర్పము తాను చిన్నపామైనది ఆ మారేడు

దళములు తామరపువ్వులయొక్క కాడలలో దాగుకొన్నది. అది కాలఫణి. నల్ల పాము. అందుచేత దానిపడగ మారేడాకువలె నున్నది. దాని శరీరము తామర తూడువలె నున్నది. ఏనుఁగు వచ్చినచో తెలియదు.

యేనుఁగు నిన్నటికంటె తొందఱగా వచ్చినది. చూచినది. తనపూజ చెడిపోలేదు. ఇట్లనుకొన్నది.

"ఈ సకలేశ్వరుఁడు కరుణేక్షణుఁడయ్యెనో ? విఘ్నకర్త సం
త్రాసము నొందెనో ? వ్రతము ధన్యత నొందెనో ? పూర్వజన్మ వే
ళాసుకృతంబు పండెనో ? కళానిధి శేఖరమౌళి నేఁడు నే
జేసినపూజ నిల్చె"నని శ్రీఘమున న్ముదమంది క్రమ్మఱన్.

స్వామికి దయపుట్టెనేమో ! నాశత్రువు భయపడినాఁడేమో !విఘ్న కర్త- నా పూజకు విఘ్నము చేసినవాఁడు. సంతాసము - భయము. కళానిధి - చంద్రుఁడు శేఖరము - తల. చంద్రుడు శేఖరమునందు కలవాఁడు చంద్రశేఖరుఁడు. ఆయన మౌళిన్ - శిరస్సునందు :

ఏనుఁగిట్లనుకొనుచుండఁగా పామునకు తన శత్రువెవ్వరో తెలిసినది. పాము దగ్గఱకు రానిమ్ము అని కూర్చున్నది. ఏనుఁగునకి కీడు తెలియదు. ఆ ఏనుఁగు మరలపోయినది స్నానముచేసెను. క్రొత్తపూలు మారేడు దళములునుఁ దెచ్చెను. నిర్మాల్యమ్ము తుడుమటకు కరమ్ము సాచెను. కరమనఁగా తొండము నిర్మాల్యమనఁగా నిన్నటిపూజ.

"శుండాలంబుకరంబుసాఁప ఫణిరాజున్మెచ్చి 'నా పూజభ
గ్గుఁడీవేళ ననుగ్రహించె'నని ముక్కుంరంధ్రోళ్ళలో నెక్కి యు
ద్దండక్రీడఁ దదీయకుంభ కుహరస్థానంబునం ద్రిమ్మరన్
గొండల్గాలఁగ నెత్తిమొత్తుకొని, దిక్కుల్మట్ట గీఁపెట్టుచున్.

శుండాలము-ఏనుగు; భర్గుఁడు శివుఁడు కుంభకుహరస్థానము. కుంభము నందున్న గుహాస్థానము. ఈ పామచ్చట త్రిమ్మరుచున్నది. ఈ యేన్గుకొండలు కూలఁగ నెత్తి మొత్తుకొనుచున్నది. తన తలను కొండలకు వేసి కొట్టుకొనుచున్నది గీపెట్టుచున్నడి.

మొగలేటి మడుఁగున మునిఁగి తుండమ్మున
నుదకమాకర్షించి యూఁది యూఁది,
కడుఁగపాలము దాఁకి కఁగఁగఁజక్కఁగాఁ
జేసాఁచి జిఱ్ఱునఁ జీఁది చీఁది,
యిలమీఁదఁ దలదాకఁ నీప్రక్క నాప్రక్కఁ
బెడమర్లుగాఁ బొరల పెట్టి పెట్టి,
యుడివోని వేదననున్నచో నుండక
పనిలేని పరువులు పాఱి పాఱి

పెద్దమ్రాఁకులతోఁ గుంభ పీఠయుగముఁ
దోముకొనుచును జెట్టులు దూఱి తూఱి
పాము సేసిన దుఃఖంబు సామజంబు
దీర్చుకొనువెర వెఱుఁగక ధీరబుద్ధి.

మొగలేటి మడుగున-స్వర్ణముఖీ నదియొక్క మడుగులోననగా లోతైన చోటిలో.

ఈ పద్యమొక యాశ్చర్యము. ఇది యెవ్వఁడును వ్రాయలేఁడు. ధూర్జటియే వ్రాయవలయును. ఆ ధూర్జటి మహాభక్తుఁడు గనుక తానుపోయి యా యేనుగులో దూఱి యా పాము తన మెదడుకో నెక్కినదనుకొని తానేమేమి చేయునో యూహించికొని వ్రాసినట్లున్నది. మహా కవిత్వమని చెప్పుకొనదగిన లక్షణములలో నిదియొకటి. అందరు కవులు తాము రచించు పాత్రలతో నంతో యింతో యేకీభావమును పొంది వ్రాయుదురు. వారంతో యింతో కవులు. ఇట్టి యొక మహా భయంకరమైన పరిస్థితిలో నందులోనొక యేనుఁగు వ-టిజంతువుతో తాను తన్మయీభావమును పొందుట యిది మాత్రమాశ్చర్యము.

అయినచో నిట్టివాఁడు మహాకవులలో మహాకవి కావలయును. లేనిచో మనస్సులోనెదో పురుగుండి అది యొక వ్యాధియై అది యచ్చట తిరుగుచున్న చెప్పరాని దురద బాధ యనుభవించినవాఁడు కావలయును.

అప్పుడు ఏనుఁగిట్లను కొనెను:

"ఏనాచచ్చుట తప్ప దిప్పుడు, నుమాధీశోప కంఠంబునన్
దానూజావక చంపనోప దురగేంద్రుంబెక్కుడీ దుఃఖమే
లా నాకున్నరి చంపి చచ్చుట జనాహ్లాదంబు గాదా? యవా
చీన స్థాణునగంబె వధ్య శిలగా సేవింతుఁగా కింతటన్"

ఉరగేంద్రము-పాపరాజు; ఉమాధీశుఁడు-శివుఁడు; ఉపకంఠము-సమీపము అవాచీన స్థాణునగమ్ము-ఈ దక్షిణ కైలాసము; ఇదియే వధ్యశిల.

అని యా యేనుఁగు శివుని దిక్కు మొగమై యీ పాము ఏ కనుమ వెంటపోవునో యని తుండ మెత్తియ బట్టి నోటిలో గ్రుక్కుకొని, వెనుక వెనుక వెళ్ళి తల వంచి చెప్పరానంత వేగముతో నా కొండను భగ్గునఁ దాకెను. దాని కుంభస్థలము పగిలి పోయెను.

కొండ కొండ తోడ గుండుబుఁగూలంగ
దాఁకినట్లు దోఁచె, దళిత కుంభ
సీమనున్న పాము చిదిసె, నేనుంగును
బడియె; నెత్తురచటఁ బడియ కట్టె.

ఈ పద్యములో నున్న సొగసేమనఁగా దళిత-చీల్చబడిన; కుంభ సీమలో నున్న పాము చిదిసెన్-చిదియు అన్న ధాతువును వాడుట

మన మొక రాతి మీద నొక సన్నని వస్తువు పెట్టి మరి యొక రాతితో కొట్టినచో నావస్తు వేమగును? చిదియును. ఆ వస్తు వప్పచ్చివలె నైపోయి దానిలోని నీరు మొదలైన వటు నిటు వ్యాపించి దాని తొక్క కూడ మిగుల కుండ చెప్పుటకు వీలులేనంత చీకాకైన లక్షణము కనిపించును. తెలుఁగు జాతి యీ చిదియు ధాతువు నట్టి యర్థము నందుపయోగించును. ఈ కవి యిచట పామేమైనదో యెట్టి స్థితిని పొందెనో చెప్పుట కాశబ్దమును వాడెను. ఇదియొక యాశ్చర్యము

ఈ రెండు జంతువులు రుద్రగణా కారమ్ములు దాల్చిరి. ఆ లింగ మధ్యమ్ము నుండి ఎద్దు మీద నెక్కి స్వామి వచ్చి "మీకేమి కావలయు" నని యడి

గెను. వారు నిత్య సుఖమిమ్మని యడిగిరి. స్వామి వారిని తన సర్వవ్యాపక జ్యోతిలో చేర్చికొనెను.

అలిం గూడుచుఁ గ్రమ్మఱ
నాలింగమునందుఁ గలసె నది మొదలుగఁ జం
ద్రాలంకారుఁడు జగతీ
పాలకః శ్రీ కాళహస్తిపతి యనఁబరగెన్.

కన్నప్ప కథ

ఈ కన్నప్పకే తిన్నడని కూడ పేరు.

"పొత్తపినాఁటిలో విపినభూమిఁ గిరాతుల కాటపట్టు, లో
కోత్తర వస్తువస్తు 'ఉడుమూ'రను పక్కణ మొప్పుఁ దద్రమో
దాత్త మహత్త్వమద్భుతరసావహ మూహ యొనర్చు, మేదినీ
భృత్తట నిర్ఝరాంబురుహ బృంద మరంద సుగంధ వాహమై."

మన తెలుఁగు దేశములో కొన్ని కొన్ని భాగములకు నాడులని పేరులు గలవు. తెలుఁగు దేశములో నున్న వైదిక బ్రాహ్మణులందఱు నాఁడులకు సంబంధించిన వారు. కొందరు వెలనాఁడులు; కొందఱు తెలఁగ నాడులు, మురికినాడులు కాసల నాఁడులు, ఈ రీతిఁగా నుందురు. పూర్వమొక్కొక్క ప్రాంతమున కొక్కొక్క నాఁడు అని పేరు.

అట్లే శ్రీ కాళహస్తి చుట్టుపట్ల దేశమునకు పొత్తపినాఁడు అని పేరు.

ఆ నాఁటిలో నున్న యడవిలో కిరాతులుండెడివారు. ఆ భూమి లోకోత్తర రమ్య వస్తువులు లోకోత్తరమైన యందములైన వస్తువులు కలది. అందులోనొక పల్లెటూరున్నది. ఆ యూరి పేరు ఉడుమూరు.

అచ్చట నున్న రమా - లక్ష్మి యొక్క, ఉదాత్తమైన మహత్త్వము అద్భుతమును గలిగించును.

మేదినీభృత్తు అనగా కొండ; దాని ప్రక్కనున్న సెలయేళ్ళ లోని తామర పువ్వులలోని గాలి చాల చక్కగా నుండును. ఆ యూరిలోని జనులు సర్వ సమృద్ధి కల వారు. అడవి పందుల కోరల యందలి ముత్యములు వారికి రేఁగు పండ్ల వంటివి; మహా సర్పముల పడగల మీది ముత్యములు వారికి గుం

వెందలు. జవ్వాది, కస్తూరి, పునుగు కలిపి, యిండ్లలుకుదురు. కాని వారి వృత్తు లను వారు మానరు. పట్టుచీరలు కట్టకలుగుదురుగాని పారుటాకులే కట్టుదురు. మాణిక్యములలంకరించు కొనగలరుగాని గురివెంద పూసలే ధరింతురు.

వాళ్ళ పొలాలకు దిష్టిబొమ్మను పెట్టుదురు. ఆ బొమ్మలు అగురు చెట్ల కొయ్యలతో కస్తూరి మసిగాపూసి చమరీ మృగముల తోకలు జుట్టుగా పెట్టి యేనుఁగు కుంభములలోని ముత్యాలు కనుగ్రుడ్లుగా పెట్టుదురు.

అచ్చటి చెంచెతలు చాల సౌందర్యవతులు. వారును వారి భర్తలును యధేచ్ఛముగా విహరింతురు.

ఆ యూరనొక యెఱుకు రాజు కలఁడు. అతని పేరు నాథనాథుఁడు. అతని భార్యపేరు తంఁదె

ఆమె గర్భవతి యయ్యెను. ఆమెకు నెలలునిండి యొక బిడ్డను కనెను. శివభక్తి ముందుపుట్టెను. తరువాత వాఁడు పుట్టెను.

వాఁడును వాని చెలికాండ్రును ఎన్నో క్రీడలాడుదురు.

చిట్లిపొట్లాకాయ, సిరిసింగణావత్తి
గుడుగుడుగుంచాలు, కుందెనగుడి,
దాఁగిలి మ్రుచ్చులాటలు, గ్రచ్చకాయలు,
వెన్నెలకుప్పలు, తన్నుబిల్ల;
తూరన తుంకాలు, గీరన గింజలు,
పిల్ల దీపాలంకి, బిల్ల గోడు,
చిడుగుడువ్వల పోటి, చెందుగట్టినబోచి,
యుల్లియుప్పనఁబట్టె లప్పళాలు,

చిక్కాలబిల్ల, లోటిళ్ళు, చిందఱాది
యైన శైశవ క్రీడా విహారసరణిఁ
జెంచుకొమరులతోడ నుద్దించుకాతుఁ
దిన్నఁ డభినవ బాల్య సంపన్నుఁడగుచుఁ

అతఁడు పెద్దవాఁడై నాఁడు. విల్లుపట్ట నేర్చినాఁడు.

విల్లుపట్టిన నెల పదినాళ్ళలోన
వీఁకగలిగిన తడవిల్లు వెదురువిల్లు
సెలసు విల్లును మొదలైన చేఁగవిండ్లు
చులుకగాఁదీసి, శబరేంద్ర సూనుఁడేయు.

పై సీస పద్యములో నాంధ్రదేశమునందలి బాలుర యాటల పేర్లు. ఇందులో నాటవికుల విండ్లపేర్లు. ఈ కథలో మరియును కొన్ని వచ్చెను. మందులు మాకులు వాని పేర్లు వరుసఁగా నుండును. ఇదియునొక కవితాశక్తి.

అంతనాయడవిలో వేటకొక అధిదేవత కలదు దాని జాతరచేసిరి.

తరువాత తిన్నఁడు వేటకు బయలుదేఱెను. ఆ వేటలో నితఁడు చాల నేర్పుకలవాడు.

తిన్నఁడొకనాఁడు వేటాడి సొలసిపోయి యొడలు తెలియక నిద్రించు చుండెను. అతనికొక స్వప్నము వచ్చెను. ఆ స్వప్నములో

"ఒడలం దెల్ల విభూతిపూత, పులితోలొడ్డాణ, మల్లాడు కెం
జడ, లాత్మైక విచారనిశ్చలదృగబ్జాతంబు, లచ్చైనక
చ్ఛద మంసంబున, రుండమాల గళ దేశస్థాణువుం గాలఁ గా
నొడయండొక్కరుఁ దక్కుమారుకలలో నుద్యత్కృపామూర్తియై."

కెంజడలు - ఎఱ్ఱని జడలు; ఆత్మవిచారమునందు నిశ్చలములైన దృగబ్జాతములు - తామరపూలవంటి కనులు; అంసంబున - బుజమునందు; కచ్ఛదము-బొంత; రుండమాల - బొమికల పేరు; ఉద్యత్కృపామూర్తియై - ఉదయించుచున్న దయామూర్తియై; ఒడయండు - రాజు; కనిపించి "ఓయీ! మొగలేఁటి దగ్గఱ శివుఁడున్నాఁడు అతఁడు భక్తులపాలిటి కల్పకము. నీవతనిని సేవించు" మని చెప్పెను.

తిన్నఁడదరిపడి లేచెను. తక్కిన వేటకాండు మరల వేటకు బయలు దేరిరి. కాని తిన్నఁడు ఆ శివుని చూడవలయుననియే భావించుచుండెను. కాని యతనికొక యడవిపంది కనిపించెను. ఇతఁడు దానిని వెన్నాడు

చుండెను, ఆ యేకలము వానిని సరిగా శ్రీ కాళహస్తీశ్వర స్వామి యున్న యెడకుఁ దీసికొని వచ్చెను. తిన్ననికి స్వామి కనిపించెను. వానిలో పూర్వ జన్మార్జితమైన శివభక్తి యంతయు నొక్క సారి పొడసూపెను. ఆ లింగమునుఁ జూచి,

"ఓ సామీ! యిటు వంటి కొండ దరిలో, నొంటిం బులుల్ సింగముల్
గాసింబెట్టెడు కట్ట నట్టడవిలోఁ గల్జువ్వి క్రీనీడ, నే
యాసంగట్టితి వేటిగడ్డ నిలు? నీవాఁ కొన్నచోఁ గూడు నీ
ళ్లే సుట్టంబులు దెచ్చి పెట్టెదరు? నీకిందేఁటికే లింగమా?"

ఇటు వంటి కొండదరిలో ఇటు వంటి కొండ ప్రక్క కల్జువ్వి క్రీనీడ-రాయి దగ్గఱ పెరిగిన జువ్వి క్రింద నీడలో ఏఁటిగడ్డన్ - నది ప్రక్క నున్న రాతిమీద, ఇల్లు ఏయాసను కట్టితివి. మాయూరికిపోదము రమ్మనెను. "మాయూరికి రమ్ము. లేళ్ళ మాంసము, దుప్పుల మాంసము, పిట్టల మాంసము, నీకు వండి పెట్టెదను.

ఓ లింగమా! వినుము నివ్వరి
ప్రాలును, నొడిపిట్ల, గుజుకుఁ బ్రాలును వెదురుం
బ్రాలును, సవరపు మేకముల
పాలును, గల వచట నీకుఁ బాయసమునకున్.
పుట్ట తేనియ పెర తేనె పుట్ట జున్ను
తొఱ్ఱ తేనియ గల, వందుఁ దోఁచి తోఁచి
కాలి దులదులనై పిండిపోలె రాలు
నట్టినింజెట్లు గలవు నీ కారగింప.
నేరేడు పండులు నెలయూటి పండులుఁ
గొండ మామిడి పండ్లు దొండ పండ్లుఁ
బాలపండులు నెమ్మి పండులు బరివంక
పండులుఁ జిటిముటి పండ్లుఁ గలివె
పండులుఁ దొడి వెంద పండ్లుఁ దుమ్మికి పండ్లు
జాన పండులు గంగ రేను పండ్లు
వెలఁగ పండులు పుల్ల వెలఁగ పండులు మోవి
పండ్లు నంకెన పండ్లు బలుసు పండ్లు

> బీర పండ్లును బిచ్చుక బీర పండ్లఁ
> గొమ్మి పండ్లీత పండ్లుఁ గొంజి పండ్లు,
> మేడి పండ్లును మొదలుకాఁ గూడిమాడి
> చెంచెతలు దెత్తురిత్తు విచ్చేయు మయ్య.

మొదట క్రీడా విశేషములు. తరువాత ధనుస్సులు, ఇచ్చట బియ్యముల లోని భేదములు, ప్రాలనఁగా బియ్యము. మరియు నడవులలో దొరకు పండ్ల పేర్లు. ఈ రీతిగా పెద్ద పెద్ద జాబితాలు. తరువాతి తరువాతి కవులలో నిది యొక పెద్ద కవితాలక్షణ మయ్యెను. ఒక జాతికి సంబంధించిన పేర్లెన్నియో చెప్పుట అది యా కవి యొక్క ప్రతిభగా పరిణమించెను. ప్రతిభ యౌనా కాదా? ప్రతిభ నిస్సంశయముగా నగును. అది కవితయా? కావచ్చును. కాకపోవచ్చును. బహువిషయ పరిజ్ఞానమొక ప్రతిభ. వాని సుచితముగా ప్రయోగించుట వేఱొక టైన ప్రతిభ. ఇచ్చటనే బాల కీడా విశేషములు చెప్పుట పెద్ద కవిత్వము క్రింద లెక్క గాదు. ఈ పండ్ల పేర్లు వరుసగా చెప్పుట కవితా లక్షణము ఎందు చేత? ఇచ్చట తిన్నని యొక్క ఆటవిక మైన అమాయకత్వము వ్యజ్యమాన మగు చున్నది ఇది కొంత కవిత్వమగును. ఆ మొదటిది నిఘంటు బుద్ధి. ఇంతియేకాదు

> చుఱుకుఁ జూపునఁ గాలిన కొఱత నుఱుకు
> నుఱుకుఁ జూపులఁ బుట్టించి నెఱుకు వారి
> యిఱుకువలి గుబ్బ పాలిండ్ల యిగురుఁబోండ్ల
> సేవకిచ్చెద నీకు విచ్చేయు మయ్య!

తనకటువంటి పరిచారికలు కలరు. అట్టి వారిని శివునకిత్తుననును. ఇదియు కూడ నతని యమాయకత్వమునకు వ్యంజకము.

అని తిన్నడు స్వామిని తన యూరికి రమ్మని పట్టుఁబట్టి కూర్చుండెను. కదలఁడు.

అప్పుడు తక్కిన బోయలు తమ చిన్న దొర యొక పందిని తఱుముచు పోయెను. ఏమైనాడో యని వెదకి కొనుచు వచ్చిరి. వచ్చి చూచిరి. అతనిని ఉడుమూరునకు రమ్మని ప్రార్థించిరి. అప్పుడు తిన్నడు వారితో—

ఈ లింగము నావెంటవచ్చిన నేను పత్తును. లేనిచో రాను. నేనిచ్చటనే చనిపోదును.

వనచరులు చేయునదిలేక వెడలిపోయిరి.

'ఎన్నాళ్ళనుండియో ప
స్తున్నాడీ యడవిలోన నొంటి మహేశుం
డిన్నెగులు మాన్పవలదా
కన్నారంగనిన బంటు గల ఫల' మనుచున్.

అని తిన్నఁడు అడవిలోనికిఁబోయి యొక యడవిపందిని చంపి తెచ్చి దాని మాంసమును దొప్పలలోఁబెట్టి స్వామి కారగింపుమని యిచ్చెను. లింగము లింగముగానే యున్నది.

ఇచ్చటనుంచి నాలుగైదు కందపద్యములు కలవు. అన్నియు నాతని యమాయిక భక్తికి చిహ్నములు సరిగా వాలలేదాయని, ఆకలికాలేదోయని; నాయందేమైన దోషమున్నదా యని; నీవు తినకపోయినచో నా బ్రతుకెందుకని చివరకు తిన్నఁడు తానచ్చటనె చత్తుననెను. వట్టిమాటకాదు. నిజముగా చచ్చు నట్లున్నాడు.

శివుఁడు అంత కష్టపడి వాని కలలో కన్పడి భక్తుని పిలిచి తెచ్చు కొన్నాఁడుకదా ! ఏమిచేయును ? అప్పుడు స్వామి తన రూపమంది యేడుపు మాన్పి తినెదనని యొప్పుకొన్నాడు. తిన్నఁడు మాంసఖండములం దిచ్చుట - శివుఁడు తినుట. - తిన్నఁడు ప్రతిదినమడవికిపోయి యే జంతువునో చంపి తెచ్చి యా మాంసమునుకాల్చి స్వామికి పెట్టుచుండును. ఆయన తినుచుండును.

అది వారి యిద్దరికే తెలియును. స్వామి దేవతారూపముదాల్చి వచ్చి తిను చున్నాఁడని యెవరికిఁ దెలియును? తక్కిన వారికి అచ్చట శివలింగముండును. శివలింగము కన్పించును. చుట్టుపక్కలనంతయు కశ్మలము. బొమికలు, నెత్తురు మరకలు, చంపఁబడిన జంతువుల శవములు. కాల్చిన నెగళ్ళు; ఎండిన మాంసపు ముక్కలు.

ఇట్లుండఁగా నొక శివబ్రాహ్మణుఁడు వచ్చెను. అతఁడు పూజారి వంటి వాఁడు. అతఁడువచ్చి యీ కశ్మలము చూచి యంతయు బాగుచేసి మరల ప్రతి దినము వచ్చుచు మరల బాగుచేయుచు, నొకనాఁడిట్లనెను.

"కులదైవంబని యల్క-పూసి గుడ్డిముగ్గుల్ వెట్టి కై సేయ లో
పలికిట్లెంగిలి మంగలంబులగు దొప్పల్ రాకతంబేమి? ని
ర్మల తోయస్నపనం బొనర్చిన శరీరంబేటికి న్నీరువ
ట్టులఁగట్టెం? భవదాత్మశుద్ధికిది గూడుంగా మహాహేయముల్."

తోయస్నపనము - నీళ్ళ స్నానము ; నీరు వట్టులుగట్టుట - ఇక్కడ నేమనవలయుననఁగా నీటిధారలు కట్టుట యనవలయును. కాని భాషలో నీర్వట్టు అన్నమాటకు దప్పిక, దాహము వేయుటయని యర్థము. ఇచ్చట నా యర్థము కుదురదు.

ఇట్లే శివుఁడు ప్రత్యక్షమైన పద్యములో కచ్చడము అన్న శబ్దమున్నది. భాషలో కచ్చడమనగా కౌపీనము, గోచి; "కచ్చడాల్ కట్టుకొను మునిముచ్చు లెల్ల తామరస నేత్రలిండ్ల బందాలు గారె" అని పెద్దన్నగారు వ్రాసిరి.

కచ్చడమనగా కౌపీనమనిగాని, నీరువట్టు అనగా దప్పిక యనిగాని కవులు ప్రయోగించిన ప్రయోగమునుఁ బట్టియే యర్థ నిర్ణయము చేయబడినది; ఆ లెక్కప్రకారము ధూర్జటి ప్రయోగమననుసరించి కచ్చడమునకు, నీరు వట్టునకు, బొంతయనియు, నీళ్ళిండిన గారలనియు నర్థములు చెప్పవచ్చునుఁ గదా!

శివబ్రాహ్మణుఁ డిట్లు కటకటంబడి యిది చేసినవాడెవఁడు? వాఁడు నీకుఁ జుట్టమా? నీ స్నేహితుడా? నిన్నుగురించియున్న కథలలో నీవు భక్తుల కొఱకు చాల పిచ్చిపనులు చేసితివని యున్నది.

నీ కిది యిష్టమైనచో గానీ, నా కా పాపాత్ముఁ జెప్పినన్ పది లక్షలు. లేకున్న కూడుగబట్టి నేను ప్రాణము విడుతును. అని వీఁడును పంతము పట్టి కూర్చుండెను.

అప్పుడు తిన్నని విషయము చెప్పెను. చెప్పి "వాని భక్తినీకు చూపింతును. కనఁబడకుండ నీవిచ్చోట నెచ్చోటనైన దాగియుండుము. వాఁ డిప్పు డే వచ్చును" అనఁగా శివభక్తుఁడు తానొకచోట దాగియుండెను. అప్పుడు చెంచు వచ్చెను. వాఁడు రెండు దొప్పలలో మాంసము పెట్టికొని, వచ్చెను. స్వామికి స్నానము చేయించుటయెట్లు? పుక్కిటనిండ నీళ్ళుపట్టు కొనివచ్చెను. స్వామిమీద నిన్నటిపూజ తీసివేయుట యెట్లు? దొప్పలు క్రిందపెట్టి చేతితో తుడువవచ్చును, కాని ఆదొప్పలు క్రింద (బెట్టించో స్వామి యాహార మపవిత్రమగును.

ఏమి సూక్ష్మమైన ధర్మములు ! అందుచేత వాఁడు తన చెప్పుకాలితో లింగముమీది నిర్మాల్యము పోఁద్రోచెను. మాంసపుదొప్పలు నేలఁబెట్టినచో నపవిత్రమగునా ? చెప్పుకాలితో శివలింగము మీది నిర్మాల్యము తుడువ వచ్చునా ?

ఎవరి భక్తి వాని వివేక ప్రమాణమైనది. మన లౌకిక జ్ఞానమునకు దేవతా భక్తియొక్క లక్షణమునకు సంబంధములేదు. ఆ భక్తియొక్క లోతు వేఱు. ఈ లౌకిక పరిజ్ఞానముయొక్క స్వరూపము వేఱు.

అంత కన్నఁడు తాను పుక్కిలిబట్టి తెచ్చిననీటితో స్వామిని స్నానము చేయించెను. తాను తెచ్చిన మాంసఖండములు స్వామి కందిచ్చెను.

స్వామి కడచిన యేడుదినములుగా నెట్లు తిన్నాడో యీ నాఁ డట్లు తినలేదు. తిన్ననికి భయమువేసెను. ఇంతలో స్వామి యొకకంట కన్నీరు కార్చ మొదలుపెట్టెను. ఆ కన్నీరు వృద్ధియగుచుండెను. అప్పుడు తిన్నఁడు ఓహో ! స్వామి కంటికి జబ్బుచేసినది. ఆ బాధతో యన్నము తినుటలేదు. అని చెప్ప రానంత దుఃఖముపొంది

కోకపొట్లం బావిగొన నూఁదియొత్తుచుఁ
గషణోష్ణకరభ భాగమునఁ గాఁచి
నెత్తితంగేడాకు మెత్తి, రేచకినిమ్మ
పంటిసీరున నూఱి పట్టువెట్టి

తెల్లదింటెనపువ్వుఁ దెచ్చి తద్రసమిడి
 కలివె పువ్వులు గోసి నలఁచిపిడిచి
పేరిన నెయివెట్టి. పెరుఁగు వత్తులు వైచి
 చనుఁబాలతో రాచి, సంకుచమిరి
విన్న మందులు, తా సరికిన్నమందు
లడిగి తెచ్చిన మందులు, నడవిమందు
లెన్ని చేసిన మానక, యిందుమౌళి
కన్ను తొడిఁబడి నెత్తురుగాఱుటయును.

కోకయనగా కట్టు పుట్టము. స్త్రీ పురుషులెవరు ధరించినను సరే ; కాని తరువాత తరువాత నిది స్త్రీలు ధరించెడి చీరకే పేరైనది.

నేటికిఁగూడ మనయిండ్లలో కన్నెఱ్ఱపడినచో, కొద్దిగా నొప్పిగా నున్నచో బట్టను పొట్లముగాజేసి నోటిలో బెట్టుకొని యూపిరి యూది యా చిరువెచ్చని గుడ్డతో కన్నునొత్తుదుము. అట్లు నాలుగైదుసారులొత్తగా కంటిబాధ తగ్గును. రెండవది రెండుచేతులు చివరిభాగపుటుబ్బుగల చోట్లు రాచినప్పుడు వెచ్చబడును. ఆ వెచ్చదనముతో కన్నులద్దుకొందురు. ఇవి రెండును సహజములైన చికిత్సలు. తక్కినవి సరే ; పేరిన నెయ్యిపెట్టి పెరుగువత్తులువైచి, చనుఁబాలతో రాచి.... అడవిలో నివియెట్లు తెచ్చెనని ప్రశ్న. ఈ సందేహము అడిగి తెచ్చినమందు లన్నమాటతో తీరినది.

ఎన్ని చేసినను కన్నీరు మానలేదు.

పట్టపు దేవిన్ హిమగిరి
పట్టిన్ మాయమ్మఁ జూచి పదరినకతనన్
నెట్టవిసెనా ? నేమందుల
మట్టెఱుఁగనొ ? కంటికిం బ్రమాదం బొదవెన్.

హిమగిరిపట్టి - పార్వతి, ఆమెమీద కసరుకొనఁగా కన్నదిరినదేమో ; నాకే మందులమట్టు (రహస్యము) తెలియదో ; సీసీ ! నేనెంత మూర్ఖుడను. కంటికి కన్నే మందు. అనుకొని బాణముతో తనయొక్క గ్రుడ్డును బెల్లగించి లాగి శివుని కంటికి బెట్టెను

అంతట స్వామికన్ను నిమ్మదించెను

"మున్నిటి కన్నుకంటెఁ గడుమోహనమై తనకన్ను వచ్చిన
న్నన్ననఁజూచి మెచ్చక, యుమాపతి రెండవకంట శోణిత
క్లిన్నతఁజూపిన, న్నగి పుళిందుఁడు నీ కృపచేతఁగన్ను మం
దున్నది, దీనికి న్నోఁజవ, నొక్కటినా ప్రశమింక శంకరా!"

తిన్నఁడు తనకన్ను పెకలించిపెట్టినంతమాత్ర నీరు కారుచున్న స్వామి కన్ను పూర్వపు కంటికంటె బాగుగానుండెను. కాని స్వామి మెచ్చలేదు. మెచ్చక రెండవకంట నెత్తురుకార్చ నారంభించెను. అప్పుడు తిన్నఁడునవ్వి
'నీకృపచేత కన్నుమందున్నది.'

అని రెండవకన్ను పెకలించఁబోవుచు నిట్లనెను: "నీకు మూడు కన్నులున్నవి. నాకు రెండే కన్నులున్నవి. నీ రెండుకన్నుల వ్యాధులు నా రెండు కన్నులతోఁ దీర్చెదను. నీ మూడవకన్నుఁగూడ జబ్బు చేసినచో నా ప్రాణములు నీకిత్తును. కంటికి ప్రాణములకు సంబంధమేమనగా ఈ ప్రాణములు మనోదృష్టికి మూలములు" అన్నాడు.

ఇక్కడ చమత్కారమున్నది. తన రెండవ కంటితో స్వామి రెండవ కన్నుకూడ కుదురును. అప్పుడు స్వామి మూడవకంట నెత్తురు కార్చినచో నది తిన్ననికెట్లు తెలియును. అప్పుడు ప్రాణములెట్లిచ్చును ఇక్కడనున్నది రహస్యము.

అందుకనియే ధూర్జటి మహాకవి 'మనోదృష్టి'కి మూలంబగునాదు ప్రాణముల నీ కిత్తున్ అని వ్రాసినాఁడు. తిన్ననికి మనోదృష్టి యున్నది. అనగా మూడవకన్ను తనికిఁగూడ నున్నదన్నమాట. తనకు రెండుకన్నులు లేకపోయినను స్వామి మూడవ కంట కన్నీరు కార్చినచో నితనికి తెలియునట. ఎట్లు తెలియును ? ఇతని మనోదృష్టికి తెలియును. అనఁగా తిన్నని మనస్సు శివభక్తి పారవశ్యముచేత విజ్ఞానమయమైనది.

అని చెప్పుకాలితో నెత్తురు కారుచున్న శివుని రెండవకంటి నదిమిపట్టి తన రెండవకన్ను పెకలించుటకు బాణము తీసెను.

కన్నుఁడవియఁ బూను కన్నప్ప తీవ్రత
కన్నమున్ను గాఁగ ఖండపరశు

వాశుగంబుఁ జేతసంటంగఁ బట్టుక
''నిలువు నిలువు'' మన్న యెలుగు తోడ.

ఖండ పరశువు—గొడ్డలిముక్క. అది శివునియొక్క యొక యాయుధము. తనకన్ను లాగుటకు కన్నప్ప యెంత తొందరపడుచున్నాడో అంతకంటె తొందరగా శివుఁడు ప్రత్యక్షమై తన చేతిలోనున్న ఖండ పరశువు, కన్నప్ప చేతిలో నున్న 'ఆశుగము' (బాణము) రెండు కలిపి పట్టుకొని 'నిలువు నిలువు' మన్న యెలుగు (ధ్వని తో —

హరి, యరవిందసూతి మును లష్టదిశాపతులాదిగా వియ
చ్చరులిరు వంకలంగొలువ సత్వరత న్నిజలింగ నిర్మలాం
తరమునసుండి, శీతవసుధాధరకన్యక ముద్దుఁగేలుఁ దా
మర కడ్రవేలుపట్టుకొని, మన్ననఁ దిన్ననికిం బ్రసన్నుఁడై.

హరి — విష్ణువు; అరవింద సూతి — బ్రహ్మ; తామరపూవునుండి పుట్టిన వాఁడు; వియచ్చరులు — ఖేచరులు, దేవతలు.

శీతవసుధాధరకన్య — చల్లనికొండ కూతురు. ఆపెడ యొక్క ముద్దు చేయి తామర చివరిగ్రవేలు పట్టుకొని శివలింగముసుండి వెలువడి తిన్ననికి ప్రసన్నుఁడైనాఁడు.

పరమశివుఁడు తిన్ననికి ప్రసన్నమైన లక్షణము రెండువిధములుగా నున్నది.

ఒకటి బ్రహ్మ మహేశ్వరులయు దేవతలయు కొలువు చేయించికొనుచు, తాను సర్వ జగత్తునకు నధినాధుఁడన్న ప్రథ యొక్కటి.

రెండవది పెండ్లి నాఁడు భర్త భార్యయొక్క కొనగ్రవేలు పుచ్చుకొని తిరుగును. అనాటి వలపులో పెండ్లి యొక్క పసిమియంతయు ప్రేమ యొక్క పచ్చి యంతయుసున్నది. పరమ సుప్రసన్నత యున్నది. రెండవ లక్షణమిది.

అందుకనియే ధూర్జటి పార్వతికి మరియొక్క పేరు వాడక శీతవసుధాధరకన్యక యని యొక ముద్దుపేరు వాడినాడు. అమ్మవారికేలు (చేయి) ముద్దు కేలట! అది తామరయట: ఆ స్వామి యొక్క సర్వ ప్రసన్నతయు నీ శబ్దముల యందున్నది.

అప్పటికి శివబ్రాహ్మణునకు తిన్నని భక్తి తెలిసెను. ఇద్దరును శివుని స్తుతించిరి. పరమేశ్వరుడు వారిద్దరిని తనలో కలుపుకొనెను.

ఈ తిన్నని పూర్వకథ యున్నది అట్లే చెలది పుర్వునకు, సర్పమునకు హస్తికి పూర్వకథలున్నవి చెలదియు, సర్పమును, నేనుగును వారు పూర్వము ప్రమథులు అనఁగా శివగణములోనివారు. శాపములుపొంది యట్లైరి.

ఈ తిన్నఁడట్టువాడు ఈ తిన్నఁడు పూర్వజన్మలో నర్జునుఁడు ఇక్కడ నున్నది యాశ్చర్యము.

అర్జునుఁడు కౌరవులను గెలుచుటకొఱకు శివునివద్ద పాశుపతాస్త్రమును సంపాదించెను.

ఈ కథ ప్రసిద్ధమైనదియే కదా! అర్జునుడు తపస్సు చేయుచుండెను. శివుఁడు కిరాతరూపమున వచ్చెను ఒక పందిని తరుముకొనివచ్చెను. శివుఁడు బాణము వేసెను. అర్జునుఁడు బాణము వేసెను. ఇద్దఱి బాణములు తగిలి పంది చచ్చెను. ఇద్దఱును చచ్చిన పంది తనది తనదియని వివాద పడిరి. యుద్ధమాడిరి. శివుఁడర్జునని అమ్ముల పొదిలో బాణములులేకుండ జేసెను. అర్జునుఁడు గాండీవముతో శివుని శిరస్సుమీదఁ గొట్టెను. ఇద్దఱును కొంత సేపు మల్ల యుద్ధము చేసిరి. చివరకు శివుఁడర్జునునకు ప్రసన్నుఁడై పాశుపతాస్త్రము నిచ్చెను.

ఇంతవఱకు కథ సర్వత్ర సమానము. ఈ శ్రీ కాళహస్తి మాహాత్మ్యములో చివరియాశ్వాసములో పీరిందఱి పూర్వజన్మ కథలు కలవు. ఈ గ్రంథములో ఈ కథను మించి మరియొకటి యున్నది. అది యేమనఁగా నర్జునుఁడు శివుని పాశుపతాస్త్రమేకాదు మోక్షమునుఁగూడ నిమ్మని యడిగెను.

ఇక్కడనున్నది రహస్యము అర్జునుఁడు శ్రీకృష్ణుని చెలిమికాఁడు. భగవద్గీత యుద్ధభూమియందు శ్రీకృష్ణుఁ డర్జునున కుపదేశించెను.

ఏ భగవద్గీత సర్వజగత్తునకు మోక్షమివ్వనన్నదో! యిచ్చుటకు సంకల్పింపఁబడినదో! ఆ భగవద్గీతను శ్రీ పరమేశ్వరునుండి ప్రత్యక్షముగా నుప

దేశము పొందిన యర్జునుఁడు పాశుపతాస్త్రమును పొందుచు తనకు శివుని మోక్ష మిమ్మని యడుగుటయేమి? కాదు భగవద్గీతోపదేశము చాల తరువాత జరిగినది. ఈ యడుగుట కొన్ని యేండ్లకు పూర్వము జరిగినది. ఒప్పికొందము. మరి అర్జునునకు తిన్నని వలె జన్మమెత్తవలసిన యవసరము లేదే! ఎత్తినాఁడు కదా! అతనికి మోక్షమువచ్చినదిప్పుడు. భగవద్గీత ఏమైనది?

ఇది ఇట్లుండగా పాండవులు చనిపోయినారు. ధర్మరాజును స్వర్గమునకు తీసికొనివెళ్ళుచు ద్రోణవధ సందర్భమున 'అశ్వత్థామహతః కుంజరః' అన్న విషయములో ధర్మరాజ బద్ధమాడినాడు, ఆడలేదుకదా! ఆ కొంచెము పాపమునకు ధర్మరాజును దీసికొనిపోయి యూరకే నరకలోకమును చూపించి తెచ్చిరి. ధర్మరాజక్కడకు పోగా నక్కడ బాధననుభవించుచున్న జనులు ఒక పుణ్యాత్ముని సన్నిధానముచేత ప్రాణములు చల్లబడి సంతోషించుచు నేడ్చుచుండిరి.

ధర్మరాజు మీరెవరని యడిగెను. ఆ యేడ్చెడివారిలో అర్జునుడు, భీముఁడు, నకుల సహదేవులుకూడ కలరు. తక్కినవారిమాట యట్లుంచి భగవద్గీత యుపదేశమును పొందిన యర్జును డందున్నాడు. గీతోపదేశము వలన నతనికి మోక్షము రాలేదన్నమాట! అర్జునునిలో నున్న జీవుని యొక్క స్వరూపమెట్టిదో!

జీవులయొక్క లక్షణములెట్టివో! ఇది యనూహ్యముగానున్నది. కొందఱు జీవులు జ్ఞాననిష్ఠులు. కొందఱు జీవులు భక్తినిష్ఠులు. కొందఱు వైరాగ్యనిష్ఠులు.

'అహం బ్రహ్మాస్మి' అని పరాకాష్ఠ పొందెడు జీవుఁడు వేఱు.

'శివోఽహం' అనుకొను జీవుఁడు వేఱు.

ఇట్లెన్నియైన భేదములుండవచ్చును. ఈ కథ యొక్క పరమార్థము ఈ చిక్కులలోపడినది.

దీనిని గుఱించి యింకను విచారించవలయును. నరనారాయణు లిద్దఱు నిత్యఋషులు. నరుఁడు నిత్యుఁడు. ఆ నిత్యత్వ లక్షణమువేఱు. అతనికి ముక్తి యేమి? తెలియదు.

ముక్తి రెండు విధాలుగా నుండునని చెప్పబడినది. ఆత్మోపాసన చేసెడు వారు వేఱు. వారు 'అహం బ్రహ్మాస్మి' అన్న భావము నందు నిష్ఠులైన వారు. కొందఱు ప్రతీకల నుపాసింతురు. 'ఓం' మొదలైనవి బ్రహ్మ ప్రతీకలు.

మరి కొందఱు దేవతల నుపాసింతురు. వీరందఱకును ముక్తి వచ్చును. ఆ ముక్తులలో భేదములున్నవి.

ఒకఁడు శివునిలో సాయుజ్యము పొందును. మరి యొకఁడు విష్ణు సాయుజ్యము పొందును. వారికి పునరావృత్తి లేదు. కాని వారు బ్రహ్మ పదార్థములో కలియరు. ప్రళయాంతము ఆయా లోకముల యందుండి చివరకు కలియుదురు.

ఇతఁడు నరుఁడు. అందుచేత నితని కట్టి ముక్తియే న్యాయమేమో!

నక్కీరుని కథ

దక్షిణ దేశమున మధురానగర మున్నది. ఆ నగరము మహా ప్రసిద్ధ మైనది.

కాశీ విశాలాక్షి కంచి కామాక్షి మధుర మీనాక్షి – ఈ ముగ్గురు తల్లులకు ప్రసిద్ధమైన క్షేత్రములలో మధుర యొకటి.

అచట వాలవాయి చొక్కనాథుఁడన్న రాజు కలఁడు. ఆయన భార్య మీనేక్షణ. అచ్చట ద్రావిడ భాషా పీఠ శంక ఫలకము కలదు.

తామ్ర పర్ణి నదికి సవతియైన వైఘనది కలదు.

అచ్చట పరమశివుఁడు పాండ్యరాజు నల్లుడై యుండెను.

ఆ పట్టణమును పాండ్య భూపాలుని కూతురును పరమేశ్వరుని భార్య యునైన పార్వతీ దేవి రక్షించు చుండును.

ఆ పట్టణమును పాండ్య రాజేలు చుండెను.

అగస్త్య మహర్షి ద్రావిడ భాషకు వ్యాకరణము, అలంకారము, నిఘంటువు, ఛందశ్శాస్త్రము మొదలైనవి వ్రాయ దలచి పదునెనిమిది యక్షరములతో మూల పీఠిక వ్రాసి పాండ్య రాజునకా ఫలకమునిచ్చి యిట్లనెను.

"ఈ శంక ఫలకము నీదగ్గర నుంచుకొనుము. ఈ ఫలకము మీద నెంత మంది యైన కూర్చుండ వచ్చును. ఎంత మంది కూర్చున్నను మరి యొకనికి స్థలముండును. ఒక్కడు కూర్చున్నప్పుడు నంతే ! మరియొకనికి స్థలముండును"

అగస్త్యుడిట్లు చెప్పి వెళ్ళిన తరువాత పలుమంది రాజులు రాజ్యము చేసిరి.

కొన్నాళ్ళకొక రాజు వచ్చెను. అతఁడు మరియు భాషా పోషకుఁడు. ఆ సభలో పండ్రెండుగురు కవులు నిలచిరి. వారిలో నత్కీరుడు మేటి, వారంద రును ప్రశంసించిన గాని ఆ శంక ఫలకము మీద మరి యొక్కనికి చోటు రాదు. ఆ సభ మెచ్చు నట్లు కవిత్వము చెప్పుచో రాజు బహు సంపదలిచ్చును.

ఇట్లుండగా దేశము నందు దుర్భిక్ష ముదయించెను. కాటకము వచ్చెను. తిండి లేక జనులు పురమును వదలి లేచిపోనెంచు చుండిరి.

అట్లుండగా ఆ మహానగరము నందు మూల స్థానము నందలి శివబ్రాహ్మ ణుడు లేచిపోనెంచెను. శివునకు దయకలిగెను. శివుఁడు వానికిఁ బ్రసన్నుఁడై యిట్లనెను.

"ఓయీ ! నేనీ రాజు మీద నొక పద్యము వ్రాసితిని. అది శృంగార రసము, నీ పద్యమునుఁ దీసికొని పోయి రాజునకిమ్ము. ఆ రాజు నీకు వేయి మాడలిచ్చును. ఇంక నీకేమి కొదువ? నీ వేయి మాడలు వ్యయమగు లోపున కఱవు తీరును. వానలు కురియును."

అనగా నా శివ బ్రాహ్మణుఁడా పద్యమునుఁ దీసికొని పోయి రాజ సభలో చదివెను.

అందులోని యర్థమిట్లున్నది,

"సింధురరాజ గమనాధమ్మిల్ల బంధమ్ము సహజ గంధమ్ము." సింధుర రాజు - ఏనుగుల రాజు, దానివలెగమన - నడిచెడి - స్త్రీ; ఆమె యొక్క ధమిల్ల బంధమ్ము - జుట్టు ముడి; సహజ గంధమ్ము - సహజముగా సువాసన కలది. (వాసన తైలములచేత గాని, పుష్పము లలంకరించు కొనుట చేతగాని వచ్చిన వాసన కాదు.)

దానికి నత్కీరుఁడు నవ్వి "ఇదియేమి" తలవెంట్రుకల కట్టి సహజమైన వాసనయేమి ! పో! పో,

తప్పిది చెప్పరాదు కవితాసమయంబున కొప్పుగాదు నీ
విప్పగిదిన్ రచింపదగునే యన విప్రుడు చిన్నవోయి, "నా
కప్పరమేశ్వరుండు వసుధాధిపుపై రచియించియిచ్చి నా
డొప్పును దప్పనేనెఱుగ నుత్తములార!" యటంచు గ్రమ్మఱన్.

కవితా సమయము - కవితా సమయములని చాలకలవు. ఆడకోకిల కూయును. ఇదియొక సమయము కాని కూయునది మగ కోకిల ఆడనెమలి నృత్యము చేయును. నృత్యము చేయునది మగనెమలి. ఆడనెమలికి పింఛముండదు. మగనెమలికే యుండును. నదులలో తామర పూవులుండునని కవి సమయము. నదులలో నెప్పుడును తామరపూవులుండవు. శుక్లపక్షమంతయు వెన్నెల, కృష్ణపక్షమంతయు చీకటి ఇది కవి సమయము. ఇట్లు కాదు. శుక్లపక్షము సాయంసంధ్య మొదలుపెట్టి వెన్నెల. కృష్ణపక్షము ప్రాతస్సంధ్యకు పూర్వము వెన్నెల. స్త్రీయొక్క మొగము చంద్రుఁడు; తామర పువ్వు. కన్నులు కరములు తామర పువ్వులు - ఇవి యన్నియు కవి సమయములు. వీనినన్నిటిని కవులు వ్రాయుచునే యుందురు.

కాని సింధురరాజగమనాధమ్మిల్లబంధమ్ము సహజ గంధమ్మనుట కవి సమయముకాదు. కాని దీనినొప్పుకొనుటలేదు.

అప్పుడు శివ బ్రాహ్మణుఁడేమిచేయును.

"ఉత్తములారా! నాకివి తెలియవు." అన్నాడు. ఉత్తములార! అనుటలో నతఁడుపడిన దిగులంతయు నున్నది. అతఁడు పడిన భయమంతయు నున్నది. సరే! నీవింత సాహసమెందుకు చేసితివని యడుగుదురేమో! "నాకిది భగవంతుడు వ్రాసియిచ్చినాఁడు నేను తెచ్చితి" ననినాఁడు.

అతని ముఖ లక్షణములు చూడఁగానది నిజమే యనిపించుచున్నది. అందఱు నూరకుండిరి అతనిని పోనిచ్చిరి అతఁడు బ్రతుకు జీవుడాయని బయటపడినాఁడు.

ఈ సంగతులన్నియు కవి చెప్పడు పాఠకుఁడర్థము చేసికొనవలయును.

అతఁడు తిరిగి దేవాలయమునకు వచ్చెను. వచ్చి స్వామితో నిట్లనెను. "నిన్ను నమ్మిపోయి సభలో సిగ్గుచెడితిని. ఉన్న కథలు చెప్పనేల?" అని మొదటిమాట. ఉన్నకథలు అనఁగా నిన్ను నమ్మినవారందరు సిగ్గుచెడుదు రని యర్థము. పరమేశ్వఁరుడు ధనమిచ్చునా? వైరాగ్యమిచ్చును. అనఁగా సిగ్గు చెఱుపును. గోపికావస్త్రాపహరణములోని రహస్యము.

"తానెఱిగిన విద్య నృపా
స్థానములో నెఱపఁ గీర్తి సమకూరుంగా
కే నరునకుఁ బరవిద్యా
ధీనత భూపాల సభలఁ దేజముగలదే?"

పరవిద్యాధీనత - పరవిద్య యనగా ఇతరులయొక్క విద్య యని, మోక్ష విద్యయని. "మోక్ష విద్యకు రాజసభలలో పాటింపులేదు. రాజులు, రాజకీయ జనము అధికార ధూర్వహులై పరమును లెక్కఁజేయరు" అని ధ్వని.

నీ మాటలు నమ్మి నేను మోసపోయితిని. నత్కీరుఁడు నన్నెన్ని మాట లన్నాఁడు? ఆ మాటలు పడుటకంటె ఈ కరువుతో చచ్చిపోయినను బాగుండె డిది. అని సద్భక్తసిధీయని సంబోధించినాడు.

అనఁగా నా శివ బ్రాహ్మణుఁడు తాను సద్భక్తుఁడు కాడని తన్ను తాను నిందించుకొన్నాఁడని యర్థము.

అని శివ బ్రాహ్మణుఁడు మరియు నిట్లనెను. "స్వామీ! నా యదృష్ట మిట్లుండగా నిన్నును నత్కీరుని అన్నఫలమేమి? ఎక్కడికైనను పోయి బిచ్చ మెత్తుకొందును. నీకు భద్రమగుగాక! నన్ను వదలిపెట్టుము.

అనఁగా శివునకు దయకలిగి యిట్లనెను:

"కటకట! యన్నత్కీరుం
డట! కవితయుఁ దప్పువట్టెనఁట! యటుపదమీ
యెటువలెనో తెలిసెద!" నని
నిట లాక్షుఁడువచ్చి కుంభినీపతి సభలోన్"

ఆ నత్కీరుఁడు - అన్నత్కీరుఁడు. రెండు నొక్కటియే. కాని యుచ్చార ణలో అన్నత్కీరుఁడనుట చేత తిరస్కార మున్నది. ఆ నత్కీరుఁడన్నచో

నంత తిరస్కారము భాసించదు. ఆ నత్కీరుఁడన్నచో ఆ లక్షణములు గల నత్కీరుఁడని మాత్రమే వ్యంగ్యము. ఇది సూక్ష్మమైన విషయము. పాఠకుని ప్రతిభ చేత మాత్రమే తెలిసికొన దగినది.

'అటు పదమీ! యెటువలెనో! తెలిసెద.'

ఎటువలెనో - ఎట్లాగో! అర్థమిది గాని యెటువలెనో అని విడబఱచి చెప్పుటలో (పైగా ప్రాసయు గణమునిట్లే కుదురును) నొక యాక్షేపమున్నది. ఒక తిరస్కార మున్నది. లోకములో నొక్కొక్కప్పుడు కోపము వచ్చినప్పుడు కొన్ని మాటలను విడబఱచి యందురు. అవి కోపమునకు వ్యంజకములు.

ఇది యంతయు వ్యంగ్య ప్రపంచకము. తెలిసికొనినచో రసావిష్కారము జరుగును. ఇది కావ్య పఠన పరమార్థము.

అని శివుఁడు రాజు సభకు వచ్చి —

శివ బ్రాహ్మణుఁడు రాజ సమ్ముఖంబునకు బోయి - అని వ్రాయఁబడెను. ఇచట నిటలాక్షుఁడు వచ్చి కుంభినీపతి సభలోన్ అని వ్రాయఁబడెను.

రాజసమ్ముఖమునకుఁ బోయి యనుటలో శివ బ్రాహ్మణుఁడు రాజ దర్శనము లభించుటకు పడిన కష్టము రాజసమ్ముఖమన్న శబ్దము చేత తెలియు చున్నది. ఇచట శివుఁడు వచ్చి సభలో నిట్లన్నాడు. అని యున్నది. దీనిలో శివుఁడు వచ్చిన పటాటోపము, ద్వార పాలకులను లెక్కచేయక పోవుట, ఆయన లక్షణమునుఁ జూచి ద్వారపాలకులడ్డగింపక పోవుట తెలియు చున్నది.

ఇట్టివన్నియు రహస్యములు. ఇందేమియు విశేషములు లేవని సామాన్య పాఠకుఁడను కొనును. కొందఱు కవులు వీనినిఁ గూడఁ జెప్పుదురు. కొందఱు గడుసు కవులు ప్రయోగించిన శబ్దములచేత దానిని పాఠకుఁడూహించ గలిగినచో నూహించుటకు వదలి పెట్టుదురు. ఇచ్చట నేమియు లేదు. కాని యున్నది.

ఇట్టి వదలి పెట్టుటలు కథలో నున్న ప్రధాన లక్షణములకు భంజకములు గావు. కాని కథాగమనములోని గడుసు దనమునకు చాల యుపయోగించును.

శివుఁడు వచ్చి యిట్లనెను !—

"ఈ రాజన్యుని మీద నే కవిత సాహిత్యస్ఫురన్మాధురీ
చారు ప్రౌఢిమఁ జెప్పి పంప విని మాత్సర్యమ్ము వాటించిన
త్కీరుండూరక తప్పువట్టెనఁట! యేదీలక్షణంబో, యలం
కారంబో, పదబంధమో, రసమో? చక్కఁజెప్పుఁడా తప్పునన్."

ఈ పద్యములోని యర్థము సరిగా నట్టి సమయములో సమర్థుడైన యొక మహాకవి యన్న మాటలే!

'సాహిత్య స్ఫురన్మాధురీ చారు ప్రౌఢిమ' అన్న సమాధానము మాత్రము తన కవిత్వము చాల గొప్పది యని యా వక్త చెప్పుచున్నాఁడన్నది యర్థమే గాక వ్యంగ్యము కూడ భాసించుచున్నది.

లోకములో సామాన్యముగా "నేను బ్రహ్మాండముగా చెప్పితి'' నందురు. అప్పుడు గొంతు పెద్దది చేయుదురు. ఆ భావము వక్త యొక్క బొమ్మలో కంఠములో మొగములో భాసించుచుండును. ఈ సమాస గ్రథనమాలక్షణము లన్నింటిని ధ్వనించు చున్నది.

అనఁగా నత్కీరుఁడు పూర్వమువలెనే మరల తప్పనెను. అంత శివుఁడు "గిరితనయా ఘనకచ భారమ్ము సహజ గంధం'' బన్నాడు. పార్వతీ దేవి ధమ్మిల్లము సహజగంధ మన్నాఁడు,

అనఁగా నత్కీరుఁడు "పార్వతీదేవి కైనచో నగుగాక! లోకములోని స్త్రీలకు కాదు" అనెను. అని నిరాకరించెను.

ఇచ్చట నెన్నియో రహస్యములు కథలోనున్నవి. శివుఁడుఁగా వచ్చెనా? రాలేదు. శివుఁడేమో యన్న సందేహము కలుఁగునట్లు వచ్చెనా? అట్లు వచ్చి యుండవచ్చును. పార్వతి యొక్క జుట్టు సహజగంధ మనుటకు సామాన్యుఁ డెవడు, శివుఁడే యనగలఁడు. అతఁడట్లన్నప్పుడు నత్కీరుఁడు తటపటాయించి నాఁడు పార్వతీదేవి ధమ్మిల్లమ్ము సహజ గంధమో కాదో నీవెవఁడవురా చెప్పుటకు అన్నాఁడా? అనలేదే! పార్వతి కైనచో కావచ్చును. తక్కిన స్త్రీలకు కాదన్నాఁడు. అనఁగా నత్కీరునకు వాఁడు శివుఁడేమో యన్న యనుమానము లేకపోలేదు.

ఈ యనుమానము లన్నియు వెనుకఁబెట్టి ధూర్జటి జరిగిన సంభాషణను వ్రాసెను. ఇదియొక విశిష్టమైన రచన.

ఇట్టి రచన కథలు వ్రాయుటలో చేయవచ్చుఁ గాని అధునికములైన వ్యక్తిగతానుభవములు వ్రాసెడు కవితలో నిట్టివ్యంగ్య వైభవము చూపుటకు వీలులేదు.

కథా కవిత్వమైననే రసోదయము కలుగును. వ్యక్తిగతానుభవములను రచించుట యందెప్పుడును రసోదయము కలుగదు.

కవితా సమయములు సర్వజనాంగీకృతములు. వ్యక్తిగతానుభవములు కవిత్వమునకు పనికిరావు. ఎవరో కొందరు వారిలో వారు సంతృప్తి పడవల యును. ఈ మహార్థము నిచ్చట నత్కీరుఁడు నిరూపించినాఁడు. అట్టి వాదము 'గగనప్రసూనవాద' మన్నాడు.

అచ్చట నత్కీరుఁడెవఁడు? ఆ పాండ్య రాజ ద్రవిడ భాషా పీఠశంఖ ఫలక మహాసభ కధ్యక్షుఁడు. అతఁడు కవిత్వమునకు శాస్త.

ఈ కథ విచిత్రముగా నున్నది.

నత్కీరుఁడు రసప్రధానమైన కవిత్వమునకు ప్రతినిధి. ఇచట శివుఁడు వ్యక్తిగత కవిత్వమునకు ప్రతినిధి.

నత్కీరుఁడు సామాన్య మానవుఁడు. శివుఁడు పరమేశ్వరుఁడు.

నత్కీరుఁడు "ఈ లూలామూలపు మాటలు వదులు" మనెను.

శివుడిట్లాలోచించెను. "వీనికి నేను శివుడనో కానో తెలియుటలేదు, వీనికి సందేహముగానే యున్నది. నిజమే చూపించెద" నని తన నొసలగల మూడవ కన్ను చూపించెను.

ఇచ్చట నున్నది కథలోని గడ్డు.

అప్పుడు నత్కీరుఁడేమనవలయును. సాష్టాంగపడి క్షమించుము, నీ కవిత్వము బాగుగనే యున్నదనవలయును.

అనఁగా ఒక వ్యక్తియొక్క గొప్పదనమునకో యొక రాజుయొక్క యధికారమునకో యొక సంఘము యొక్క దౌర్జన్యమునకో తాను దాసుఁడై పోవుట.

అయినచో నేమగును? యథార్థమైన రసవత్కవితకే ద్రోహము చేసిన వాఁడగును.

ఎప్పుడు శివుఁడు కవిత్వము వ్రాయడు. ఎప్పుడు నొకరాజు కొందరు కవులను వెంటవేసికొని యుండడు. సర్వకాలములయందు సర్వదేశముల యందు సంఘము కొన్ని దుష్ట లక్షణములు గలిగిన కవిత్వమునే యభినందించుచుండదు. అందుచేత శివునినైన నెదిరించి తీరవలయును. లేనిచో సాహిత్య ద్రోహము జరుగును.

లేనిచో శివుఁడు తన్ను శపించవచ్చును. మన్మథుని దహించినట్లు దహించవచ్చును. పోనీ అయినచో తానొక్కఁడే యగును. లేనిచో రసోవైసః, అహం బ్రహ్మాస్మి మొదలైన మహార్థములకు స్థానభూతమైన రస వత్కవిత భంగపడును.

సత్కీరుఁడింతటి గొప్పవాఁడు. అప్పుడతఁ డిట్లనెను.

"తలచుట్టు వాఱఁ గన్నులు
గలిగినఁ బద్యంబు దప్పుగాదన వశమే?
వలదిచ్చట నీ మాయా
విలసనములు పనికిరావు విడువు" మటన్నన్.

నత్కీరునకు శివుఁడు శివుఁడని తెలిసెను. శివునకు ఫాలమునందు కన్ను కలదు. ఒక్క ఫాలము నందుకాదు. తల చుట్టును కన్నులుండనిమ్ము తప్పు తప్పే యన్నాడు. దీనియందెంతో యర్థమున్నది. అనంత కల్పముల యందు శివులనేక మంది యుందురు. వారు మోక్షమిత్తురు. సాయుజ్యమిత్తురు. ఈ మోక్ష సాయుజ్యములు కల్పాంతము వఱకే. రసము నిత్యమైనది. అహంబ్రహ్మాస్మి లక్షణము కలది. అని యెడు గొప్ప అద్వైత సిద్ధాంత ప్రతిపాదనము జరుగు చున్నది.

శివునకుఁ గోపము వచ్చినది.

శపియించెం బ్రతి భాషలఁ
గుపితుండైన రుద్రుఁడతని "గుష్ఠ వ్యాధిం
దపియింపు" మనుచు దానికి
నపరిమిత భయమ్మునంది, యతడిట్లనియెన్.

ఈ పద్యము మొదట మూడు మాటలు ఆరారు మాత్రలతో చేసి మొదటి రెండు రెండు అక్షరములు రెండు రెండు మాత్రలుగా చేయుటలో వచ్చిన నడక చేత వారి వాదన లక్షణము శివునకు వచ్చిన కోపలక్షణము ధ్వనితమగుచున్నది.

మహాకవిత్వ మనగా నిట్లుండవలయును. కవులివి తెలిసికొని వ్రాయ వలెను.

తెలిసికోకుండ వ్రాసినవాఁడు కవి. తెలిసి వ్రాసిన వాఁడు మహా కవి, మహాకవి లక్షణము లింకను చాలకలవు. ఇది యొక లక్షణము ఇది ప్రధానమైన లక్షణము. రచనకు సంబంధించిన లక్షణము.

అపుడు నత్కీరుఁడు స్వామి పాదముల మీద పడి రక్షించుమన్నాఁడు. శివుఁడు ''నీవు కైలాస పర్వతము చూచినచో నీకీ శాపము తీరు''నన్నాఁడు.

నత్కీరునకు కుష్ఠవ్యాధి వచ్చెను.

తరువాత చాలా కథయున్నది.

అతఁడనేక తీర్థ యాత్రలు చేసెను. నత్కీరుడొక భూతము చేతికి చిక్కెను. అచ్చట నతనికి సుబ్రహ్మణ్యస్వామి ప్రత్యక్ష మయ్యెను.

కైలాసమునకు పోవుట సాధ్యముకాదు గదా ? అప్పుడు కుమార స్వామి వానికి నొక కీలకమును చెప్పెను. స్వామి కైలాసమ్మన్నాడు కాని ఉత్తర దిశా కైలాసమనలేదు కదా ! నీవు దక్షిణ దిశా కైలాసమునుఁ జూడుము. అనగా శ్రీకాళహస్తి.

అనగా నత్కీరుఁడు శ్రీకాళహస్తి పురమువచ్చి స్వామిని సేవించెను. అతని కుష్ఠ వ్యాధి మానెను. అతఁడు నూరు పద్యములతో శివస్తోత్రమును వ్రాసెను. స్వామి సంతోషించెను. ప్రత్యక్ష మయ్యెను.

> ప్రత్యక్షంబగుచున్ ''భవద్భవము సాఫల్యంబు నుం బొందె: సా
> హిత్య శ్రీవర ! నీకు నింపగు వరం బే నిచ్చెదన్ వేడు, భీ
> తిత్యాగం బొనరించినాడ'' నన నత్కీరుం డుమాజానికిన్
> బ్రత్యగ్జ్యోతికి మ్రొక్కి మ్రొక్కి, ప్రమద ప్రాయాంత రంగంబుతోన్.

ఈ పద్యములో నున్న సొగసేమనగా శివుఁడు నత్కీరుని "సాహిత్య శ్రీవర!" అని సంబోధించెను. అనఁగా శివుఁడు నత్కీరుని సాహిత్య సిద్ధాంతము నంగీకరించినాడని యర్థము. పట్టుదల చూపించినది శివుఁడు నత్కీరుఁడు కాడు,

నత్కీరుఁడేమి చేసినాఁడు? భీతిత్యాగం బొనరించినాఁడు. అనఁగా భయమును వదలి పెట్టినాడు. భయము జంతువుల లక్షణము. జంతువుల లక్షణములు నాలుఁగు. ఆహార నిద్రా భయ మైధునములు. నత్కీరునకు జంతులక్షణమప్పుడే లేదు.

అతఁడు ముక్తుడు. ముక్తునకుండవలసిన ప్రధాన లక్షణ మతని యందున్నది. అతఁడు రసనిష్ఠుఁడు. ఐనచో నీ కుష్ఠువ్యాధి యేమి? ఈ సంచరించుట యేమి: ఇది యంతయు ప్రారబ్ధము,

శివుఁడు చివరకతనికి సాయుజ్యమిచ్చెను. ఈ కథయందు మన మతము యొక్క సర్వరహస్య మిమిడి యున్నది.

ఉత్తర హరివంశము

ఊర్వశి కథ

నరకాసురుఁడు స్వర్గ లోకము మీదికి దాడి వెడలి దేవతల నందఱను జయించెను. అష్టదిక్పాలకులను జయించెను. రాక్షసులు దేవలోకములో చేయరానన్ని చెడ్డపనులు చేసిరి. స్వర్గపుర మంతయును దోచిరి. అనేక ఘాతుక కృత్యములు చేసిరి. ఆ దుష్టపు పనులన్నియు జూచి నరకాసురుఁడు నవ్వుచుండెను. అతఁడు ఇంద్రుని యొక్క మందిరమునకు వెళ్లెను. ఈ లోపుననే యింద్రుని యొక్క భార్యలందఱు రహస్యముగా పారిపోయిరి. ఇతఁడంతఃపురమును ప్రవేశించెను. అంతఃపురములో నింద్రుని భార్యలకోసము వెదకెను. వారెవరునుఁ గనిపించలేదు.

అప్పుడువచ్చి సభామంటపమున రత్నసింహాసనము మీద కూర్చుండెను. దేవత లెవ్వరునులేరు. తానొక్కరుఁడును గూర్చుండెను. తాను తన రాక్షస మంత్రులునుఁ గూర్చుండిరి.

ఆ నరకాసురునకు కొన్ని యేండ్ల నుండి యూర్వశి మీద మమకారము. రంభ, ఊర్వశి, తిలోత్తమ—వీరందఱును అప్సరః స్త్రీలు, అనగా దేవలోకము లోని వెలయాండ్రు.

ఈ యూర్వశిని నారాయణ మహర్షి తన తొడకోసి యాలోపలనుండి తీసెను. అనఁగా సృష్టించెను. అందుచేత నీమె శ్రీమన్నారాయణుని కుమార్తె.

బ్రహ్మ సర్వజీవులను సృష్టించెను గదా ! అతఁడు పితృస్థానమునం దుండును. ఆయనయే సరస్వతిని గూడ సృష్టించెను. అందుచేత సరస్వతి బ్రహ్మకు కూతురు. ఆమెను పెండ్లియాడెను. ఇది దోషముగా నిప్పటికిని జనులు చెప్పుదురు.

వేదమునందొక కథయున్నది మొట్టమొదట ప్రజాపతి యుండెను. ఆయన తానొంటరిగా నున్నాఁడని భయపడెను. ఇంకెవఁడైన నున్నప్పుడు భయముగాని తానొక్కఁడే యున్నప్పుడు భయమెందుకు ? ప్రజాపతి సాక్షాత్ ఆత్మ స్వరూపుఁడు ఆత్మ యొక్కటియే కదా ! ఆత్మ నిర్భీకమైనది కదా ! ప్రజాపతియు నిట్లే తలంచెను. తలంచి తాను పడ్డ భయమున కర్థమేమియని ప్రశ్న వేసికొనెను. ఇది భయముకాదు. ప్రజాపతి సృష్టించ వలయును. సృష్టించుట యెట్లు ? ప్రజాపతి యూహించెను. తన పరిష్వంగమున కనుకూలమైన మరియొక వ్యక్తిని సృష్టించవలయును. ఆ వ్యక్తి స్త్రీ యైనది. ఇచ్చట పరిష్వంగ మన్న శబ్దము చాల అగాధమైన యర్థము కల శబ్దము.

అది యట్లుంచి ప్రజాపతి తాను సృష్టించిన స్త్రీయందు తాను సృష్టి చేయ వలయును ఆమె తనకు కూతురు. బెండ్లి యాడుదురా ? కూఁతునందు సంతానముఁ గందురా ? కన్నచో మహారాక్షసులుదయింతురు. ఇట్టి కథ శ్రీ కాళహస్తి మాహాత్మ్యమునందు కలదు.

అందుచేత ప్రజాపతి యీ స్త్రీ పురుష ద్వంద్వ లక్షణమును బురస్కరించుకొని మేకలను గొఱ్ఱెలను గఱ్ఱములను సృష్టించెను అందుచేత నది ప్రథమ సృష్టియైనది. ఆ కథ కిచ్చట ప్రసక్తిలేదు.

ఇక్కడనున్న ప్రసక్తి యెంతవర కనఁగా నూర్వశి నారాయణ మహర్షి కూతురన్నంతవరకు. నరకాసురుఁడెవ్వడు ? నరకాసురుఁడు భగవంతుడైన నారాయణుడు వరాహావతారమెత్తినప్పుడు భగవంతునకును భూదేవికిని కలిగిన సంతానము అనఁగా వీఁడు నారాయణుని కుమారుఁడు. ఊర్వశి నారాయణుని కూఁతురు వీరిద్దఱు నన్నయు చెల్లెలు. వీని కామె మీద మోహము. ఇది రాక్షస ప్రవృత్తి.

ఒక దుష్టమైన యూహ యెందుకు కలుగును ? వానియందు రాక్షస ప్రవృత్తి యుండవలయును. అది యెందుకుండును ? వాని పూర్వజన్మ దుష్ట సంస్కార వశమున నుండును.

ఇట్టి యూహలకు ఫలమెప్పుడును దుష్టముగానే యుండును.

వాఁడు దేవేంద్రాదులను గెలిచెను. చక్కఁగా స్వర్గము నేలుకొన వచ్చును. వానికి నాశన మాసన్నము కాఁబోవుచున్నది. వాని కూర్వశి మీద కోర్కె యున్నదని యెవ్వరికిని తెలియదు.

వాఁడు రత్నసింహాసనమునఁ గూర్చుండి "ఊర్వశిన్ దోడి తెమ్మ" నెను ఈ మాట హఠాత్తుగా ననెను.

ఈ కవి నరకుని చేత నీ మాట నంత హఠాత్తుఁగా ననిపించెను.

అంత హఠాత్తుగా ననిపించిన దాని వ్యాఖ్యానమే పూర్వము చేయఁ బడినది.

ఆమెనుఁదోడి తెమ్మని యొక్కనిఁ బంపెను. పది మంది వెళ్ళిరి. ఈ లోపుఁగా నరకాసురుఁడు గంధర్వుల సంగీతము వినుచు కూర్చుండెను.

"వెదకం బోయిన దైత్యులు
పొడగని, యూర్వశి, తొలంగి పోనేల ? నినుం
దొడి తెమ్మనె మారాజదె
బడి బడి వచ్చెదరు వేగ పనిబను మనినన్.

వెదుకఁబోయిన రాక్షసు లూర్వశిని చూచినారు ఆమె తొలఁగి పోఁబోవు చున్నది-ఆమె తొలఁగిపోబోవుచున్నదన్న విషయము వీ రన్నదాని వలెనే తెలియవలెను-వారన్నారుకదా! "నినున్ దొడితెమ్మనెమారాజు." తొడితెమ్ము- ఈ శబ్దము నిజముగా తోడితెమ్ము అని యుండవలెను. కాని యీ కవి "తొడిగా" వాడినాఁడు. ఇతరకవులెవ్వరు నిట్లు వాడలేదు. 'తొడి' యన్న క్త్వార్థకము తిక్కనాదులు వేఱే యర్థమునందు వాడుదురు. యుద్ధవీరులు యుద్ధమునకు బయలుదేరునపుడు "తొడిపూసికట్టి" అని వాడుదురు. 'తొడి' యనగా నిను ఏకవచనమునఁ దొడిఁగికొని యనియర్థము. తొడుఁగు అన్న ధాతువు చివరి 'గ'కారము పోయి తొడు ధాతువగును. దీనిమీద నుండియే తొడవు అన్న శబ్దము వచ్చెను. తొడవు అనగా నలంకారము. కట్టి యనగా దిండుకట్టి. శిరస్త్రాణము పెట్టుకొనుటకు తలచుట్టు దిండువలె పెట్టుకొందురు. పూసియనఁగా వీరగంధ మును బూసికొనుట.

కాని నాచన సోమన్న 'తొడి తెమ్మనె' అని వ్రాసినాఁడు.

బిబిబి వచ్చేదను. వెంబడివెంబడి వచ్చుచున్నారు. అనఁగా మారాజు నీకోసమెడతెరిపిలేకుండ మనుష్యులను బంపించుచున్నాడని యర్థము.

అనఁగా నామె 'దిట్ట'. అనఁగా గడుసరి. ఆమెకు భయమువేసినది.

ఎప్పుడు నరకాసురుఁడు స్వర్గమును జయించెనో ఎప్పుడు రాక్షసులు అమరావతిని దోచుకొనుచుండిరో యప్పుడే యామెయు భయపడెను. ఇంతలో నదేమి యిదేమియని నరకాసురుఁడు తనకోసమే కబురుపంపెను.

అంతకుముందే యామె నగలన్నియుఁ దీసివేసెను. తలలోని పూవులు పారవేసెను. మైనిగంధపు పూత రాల్చివేసెను. ప్రాతచీర కట్టికొనెను. రాక్షసునివద్దకు వచ్చెను. ఆమె పెదవులమీద సహజముగానున్న చిరునవ్వేలేదు.

> "దనుజేంద్రుఁడా తలోదరిఁ
> గనుఁగొని చొళ్ళెంబునిమురు క్రమ్మనఁ బైకొం
> గనువుపఱుచు గేదఁగిరే
> కు నఖంబులఁ జీఱు గులుకుఁగోర్కులఁదేలున్ !

ఈ పద్యము చాల చమత్కారమైన పద్యము. ఇట్లెవ్వరును వ్రాయరు. అచ్చు వేసినవారుకూడ సరిగా నర్థముచేసికొన్నట్లులేదు. అతనికి కులుకు కోర్కులు కలిగెను. ఆమె చొళ్ళెమ్ము నిమురవలెనని యామెపై కొంగు సర్దవలెనని యామెచెక్కిళ్లు గోళ్ళతో గీరవలయునని - యిక్కడ చెక్కిలి బదులు గేదఁగిరేకు వాడినాడు. ఉపమేయముఁబదులు ఉపమానమును వాఁడినాడు ఇది రూపకాతిశయోక్త్యలంకారము.

ఈ పద్యములో నున్న సొగసేమనఁగా నిమురు, అనువుపఱచు, చీరు- ఈ మూఁడు అసమాపకక్రియలు కోర్కులు అన్నమాటకు విశేణములు. అవి మూఁడును తద్ధితార్థక క్రియాజన్య విశేషణము. నిమురు కోర్కి; అనువుఅచు కోర్కి; చీరుకోర్కి, అని ప్రతి కవియును వ్రాయును కాని యితఁడు మొదటి రెండువిశేషణములు వెనుక వదలిపెట్టి తరువాత నన్వయము చేయవలసిన గడుసుఁదనము వెలయించెను.

ఈ లక్షణమంతయు నూర్వశి చిత్తములో తెలిసికొనెను. ఎట్లు తెలిసికొనెను? ఇదియొక యాశ్చర్యము. వాని కన్నులలో వాని భంగిమలలో వాని హస్తాదిచాలనములలో అట్లట్లు చేసెడి కాముకులను మున్నామె యెఱుఁగు గనుక నామె తెలిసికొనెనని యర్థము.

తెలిసికొని వానికిఁ దనయందు కోర్కెకలదని యామె లజ్జను వహించెను.

వెనుకటి భయము పోయినది. ఇంతకు ముందువఱకు తెలియనిస్థితి. ఇప్పుడు తెలిసినస్థితి. అతఁడు తనయందు ప్రేమకలవాఁడని దెలిసినంతనే యామెకు సిగ్గు వచ్చెను. ఆమెకు సిగ్గురాలేదు. ఎందుచేతననఁగా "పూనిన లజ్జన్'' అని వ్రాసినాఁడు. లజ్జనామె పూనెను ఆమెను లజ్జ పూనుకొనుట వేఱు లజ్జ యామెను పూనుట వేఱు. ఆమెను లజ్జ పూనెననఁగా నామెకు లజ్జ సహజముగా నుదయించెనని యర్థము. ఆమె లజ్జను బూనెననఁగా ఆమె సిగ్గు నభినయించినదని యర్థము.

అంతనామె యేమిచేసినది? ప్రక్కనున్న స్తంభము దగ్గఱకుబోయి యొక బొమ్మవోలె నిలుచుండెను.

నరకాసురుఁ డామెనుఁజూచి యిట్లనెను. "యుద్ధములో నింద్రుఁడు నా కోడిపోయెను. దిక్పాలకులందఱు పారిపోయిరి. వారివారి భార్య లెందుఁ బోయిరో తెలియదు. నీవుకూడ నమరావతి నెందుకు వదలిపెట్టినావు? ఆమె వదలిపెట్టి పోలేదుకదా? లేదా ఆమె వదలిపెట్టి పారిపోవుచుండఁగా నా పంపఁ బడిన రాక్షసుఁడు ఆమె నూరిబయట పట్టుకొన్నాఁడేమో- ఆ యర్థము దీని యందున్నది

నీ వెందుకు పోవలయును? నీవు పొత్తులదానవు. అనఁగా నీ వొక్కని స్త్రీవికావు. పలుమంది వాంఛింపతగినదానవు. పలుమంది నిన్ను వాంఛింతు రనికూడ నర్థము.

అతఁడు రంభకోసము పంపలేదు. తిలోత్తమకోసము పంపలేదు. మరి యెవ్వరికోసము పంపలేదు. ఒక్క ఊర్వశికోసమే పంపెను తన సౌందర్యమే యతనికి నచ్చెనని యర్థము.

ఒకానొక స్త్రీయొక్క సౌందర్య మీరీతిఁగా నొకనికి నచ్చినచో నా స్త్రీ సంతోషపడునా? పడదా? పడునో పడదో యట్లుంచి యట్టివానిని తిరస్కరింపఁ గలదా? వానియందొక యభిమానముండదా? యుండును.

అతఁడు మరియు నిట్లనెను.

నాకపురమ్ములో మెరసి నందనకేళిఁజరించి దివ్య కాం
తాకరతాల వృంత సముదాయ సమీరము సోఁక రాజ్యముం
గైకొని నేఁడు దిగ్విజయ గౌరవధన్యుఁడనైన నా సభన్
నీ కనుదోయి వెన్నెలలు నిండక కోర్కులు నాకు నిండునే!

వాచన సోమన్న వ్రాసెడు ప్రతి పద్యమును జాగ్రత్తగా జూడవల యును. పై మూఁడు చరణములు తన గెలుపును దాను ప్రశంసించుకొను చున్నాఁడు. నాల్గవ చరణములో రచనమెత్తపడినది. నీ కనుఁదోయి వెన్నె లలు నిండక' - ఆ యూర్వశియం దతనికిఁగల కోరిక యెంత సుకుమార మైనదో వ్యజ్యమానమగుచున్నది.

తనయందంత మెత్తనివలపుఁ గలవానిని ఊర్వశి యేమనఁగలదు?

అని యతఁడు మరియు నిట్లనెను:

"అవిగో! యింద్రుని రథములు. అవిగో! కుబేరుని యేనుగులు. అవిగో వరుణుని గుఱ్ఱములు. అవిగో యమునియొక్క పిరానకులు. నా దైత్య భటులు దేవతల సొమ్ములన్నియుఁ దెచ్చినారు. వీనిలో నీ కేవి కావలసిన వానినిఁ దీసికొమ్ము.

తొలుత నీతో నిట్లు మంచిగామాట్లాడి చివరకు నిన్ను పరిత్యజించి పదిమంది స్త్రీలలో నీకు పరాభవముఁ దీసికొనిరాను. నీవు నన్ను పొందినచో నుభయలోక సుఖమ్ములు నీ లోగిట చేర్చుదును. ఆమె లోగిట - ఆమె యింటి యందు నుభయలోక సుఖములు చేర్చునట. అనఁగా నుభయలోక సుఖసాధన ములని యర్థము.

నరకాసురుఁ డిట్లనఁగా నామె యేమిచేయును? ఆమె కతనియందను రాగములేదు. ఆ సుఖము లామెకక్కఱలేదు అతఁడు తన్నంత మెత్తగా

నూహించుచున్నాఁడు. ఆమె చింతాక్రాంతురాలైనది. ఏమిరా యీసృష్టి! అతఁడు నన్నింత ప్రేమించుచున్నాఁడు. అతనియందు నాకు ప్రేమలేదు. ఇతనికి నేనేమి చెప్పవలయును? అన్న దుఃఖమామె నావరించినది.

కానీ యిప్పు డితనినుండి తప్పించుకొనుటయెట్లు? ఇతని ప్రేమ యెంత నిజము? ఇది నిజముగా ప్రేమయా కామ ప్రవృత్తియా? ఆ రెంటిలో నేదియో తేల్చికొనినగాని తానొక నిశ్చయమునకు రాఁజాలదు. ఆమె యిట్లన్నది-

"చతురవచో విలాస గుణసాగర సాగరమేఖ లావనీ
పతియగు నీకు నింతులొక ప్రాఁతియె! నీ విటు గోరుటెల్ల నా
యతులిత భాగ్యః మింతనిజ; మైకఁ గలంగకమున్న వైభవో
న్నతి మెఱయంగవచ్చి యొక నాఁడజనన్ నను గారవించితే."
నావుడు దానవేశ్వరుఁడు నవ్వుచు నూర్వశితోడ నిట్లనున్
"నీవిటు దూఱనేరువని నేరమివెట్టితి గాకయేను మీ
దేవతలున్న వీటి కరుదెంతునె! మింటటికంబుచేఁతకై
లావునరాక వేఱొక తలంపున వచ్చినఁ గీడుపుట్టదే?"

అతనిని పొగడినది. నేర్పుగల మాటలలో నిన్ను పోలెడువాఁడు లేఁడన్నది. సముద్ర పర్యంతముగల ధారుణికంతకు వాఁడే రాజన్నది. అని నామీద నీకింత ప్రేమయున్నచో నీ వొక్కనాడైనను నావద్దకు వచ్చితివా అన్నది.

అతఁడేమన్నాఁడు? నేను చక్రవర్తినిగదా! ఈ పనికోసము నేను నా శత్రువుల యూరునకు రావచ్చునా? నే నెట్లు రాగలను? నీవు నాయందు నేరమునుఁ జూపింతువుగాని. అనఁగా నామె నీవు రాలేవు సరే! నాకు వార్త పంపినచో నేను రానాయన్నది.

దానికతఁ డింకేదైన సమాధానము చెప్పియుండవచ్చును. కాని యతఁ డిట్లన్నాఁడు.

"పగవాఁడట దేవేంద్రుఁడు!
మగువా నీవతని కొలువు మానిసిపట! నిన్
దగవు చెడి పిలువఁ బనుచుట
మగతనమే? యిట్టి లంజెమాటలు గావే."

ఇంతవఱకతని ప్రేమ మధురముగా మెత్తగానుండెను. ఆమె చొళ్ళెము నిమురుట. పై కొంగనువుబఱచుట. గేదగిరేకు నఖమ్ముల జీఱుట, కనుదోయి వెన్నెలలు - నేను కొఱగానివాడను గాను - ఉభయలోక సుఖమ్ముల నీలోఁగిట చేర్తును — నీవు నామీద నేరము పెట్టుచున్నావు — ఈ మాటల న్నియు నతనిగుండెలోని గాఢమైన వాంఛయు నతని వలపులోని మెత్త దనముఁ జెప్పుచున్నవి. ఇచ్చటికి వచ్చునప్పటికి "ఇట్టి లంజెమాటలు గలవే?" అన్నాఁడు.

వెంటనే యామెకుఁ దెలిసినది. అతఁడు తన్నుఁ లంజెగాఁ జూచు చున్నాఁడు. ఆమెయొక్క మనస్సులోని సందేహమంతయు విడిపోయినది.

ఇంక వానిని మోసము చేయవచ్చును. ప్రేమ మెత్తదనము' అను రాగము, వానిలోని సౌకుమార్యము సర్వమును పోయినవి.

వానిది సుకుమారమైన వలపుకాదు. అచ్చముగా కామ ప్రవృత్తి. ధూర్త లక్షణముతో కలసియున్న కోర్కె.

ఆమె చక్కఁగా విచారించెను. ఇట్లనెను :

"లంజియనౌదు నేను విను లావున నీ వమరేంద్రుగెల్చి న
న్నుంజెఱవట్టి తెమ్మని వినోదము చేసితిగాక చిత్తమె
ల్లంజెడియుండ రిత్తయొదలం జవిచేరునె ? చిల్కవోయినం
బంజరమేమి సేయ ? రసభంగము సంగతిలోన మెత్తురే ?
నవ్వులమాటలో నిజమొ నాకములోన ననేకకన్యకల్
మవ్వపుఁదీగెలందెగడు మానినులుండగ నంతవెన్నడో
జవ్వనమమ్ముకొన్న గడసాని ననుంగవయం దలంచితే
పువ్వులు వేడుకైనఁ గడి వోయినవాళ్ ముడు వంగవచ్చునే !

ఆమె వెంటనే యామాటనే యంది పుచ్చుకొన్నది. నేను లంజియ నౌదును. ఇక్కడనొక చమత్కారమున్నది. ఇది చాల సూక్ష్మమైనది.

మహాకవు లాలోచించి వ్రాయుదురు. నిజమైన భావుకుఁడు వాని నాలోచించవలయును. ఎగురగొట్టఁ దలచినచో నన్నియు నెగురగొట్ట

వచ్చును. సంస్కృతములో "లంజా" యన్న శబ్దమున్నది. 'చ', 'జ'లు దంత్యములు, తాలవ్యములునని రెండు విధములు. దంత్యమనఁగా దంతముతో నుచ్చరించెడిది, తాలవ్యమనఁగా దవడతో నుచ్చరించెడిది. తెలుగులో దంత్యము లైన (చే, జే) యిట్లు.

తెలుగులో అకారముతో కూడిన చ, జ లు దంత్యములుగాని తాలవ్యములు కావు. సంస్కృతములోనున్న లంజా శబ్దమును సీతా వసుధా మొదలైన శబ్దము లవలె చివరి దీర్ఘమును దీసివేసి తత్సమములు జేసినచో నున్నదున్నట్టు ఉచ్చరించినచో తెలుఁగులో 'అ' కార సహితమైన తాలవ్య 'జ' కారము వచ్చును. తెలుఁగు దానిని సహించదు అందుచేత దానిని 'లంజె' యని యుచ్చరించ వలెను

ఇట్లుండగా సంస్కృతములోనున్న లంజా శబ్దమునకు రెండుమూడర్థ ములు కలవు. ఆ యర్థములలో రంకుటాలన్న యర్థము కూడ కలదు. శబ్ద రత్నాకర కారుఁడు దంతముకాకుండా తత్సమము చేసి యీ యర్థమును వ్రాసి నాఁడు. అది పొసగదని కాబోలు! తెలుగుఁలో 'ఎ' కార సహితమైన యీ 'జ' కారముతో లంజెయను శబ్దము వచ్చినది ఇది నిజమైన తెలుగుమాట. 'అ'కార ముతో కూడిన 'జ' కారముతోడి యీ శబ్దము తెలుఁగులో నెవ్వరు వాడినట్లులేదు.

రాజన్ శబ్దము సంస్కృతమున నున్నది. తెలుగులోనికి వచ్చునప్పటికి రాజు అను దంత్యమై యూరకొన్నది. ఈ 'లంజె' యన్న శబ్దము ఎకారాంతము. అచ్చ తెలుఁగు శబ్దములో ఎకారాంత శబ్దములకు వైకల్పికముగా 'ఇయమ్' ప్రత్య యము కూడ వచ్చును. కడె-గడియ; విడెము-విడియము; పల్లె-పల్లియ; ఈ రీతిగా లంజె-లంజియ అగును.

ఈ రెండు శబ్దములలో 'లంజె' యన్నమాట యూరికే యన్నటులుండును లంజియా యన్నమాట యీ పలికినట్లుండును. ఊర్వశి యీ మాటను తాను సహించలేదన్న లక్షణము ఈ పద్యము లంజెయన్నమాటలో మొదలు పెట్టుటలో నున్నది. ఇది పరమ సూక్ష్మమైన విషయము. శబ్ద ప్రయోగములోని గడుసు

39949

లోతులు తెలిసినగాని యిది తెలియదు నీవు నన్ను చెఱపట్టి తెమ్మని పంపితివి. ఇది నీకు వినోదము. నా మనస్సు చెడియున్నది. నా శరీరము చిలుకలేచి పోయిన పంజరమువలె నున్నది. ఈ మాటలన్నది. ఇది చాల సాహసము. ఇంద్రుని యోటమి తనకంత కష్టముగా నున్నదని యర్థము. దీనిని నరకాసురుఁడు మెచ్చునా ? అనుటకామే సాహసించినది.

ఎందుచేత ? వాఁడు మరులుకొని యున్నాఁడు. అట్టివానితో నెట్లయిన ననవచ్చును.

తన జవ్వనమెప్పుడో యంగడిలో నమ్ముకొన్నదఁట! -అనఁగా నీవు నన్ను లంజెవన్నావుకదా! నేనిదివఱకే లంజియను నా వలన నీకేమి సుఖము ?

అనఁగా నతఁడు —

"అంజెదవుగాక ననుఁ జెం
తంజేరఁగ నీక యెంతదఱిఁగిన మిరియా
లుం జొన్నల సరిపోవే
లంజెతనములందుఁ గొమిరెలన్ గెలువవటే."

ఇది ప్రసిద్ధమైన పద్యము నీవెంత యౌవనము నంగడిలో నమ్ముకొన్న దానవైనను నీ లక్షణము వేఱు అని యిచ్చట లోకోక్తిని సంగ్రహించినాఁడు. 'ఎంత తఱిగినవైనను మిరియాలుం జొన్నల సరిపోవే' యని ఇట్లు లోకోక్తులను సంగ్రహించుట తెలుఁగు కవిత్వములోనొక సొగసని జనులు భావింతురు. ఈ లోకోక్తులలో కొన్ని గడుసువికలవు. అందులో నిదియొకటి. మరియు నీలోకోక్తి యితనివలననే లోకోక్తులలోనికి వచ్చినదేమో తెలియదు. నీవెంత ముసలి లంజియవైనను పడుచు లంజెలను గెలువలేవా యన్నాఁడు.

ఇప్పుడేమైనది తొలుతటి ప్రేమ యొక్క సౌకుమార్యము, మెత్తఁదనము లోతు అన్నియుపోయి పట్టి కామ ప్రవృత్తి క్రిందకు దిగినది. వీనిని చక్కఁగా నేడిపించవచ్చును.

పీడొాక వ్యామోహములో పడియున్నాఁడు. తేలికగా వీనిని మోసము చేయవచ్చును.

అంపకని యేమన్నదనఁగా : నీకింద్రుఁడోడివాఁడు. నీవతనిని గెలిచితివి అతని రాజ్యముకూడ నీకే వచ్చినది. కాని నీయందొక్కటియే లోపము కనిపించుచున్నది ఆయింద్రుడు హవిర్గ్రహీత. యజ్ఞయాగాది క్రతువులలో హవిస్సు నాతఁడు గ్రహించును. ఆపని నీవు చేసినచో నప్పటికి నీవు సంపూర్ణముగా నింద్రుడవగుదువు.

> "యాజకులు యజ్ఞ భాగ
> భ్రాజిష్ణునిఁ జేయ నిన్ను భావజ సౌఖ్యా
> వ్యాజపద రాజుఁ జేసెదఁ
> దేజము సూ పఱపు దెలుపుఁ దెలుపలకెందున్."

భావజసౌఖ్య పదరాజును జేసెదనన్నది. ఈ సమాసములోనొక వింత యున్నది. సౌఖ్యావ్యాజ పదమువఱకు సంస్కృత శబ్దములు. రాజు తద్భవ శబ్దము తత్సమముకాదు, తత్సమము సంస్కృత శబ్దము తద్భవము తెలుగు శబ్దము. నిన్ను తత్పదాధిపతినిఁ జేయుదును మొదలైనట్లుండవలెను. పదరాజు అని సమాసము చేయకూడదు. కాని యాయన చేసినాఁడు యథార్థముగా విచారించినచో దీనికి గతిలేదు. కాని మహారాజు అని యున్నది. ఇది శబ్దమునకే వికృతి యనవచ్చును. ఇంత సమాసముమీద నిచ్చటనట్లనరాదు.

అని నరకాసురాడామెకు తానట్లు చేయుదునని యొడంబడి యామెను పంపించి – తరువాతి కథయున్నది. ఇతఁడు ఋషులను బాధించుట, వారుపోయి శ్రీకృష్ణదేవునితో జెప్పుకొనుట. శ్రీకృష్ణుడు వచ్చి నరకాసురుని సంహరించుట.

అద్యంతమీకథా స్వరూపమిట్టిది. కవులు వీనినన్నింటిని చెప్పరు, పాఠకులు వట్టి పద్యములు చదువుకొంచుబోవుదురు. బాగుగానున్న పద్యములు గొన్నిటిని, లెస్సగానున్న పలుకుబడుల కొన్నిటిని మాటిమాటికి చెప్పికొనుచు నా కావ్యములు తాము చదివినట్లు తలంతురు. అది యంతన్యాయము గాదు.

ఈ యుత్తర హరివంశము వ్రాసిన గ్రంథకర్తపేరు నాచనసోమన్న. ఇతఁడు వ్రాసినదొక్కటియే పుస్తకము

ఈయనను కొందఱు తిక్కనగారికంటె కూడ గొప్పకవియని చెప్పుదురు. ఇతని కథా కథనము విచిత్రములుగా నుండును. ఇతఁడనేక విషయములను దాచి చెప్పుచుండును. "అన్యదాలోచనామృతమ్." కవిత్వ మాలోచించినకొలఁది యమృతప్రాయము కావలెను. ఆలోచన యక్కఱలేనిది కవిత్వమగునో! కాదో!

అర్జునుని పాశుపతాస్త్ర సంపాదన కథ

ఈ కథ భారతములో ప్రసిద్ధమైనది. అర్జునుడు భారతవీరులలో నందఱకంటె నధికుఁడగుటకు కారణమతని వద్దనున్న పాశుపతాస్త్రము ఇంతకంటె మహాస్త్రములేదు. ఉండదు.

మన పురాణ ప్రపంచకములో దీనికిఁదీటైనది శ్రీ విష్ణుమూర్తి యొక్క సుదర్శనచక్రమొక్కటియే ! మన పురాణములలో శివకేశవులు యుద్ధము చేయుటకూడ నచ్చటయున్నది. అప్పుడు శివుడు పాశుపతాస్త్రము ప్రయోగించినచో శ్రీమన్నారాయణుడు సుదర్శన చక్రము ప్రయోగించును. అప్పుడు లోకము లన్నియు సంక్షోభించును. బ్రహ్మేంద్రాదులు వచ్చి వారిని ప్రార్థింతురు. వారు వానినుపసంహరింతురు,

అట్టి పాశుపతాస్త్రము శివునివద్దనే యున్నది. ఆ యస్త్రముయొక్క సమంత్రక ప్రయోగము శివునకొక్కనికే తెలియును. శివుడు తత్పూర్వమునందుగాని తత్పరమునందుగాని యీ పాశుపతాస్త్రము నెవ్వరికి నీయలేదు. ఈయడు.

శ్రీ మహావిష్ణువు తన సుదర్శనాయుధమును ప్రయోగించిన సందర్భము లనేకములుగలవు. శివుఁడు తన పాశుపతాస్త్రమెన్నడు నెవనిమీద ప్రయోగించలేదు.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో బ్రహ్మ సృష్టికర్త విష్ణువు స్థితికర్త శివుడు లయకారుడు. మహాప్రళయకాలమునందు సర్వ సృష్టిని లయము

చేయుటకొఱకు శివుఁడా పాశుపతాస్త్రమును ప్రయోగించును. దాని శక్తి యంతటిది.

శ్రీమన్నారాయణుఁడు తన సుదర్శనాయుధమునెప్పుడు నెవరికీయలేదు.

శివుఁడే సృష్టిలో నీ యనంతకాలములో నిన్ని మహాయుగములలో నిన్ని కల్పములలో నా పాశుపతాస్త్రమును అర్జునునకొక్కనికి మాత్రమిచ్చెను.

భారతయుద్ధము జరిగినది. ఆ యుద్ధములో నర్జునుఁడు పలుసార్లు చికాకు పడెను. ఒకప్పుడు కర్ణుని చూచి భయపడెను.

అర్జునుఁడు తనవద్దనున్న పాశుపతాస్త్రమును ప్రయోగించి కౌరవ సైన్యమునంతయు కన్నుమూసి కన్ను తెఱచునంతలో • దగ్ధముచేయగలఁడు. కాని యాయన యట్లు చేయలేదు. కారణమేమి ? ఆయన యంత నియమవంతుడు. అంత నిగ్రహముకలవాఁడు. అంత శీలవంతుఁడు. అంతతపశ్శాలి.

ఆయన నిత్యుఁడైన నరుఁడన్న మహర్షి.

పాశుపతాస్త్రము శివునిచేతిలో నెంత భద్రముగానున్నదో యర్జునుని చేతిలోనంత భద్రముగానున్నది.

అర్జునుఁడిట్టి వాఁడని తెలిసియే శివుఁడీ పాశుపతాస్త్రమతనికిచ్చెను.

కనుకనీ పాశుపతాస్త్ర సంపాదనమెట్టిది ? ఆ యస్త్రము తనదగ్గఱ [illegible] దన్న గొప్పకేతప్ప మరియొకందుకుగాదు. ఆ యస్త్రమతనివద్ద నున్న [illegible] పరులు భయపడవలెను. భక్తితోనుండవలయును. మరియొక కారణము [illegible] పించుటలేదు

శివుఁడు తన పాశుపతాస్త్రమును సృష్టిలో నెవ్వరికినీయఁడు కదా ! [illegible] నున కెందుకిచ్చెను. అర్జునుఁడు తనయంతటివాఁడని శివునకు తెలియును [illegible]! ఇది రహస్యము.

అర్జునుఁడు శివునియంతటివాఁడు. శివుఁడు మాత్రముకాదు.
ఈ రహస్యము తెలియనిచో నీ కథలోని రహస్యము తెలియదు.

లోకములో ననేకులు కవులుందురు,

ఒకకవి ఘట్టములను విస్తరించి ప్రసంగములను పెంచి లోకములో వ్యవహారమునందలి తన పరిజ్ఞానమును వెల్లడించును.

మరొకకవి వర్ణనాభాగములను విస్తరించి వ్రాసి "ఆహా !" పుట్టించును.

మరియొకఁడు లోకములోని రాజకీయములు సాంఘికములు తాను వ్రాసెడి కథలో చొప్పించి యనఁగా దానియందారోపించి యది యొక వ్యాఖ్యానముగా చేయును.

ఇవి యన్నియు కొలఁది కొలఁదిగా భాసించు రచన చేసెడి కవులుకూడ నున్నారు.

ఈపైన చెప్పిన సంగతులయొక్క స్పర్శయే లేనివాడు కవియేకాడు. కవి యనిపించుకున్న ప్రతివానియందు నీపై చెప్పిన లక్షణములలో నొకటియో రెండో యుండుచునే యుండును.

వీరందరను మించిన యొకకవి యున్నాడు. వానియందుఁగూడ నీ లక్షణములుండును కాని వీనియన్నింటిని మించిన మహాలక్షణమింకొకటి యుండును. తాను తీసికొన్నకథ యెట్టిది ? దాని స్వరూపమెట్టిది ? దానిలో నున్న రహస్యమెట్టిది ? ఆ మహావిషయము ధ్వనితమగునట్లు వ్రాయును. దానికి ప్రాధాన్యమిచ్చును. వాఁడు ఋషి వంటివాఁడు. తత్త్వము తెలిసినవాఁడు. తక్కినవాండ్రు కవిగాండ్రు.

మన తెలుఁగు పురాణ కావ్యములలో కొన్ని కొన్ని కథలు ఎక్కువ మంది కవులచేత వ్రాఁబడి వున్నవి. బాణాసుర కథయున్నది. భాగవతములో నున్నది. ఉత్తర హరివంశములో నున్నది. శివపురాణమందున్నది. ముువ్వురు కవులు వేఱువేఱే.

ఇప్పుడీ పాశుపతాస్త్ర సంపాదనకథ యున్నది. భారతములోనున్నది. శ్రీనాథుఁడు రచించిన హరవిలాసము నందున్నది. ధూర్జటి వ్రాసిన శ్రీ కాళహస్తి మాహాత్మ్యమునందున్నది.

ఇప్పుడు మనము శ్రీనాథ ధూర్జటులు వ్రాసిన కథలను సరిపోల్చి యిద్దరు కవుల ప్రవృత్తులెట్లుండునో వారెట్లూహింతురో హెచ్చుతగ్గులెట్లుండునో కొంతతూచి కొంత కవితా పద్ధతులను విచారించుకొనవచ్చును.

ఒకానొక విషయమును ఇద్దఱు రెండువిధములుగా చెప్పుదురు. ఒకఁడు తేల్చి చెప్పును, ఒకడు దానిని విస్తరించి చెప్పును.

అర్జునుఁడు తపస్సు చేయుచున్నాఁడు, అతఁడు తపస్సు చేయుచుండగా అతనికి 'వినంబడెన్ శ్రవ్యమ్ములై కుర్కుర ప్రకరోదంచిత కంఠనాళ కుహళీ భౌభౌ నాదముల్.'

ఇది హరవిలాసములోనిది. వినఁబడెన్ శ్రవ్యమ్ములై రెండు నేకార్థకములు, ఈ రెండు మాటలక్కఱలేదు. ఒకటి చాలును.

కాని ఒకఁడు విశేషార్థమును చెప్పుటకు పూనుకొనును. కొన్ని విధములుగా నెప్పుడు పట్టిన నప్పుడు సమర్థించుటకు వీలుండును. ఇక్కడనిట్లు చెప్పుదము. చెవులకు వినిపించినవి అని యర్థము. చెవులకు వినిపించక మరి యే యింద్రియములకు వినిపించును? అని ప్రశ్న. విన్నట్లు భ్రాంతిపడినచో ఆ భ్రాంతి చెవులకు వినిపించనక్కఱలేదు. అందుచేత శ్రవ్యమ్ములై యన్న మాట యవసరము.

నీవీ యర్థము చెప్పితివి కదా ! ఇచ్చట నిది భ్రాంతికాదని చెక్పవలసిన యవసరమేమున్నది? ఎంతయో యున్నది.

అర్జునుఁడు మానవుఁడు శివుఁడు పరమేశ్వరుడు, మానవశరీరము పంచభూతాత్మకము, శివమూర్తి పంచభూతాత్మకముకాదు. అది వట్టి తైజసము, పంచభూతాత్మకమైన శరీరమునుండి వినిర్గమించిన ధ్వనియే శ్రవణగోచరమగును. ఇప్పుడు శివుఁడు మాయా కిరాతవేషము వేసికొని వచ్చెను. ఆయనవెంట వేదములు కుక్కలై వచ్చెను. ఆ భౌభౌ మహారావములు అర్జునునకు చెవులకు వినిపించెను. శివుఁడు పంచభూతాత్మకమైన శరీరముతోనే వచ్చెను, వేదములును నిజముగా కుక్కలుగనే వచ్చెను. ఇది యెట్లు సాధ్యము ? అన్న ప్రశ్న.

ఈ పంచభూతాత్మకమైన సృష్టిచేసినది పరమేశ్వరుఁడు. ఇది యతని చేతిలోనున్నది. అతడు సృష్టించును. పెంచును. సంహరించును ఈ లోకము

కొఱకు నీ మూడు కార్యములు జరుగుటకొఱకు పుట్టినది మొదలు వాని యిష్టముప్రకారము వందయేండ్ల వఱకో అంతకుమించియో యీ కార్యమును కొనసాగించుచుండును. సృష్టిలయము లౌకపు దైకకాలికముగా చేయును. పెరుగుటకు మన కాలము ప్రకారము కొంతకాలము పట్టినట్లు కన్పించును.

గర్భములో శిశువేర్పడి పుట్టి పెరుగును. ఏర్పడుటకు కర్తయెవరు? గర్భములో పంచభూతములు పిండముగా నేయేపాళ్ళలో నుండవలయునో యాపాళ్ళను నిర్ణయించిన వాడెవఁడు? అందులో జీవుని ప్రవేశపెట్టినవాఁ డెవఁడు?

పంచభూతము లతని యదుపులోనున్నవి. అతని యిష్టము వచ్చినట్లు చేయును.

అందుచేత శివుఁడు తనంతటతాను పంచభూతాత్మకమైన కిరాతాకృతి దాల్చగలఁడు. వేదములను వేటకుక్కలవలె మార్చఁగలడు. అది జరిగినదని యర్థము.

అందుచేత వేదములు కుక్కలగుట నిజము, భౌభౌ అని యరచుట నిజము, అర్జునుఁడు వినుట నిజము. నిజమనఁగా లౌకికమైన నిజము అని యర్థము.

ఇక్కడ శ్రీనాథుఁడు కుక్కలైన వేదములను వర్ణించెను.

చాయ గోసులకంటె కేసరులకంటెఁ
బులులకంటెను బిసరులై పొగరు మిగిలి
జల్లుకొనివచ్చెఁ బైపైన సారమేయ
యూధములు వేదమయమూర్తు లుద్ధతముగ.
ప్రకటలీల నుదాత్తంపు ఫణితిఁ గొన్ని
క్రమముతో ననుదాత్త స్వరములఁ గొన్ని
స్వరితములఁ బ్రచయంబుల వరుసఁగొన్ని
ఘోషణము సేయఁదొడఁగె నా కుర్కురములు.

ఈ పద్యములలో వేదలక్షణములైన యుదాత్తా నుదాత్తస్వరితములను పెట్టి కుక్కలరావములను వర్ణించెను. ఈ పని ధూర్జటి చేయలేదు.

దీని వలన విశేషమేమి? ఈ ఉదాత్తాను దాత్త స్వరిత లక్షణములు కలిగిన యీ కుక్కల ధ్వనులను అర్జునుఁడు విని వానిని వేదములుఁగా పోల్చుకొనెనా? పోల్చి కొన్నచో వచ్చిన కిరాతుని శివుండని గ్రహించెడు వాఁడు. అందు చేత నర్జునుని యందా విశేషము లేదు. లేదని చెప్పుటకు వ్రాసెనా? ఊరకయే వ్రాసె ననవలయును.

కాని శివుఁడు కిరాతుడయ్యెను, యెట్లయ్యెను, ఆ వేషము నెట్లు పూర్చెను? కిరాతునకు శివునకు నేవియో సామ్యము లుండ వలయును

శ్రీనాథుఁ డీ పద్యమును వ్రాసెను.

వికట పాటల జటా మకుటికా భారంబు
కలుకైన జుంజులు నెలులుగాఁగఁ
జారు సుధామ శకలావతంసంబు
పెద కొప్పుపై నుండు పీఁకెగాఁగ
ఘన లలాటంబునఁ గనుపట్టు కను చిచ్చు
గైరికద్రవ తిలకంబుగాఁగఁ
భుజ మధ్యమునఁ గ్రాలు భుజగ హారంబులు
గురిజ పూసలగుబ్బ సరులుగాఁగఁ.

దీనినే ధూర్జటి—

జడకొప్పు కేకిపింఛపుఁ ద్రాటి చుట్టగా
బిసరుహాహిత రేఖ పీఁకెగాఁగఁ,
సెగలు చల్లెడు కన్ను జేగురు బొట్టుగా
శ్రుతిఫణి యౌషధ లతికగాఁగ
మెడను బున్కల పేరు మేటి తామరులుఁగాఁ
దోలు దుప్పటి యొడదోలుగాఁగఁ
జేతిపినాకంబు సెలవింటి బద్దగా
శూల మేర్చిన యంపకోలగాఁగఁ

రెంటిని పోల్చి చూచినచో నూహ యొక్కటియే. కల్పనలో గూడ సా మేయున్నది. మాటలు వేఱు. కూర్పు వేఱు.

చదువరి అనగా పాఠకుఁడు కవితా విద్యలో నున్న పట్టుగలిగిన ప్రథమ దశా స్వరూపమును దెలిసినచో దీనికాశ్చర్య పడడు. సంతోషించును.

ఇది మహా కథను పోషించు ననేక విషయములలో నొకటి; యింతకు మించి యేమియును లేదు.

ఇచ్చట ధూర్జటి యొక పద్యమును వ్రాసెను.

"కాకోలాశనకృత మా
యా కోలము సేయఁదొడఁగె నలజడి, ముని రా
జీ కోలాహల మెసఁగఁగ
నా కోలాంగూల కేతు నాశ్రమ భూమిన్."

ఈ పద్యములోని చివరి చరణములో నర్థముపొసగుట కష్టము. అర్జునుఁడు కపిధ్వజుఁడు. కపి యనఁగా కోతి. కోతికి గోలాంగూలమని పేరు కోలాంగూలము కుదురదు. లాంగూలము తోక, గోవు వంటి తోక కలది కనుక కోతికి గోలాంగూల మని పేరు వచ్చినది.

సంస్కృతములో ననేకములైన నిఘంటువులు కలవు. ఏ నిఘంటువులోనైన కోతికి కోలాంగూల మని యున్నదేమో తెలియదు. కాని బ్రౌను దొరపాఠము—

"నౌకోలాంఛన తపోవనాంతర భూమిన్" అని యున్నది

న + ఓకః-నౌకః; ఓకః—స్థానము, ఇల్లు; ఔకః అనికూడ ననవచ్చును. నౌకః అనగా ఇల్లు లేనిది. కోతికి వన చరమని పేరు గదా! కనుక నౌక శ్శబ్దమునకు కోతియని చెప్పుకొన వలయును.

అర్జునుఁడు బాణము వేసెను, శివుఁడు బాణము వేసెను. బాణములు తగిలి పంది తిరిగిన లక్షణము నిద్దఱును వర్ణించిరి.

శ్రీనాథుఁడు సంస్కృత శబ్దములతో వర్ణించెను. ధూర్జటి కొన్ని తెలుఁగు శబ్దములనుఁ గూడ కలిపెను.

ఇచ్చట కొన్ని మాటలు ఆయనయు వ్రాసెను ఈయనయు వ్రాసెను. ఆయన మాటలలో కొంత చమత్కార మున్నది. ఈయన మాటలలో కొంత చమత్కార మున్నది.

యుద్ధము చేయకముందు శివునిచేత శ్రీనాథుడు చాల మాటలనిపించెను. అర్జునునిచేత సమాధానము చెప్పించెను. శ్రీనాథుడు కథను ప్రధానముగా వ్రాయుచున్నాడు. అంతమచేత పెంచినాడు. ధూర్జటి కన్నప్ప పూర్వజన్మ కథగా చెప్పుచున్నాడు.

యుద్ధమును ధూర్జటి యిట్లు వర్ణించెను.

సూనశరారి యున్న సుచిసూనద పుత్రుడు. దివ్యబాణ సం
ధానమున న్మహాహవము దర్పమెలర్ప నొనర్ప నొప్పి రిం
తైనఁ గొఅంతలేక సమయాందలి తేజము మిన్నుముట్టఁగా
భానుఁడు భానుఁడు ఐటులభాను పరంపరఁ బోరుకై వడిన్.

భానుశబ్దము రెండుసార్లు వచ్చినది. ఒక భానునకు సూర్యుఁడని యర్థము. రెండవ భానునకు శివుఁడుయర్థము శివునికిగలపేర్లలో భానుఁడని కూడనున్నది. శివుఁడును సూర్యుఁడును పోట్లాడుకొనినట్లని యర్థము వచ్చును. కాని యిచ్చట యిద్దరిలో నొకఁడు శివుడే, రెండవవాఁడు సూర్యుఁడు కావలెను అతఁడర్జునుడు.

సూర్యుడును శివుడును పోట్లాడుకొనిరి, సూర్యుడగ్ని మండలము. శివుఁడు కూడ రుద్రుడు. అందువలన మహాగ్ని మండలము, ఇక్కడ నర్జునునకు వట్టి పోలిక కావలయును. కాని మరికొంత లోతుపోయిచూచినచో నిది చమత్కార ముగా నున్నది.

శివుఁడు సర్వజీవ సమాహారభూతమైన వేల్పు. శాకల్య బ్రాహ్మణములో నొక ప్రశ్నయున్నది. రుద్రులెంతమంది? అని శాకల్యుఁడడుగఁగా యాజ్ఞవల్క్యుడు పదునొకండుమందియని చెప్పెను. కర్మబుద్ధి, అయిదింద్రియములు, అయిదు ప్రాణములు. కర్మబుద్ధులు ఆత్మమనస్సులు కలసియొకటి. వీరు పద కొండుగురు రుద్రులని తాత్పర్యము. అర్జునుఁడు నరుఁడు. ఈ పదునొకండు లక్షణములు ప్రతినిధిభూతములై యున్న పురుషుఁడు. కనుక నిచ్చట భానుఁడు భానుఁడున్ అనఁగా నట్టి శివుఁడు నట్టి శివుఁడునని యర్థమని చెప్పవచ్చును. ఈ వ్యాఖ్యానము సుంతదూరమైనది

చివరకు నర్జునుఁడు, శివుఁడు పార్థుని శరములు నించించగా గాండీవముతో శివుని శిరస్సు మీదఁగొట్టెను. ఇచ్చట శ్రీనాథుఁడు పెద్ద పద్యము వ్రాసెను.

కఱకు వెంద్రుకలలోఁ బఱచు మందాకిని
సుకుమార దేహంబు స్రుక్కఁబాఱె
నవతంస కుసుమ మాల్యంబైన శశిరేఖ
బ్రహ్మ కపాలరంధ్రమునఁ గూలె
నెట్టియంబుగ బిగ్గఁజుట్టిన పెనుఁబాము
బిగియూడి నొసలిపై డిగఁగజాఱె
నలిక నేత్రముకిత్తి యారజ్యమానమై
తెప్పలసందుల నిప్పు లుమిసె
నగజభయమందెఁ బ్రమథులు బెగడుగదిచి
రుపనిషత్తులు ఘోషించె నొక్క పెట్టఁ
గాలకంఠుని మౌళి శృంగాటకంబు
గాండివంబునఁ దాడింప పాండవుండు.

ఇట్టి పద్యమును ధూర్జటి వ్రాయలేదు వ్రాయవచ్చును. ఇద్దఱును శైవులే. ఇద్దఱును శివభక్తులే! కాని శ్రీనాథుఁడిట్టి వర్ణనల వైపునకు మొగ్గును. ధూర్జటి మొగ్గడు ఇట్టి వర్ణనలవలన పాఠకునిమనస్సు కొంచెము చక్కిలిగింత పెట్టఁబడును. అధికమైన ఫలములేదు. కథలో నొకయంశమును కొంచెము పెద్దది చేసి వర్ణించుట. దీనివలన శివునకు కలిగిన బాధలేదు. ఆయకు నలంకారములుగా నున్న వస్తువులు కొంచెము క్లేశముపొందెనని చెప్పుట. చెప్పుట రమ్యముగా నున్నది. అంతవఱకే. మరియు చివర గీతపద్యములో మొదటి రెండుచరణములు కొంచెము త్ప్రేక్ష. వానివలన నొకవేళ నర్జునుని పరాక్రమ మతిశయముగా భాసించునని చెప్పవచ్చునుగాని యిచట శివుఁడు పార్థునను గ్రహించుటకు వచ్చెను.

ఇద్దఱును మల్లయుద్ధము చేసిరి. ఇద్దఱును మల్లయుద్ధమును వర్ణించిరి ఇద్దఱు చెఱియొక విధముగా చేసిరి.

శ్రీ నాథుని మల్లయుద్ధ వర్ణనలో తిక్కనగారి మాటలు కొన్ని కలవు.

స్వామి ప్రత్యక్షమయ్యెను. హరవిలాసములో సార్వవిభక్తికస్తవమున్నది. ఇది యుదాహరణ కావ్యసంబంధమైనది. ఉదాహరణ కావ్యము కొంతదేశిసంబంధమైనది. శ్రీనాథునకు దేశికావ్యములందు దేశ్యములైన కొన్ని యాచారముల యందు మక్కువయెక్కువ శ్రీనాథుని యర్జునుఁడు పాశుపతాస్త్రమును మాత్ర మడిగెను. ధూర్జటి యర్జునుఁడు ముక్తి రమణీ హృదయేశత్వము కూడ నడిగెను. ఇది భేదము. ఈ సంగతి మొట్ట మొదట విచారింపబడినది.

ఈ సామ్యము చెప్పుటవలన ప్రయోజనమేమి? యనఁగా కవితారచనలో భిన్నకవుల దృష్టులు భిన్నముగా నుండును. భిన్నకవుల రుచులు భిన్నముగా నుండును. ఒకఁడొకచోట పెంచి వ్రాయును. ఒకడింకొకచోట పెంచివ్రాయును. ఒక వర్ణనాశక్తి మిక్కిలిగాలేనిచో వాఁడు కవియే కాదుగదా! ఈ వర్ణనాశక్తి ప్రధానముగా రెండు విధములుగా నుండును. ఒకటి ప్రసంగమును పెంచుట. రెండు విషయములను ప్రపంచించి చెప్పుట.

ఇప్పుడేమగుచున్నదనఁగా ఒక కవియొక్క గొప్పదనమును నిర్ణయించవలయుననఁగా రెండే విషయములు మిగిలినవి. మొదటిది అతఁడు తీసికొన్న కథలోని పరమార్థమాతనికి గాటముగా తెలిసి వ్రాయుట. ఇదిపరమోత్తమమైనది. రెండవది ఆ కవి యొక్క శైలి-అతని రచన-అతని యక్షర గుంఫన చాతుర్యము. ఈ రెండవ దానికి సహజముగా ప్రాచుర్యము వచ్చుచున్నది.

శ్రీనాథ ధూర్జటులలో శ్రీనాథున కున్నంత ప్రతిష్ఠ ధూర్జటికి లేదు. కాని కొన్ని చోట్ల ధూర్జటి నాచన సోమన్న యెత్తిన యెత్తుగడ లెత్తఁగల వాఁడు. నాచన సోమన్న కూడ నచ్చముగా నతని శిల్పశక్తి చేత ప్రసిద్ధికి వచ్చినవాఁడు కాడు. అతనికొక ప్రత్యేకమైన రచనా సామర్థ్య మున్నది. దానిని పురస్కరించుకొని వచ్చిన వాఁడు.

పాఠకుఁడు కావ్యములను పరిశీలించి చూచి భిన్నశైలీ పద్ధతులను వి... రించి రసానుభవమును పొంద వలయును. ప్రసిద్ధులైన కవులందఱి య... పాఠకునియం దానందము సమకూర్చు కొన్ని లక్షణములుండును. కొం... కొన్నిటి యందు మమకారము హెచ్చు. ఈ మమకారము ఇతర కవుల గుణ... యందు వాని నంధుని చేయరాదు. విషయములు సర్వంకషముగా తెలియ... యును. అప్పుడను భూతమగు నానందమంచు భేదముండును. అప్పుడల్ల... మహా కవులుగా భాసించరు.

విజయ విలాసము

ఈ గ్రంథమును వ్రాసిన కవి చేమకూర వేంకట కవి. ఆయన రెండు గ్రంథములు వ్రాసెను. మొదటిది సారంగధర చరిత్రము. రెండవది యిది. ఈ కావ్యములో ననేకములైన శ్లేషలు, చమత్కారములు, స్ఫూర్తులు, అన్వార్థములు కలవు. త్రవ్విన కొలంది క్రొత్త క్రొత్త యర్థములు పుట్టును. దీనికి "పిల్ల వసు చరిత్రము" అని పేరు. శ్లేషార్థములను పురస్కరించు కొని వచ్చిన పేరే గాని మరియొకటికాదు. వసుచరిత్ర లక్షణము వేఱు. దీనిలక్షణము వేఱు. ఈ గ్రంథములో కొంత మైత్తదన మెక్కువ. వసు చరిత్రలోని శృంగార రసము మిక్కిలిగా కవి సమయముల మీద పోవును. ఇందులోని శృంగార రసము లోకము నందలి మాటలు, పలుకులు, ఊహలు-మొదలైన వాని మీద నెక్కువ నడచును.

ఎవరో కవి చేమకూర మంచి పాకమున పడ్డది అన్నాడట.

సామాన్యముగా నే కవి వ్రాసిన గ్రంథము తీసినను భారత భాగవత రామాయణము లందువలె వర్ణనలు కథా ప్రాధాన్యమును బలపరచునవిగా నుండవు. ఈ కావ్యములలో వర్ణనములనే కథ బలపరచ వలయును. అనేకములైన శృంగార వర్ణనలు-ఆకథలోనే కాదు ఏకథలోనైనను చేయవచ్చు ననట్టు లుండును ఈ వర్ణనా బాహుళ్యము వలన కొన్ని కావ్యములలో ప్రధాన కథ యేమి? ఎక్కడ నున్నది? అన్న విషయము వెదకికొన వలసి వచ్చును. ఆ ప్రధాన కథను పట్టుకొన్న గాని కవి చేసిన కల్పన యొక్క పరమోత్కృష్టత తెలియదు.

కథ యెప్పుడును పై భాగమున నుండును. వర్ణనలు క్రింది భాగమునం దుండును. చాల మంది కవుల రచనలలో వర్ణనలు పై భాగమునకు వచ్చి కథ అట్టడుగున పడిపోవును.

మొదట చెప్పబడినది కదా! కావ్యములు వర్ణనా ప్రధానములైనవి. భారత భాగవత రామాయణములను చూచినట్లే కావ్యములను జూడ రాదు వానిని వీనితో పోల్చరాదు. నేడు చేయబడుచున్న యన్యాయ మిదియే !

ఈ కవులందఱు నొకానొక ఘట్టమును చిత్రచిత్రములుగా వర్ణింతురు. ఈ చేమకూర వేంకటకవి ప్రతి పద్యమునందు తానేదో విశేషము పెట్టకుండ వ్రాయడు. ఇతని శక్తి యెక్కువ శ్లేషలమీదను. యమకముల మీదను నడచును. ఇచ్చటనొక భాగముతీసి – కథకెక్కువ ప్రాధాన్యముగల భాగమును తీసి చూపించుచున్నాను.

అర్జునుఁడు యతివేషమున ద్వారకానగరము వెళ్ళెను. కృష్ణుఁడు సుభద్ర నాయన పరిచర్యకొఱకుంచెను. ఇద్దఱు నొకరినొకరు పూర్వము చూచినవారు కారుగాని, మేనత్త మేనమామ బిడ్డలగుటవలన నితని పరాక్రమము విని యామెయు, ఆమె సౌందర్యమును విని యితఁడును పరస్పరము ప్రేమించుకొన్నవారే! చిన్నప్పుడెప్పుడైన నొకరినొకరు చూచుకొనిరేమో తెలియదు ఇప్పుడర్జునునకు గడ్డములు, మీసములు, కావిగుడ్డలు.

ఒకనాఁడు సుభద్ర పరిచర్యచేయుటకు వచ్చెను ఇతఁడు యోగిగనుక కొంత జ్యోతిషము చెప్పెను.

"చెలువ! నినురాజకీరంబు చెట్టపట్టెఁ
గలికి: నినురాజ హంసంబు కాలుద్రొక్కె:
మంచిశకునంబు లివిగో! నామాటఁజూడు
కన్నె, యీలోనఁ బెండ్లిగాఁగలదు నీకు."

ఇవి శకునములని నీ వెంటనే చిలుకవచ్చినది. హంసయు నిన్ననుసరించినది ఆమె బుజముమీద చిలుక వ్రాలినది పెంపుడుచిలుక. ఇది సహజమే రాజహంసము కాలు త్రొక్కినది. నీవు రాజహంసమువలె నడతువు అని యర్థము. నీ నడక హంసగమనముతో సరిపోవును.

లోకములో 'నక్కనుఁద్రొక్కి వచ్చినాఁడు, అందురు. అనఁగా నా ప్రయాణములో వానికి నక్కదారిలో కనిపించెనను యర్థము. ఈ త్రొంచు – ధాతువునకు తెలుగులో నా యర్థమున్నది. ఇది శకునము గనుక కాలు త్రొక్కె నన్నమాట యందుము, రాజకీరము, రాజహంసము — ఉత్తమజాతి చిలుక, ఉత్తమజాతి హంస – లేదా ఇవి రెండును శ్రేష్ఠవాచకములై గొప్ప రాచిలుక యర్థము వచ్చును. లేదా ఉపమానోత్తర పదకర్మ ధారయములై చిలుక నీ

రాజు. హంసవంటి రాజు ననగా మంచి వాఙ్నిపుణుఁడు గొప్ప వంశమునందు పుట్టినవాఁడు – అని యర్థములుకూడ వచ్చును.

హంస శబ్దమునకు జీవుఁడని యర్థము. ఉత్తమ జీవుఁడు. అర్జునుఁడు పూర్వము నరుఁడన్న మహర్షికదా! అ స్ఫూర్తియున్నదన్నను నున్నదన వచ్చును. మంచి శకునమ్ములివి. భవిష్యదాగామి శుభలక్షణములని యర్థము. శకునమనగా ఒకటి పక్షి — రెండు — శుభసూచియైన విషయము,

ఆ యర్థముకూడ పక్షిమీదనుండియే వచ్చినది. ఇదిగో! మంచి శకునములు. ప్రక్కనున్న రాజహంసను. రాజకీరమును జూపించుచు నన్నమాటలు. అవి మంచి పక్షులు. కాదనుటయెట్లు? అనఁగా నేను జోస్యము చెప్పుటలేదు. నేను యతినిగాను. అని వెనుకనున్న యర్థము.

''ఈ లోనఁ బెండ్లికాగలఁదు నీకు'' – ఈ కొద్దిలో నీకు పెండ్లి యగును.

అనవుడు లజ్జావనతా
నన తామరసయయి, 'వీరు నాఁగ మహాత్ముల్;
తనచేసిన సేవకుఁగా
మనమలరి వచించి 'రనుచు మదినుత్సుకయై.

అనఁగా నామె సిగ్గుచే తలవంచి వీరు నాఁగ మహాత్ములు. వీరనగా మహానుభావులు. నేనతనికి సేవచేసితిని, అతని మనస్సు సంతోషించెను. ఇట్లు చెప్పిరి. అని మనస్సునందు కోరిక కలదై.

ఈ పద్యములో శ్లేషమేమియులేదు. వట్టి పద్యము. ఇట్టి పద్యములు విజయ విలాసములో సామాన్యముగా నుండవు.

అట్లే మరియు నొక పద్యము.

అవుఁగా మీరిట మున్నుగన్గొనిన చాయల్లేవుగా నాఁటనుం
డి విశేషంబులు గొన్ని మిమ్మనడుగన్ వేడ్కయ్యెడున్నాకు, నె
య్యవిఁగన్గొంటిరి పుణ్యభూము? లట రాజ్యంబుల్ మనోజ్ఞంబు లె
య్యవి! యేయేపురముల్ గనంబడియె మీకందంద మార్గంబునన్.

వసు చరిత్రకారుఁడిట్టి పద్యములలో గూడ శ్లేషలు పెట్టును. ఈ యిద్దఱికి కల కొంచెము భేదమిది.

మీరింద్ర ప్రస్థము గని
నారా ? పాండవులఁజూచినారా ? సుఖులై
వారందఱు నొకచో ను
న్నారా ? వీరాగ్రగణ్యు నరునెఱుఁగుదురా ?''

ఈ పద్యములో కనినారా, చూచినరా, ఉన్నరా, ఈ మాటల చేత పద్యమునందొక సన్నని యందము పుట్టినది ఎఱుఁగుదురా దానిలో విఱిగిపోయినది వట్టి ''రా''యే మిగిలినది.

తరువాత నొక సీసపద్యమున్నది.

''ఎగుబుజమ్ములవాఁడు మృగరాజ మధ్యమ్ము
పుడికి పుచ్చుకొను నెన్నడుమువాఁడు.''

ఇట్టి పద్యములు తెలుఁగు కావ్యములలో శ్రీకృష్ణునిఁగూర్చి చెప్పఁబడి వున్నవి. ఈ పద్యములో గూడ శ్లేషాదులులేవు.

తరువాతి పద్యము.

తడవాయె భూప్రదక్షిణ
మడరింపఁగ బోయి యామహామహుఁడు, పదం
పడి పుణ్య స్థలముల నె
న్నఁడు మీరందఁదు నరుగ నరుఁగానరుగా ?

చివరి చరణములో నున్న 'నరుగ నరుగానరుగా'' అన్న యమకమే యీ పద్యమునకు శోభ – శోభ యనఁగా చేమకూరకవి కూర్చఁగలిగినశోభ. ఆయన పద్యమునకు తెచ్చెడి యందములిట్టివానిమీదనే యెక్కువగా నాధారపడి యుండుచు.

ఈ వరుసలో అతఁడు యతివేషముతోనుండుట – దానిని దాటుచేసికొని చెప్పుట. తన్ను వెల్లడించుకొనుట.. ఆమె సిగ్గుపడుట – మొదలైన రచన

యున్నది. ఈ వరుస పద్యములలో వరుసగానొక పది పద్యములు శ్లేషలు యమకములు మొదలైనవి లేకుండ వట్టి కథగా నడచినవి.

కాని కొందఱు కొందఱు కవులు కొన్ని కొన్ని మాటలు తమ పద్యములకు సౌందర్య సంపాదనార్థము ప్రయోగింతురు. అవి వారి వారి వైలక్షణ్యములు.

ఈ కవి కొన్ని సంధులు బాహాటముగా నితర కవులు ప్రయోగించినవి ప్రయోగించును.

'వేడ్కయ్యెడున్ నాకు' ఇచ్చట విసంధి చేయుట మంచిది.

వేమాఱు గ్రుచ్చి గ్రుచ్చి నీవేమడిగెదవు. గ్రుచ్చి + ఇపుడు - గ్రుచ్చి యిపుడు అనవలె. ఇది క్త్వార్థక ఇకారము. దీనికి సంధిలేదు. ఈ కవి ఈ క్త్వార్థక ఇకార సంధులు మరి నాలుగైదు చోట్ల చేసినాఁడు.

"నన్ను గాంధర్వంబునను బెండ్లియాడవే
సిగ్గేలపడియెదే చిగురుఁబోఁడి.''

ఈయన తంజావూరువాఁడు. అప్పుడు యక్షగానముల యొత్తిడి కలదు. ఎంత కాదన్నను వాని వాసనపోదుకదా! మద్దెలయు శ్రుతియు తాళమును కలిపి యక్షగానములలో నిటువంటి వాక్యములుండును, దాని వాసన దీనియందున్నట్లున్నది. అనఁగా రచనయందు బిగువు తక్కువ. సాహిత్యముద్ర తక్కువ మహానుభావులైన ప్రబంధ కవుల పలుకుఁబడిలోని గడుసుఁదనము తక్కువయని యర్థము.

ఇట్టి రచనయందు మనము రమించమని లేదు. మనము రమింతుము. యక్షగానములు చూచి సంతోషించమా? భావములయందెప్పుడు నుదాత్తతయు, ననుదాత్తతయు కలవు. భావములందేకాదు. చెప్పుటయందుకూడ నుండును, ఇది క్లిష్టమైన వ్యవహారము. పాఠకుఁడు తనబుద్ధిని మహా విషయములచేత పరిష్కృతము చేసికొని యుదాత్తముగా దీర్చి దిద్దికొననిచో మహాకవులకు. కొన్ని కళలు తక్కువ కవులకు భేదము నేర్పరించికొనలేదు.

—★—

C No.... 39949